# వస్తాను నేస్తం... నవల

## - శ్రీధర



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 22

# వస్తాను నేస్తం...

## శ్రీధర



విభిన్న ప్రేమ కథ ..యువతరం నడవడికకి అద్దం పట్టే ధారావాహిక నవల





### 1



రాత్రి రెండు గంటలు దాటింది.

తిరుమలలో ఎగుడు దిగుడు రోడ్ల మీద నడుస్తున్నాడు సత్యమూర్తి. అంత రాత్రివేళ ఎదురొచ్చిన ఇతన్ని చూసి పిచ్చి ఉత్సాహంతో పరుగెత్తుకొచ్చి రెండు చేతులూ చాచి కౌగిలించుకుంటోంది రికామీ గాలి. ఎవరైనా, చివరకు గాలే అయినా, అలా నడుముకు చుట్టుకుపోతే, అతనికేమో ఒకటే గిలిగింతలు. అందుకనే గట్టిగా చేతులు ముడుచుకుని, వడివడిగా నడిచి గుడి ముందుకొచ్చాడు.

సుప్రభాతం టిక్కెట్ల కోసం ఇంకా క్యూ మొదలవలేదు. ముందుగా తనే వెళ్ళి నిలబడదామని మెట్లెక్కుతూ, ఒక మెట్టు మీద కూర్చున్న ఆమెను చూసీ చూడగానే ఆశ్చర్యం, సంతోషం, విషాదం అన్నీ ఒక్కసారిగా ముంచుకొచ్చాయి..

మల్లిక!....

నిన్న, మొన్నటి దాకా హృదయ వీణను మీటి రసరమ్య రాగాలను పలికించింది. ఆనక ఆ తంత్రుల్ని తెంపేసి, గుండె గాయాల్ని మాత్రం మిగిల్చేసి...... ఇప్పుడిక్కడ... పక్కన ఎవరో ఉన్నారు. ఇంకెవరు? పతిదేవుడై ఉంటాడు.

అక్కడ్నించీ కదిలి, కౌంటర్ ముందుకొచ్చి నిలబడ్డాడు. "భగవంతుడా అంత కథ నడిచి, విడిపోయిన వాళ్ళను మళ్ళా ఎందుకయ్యా నీ గుడి గుమ్మం ముందు మమ్మల్ని కలుపుతున్నావు?" అని మౌనంగా అడుగుతున్నాడు సత్యమూర్తి.

గుండె కుదుళ్ళలో పెనవేసుకుపోయిన ఆశల మొదళ్ళు నరికేసి, పాయలుగా విడదీసి ఎడంగా లాగే కొద్దీ గుండె చీరుకుపోయి, రక్తాలు కారి, భరించలేని బాధ, అదంతా ఒక కథగా, కలగా మర్చిపోతుంటే మళ్ళీ..

సొంతం చేసుకోలేనప్పుడు, అసలు మమతానుబంధాలు పెంచుకోకూడదు. ఊడలు దించుకునే ఈ అనుబంధాలే, తర్వాత బాధాసర్పాలై....

మల్లిక కూడా లేచి ఇటువైపే వస్తోంది. అప్పుడూ ఇలాగే ఎండొచ్చినా, వానొచ్చినా, ఏమొచ్చినా, రాకున్నా రోజూ నవ్వుతూ తాను కాలేజీ గేటు దగ్గర ఎదురొచ్చేది. నవ యవ్వన ఉషస్సున వెల్లివిరిసిన ఇంద్రధనస్సులా.. రంగు రంగుల కలల అలల మీద తేలుతూ తూలుతూ వచ్చేది. కంటి కొసల వెంట వేళ్ళాడే మధురమైన కాంక్షల్ని మోసుకొచ్చేది. ఇప్పుడూ అలాగే వస్తోంది మళ్ళా....

కింద పడుకున్న వాళ్ళందరి మధ్యనా ఎత్తెత్తి అడుగులు వేస్తూ నెమలిలా నడుస్తోంది. అయినా ఎవరిమీదనో కాలేసింది. "వోలమ్మో తొక్కేసినాదీ..." అన్న కేక విని అదిరిపడి అటు తూలి, ఇటు వాలి గొప్ప డిస్కోడాన్స్ చేసి, అతని ముందుకొచ్చి నిలబడింది.

ఆమె భర్త అంత దూరంలో అటూ ఇటూ పచార్లు చేస్తూ ఎటో వెళ్ళాడు.

"బాగున్నావా?" అని అడిగింది మల్లిక.

బాధగా నవ్వాడతను. అసలు సత్యమూర్తి ఆ మాత్రం అయినా నవ్వి చాలా కాలం అయింది.

"నిన్ను ఇక్కడ చూడటమే ఆశ్చర్యంగా ఉంది..." అంది మళ్ళీ మల్లిక.

దీర్ఘంగా నిట్టూర్చాడు.

"నువ్వు నాస్తికుడివి కదా... దేవుడి దగ్గరకు రావడమేమిటా అని?.."

"ప్రధాన మంత్రి దగ్గర నుంచీ పెద్దా చిన్నా అంతా వస్తున్నారుకదా.. ఒకసారి చూద్దామని.. ఏమీలేని వాణ్ణి ఏవో తీరని కోరికలతో నేను రావటం సరే.. అన్నీ ఉన్నదానివి.... నువ్వెందుకు వచ్చినట్లు?..." అని అడిగాడు సత్యమూర్తి.

"ఉండటం, లేకపోవటం కాదు... మనిషికి ఆశ చావక పోవటం వల్లనే.. మన గొప్పలు, భేషజాలూ అన్నీ పక్కన పెట్టి, చేసిన తప్పులకు చెంపలు వేసుకుని, ఇంకేదో కావాలని అడుగుతాం. ఇన్ని కోట్లమంది ఎదల్లోని రొదలో, మనం లోలోపలే గొణుక్కునేదేమిటో ఆ దేవుడికి వినిపిస్తుందో లేదో అదీ తెలియదు..."

"మరెందుకు వచ్చినట్లు ఇంత దూరం?"

"మన తృప్తికోసం... ఇంటి దగ్గరలేని కొంత ప్రశాంతత ఇంత ఊరట ఇక్కడైనా దొరుకురుతుందేమోనని..." అన్నది మల్లిక.

"నీ మాటలు విని ఎన్నాళ్ళయ్యింది మల్లికా? మళ్ళీ నిన్ను చూస్తాననీ, ఈ మాత్రం మాట్లాడే అదృష్టం కలుగుతుందనీ అనుకోలేదు. నువ్వు చెప్పిన ఆ ప్రశాంతత, ఆ ఊరట నా కిప్పుడు దొరికాయి. దేవుడున్నాడేమో" అన్నాడు సత్యమూర్తి.

ఆమె మాట మార్చింది. "ఫామిలీని తీసుకు రాలేదా?"

"ఎవరి ఫామిలీని తీసుకురమ్మంటావు? నాకింకా పెళ్ళి కాలేదు" అన్నాడు సత్యమూర్తి.

"ఎందుకు చేసుకోలేదు?" అని అనాలోచితంగా అడిగి, వెంటనే సమాధానమూ తెల్సొచ్చి, తప్పు చేసిన దానిలా తలదించుకుంది.

"కొన్నింటికి సమాధానాలు మనసుకు మాత్రమే తెలుస్తాయి. ఎదుటి మనిషికి చెప్పడానికి ఏమీ ఉండదు. జీవితం నాకో శాపం అయినా పర్వాలేదు మల్లికా, నీకో వరం అయితే చాలు" అన్నాడు సత్యమూర్తి.

దెబ్బతిన్న పక్షిలా గిలగిల్లాడుతూ చూసింది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతుంటే పైట కొంగుతో తుడుచుకుంది.

"ఊరుకో..మల్లికా..నువ్వు కంటతడి పెడుతుంటే నే చూడలేను.." అన్నాడు సత్యమూర్తి.

ఒక్కొక్కళ్ళే క్యూలో చేరటానికి వస్తున్నారు. కింద పడుకున్న వాళ్ళను తొక్కుకుంటూ, తన్నుకుంటూ, కూచిపూడి, కథాకేళీ ఆడుకుంటూ, పడుకున్నవాళ్ళేమో గురకల నేపథ్యంలో కీర్తనలు పాడుతున్నారు `వోలమ్మో, తొక్కేసినారూ` అనుకుంటూ, ఇళయరాజా ఉంటే బావుణ్ణు ట్యూన్ కట్టేందుకు.

"ఇంతకీ ఏం ఉద్యోగం చేస్తున్నావు?" అని అడిగింది మల్లిక.

"మూడు ఉద్యోగాలు చేస్తున్నాను. తినటం, పడుకోవటం, రోడ్లంట తిరగటం.. నీకు తెలుసుకదా. సమాజం నా మీద ఎలాంటి ముద్ర వేసిందో? అది ఎంతకీ చెరిగిపోవటం లేదు. ఇంక నాకు ఉద్యోగం ఎవరిస్తారు? భూమికి బరువై, సమాజానికి వెలి అయి, ఎవరికీ అక్కర్లేకుండా ఎందుకూ కొరగాకుండా, అస్తమానం అందరి ముందూ తలొంచుకుని తిరుగుతున్నాను. వీలున్నంతవరకూ మనుషులకు దూరంగా తప్పుకు తిరుగుతున్నాను..." సత్యమూర్తి ఎంతో తేలికగా దాన్ని తేల్చి చెబుతున్నా, ఆ బాధ తప్తహృదయాన్ని అర్థం చేసుకుంటూనే ఉంది.

ఇంతలో ఇంకొంత మంది వచ్చారు. సుప్రభాతం టిక్కెట్లు తీసుకున్నారు. ఇవతలికి వస్తూ మల్లిక చెప్పింది ఫలానా ఊళ్ళో కాలేజీలో లెక్చరర్ పోస్టుకు అప్లయ్ చేయమని. ఇంకేదో అడగబోయేంతలోనే వేగంగా వెళ్ళిపోయింది.

కాసేపటికి గుళ్ళోకి వెళ్ళారు. సుప్రభాతం మొదలైంది. మల్లిక కూడా గొంతు కలిపి పాడుకుంటోంది - ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద - అనుకుంటూ, సత్యమూర్తి భక్తిపారవశ్యంలో నున్న ఆమె వంకే చూస్తున్నాడు.

కాలేజీలో చదివేనాటికన్నా మల్లిక ఇప్పుడు మరింత గాంభీర్యాన్ని, ప్రౌఢత్వాన్ని సంతరించుకుంది. అప్పటికీ, ఇప్పటికీ పోల్చుకుంటున్నాడు. కన్నుల్లో తెల్ల తామరల చల్లదనం, వదనంలో వెన్నెల నైర్మల్యం, నవ్వుల్లో సెలయేటి గలగలలు, కదలికలో హంస తూలికలు - ఇంత అందాన్ని సొంతం చేసుకున్నందుకు కించిత్ అయినా గర్వపడాలి కదా - అదీ లేదు. వినయాన్నీ అణుకువనూ ఆభరణాలుగా చేసుకుంది పైగా.

దర్శనానికి వెళుతుంటే ముందుగా ఆమె భర్త, వెనకాల మల్లికా, ఆమె వెనకాలే సత్యమూర్తి... ఎవరెవరు ఏం కోరుకున్నారో తెలియదు. ఆ దైవం వీళ్ళ ముగ్గుర్నీ ఒకేసారి ఎందుకు పిలిపించాడో, ఇంక ఏం చేయదలచాడో అదీ తెలియదు.

కళ్ళు తెరిచి చూసేలోపల మల్లికా, ఆమె భర్తా మాయమైపోయారు. ఆమె ఇప్పుడు `ఏ ఊరు చేరిందీ, ఎక్కడుంటోందీ` అని అడుగుదామనుకునే లోపల వెళ్ళిపోయింది. జీవితంలో మళ్ళీ కనిపిస్తుందో లేదో? అందుకనే అడ్రసు అయినా అడుగుదామనుకుంటే, అందకుండా వెళ్ళిపోయింది.

చాలాసేపటి వరకు గుడి చుట్టుపక్కల అంతటా తిరుగుతూనే ఉన్నాడు పిచ్చిపట్టినవాడిలాగా. కానీ జలతారంచులతో మెరిసిపోయే నెమలి ఫింఛం చీర కట్టుకున్న ఆ నిలువెత్తు తటిల్లిత మాత్రం కనిపించలేదు.

చీకటిని చుట్టుకుని పడుకున్నవాళ్ళంతా లేచి బద్ధకపు దుప్పటిని దులుపుకుని, కళ్ళు నులుముకుని, పలహారాలశాలల్లోకి దూరుతున్నారు. వాళ్ళందరినీ మౌనంగా అడుగుతున్నాడు - "ఏమండీ మీలో ఎవరైనా వేకువకు ముందే ఇటుగా వచ్చిన మూర్తీభవించిన సౌందర్యాన్ని చూశారా?" అని.

చెరుకు విల్లులాంటి ఒళ్ళు వంచి ముత్యాల ముగ్గులు పరుస్తున్న పిల్లను అడుగుతున్నాడు "అమ్మా, నీకు గానీ కనిపించిందా పరువాల పుత్తడి బొమ్మ."

రోడ్లమీద రద్దీ పెరుగుతోంది. గుంపులు గుంపులుగా తిరుగుతున్న జనం మధ్యకు దృష్టి సారిస్తున్నాడు. మనిషి మనిషినీ అడగాలని ఉంది, కానీ కల్హారమాలిక పోలికగల మల్లిక గురించి వీళ్ళకెలా చెప్పటం?

తిరిగి తిరిగి బయలుదేరిన చోటుకే వస్తున్నాడు. ఇదుగో, ఇక్కడే రాత్రి వెన్నెట్లో ఆమె పలుకులు తేనె చినుకుల్లా రాలాయి. మాటలే శ్రావ్యమైన పాటలైనాయి.

ఇప్పుడు అక్కడ వందలమంది తిరుగుతున్నారు. పెద్ద పెద్ద లీడర్లూ, ప్లీడర్లూ, డాక్టర్లూ, యాక్టర్లూ, కాంట్రాక్టర్లూ, చోరులూ, జారులూ, పూజారులూ - అందరూ ఉన్నారు. "మీరెవరైతేనేం గానీ, హంసతూలికలతో సాగిపోయే, స్నిగ్ధముగ్ధ సజీవ శిల్ప సౌందర్యాన్ని చూశారా? చూస్తే చెప్పండి బాబూ, ఎటుగా వెళ్ళిందో?"

పాము మెలికలు తిరిగిన క్యూలోని వాళ్ళనూ అడుగుతున్నాడు వెన్నెల కన్నా చల్లగా నవ్వగలిగే వన్నెల విన్నాణాల గురించి - గోవిందనామాలు స్మరిస్తూ పోతున్న భక్తశిఖామణులారా, దగద్ధాయమానమైన కిరీటం ధరించిన దేవుడికి సరిగా వినపడ లేదేమో, మీరైనా విన్నవించండింకోసారి, ఈ దీనుడి హృదయవేదనా నివేదన -

దుకాణాలు, బస్టాండూ వెతుకుతూనే ఉన్నాడు. ఎక్కడెక్కడి వాళ్ళో కనిపిస్తున్నారు ఒక్క ఆమె తప్ప. ఎవడో జేబు కొడితే పట్టుకుని కొడుతున్నారు. బుద్ధుడేలిన గడ్డ మీద పుట్టినా, పాపం గడ్డం గీయించుకునే డబ్బుల్లేక పోబట్టే గదా, బుద్ధి గడ్డి తింటోంది. 'నువ్వేం తింటేనేంగానీ, దొంగా, నీకేమన్నా నెమలి జాడ తెల్సునా?'

'మొహం నిండా నామాలు పెట్టుకుని, ఎవడు దొరుకుతాడా పంగనామాలు పెడదామని చూస్తున్న మహాశయా, నువ్వన్నా చెప్పవయ్యా, శంపాలత వైనం ఏదన్నా?'

కుళ్ళిపోయిన అరటి పండు పారేస్తే నలుగురు పిల్లలు పరుగెత్తారు. ముష్టికెళితే అక్కడా యుద్ధమే - అదిసరేగానీ, ఏమ్రా పిల్లలూ, మీరు గానీ చూశార్రా కదిలిపోయే ఓ జరీ అంచు, నెమలి పింఛం....

ఎవరూ ఏమీ చెప్పకపోతే, చివరకు వెళ్ళి గుడిముందు నిలబడి దేవుణ్ని దులిపేశాడు.

"చూడు దేవుడూ, నువ్వు కావాలనే చేశావు? ఇంతకీ నా అపరాధం ఏమిటి? దోపిడీలు, హత్యలు చేసినవాళ్ళు హుండీలో కానుకలేస్తే దయ చూపిస్తావా? పదవుల కోసం, వీధుల్లో ఫైటింగులు చేయించి, నీ దగ్గర కొచ్చి కళ్యాణాలు చేయిస్తే మురిసిపోతూ పెళ్ళిళ్ళు చేయించుకుంటావా? కానీ నన్ను నా నేస్తాన్ని ఒక్క చిన్న ప్రశ్న అడగనివ్వవా? ఏం దేవుడవయ్యా నువ్వు?" అని కడిగేశాడు.

దేవుడూ లేడు, దయ్యమూ లేదు, ఇదంతా మనిషి అజ్ఞానం మీద మూఢనమ్మకం మీద సాగుతున్న భారీ వ్యాపారం - అనుకుంటూ కాటేజ్ కెళ్ళాడు. ఖాళీ చేసి, సూట్‌కేస్ చేత బట్టుకుని వస్తుంటే, గాలి తెరల మీద నుంచీ తేలిపోతూ వస్తోంది జానకి పాడిన పాట. "నీ నగుమోము కనలేనీ నా జాలీ తెలిసీ జగమేలా పరమాత్మా, ఎవరితో మొరలిడుదూర..'

బస్సులో కూర్చున్నాడు. ఎవరో చెప్పుకుంటున్నారు. ఘాట్‌రోడ్డులో కారు యాక్సిడెంటు అయిందట. కారులో ఉన్న ఆడా మగా, ఇద్దరూ చనిపొయ్యారట.

సత్యమూర్తి గుండె ఝల్లుమంది. కొంపదీసి మల్లికా, ఆమె భర్త కాదుకదా? ఇలా అర్థాంతరంగా వెళ్ళిపోతోంది కాబట్టే చివరి క్షణాల్లో తనకు కనిపించి, ఫలానా చోట ఉద్యోగం ఉంది వెళ్ళమని దారి చూపించి, తాను మాత్రం అడ్రసు అయినా చెప్పకుండా వెళ్ళిపోయిందా?

నో.! మల్లికకు అలా కావడానికి వీల్లేదు. ఇంకెవరికో ఆ యాక్సిడెంటు అయి ఉండచ్చని అనుకుంటున్నా గుండె గదిలోంచి భయం ముందుకు వచ్చి, నిలువెల్లా వణుకొస్తోంది. కళ్ళవెంట నీళ్ళొస్తున్నాయి. గొంతులో దుఃఖాన్ని దిగమింగుకున్నాడు.

"భగవంతుడా! నా మల్లికకు ఏ ఆపదా రానివ్వకు దేవా. ఆ శిక్ష ఏదో నాకు వెయ్యి. సంతోషంగా భరిస్తాను" అనుకుంటున్నాడు జేబు గుడ్డతో మొహాన్నీ, జారిపడే అశ్రుకణాల్నీ తుడుచుకుంటూ.

జానకి పాట వినిపిస్తోంది, 'నిను కనుగొన ఆనందమై కన్నీరు నిండె.. ఆనందమై కన్నీరు నిండె..'

బస్సు బయలుదేరింది. పాట వినిపిస్తూనే ఉంది. 'దయరానీ, దయరానీ, దాశరథే రామా' దుఃఖం ఉబికి వస్తోంది. 'మల్లికను మాత్రం రక్షించు దేవుడా' అని రెండు చేతులూ జోడించి వేడుకున్నాడింకోసారి.

బస్సు మలుపు తిరిగి, జంగ్లీ దునియాలోకి ప్రవేశించింది.

# 2

కాలేజీ ఆవరణంతా బిలబిలమంటున్న అబ్బాయిలతోనూ, తళతళళాడుతున్న అమ్మాయిలతోనూ కళకళలాడుతోంది. కాలేజీల్లో చదివేవాళ్ళకు దొరికేవి రెండు. ఒకటి చదువు, రెండు చెలిమి. కొందరు అదృష్టవంతులకు రెండూ దొరుకుతాయి. కొందరికయితే ఏ ఒక్కటీ దక్కదు.

సత్యమూర్తి ప్రిన్సిపాల్ రూంలోకి వెళ్ళి అపాయింట్‌మెంట్ ఆర్డరు చూపించాక ఆయన లేచి కరచాలనం చేసి కూర్చోమన్నారు. "మీరు మా కాలేజీకి రావటం మా అదృష్టంగానే భావించాలి, సాధారణంగా కొత్త లెక్చరర్ మొదటి రోజు క్లాస్ తీసుకునేటప్పుడు, నేను వచ్చి కూర్చోవటం అలవాటు. కానీ మీ క్లాస్‌లో కూర్చుని మిమ్మల్ని, మీకు గోల్డ్‌మెడల్ ఇచ్చిన వాళ్ళనూ అవమానించలేను..." అన్నాడాయన నవ్వుతూ. ఆయన గలగలా నవ్వుతుంటే చిన్నప్పుడు హోటల్లో కప్పులు కడిగిన చప్పుడు గుర్తొస్తుంది.

ఆయన సత్యమూర్తిని క్లాస్ రూంకు తీసుకెళ్ళి, పరిచయం చేసి వచ్చారు. ఆ వేళ చదవటంలో ఎన్ని రకాలున్నాయో, కళ్ళు పెట్టి చదవటం వేరు, మనసు పెట్టి చదవటం వేరు, అంటూ అందరికీ తెలిసిన విషయంలోనూ, తెలియని విషయాలు ఎన్ని ఉన్నాయో చెప్పి, తన వాగ్ధాటితో ఆ కాసేపూ అందర్నీ వివశుల్ని చేస్తే, మొదటి రోజే వాళ్ళందరూ అతని వంక ఆరాధనా పూర్వకంగా చూశారు.

మర్నాడు ప్రిన్సిపాల్ సత్యమూర్తికి మరి కొంత మంది లెక్చరర్లను పరిచయం చేశాడు. సత్యమూర్తి వెళ్ళిపోయాక తెలుగు లెక్చరర్ ప్రిన్స్‌పాల్‌తో అన్నాడు.

"ఇతని చరిత్ర మంచిది కాదు. తెలిసే తీసుకున్నారా?"

"వెతకటం మొదలెడితే, రాముడు, కృష్ణుడు దగ్గర నుంచీ అందరి చరిత్రల్లోనూ లోపాలు కనిపిస్తాయండీ..." అన్నాడాయన నవ్వుతూ.

"అది కాదండీ, ఇతను ఖూనీకోరు.." అని రహస్యంగా అన్నాడు.

"నాకంతా తెలుసు మాస్టారూ... ఇంక మీరేం మాట్లాడకండి..." అన్నారాయన ఆ ప్రసంగాన్ని అంతటితో తుంచేస్తూ.

ఆ వేళ సత్యమూర్తి హోటల్ రూముకు చేరేటప్పటికి, అక్కడ రవి ఎదురుచూస్తూ కూర్చున్నాడు. రవి సత్యమూర్తి స్టూడెంట్. మాష్టారితో పరిచయం కోసం ప్రయత్నిస్తున్నాడు.

మరికొంత చనువు పెంచుకోవటం కోసం, మాష్టారు అనుమతితో తిన్నగా సత్యమూర్తి ఉంటున్న రూముకే వచ్చాడు. ఒక్కడే ఉంటున్నందువల్ల సత్యమూర్తికి కాలక్షేపం కావటం కష్టంగా ఉంది. అందులోనూ కొత్త చోటు. కనుక త్వరగానే రవి, సత్యమూర్తికి కుడి భుజం అయినాడు.

నాలుగు రోజుల పాటు వెతికి సత్యమూర్తికి మంచి వాటా అద్దెకు కుదిర్చాడు. అక్కడి వాతావరణం బాగా నచ్చింది అతనికి.

ఒకరోజు సాయంత్రం రవితో పాటు తనూజ కూడా సత్యమూర్తి ఇంటిని పావనం చేసింది. ఆ పిల్ల కూడా రవితో పాటు సత్యమూర్తి క్లాసులోనే చదువుతోంది. ఇద్దరూ చదువులో పోటీ పడుతుంటారు. గనుక లెక్చరర్ల దృష్టి వీళ్ళమీదే ఉంటుంది.

"ఏమిటి, ఇద్దరూ కలిసి వచ్చేశారు?" అమెని అడిగాడు నవ్వుతూ.

"ఏం మాష్టారూ, మేం కలిసి రాకూడదా!?" అని అడిగింది తనూజ సూటిగా.

"రాకూడదని కాదు..." అని సత్యమూర్తి సందేహిస్తుంటే రవి అందుకున్నాడు.

"క్లాస్‌రూంలో ఉన్నంత సేపూ మా ఇద్దరిదీ ఒకటే క్లాసు. కానీ బయటకు వచ్చాక, ఆమెది హైక్లాస్, నాది లోక్లాస్" అన్నాడు.

కాసేపు ముగ్గురి మధ్యా సమాజంలో వర్గాల గురించి, వర్గ పోరాటాల గురించి చర్చలు జరిగాయి. సత్యమూర్తి లెక్చరర్ అయినా వయస్సు మళ్ళినవాడేం కాదు. ఈతరంవాడే కనుకనే వీళ్ళ అభిప్రాయాలే అతనివీనూ. అయితే అనుభవాలు నేర్పిన పాఠాలు చాలా ఉన్నాయి. అక్కడే అతనికీ వీళ్ళకీ తేడా.

రోజూ సాయంత్రం పూట సత్యమూర్తి ఇంట్లో చేరి కబుర్లతో కాలక్షేపం చేయడం బాగా అలవాటైంది. రవి, తనూజల మధ్య స్నేహం బలపడటానికి ఈ సమావేశాలు బాగా దోహదం చేస్తున్నాయి. పైగా సత్యమూర్తి వాళ్ళకు అన్నిటా అండగా కనిపిస్తున్నాడు. పాఠాలు మాత్రమే కాదు, అతడు ఏం చెప్పినా హృదయానికి హత్తుకునేట్లు చెప్పేవాడు.

రోజూ తనూజ ప్లాస్టిక్ బుట్టతో ఏవో టిఫిన్లు తెచ్చేది. రవి అనేవాడు - "ఆ బుట్టలోనివి మనకు పెట్టేసి, మనల్ని బుట్టలో వేసుకుంటోంది మాష్టారూ."

"మిమ్మల్ని బుట్టలో వేసుకోవాల్సిన ఖర్మ నాకేం పట్టింది. నిలుచున్న పళంగా నీలాంటి వాళ్ళను పాతిక మందిని కొంటాను" అనేది.

"పాతిక మందిని ఏం చేసుకుంటావు?"

"చెడుగుడు పోటీలు పెట్టుకుంటాను. నీకెందుకు? చెప్పు, రేటెంత?"

"చెప్పు రేటా? గుర్తులేదు."

తనూజ అందర్లాంటి అమ్మాయి కాదు. చాలా చురుకైనది. రవీ తక్కువవాడేం కాదు. అందుకే వాళ్ళతో కాలక్షేపం సరదాగానే ఉంటోంది సత్యమూర్తికి. మధ్యలో వాళ్ళు కొన్ని 'కోడ్' పదాలు వాడు కుంటున్నారని సత్యమూర్తి గ్రహించాడు.

అప్పట్లో మల్లికా ఇలాగే కొన్ని కొత్త నిర్వచనాలు చెప్పేది. కౌగిలించుకోవటాన్ని 'జనరల్ బాడీ మీటింగ్' అనేది. ముద్దుపెట్టుకోవటాన్ని ముద్దుగా పెదవుల 'వర్గపోరాటం' అనేది. అవన్నీ గుండెను ఊయలలూగించిన రోజులు...

ఆ తర్వాత వచ్చాయి, గుండెల్లో ఫిరంగులు మోగించిన రోజులూనూ...

తనూజ తండ్రి ముకుందరావు మాజీ మంత్రి. ఇప్పటికీ ఆయన అటు రాజకీయాల్లో, ఇటు వ్యాపారాల్లో క్షణం తీరుబడి లేకుండాఉంటారు. ఆ పరగణాల్లో ఆయన మకుటం లేని మహరాజు. ఆయన మాట శిలాశాసనం, వెయ్యి కాండిల్ బల్బులా వెలుగుతున్న మనిషి, కనుక చిన్న చిన్న మనుషులు చీమల్లా కనబడటం సహజమే.

అయినా, ఆయన సత్యమూర్తిని తమ ఇంటికి పిలిపించాడు.

"మా అమ్మాయి మీ గురించి గొప్పగా చెబుతుంటే, చూడాలనిపించి డిన్నరుకు పిలవమన్నాను..." అన్నాడాయన.

"తనూజకు నామీదున్న అభిమానం వల్ల అలా చెప్పి ఉంటుంది. అంతకన్నా మరేం లేదు..." అన్నాడు సత్యమూర్తి ఆయన ముందు వినయంగా కూర్చుని.

"కావచ్చు. కానీ ఆ అభిమానం ఏర్పడటానికీ ఏదో ప్రత్యేకత ఉండాలి కదా...." అన్నాడాయన.

వరండాలో, మేడ మీద, బాల్కనీలో, లాన్‌లో ఒక్కోచోట కాసేపు కూర్చుంటూ సత్యమూర్తితో ఎన్నో విషయాలు మాట్లాడి, ఆయన చాలా సమయం గడిపాడు. భోజనాలు అయ్యాక, వద్దంటున్నా వినకుండా సత్యమూర్తిని కారులో దింపాడు. ఇంట్లోకి వచ్చి కూర్చున్నాడు. ఇల్లంతా పరికించి చూశాడు.

"ఫర్నిచర్ ఉన్నట్లు లేదే. రేపు పంపిస్తాను..." అన్నాడు.

"అబ్బే, మీకెందుకండీ శ్రమ?... నెమ్మదిగా నేనే కొందామనుకుంటున్నాను..."

"మీరు దేనికీ మొహమాట పడొద్దు. సంకోచం లేకుండా అడిగి తీసుకోండి. ఎందుకంటే మా అమ్మాయి విషయంలో నేను మీకూ శ్రమ ఇవ్వబోతున్నాను..."

"ఇందులో శ్రమేముంది? ఇటీజ్ మై డ్యూటీ... అందులోనూ తనూజ చాలా ఇంటిలిజెంట్..." అన్నాడు సత్యమూర్తి.

"అది నిజమే, కానీ ఇంకా దానిది తెలిసీ తెలియని వయస్సు. ఈ యవ్వనం ఉంది చూశారా, నురగలు కక్కుతూ ప్రవహించే జలపాతం లాంటిది. ఈ ఒక్క ఆడపిల్లా... నా ప్రాణాలన్నీ దానిమీదే పెట్టుకుని బతుకుతున్నాను. ఈ పదవీ, పలుకుబడీ.. అన్నీ దాన్ని అందలం ఎక్కించటానికే... నా కూతురు నాకు గర్వకారణం కావాలి.... కన్న తండ్రిగా ఈ మాత్రం ఆశపడటం తప్పా మాష్టారు?..."

"ఎంత మాత్రం కాదు" అన్నాడు సత్యమూర్తి.

"కానీ ఈ మధ్య చూచాయిగా విన్నాను. రవి అనే కుర్రాడితో స్నేహంగా ఉంటోందని..."

"ఇద్దరూ చదువులో పోటీపడుతుంటారు. జనరల్‌గా క్లాసులో వీళ్ళిద్దరూ ఫస్టూ, సెకండూ వస్తుంటారు. అంచేత స్నేహం..." అని సర్దిచెప్పాడు.

"అంతవరకే అయితే ఫర్వాలేదు. కానీ నమ్మి వదిలెయ్యటానికి వీల్లేని వయస్సు కదా... పాఠాలు చదవటం తప్ప, మనుష్యుల అంతర్యాలు చదవగల జీవితానుభవం లేని పిల్ల... అందర్నీ అమాయకంగా నమ్ముతుంది. పిచ్చితల్లి... అలాంటిది ఈ ప్రేమ ఉచ్చుల్లో చిక్కుకుపోతే... అదీ, దానిమీద ఎన్నో ఆశలు పెంచుకున్న నేనూ, సర్వనాశనం అయిపోతాం మాష్టారూ.." అంతదాకా ఎంతో గంభీరంగా ఉన్న ఆయన ఒక్క క్షణంలో మళ్ళీ గాంభీర్యాన్ని తెచ్చి పెట్టుకున్నాడు.

"తనూజతో ఈ విషయాలు చెప్పకపోయారా?" అన్నాడూ సత్యమూర్తి...

"ఆ సమయం వస్తే, సామ దాన భేద దండోపాయాలన్నీ ఉండనే ఉన్నాయి. కానీ తండ్రిగా, దాని ప్రేమకు అడ్డుపడుతున్న వ్యక్తిగా నేను చెప్పేదానికి ఒక స్నేహితుడిగా, శ్రేయోభిలాషిగా మీరు చెప్పే దానికి తేడా ఉంటుంది. ముందు మనిషి నచ్చితే, ఆ మనిషి చెప్పేది కూడా నచ్చుతుంది. ఎలా చెబుతారో, ఏం చెబుతారో, ఏం చేస్తారో నాకు తెలియదు. తనూజ మీ చెల్లెలే అనుకోండి. దాని బాగోగులు కోరే అన్నగా, దాన్ని ఉచ్చు నుంచీ తప్పించండి. వాళ్ళు దగ్గరగా రకూడదు, ఇప్పటికే దగ్గరై ఉంటే దూరమైపోవాలి. నాకీ ఉపకారం చేసి పెట్టండి. మీమీదున్న హత్య కేసు నేను రూపుమాపిస్తాను..." అన్నాడాయన.

సత్యమూర్తి ఉలిక్కిపడ్డాడు. తన సంగతంతా తెలిసే ఆయన ఇంతసేపూ తనతో ఇంత ఆదరంగా మాట్లాడాడా?

"ఏమంటారు?"

"నన్ను ఆలోచించుకోనివ్వండి..." అన్నాడు సత్యమూర్తి.

"నా వైపు నుంచీ కూడా ఆలోచించండి. నేనేమీ మిమ్మల్ని చేయరాని అన్యాయాలూ, అక్రమాలూ చేయమనటం లేదు. ఎక్కడ ప్రేమావేశంలో దారితప్పిపోయి, జీవితాన్ని ముళ్ళకంచెల్లోకి ఈడ్చుకుంటుందోనన్న బెంగతో, భయంతో, నా బిడ్డకు సరియైన దారి చూపించమంటున్నాను. ఈ మాత్రం చేయలేకపోతే, మీ చదువులు, డిగ్రీలు, కాలేజీలు శుద్ధదండుగ, షీర్ వేస్ట్ ఆఫ్ టైం, మనీ అండ్ ఎనర్జీ... ఇంతకీ ఊరికే చేయమని అడగటం లేదు. మీ కష్టాల్లో నుంచి మీరు బయటపడటానికి ఎలాంటి సహాయం చేయటానికైన సిద్ధంగా ఉన్నాను..." అన్నాడాయన. ఏదో ఒక ఒప్పందానికి వస్తున్న ధోరణిలో.

ఆయన ప్రత్యుపకారాల సంగతి కాదుగానీ, ఇదేదో చాలా చిత్రంగా తన మెడకు చుట్టేసుకుంటున్నట్లుగా ఉందనిపిస్తోంది సత్యమూర్తికి.

ఇప్పుడు రవి, తనూజలాగానే అప్పుడు తనూ, మల్లికా.... ఏ జన్మలో, ఏ జంటను విడదీసినందుకో ఈ జన్మలో ఇంత నరకాన్ని అనుభవిస్తున్నాడు. ప్రేమించుకున్న హృదయాల తపనా, ఆరాటం తనకు తెలుసు. అవన్నీ వదిలించుకుందామన్నా వదలకుండా వెంటాడుతుంటే, మళ్ళీ ఇక్కడా, ఇలా చిత్రంగా తన చుట్టూ గూడు అల్లేస్తున్నారా?...

ఇద్దరూ బయటకొచ్చారు .. ఆయన కార్లో కూర్చున్నాడు. వెళ్ళబోయే ముందు సత్యమూర్తి వంక చూశాడు.

"ఇంకో వేపు నుంచి కూడా ఆలోచించండి... అంతదాకా వస్తే నా బిడ్డను ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు. ఈ చిక్కుముడిని మీరు విప్పలేకపోతే, నేను విడదీసే పద్ధతి వేరే విధంగా ఉంటుంది. ఒక అమాయకుడి ప్రాణాలు తీయటం నాకు ఇష్టం

లేదు. కానీ గత్యంతరం లేకపోతే, నాకు అదేమంత పెద్ద కష్టంకాదు... కనుక.. మీ శిష్యుడి ప్రాణాలు కాపాడటానికి వీలుంటుందేమో అదీ ఆలోచించండి..." అంటూ ఉండగానే కారు స్టార్ట్ అయింది.

ఆయన వెళ్ళిపోయాడు. సత్యమూర్తి నిశ్చేష్టుడై అక్కడే నిలబడి పొయ్యాడు.

రవి కళ్ళముందు కదులుతున్నాడు. మెడకు తాడుగట్టి లాక్కెళుతున్న బలిపశువులా కనిపించాడతనికి.

వీడిని రక్షించగలడా తను?

## 3

ఆ రోజు కూడా సాయంత్రం మామూలు వేళకే సూర్యుడు తాటి చెట్ల వెనక్కి వెళ్ళాడు. మసక చీకట్లు ముసురుకున్నాయి. రవి లైటు వేశాడు. అతని దృష్టి అంతా రోడ్డు మీదకే ఉంది. తనూజ కోసం ఎదురు చూస్తుండటం వల్ల రవికి అసహనం ఎక్కువగా ఉంది.

అతని వంకే చూస్తున్న సత్యమూర్తి నవ్వుకున్నాడు. అప్పట్లో మల్లిక కోసం ఎదురు చూస్తూ తనూ తనూ ఇలాగే సతమతమైపొయ్యేవాడు. ఆ మాట కొస్తే ఇప్పటికీ ఆమె కోసం సత్యమూర్తి హృదయం ఆక్రోశిస్తూనే ఉంది. ఇంకో పది నిమిషాల్లో తనూజ వస్తుంది, రవిని వెతుక్కుంటూ. కానీ - మల్లిక మాత్రం రాదు గదా ఎన్ని నిమిషాలూ, గడియలూ, రోజులూ, సంవత్సరాలూ గడిచినా? ఎప్పుడైనా మళ్ళా ఏ ఊర్లోనో, దార్లోనో క్షణమైనా కనిపించి, కనుమరుగై పోరాదా? ఆ ఒక్క క్షణాన్నీ నెమరేసుకుంటూ నెట్టెయ్యవచ్చు ఇంకొన్ని యుగాల్ని - అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు సత్యమూర్తి.

ఇంతలో తనూజ లోపలికి వచ్చేసింది. చల్లని గాలీ లోపలికి వచ్చింది కిటికీ తలుపులు నెట్టుకుని, రవికి ప్రాణం లేచొచ్చింది. ఆమెకు ఎదురు వెళ్ళాడు.

"ఇప్పుడు టైం ఎంత?" అని అడిగాడు.

"ఏడు" అందామె.

"నువ్వే ఏడువ్" అన్నాడూ రవి.

"టైం అడిగింది నువ్వు. చెబితే ఏడవమంటావేమిటి?" అంది ముఖం చిట్లించుకుని.

"ఇప్పుడా రావటం?" అని అడిగాడు రవి.

"నాకు తిక్కరేగితే అసలు రాను. ఏమంటావ్?" అంది తనూజ.

"నువ్వే అంటున్నావుగా, నీకు తిక్క అని. ఇంక నేనేమంటాను" అన్నాడు రవి.

తనూజ ఆలస్యంగా రావటానికి కారణం ఉంది. ఆమె తనతోపాటే మాష్టారింటికి సోఫా సెట్ తీసుకొచ్చింది. ముందు గదిలో ఎటువైపు పెట్టాలో ఆమె నిర్ణయించింది. తర్వాత తలుపులకీ, కిటికీలకు కర్టెన్లు తగిలించింది స్వయంగా. రవి ఆమెకు సాయం చేస్తున్నాడు.

"జాగ్రత్త. వయసులో ఉన్న ఆడపిల్లవు. కాలు జారితే కష్టం..." అన్నాడు రవి.

"కాలు జారే సమయమనే, నిన్ను పక్కన నిలబడి పట్టుకోమంటున్నాను..." అంది తనూజ.

"నీ కత్తికి రెండువైపులా పదునే. నిన్ను పట్టుకున్నా కష్టమే, పట్టుకోకున్నా కష్టమే. అత్తా, నీ కొంగు తొలగిందని చెప్పినా తప్పే, చెప్పకున్నా తప్పే..."

"కర్టెన్ పట్టుకోవయ్యా మగడా అంటే, కొంగు తొలగిందంటావా" అంది తనూజ.

స్టూలు దిగి, చుట్టూ చూసి "ఇప్పుడెలా వుంది?" అని అడిగింది.

"నా మొహంలా ఉంది" అన్నాడు రవి.

"నీ మొహానికేమోయ్ ముద్దొస్తున్నావ్..." అనేసింది తనూజ.

ఆ పిల్ల నోటికి ఎంతొస్తే అంతా అనేస్తుంది. ఆమెకు ఏం తోస్తే, అది చేసేస్తుంది. చాలా డేరింగ్ అండ్ డాషింగ్ అని అంతా చెప్పుకుంటారు.

వీళ్ళిద్దరినీ చూస్తుంటే సత్యమూర్తికి మల్లికతో తను గడిపిన రోజులే గుర్తుకొస్తుంటాయి, మల్లిక కూడా ఇలాగే ఏ మాత్రం వెనకాడకుండా అనదల్చుకున్నదేదో మొహాన అనేసేది.

"వీటి మీద ఎంబ్రాయిడరీ ఉంటే బావుండేది. నీకు అల్లికలు రావా?" అని అడిగాడు తను ఒకసారి.

"అల్లుకు పోవటం ఎలాగో, ఆడపిల్లలకు ఒకరు నేర్పక్కర్లేదు మిత్రమా?" అంది నవ్వుతూ.

అంతా సర్దటం పూర్తి అయ్యాక తనూజ సత్యమూర్తిని అడిగింది ఎలా ఉందని.

"మీ డాడీ పంపారే అనుకో. నన్ను ఇలాంటి ప్రలోభాలతో లొంగదీసుకోవటం నీకేమన్నా బావుందా తనూజా..." అని ఎదురు ప్రశ్నించాడు సత్యమూర్తి.

"ఇది ప్రలోభపెట్టటం అని మీరనుకుంటే చెప్పండి. ఇప్పుడే వెళ్ళిపోతాను. ఇంక ఈ ఛాయలకైనా రాను..." అంది తనూజ లేచి వెళ్ళబోతూ.

"ఉన్నవాళ్ళ పిల్లలతో ఇదే పేచీ. మాట మాట్లాడితే కోపం. నిముష నిముషానికీ అలుగుడు, నీలుగుడు... ముందున్నయి నా పాట్లన్నీ" అని స్వగతంలో అనుకోవాల్సిన మాటలు పైకే అనేశాడు రవి.

నీకు సమాధానం తర్వాత చెబుతాను" అంటూ సత్యమూర్తి దగ్గరకెళ్ళింది తనూజ.

"మీరు కేవలం గురువు, నేను ఒక శిష్యురాల్ని మాత్రమే అన్న ఫీలింగ్‌ను దాటి చాలా దూరం వచ్చామని, నా మటుకు నేను అనుకుంటున్నాను మాష్టారూ, యూ ఆర్ మై గైడ్, ఫిలాసఫర్, ఫ్రెండ్.. అండ్ ఏ బిలవ్‌డ్ బ్రదర్... నిజంగా నాకో అన్నయ్య అంటూ ఉన్నా, ఆ అన్న దగ్గరా ఇంత స్వేచ్ఛగా, యధేచ్ఛగా ఉండలేనేమోనండి... మీరు నన్నూ రవినీ ఆదరిస్తున్న తీరు మాకెంతో సంతోషాన్నీ ధైర్యాన్నీ ఇస్తోంది. మాకు చదువుతో పాటు, బ్రతుకు అర్థాన్నీ తెలియజేస్తున్న మీ రుణం మేం తీర్చుకోలేనిది... ఎన్ని సోఫాలు ఇచ్చినా, టీపాయ్‌లిచ్చినా..." అంది తనూజ.

సత్యమూర్తికి వెంటనే ముకుందరావు గుర్తొచ్చాడు. ఈ ప్రేమ ఉచ్చు నుంచీ తనూజను కాపాడే బాధ్యత ఆయన తన మీద పెట్టాడు. ఈ పిల్లకింకా ఆ విషయం తెలీదు మరి. వీళ్ళను విడదీసి చెరో దారి పట్టించాల్సిన డ్యూటీ ఆయన అప్పగించాడు.

తనూజ ఇంక రవి వైపు తిరిగి అడిగింది, "ఏమిటన్నావ్, నాకు అలుగుడు నీలుగుడూ ఎక్కువా?"

"ఛీ ఛీ, నీకింకా చాలా తక్కువ. నేను చెప్పింది బాగా ఉన్నవాళ్ళ పిల్లగురించి, నీ కంటే ఇంకా బాగా ఉన్నవాళ్ళ గురించి..... అయినా ఈ పరగణాల్లో నిన్ను ఎవడన్నా అని, బతికి బట్టకట్ట గలడా?" అన్నాడు రవి భయాన్ని అభినయించి.

"చస్తే ఏమోగానీ, బతికితే మాత్రం బట్ట కట్టాలి. లేకపోతే జనం జడుసుకు ఛస్తారు అనవసరంగా..." అని నవ్వింది తనూజ.

కొంచెం సేపయిన తర్వాత తనూజ, రవి బయలుదేరారు. దార్లో మధ్యలో విశాలంగా ఉన్న పచ్చిక బయలులోకి వచ్చారు. పగలయితే అక్కడ కాబోయే కపిల్‌దేవ్‌లు, గవాస్కర్‌లు వీర విహారం చేస్తుంటారు. తెల్లని వెన్నెట్లో పచ్చిక బయలు మధ్యగా నున్న సన్నటి

పొడవాటి కాలిబాట భూదేవి నుదుటి పాపిటిలా ఉంది. దారి పక్కనే ఉన్న బండ మీద మజిలీ వేశారు. వాలుగా ఉన్న చోట కూర్చున్నాడు రవి.

"పైకిరా" అంది తనూజ.

"నన్ను పనికిరావని అన్నవాళ్ళే గానీ, పైకిరా అన్నవాళ్ళెవరూ లేరు ఇంతవరకూ. అందులోనూ పక్కనున్న అందమైన ఆడపిల్ల 'పైకిరా' అన్నదీ అంటే, అంతకన్నా ఇంకేం కావాలి... కానీ నాకిక్కడే తాజా రోజాల కన్నా నాజూకైన నీ పాదాల చెంతే పదికాలాల పాటు ఉండిపోవాలనిపిస్తోంది..." అన్నాడు.

"తథాస్తు. ఇదివరకు ఆడాళ్ళు అడిగేవాళ్ళు పాదాల చెంత చోటు ఇవ్వమని. ఇప్పుడు రివర్స్ గేర్" అంది తనూజ.

"పాదాల దగ్గర మొదలెడితే పనులు తొందరగా పూర్తవుతాయి" అని అసలు రహస్యం చెప్పేశాడు రవి.

"సంతోషించాంగానీ నీ తెలివితేటలకు... ఈ వెన్నెల, ప్రశాంతత, ఒంటరితనం, నీ పక్కన నేను – నీ కేమనిపిస్తోంది?" అని అడిగింది తనూజ ముందుకు వంగి.

"ఇటునుంచీ నిన్ను చూస్తుంటే, కాయల భారానికి కిందకి వంగిన కొమ్మ గుర్తొస్తోంది."

"ఛీ. నీ బుద్ధిపోనిచ్చుకున్నావు కాదు. నాకు సగం సంతోషంగానూఉంది సగం భయంగానూ ఉంది మా నాన్నను తలుచుకుంటే. నన్ను ఏం చేయడు, కానీ ఆ కోపమంతా నీ మీద చూపిస్తే?"

"చెప్పానుకదా నేస్తం... నీ పాదాల దగ్గర నా తల బద్దలైనా పర్వాలేదు. నాకు సంతోషమే' అన్నాడు రవి.

తనూజ ఆదరంగా అతని తల మీద చెయ్యివేసి నిమిరింది. ఒక్క క్షణం ఆగి అంది –

"మన విషయంలో మాష్టారి సహాయం తీసుకుందామనుకుంటున్నా ఆయన నచ్చ చెపితే, మా నాన్న కన్విన్స్ అవుతాడన్న నమ్మకం నాకు కలుగుతోంది."

"నాకూ అదే నమ్మకం,,," అన్నాడు రవి.

ఇద్దరూ కాసేపు సత్యమూర్తి గురించే ఆలోచించుకుంటూ ఉండిపొయ్యారు.

"ఇంక లేచిపోదామా?" అంది తనూజ.

"ఇప్పుడేనా... ఇంకొన్నాళ్ళు ఆగాక ఎలాగూ తప్పదని అనుకుంటున్నా..." అన్నాడు రవి.

"లేచిపోవటం అంటే... ఇంక లేచి ఇంటికెళ్ళిపోదమా అని... ఆ రోడ్డు దాకా తోడురా..." అంది తనూజ.

"నీకు తోడు వస్తే నాకు ఏమిటి లాభం? లంచం ఇస్తావా మరి"

"ఇంత పబ్లిక్‌గానా లంచాలు ఇచ్చుకోవటం, పుచ్చుకోవటం, పద పద..." అంది తనూజ సుతారంగా అతన్ని ముందుకు నెడుతూ.

ఇద్దరూ కాలి బాటన నడుస్తున్నారు. పచ్చిక మైదానం మధ్యకు వచ్చారు. చుట్టూ తాటిచెట్లు ఒంటికాలిమీద నిలబడి తపస్సు చేసుకుంటున్నాయి నిశ్శబ్దంగా. వెన్నెల్లో పచ్చిక మీద ఆ చెట్ల నీడలు పులిచర్మం మీద మచ్చల్లా ఉన్నాయి.

రవి పక్కనే నడుస్తున్న తనుజ వెన్నుపూస మీద, మునివేళ్ళను పాకించి 'పాము, పాము' అన్నాడు కంగారుగా.

తనూజ గుండె ఝుల్లుమంది. అతన్ని హత్తుకుపోయింది భయంతో. రవి రెండు చేతుల్లోనూ ఆమెను గట్టిగా బిగించేసి, మొహం మీదకు మొహం చేర్చాడు, పెదవులకోసం వెతుక్కుంటూ.

విడిపోయి, నడుస్తుండగా అన్నాడు "లంచాలు ఎలా పుచ్చుకోవాలో మాకూ తెలుసు..."

"చాల్లే పెద్ద.... సిగ్గు లేకుండా..." అంది తనూజ పెదవుల మీద తడి తుడిచేసుకుంటూ.

"సిగ్గుపడితే, పనులు కావు పిల్లా..." అన్నాడు రవి.



మర్నాడు ఉదయమే సత్యమూర్తి ఇంటికి వచ్చాడు రవి, అతనితో పాటే కాలేజీకి బయలుదేరాడు. కానీ భోజనానికి రమ్మంటే, రానని వెళ్ళిపోయాడు.

సత్యమూర్తి కాలేజీకి వచ్చేటప్పటికి, రవి అప్పటికే చెట్లకింద చేరి మిత్రులతో కబుర్లాడుతున్నాడు. సాయంత్రం సత్యమూర్తి ఇంటికి బయలుదేరుతుంటే, రవి ఎదురొచ్చాడు, లెటరొచ్చిందంటూ ఇచ్చాడు.

తనకు ఉత్తరం ఎక్కడినుంచా అని ఆశ్చర్యపోతూ అడ్రసు చూడగానే అంతులేని ఆనందం కలిగింది సత్యమూర్తికి, ఆ అక్షరాలు అతనికి చిరపరిచితమే... మల్లిక!... ఆ సంతోషం మీద తేలిపోతూనే ఇంటికొచ్చి సోఫాలో వాలిపోయి, కవరు చించి చదువుకున్నాడు.

"డియర్ సత్యా -

ఉద్యోగంలో చేరినందుకు హృదయపూర్వక అభినందనలు, చాలా ఆలస్యంగా చెబుతున్నాను. బట్, బెటర్ లేట్, దాన్ నెవర్ - అన్నారు కదా.

కొత్త చోటు, కొత్త ఉద్యోగం, నచ్చిందా? నీ నిరాశామయ సమాధానమూ నాకు తెలుసు. కోరుకున్న జీవితం మనకు లభించనప్పుడు, లభించిన జీవితంతో రాజీపడక తప్పదు మరి.

సరేగానీ, ఎలా ఉన్నావు, ఏం చేస్తున్నావు? ఐమీన్ ఉద్యోగంగాక, మిగతా టైంలో... చేతులూ, మూతులూ కాల్చుకుంటున్నావా లేక హోటల్ వాడు పెట్టే గడ్డి తిని బతుకుతున్నావా? మనమూ గడ్డి తిని పశువుల నోరు కొట్టడం ఎందుకంటున్నావా? ఎన్నాళ్ళు అయింది నీ మాటలు విని? సరస సంభాషణలతో, నీతో కాలం వెళ్ళబుచ్చి? ఇన్నాళ్ళ మౌనరాగాలాపనల తర్వాత మొన్నా మధ్య కదా, దేవుడి దర్శనానికి వస్తే నీ దర్శనం అయింది. మళ్ళీ ఎప్పుడో, ఎక్కడో?

నా గురించి అడుగుతున్నావా? ఏముంది చెప్పడానికి? నిజానికి నాకే లోటూ లేదు. కార్లూ, మేడలూ, ఆస్తులూ అన్నీ ఉన్నాయి. నేనూ వున్నాను, వీటికి రేయీ పగలూ కాపలా కాస్తూ, పగటి పూట ఎండ కాస్తుంది కనుక నేను ఈ చలువ రాతి సౌధోపరిభాగంలో, యూఫోం పరుపులపైన పడుకుంటాను,కుక్క పిల్లను తోడు తెచ్చుకుని.

రాత్రికి తీరిగ్గా చంద్రుడొస్తాడు. వెన్నెలా వస్తుంది.. ఎక్కడో నే జారవిడుచుకున్న జ్ఞాపకాల మూటను భుజాన వేసుకుని, ఇంక అక్కడ్నుంచీ నీ తాలూకు ఆలోచనా సుమాల వానజల్లు కురుస్తుంది. తడుస్తూ నడుస్తుంటాను, దారీ తెన్నూ లేని కొండ చరియల్లోకి. ఏ

లోయలోనుంచైనా నీ పిలుపు వినిపిస్తుందేమోనని, మంచు తెల్లంచు టోపీలున్న ఏ శిఖరాగ్రం మీదనైనా నీవు నడిచి విడిచిన కాలి గుర్తులు కనిపిస్తాయేమోనని - పంచేంద్రియాలు కేంద్రీకరించి వెతుకుతుంటాను. నా పిచ్చిగానీ, ఇంకా ఎక్కడ కలుస్తాం చెరో దారి అయ్యాక.

గతాన్ని తలుచుకుంటే చాలు, ఏదోలా అయిపోతాను నేను. ఆ రోజులే వేరు ఆ రాత్రులూ వేరు.

సముద్రంలో స్నానం చేసి వచ్చిన చల్లగాలి, మనల్ని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న సాయం సమయాలూ, వెన్నెల జారుపైట కింద జేరి గుండె గుసగుసలు విన్న క్షణాలూ, నిర్నిద్రగా మనిద్దరం చెట్టాపట్టాలుగా, క్రీనీడలుగా నడిచి వెళ్ళిన రాత్రులూ - మరుపురావు మనం ఉన్నంతవరకూ.

అప్పుడంత చేరువగా వచ్చి, ఇప్పుడింత దూరంగా వెళ్ళి ఎలా ఉండగలుగుతున్నామో, నాకే తెలియదు, ఒకే ఒక్క ఆశ, పేరాశలా అహర్నిశం ఊరిస్తూ ఉంటుంది.

ఎప్పుడేనా, ఒక్కసారి -

ఈ సభ్య నాగరిక సమాజపు నీతినియమాల అడ్డు తెరలన్నీ దించేసుకుని, వీళ్ళందరికీ బహుదూరంగా, మనం తప్ప మరెవరూ లేని ఏ ఆశ్రమానికో, అడవికో వెళ్ళి తెలిమబ్బుల చలవపందిరికింద -

లేళ్ళూ, నెమళ్ళూ కులుకుల నడకలతో దారి చూపగా -

కోయిల గొంతెత్తి కొత్తగా మత్తుమత్తుగా పాడగా -

ఇద్దరం ఒకటిగా నడిచివెళ్ళి -

ఏ పారిజాత వృక్షాల పాదాల చెంతనో, పండుటాకుల పట్టుపరుపులపైననో -

నేను నీవై, నీవు నేనై - తీరేనా ఈ కోరిక?

రోజూ ఈ నీలాల కన్నుల కొసల నుంచీ దారి పొడగునా జారి పడే కాంక్షలు ఎన్నని చెప్పను?

కోర్కెల రెక్కలల్లార్చుకుంటూ, స్వైరవిహారం చేసే ఆశలనేమని వర్ణించను?

నీ గుండెల మీద తలవాల్చి నిద్రపోవాలని ఉంది. అది కడసారి నిద్ర అయినా పర్వాలేదు. వేచి ఉంటాను వెయ్యేళ్ళదాకా -

నిజానికి ఈ హృదయమనే గదిలో తాళం మాత్రం తీయలేదు. కనుక ఇంకా నీవు మిగిల్చిపోయిన జ్ఞాపకాలన్నీ అక్కడే ఉన్నాయి భద్రంగా.

ఇంతకీ మావారి గురించి చెప్పలేదు కదూ. ఆయన హరిశ్చంద్రప్రసాద్, అలా అని తొందరిపడిపోకు.... ఈ హరిశ్చంద్రుడు ఎన్ని అబద్దాలు అయినా ఆడగలడు గానీ, భార్యను మాత్రం బజార్లో అమ్మడు, నువ్వు కొనుక్కొందామన్నా,

అంచేత ఇంక ఇంతే. నేనూ, నా విచారమూ, నా దైన్యమూ చుట్టచుట్టుకుని, కట్ట గట్టుకుని తిరుగుతుంటాం.

మొన్నొకనాడు, పండగనాడు ఆయన బలవంతం మీద కొత్త చీర కట్టుకున్నాను. ఆయన నవ్వుతూ దగ్గర కొస్తే, నాకు మాత్రం పరుగెత్తుకుని నీ దగ్గరకు రావాలనిపించింది, ఈ సంకెళ్ళు తెంచేసుకుని, ఈ బందిఖానాలు దాటుకుని... కానీ మన దౌర్భాగ్యం ఏమిటంటే, మనం మనం కోసం బ్రతకటం లేదు ఇదిగో, ఈ చుట్టూ ఉన్న వాళ్ళ కోసం, కట్టుకున్న వాళ్ళ కోసం బ్రతుకుతున్నాం. ఈ ద్విపాత్రాభినయం చేయటం ఎంత కష్టమో మనకు మాత్రమే తెలుసు...

ఇంతకీ నీ అడ్రసు ఎలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావా? మన ఆస్తి ఎక్కడైనా దూరంగా ఉందనుకో. దాని బాగోగుల గురించి తెలుసుకుంటామా లేదా, అలాగే ఇదీను.

ఉండనా ఇంక. నిద్ర ముంచుకొస్తోంది కనురెప్పల మీద నించీ బరువుగా జారుతూ, నాకు మెలుకువ కన్నా నిద్రే నయం, నిద్రలోకి పోతే కల వొస్తుంది. ఆ కలలోకి నీవొస్తావు. అటునుంచీ ఏ ద్వీపాంతరవాసానికో వెళతాం ఇద్దరం కలిసి. అక్కడి నీలి నీటి సరస్సు ఒడ్డున, పోక చెట్ల నీడల్లో నడుస్తుంటే ఆనందోత్సాహం నవ్వుతూ ఎదురొచ్చి స్వాగతం చెబుతుంది రండి, రండని.

సరే మరి. అడ్రసు ఉందికదాని జవాబు రాయకు. భర్తచాటు భార్యను కదా. నేనే మళ్ళా ఎప్పుడో రాస్తాను, జీవితంలోని వ్యధనంతా ఈ కాగితాల నిండా నింపి, కనుక, ఇంక శలవు - నీ తాలూకా ఊహలనుంచీ, నీ జిల్లా ఆశలనుంచీ.

నీ, కాదు ఎవరికీ ఏమీ కాని ఆనాటి నీ మల్లిక"

సత్యమూర్తి ఆ ఉత్తరం చదివిన చాలా సేపటి దాకా ఏవేవో ఊహల మీద విహరించాడు. ఎప్పుడో తేరుకుని చూసేటప్పటికి ఎదురుగా రవి కూర్చుని ఉన్నాడు, ఏదో పుస్తకం చదువుకుంటూ -

సత్యమూర్తిని చూసి నవ్వాడు.

"నేనో విషయం అడుగుతాను, నిజం చెబుతావా రవీ..." అని అడిగాడు సత్యమూర్తి.

"అడగండి మాష్టారూ?...." అన్నాడు రవి.

"నువ్వు ఇవాళ భోంచేశావా?" అని సూటిగా కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"చేశానండి."

"ఎప్పుడు?"

"కాలేజీలో ఉండగా నేచేసింది అదేనండి. చదువే నాకు ఆహారం అదే నా జీవితం,,,'

"కావచ్చు, కానీ ప్రాణాన్నీ, శరీరాన్నీ కలిపి ఉంచటం కోసమైనా తిండి తినాలి కదా..."

"ఆకలితో నా స్నేహం ఇప్పటిది కాదండి. చిన్నప్పటినుంచీ నాకు అలవాటే. ఓ పల్లెటూళ్ళో, నిరుపేద కుటుంబంలో పుట్టాను. కానీ అందరిలా నేను గర్వంగా, గౌరవంగా బతకాలన్న ఆశ, తపన... ఇవే నన్ను నడిపిస్తున్నాయి" అన్నాడు.

"ఆశలు నీ ఒక్కడికే కాదు. ప్రతీవాడికీ ఉంటాయి. భవిష్యత్తులో ఏదో ఉజ్వలంగా వెలిగిపోతానని పగటి కలలు కంటాడు. కానీ ఈ కలలన్నీ ఒట్టి కలలే తమ్ముడూ అని కాలమే మనకు గుర్తుచేస్తుంది తర్వాత ఎప్పుడో"

"చదువుకోవాలనుకోవటం, బాగుపడాలనుకోవడం పగటి కలా అండీ?"

"నేను చెప్పేది వాటి గురించి కాదు. తనూజతో నీ స్నేహం గురించి, మీ ప్రేమ గురించి. ఆమెను పెళ్ళిచేసుకునే అర్హత నీకుందా అని అడుగుతున్నాను."

"ఆమె ఆడది. నేను మగాడిని. పెళ్ళి చేసుకోవటానికి ఇవే అర్హతలు."

"శారీరక వాంఛలు తీర్చుకోవటానికే అయితే, నువ్వు చెప్పిన ఈ అర్హతలు చాలు. కానీ పెళ్ళి చేసుకోవటానికి ఈ అర్హతలు చాలవి. ఉన్నమాట అంటున్నందుకు బాధపడొద్దు. నీకే తిండి లేదు. ఇంక పెళ్ళాన్ని, అందులోనూ తనూజను ఎలా పోషించగలవు?" అని అడిగాడు సత్యమూర్తి.

"దయచేసి మాకు పిరికి మందు నూరి పొయ్యకండి మాష్టారూ" అన్నాడు రవి. అతనే మళ్ళీ అన్నాడు "ఇంత దూరం వచ్చాక ఇంక వేరే ఆలోచనలకు తావులేదండీ."

"ఎంత దూరం వచ్చారేమిటి?"

"పెళ్ళి చేసుకోవాలని మేం నిర్ణయించుకున్నాం..."

"మీ నిర్ణయాలు చాలా? ఆ అమ్మాయి ఎవరనుకుంటున్నావ్? ముకుందరావుగారి అమ్మాయి. ఆయనతో చెలగాటాలాడే స్తోమత ఉందా? తలుచుకుంటే అడ్రసు లేకుండా పోతావ్."

"బెదిరిస్తున్నారా?"

"కాదు, రేపు జరగబోయే కటిక వాస్తవాన్ని నీకు ముందుగా చెబుతున్నాను... హెచ్చరిక చేస్తున్నాను."

"అయినా సరే... తనూజ కోసం నేను సంతోషంగా చనిపోగలను మాష్టారూ."

"చచ్చి ఏం సాధిస్తావ్? దయ్యమై పట్టుకుని ఆ పిల్లను మరింత క్షోభపెట్టటం తప్ప."

"మరి మమ్మల్ని ఏం చెయ్యమంటారు మాష్టారూ?"

"మీ పరిస్థితులేమిటో మరిచిపోతే లాభం లేదు. అంచేత ఎవరి పరిధుల్లోనే వాళ్ళుండిపొండి" అని హితబోధ చేశాడు.

రవి కొద్ది క్షణాలు ఆగి, తలెత్తి అతని వంక చూసి అన్నాడు "క్షమించండి మాష్టారూ... ఈ ఒక్క విషయంలోనూ నేను మీ మాట వినలేను. బ్రతికినా, చచ్చినా ఇద్దరం ఒకటిగానే ఉండాలన్నది మా తిరుగులేని నిర్ణయం... ఆయనతో యుద్ధం అనివార్యం అయితే అందుకూ సిద్ధమే... సర్వనాశనం తప్పదని తెలిసీ, భగవంతుడు కృష్ణుడే దగ్గరుండి కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని జరిపించాడు. నేనూ కొండను ఢీకొంటున్నాను, మాడు పగులుతుందని తెలిసీ. కానివ్వండి ఏం జరగాలో అదే జరుగుతుంది. ఆపటం ఎవరితరం? అనేసి ఇంక అతనికి మాట్లాడే అవకాశమైనా ఇవ్వకుండా లేచి వెళ్ళిపొయ్యాడు.

సత్యమూర్తి దీర్ఘంగా నిట్టూర్చాడు. ఈ ఆవేశం ఎలాంటిదో తనకు తెలుసు. అప్పట్లో తనూ ఇలాగే ఎగిరిపడ్డాడు. తర్వాత వెళ్ళి జైల్లో పడ్డాడు. 'నువ్వు హంతకుడివి సుమా' అంటూ లోకం తన మీద ముద్ర వేసింది.. ఆ కథకు కారణం అయిన మల్లిక, మిసెస్ హరిశ్చంద్రప్రసాద్‌గా మారి గుట్టుగా కాపురం చేసుకుంటోంది.

అనుభవం నేర్పిన పాఠాలతోనైనా, వీళ్ళను కొట్టో, తిట్టో విడదీద్దామంటే, వింటేనా?

రాత్రి పదిగంటలు దాటాక సత్యమూర్తి ఇంటి ముందు కారు ఆగింది. ముకుందరావు కారు దిగాడు. సత్యమూర్తి ఎదురెళ్ళి సాదరంగా ఆహ్వానించి తీసుకొచ్చి, ఆయన పంపించిన సోఫాలోనే ఆయన్ను కూర్చోపెట్టాడు. కుశల ప్రశ్నల తర్వాత ఆయన అసలు విషయానికొచ్చాడు.

"నేను చెప్పింది ఏం చేశారు?" అని అడిగాడు.

"మీరు అనవసరంగా అనుమాన పడుతున్నారేమోననిపిస్తోంది..." అన్నాడు సత్యమూర్తి.

"మీరు అమ్మాయిని కదిపి చూశారా?"

"ఇంకా లేదు. అవకాశం రాలేదు. అయినా వాళ్ళను స్టడీ చేస్తున్నాను. నాకా అనుమానం కలగడంలేదు."

"అలాంటిదేమీ లేకపోతే, నాకే చింతా లేదు. ఎక్కడినుంచో చూచాయిగా నాదాకా వచ్చింది. ఆడపిల్ల తండ్రిని కదా. నా జాగ్రత్త నేను పడుతున్నాను."

"అదీ నిజమే లెండి."

"పైగా ఆ వయస్సు ఉరవడి అలాంటిది. ప్రపంచాన్నే జయించాలనీ, సముద్రాలను ఔపోసన పట్టాలనీ, అర్థం లేని ఆవేశం, వాళ్ళని అనేక ప్రమాదాల్లోకి పరుగులు తీయిస్తుంటుంది. కానీ కూడూ గుడ్డా అయినా దొరికితే చాలనీ చాలా ఆలస్యంగా సమాధానపడతారు. అప్పటికే ఇంక తిరిగి రాలేనంత దూరం వెళ్ళిపోతారు."

"బాగా చెప్పారు" అన్నాడు సత్యమూర్తి.

"పసిపిల్లాడు బావి దగ్గరకెళితే తల్లి పిల్లాడి రెక్క పుచ్చుకుని ఇవతలకు లాక్కొస్తుంది. కత్తిపీటతో ఆడుకుంటుంటే, ఎక్కడ చేతులు కోసుకుంటాడోనని దూరంగా ఈడ్చుకుపోతుంది. అంతమాత్రాన తను చేసే పనులేవీ వాడు చేయకూడదని కాదు. తనలాగా చేయబోయి, చేతగాక ఎక్కడ ప్రాణాల మీదకు తెచ్చుకుంటాడోనని ఆమె భయం. పిల్లల మీద తల్లిదండ్రుల భయం ఎప్పుడు తప్పటడుగు వేస్తారోనని... వాళ్ళనో కంట కనిపెట్టి చూస్తూనే ఉంటారు" అన్నాడాయన.

రెండు క్షణాలాగి ఆయనే మళ్ళీ అన్నాడు "పెళ్ళి విషయంలో నా నిర్ణయానికేఅది కట్టుబడి ఉండనక్కర్లేదు. మా హోదాకూ, స్థాయికీ తగినవాడిని ఎవర్ని ఎన్నుకున్నా, నేను దాని నిర్ణయానికే కట్టుబడి ఉంటాను. కానీ మరీ తాడు బొంగరం లేనివాడితో అంటేనే, ఇంతగా మథన పడాల్సి వస్తోంది..."

"మీరంతగా బాధ పడాల్సిన పనేం లేదులెండి. నేనున్నాను కదా. అలాంటిది ఏమన్నా ఉంటే, మీతో చెపుతాను. ఏం చెయ్యాలో చూద్దాం. తనూజ తెలివైన పిల్ల. విడమర్చి చెపితే అర్థం చేసుకోలేనత అమాయకురాలేం కాదు..." అన్నాడు సత్యమూర్తి.

"దాని జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టంలో ఈకాస్త సాయమూ చేసిపెట్టండి... మీ మేలు మరిచిపోను. మీ ఋణం ఉంచుకోను...." అన్నాడాయన.

"పెద్దవారు అలాంటి మాటలు అనకండి - మీరు నమ్మినా, నమ్మక పోయినా, నా స్వంత చెల్లెలే అన్న భావంతో చూసుకుంటున్నాను. నా చెల్లెలి భవిష్యత్తును తీర్చి దిద్దాల్సిన బాధ్యత నాకూ ఉంది..." అన్నాడు సత్యమూర్తి.

"మీరామాత్రం బాధ్యత తీసుకుంటే, నా బరువు తగ్గిపోతుంది,"

ఒక అరగంట తర్వాత ఇంటికొచ్చి మేడ మీద కొచ్చి, కూతురు గదిలోకి వచ్చాడు. ఏం అడిగితే, ఏం చెప్పాల్సివస్తుందోనని తనూజ నిద్రపోతున్నట్లు నటించింది.

ఆయన రెండు నిముషాలు కూతుర్నే చూసుకుంటూ అక్కడే నిలబడ్డాడు. తర్వాత గదిలోకి వెళ్ళిపోయాడు.

ఎవరి మటుకు వాళ్ళు, ఈ ఆటలో ప్రత్యర్థిని తెలివిగా ఓడించగలమన్న ధీమాలో ఉన్నారు తండ్రీ కూతురూను.

రవీ, తనూజా మళ్ళా సత్యమూర్తి ఇంట్లో చేరి పాఠాలు చదవటం మొదలుపెట్టారు. అంటే ప్రేమ పాఠాలు మళ్ళా మొదలెట్టారన్నమాటే.

సత్యమూర్తి ఎదురుగా కూర్చున్నంతసేపూ దృష్టి పుస్తకాల మీదే ఉన్నా అతను అటు తిరగ్గానే వీళ్ళిద్దరూ చూపులతోనూ, చేతలతోనూ, చేతులతోనూ పలకరించుకుంటున్నారు.

అయితే రవి జరిగిన అనుభవాన్ని అంత తేలికగా మర్చిపోలేక పోవటంతో, మామూలు మనిషి కాలేక పోతున్నాడు. అయినా తనూజ అతన్ని సహజ ధోరణికి లాగుతూనే ఉంది.

మధ్యలో సత్యమూర్తి అటూ ఇటూ వచ్చి వెళుతున్నప్పుడు "స్పీడ్‌బ్రేకర్స్" అడ్డొచ్చినా, అతనటుమళ్ళగానే మామూలే.

మిగతా మూడు నెలలూ, మూడు రోజుల్లా గడిచిపోయాయి. పరీక్షలు దగ్గరకొచ్చాయి. కనుక ఇంక పుస్తకాల పురుగులైపొయ్యారు. టీనీళ్ళు తాగుతూ, తెల్లార్లూ కళ్ళుమూస్తూ తెరుస్తూ, అదే మళ్ళా మళ్ళా వల్లె వేస్తూ కూర్చుంటున్నారు. ఎంత




శ్రమా, బడలికా అయినా, విడిగా అయితే ఏమోగానీ, ఎదురెదురుగా కూర్చుని చదువుతున్నందువల్ల అదీ ఆసక్తిగానే ఉంది. పైగా ఇద్దరికీ చదువులో మొదటి నుంచీ ఉన్న పోటీ ఉండనే ఉంది. అంత తీక్షణంగా చదివేటప్పుడూ, నిద్రమొహాలతో ఉన్నప్పుడు కూడా రవి కనపడకుండా ఏదో చేసేవాడు. తనూజ గుడ్లురిమి చూసేది.

"నువ్వు నా మీద నలుగురిలో చెయ్యి చేసుకుంటే లేదుగాని, నేను ఎవరి కంటా పడకుండా చెయ్యివేస్తే తప్పా?" అని అడిగేవాడు.

"నువ్విలా చేతులూ కాళ్ళూ వేస్తేనే, చెయ్యి చేసుకునేది మరి?..."

"అయితే మళ్ళీ ఇంకోసారి నా చెంప మీద కొట్టుకో నాకేం అభ్యంతరం లేదు. కానీ నా ఇష్టమొచ్చినచోట చెయ్యి వేసుకోనీ... ఓ,,కే?...." అని బేరం పెట్టాడు రవి.

"ఇదుగో చెబుతున్నాను. పరీక్షలయ్యాక మన మధ్య కనీసం మూడు మీటర్ల దూరం అయినా లేకుండా అతుక్కుపోవాలి. ఒప్పుకుంటున్నావా....."

"పరీక్షలయ్యాక కాదు, పెళ్ళి అయ్యాక, అలా అతుక్కుపోవటాలన్నీ..."

"ఇప్పుడంటే థ్రిల్ ఉంటుంది కాబట్టి ఇంతగా మీద పడుతున్నాను గానీ, పెళ్ళి అయ్యాక, మనవళ్ళూ మునిమనవళ్ళూ పుట్టాక, నువ్వు రవిక విప్పుకుని, పిండి రుబ్బుకునేటప్పుడు. పిలిస్తే మాత్రం ఎవడొస్తాడు నీ దగ్గరకు?...

ఓ పక్క ఇలా గిల్లి కజ్జాలాడుతూనే పరీక్షలు రాసేశారు. పెద్ద బరువు దించేసుకున్నట్లు ఫీల్ అయ్యారిద్దరూ. రెండు రోజులు కరువుదీరా నిద్రపోయి లేచాక, ఓ వెన్నల రాత్రి తనూజ, రవి, సత్యమూర్తీ డాబామీద కూర్చున్నారు.

"ఇంక మా పరీక్షలు అయిపోయి మాష్టారూ" అని అన్నాడు రవి..

"అసలైన ఆత్మ పరీక్షలూ, అగ్నిపరీక్షలూ కూడా అయినట్లేనా?" అని అడిగాడు సత్యమూర్తి నవ్వుతూ.

"అన్ని పరీక్షలూ అయినాయండీ" అన్నాడు రవి.

"అని అనుకోవడానికి వీల్లేదు. రేపు ఏం జరుగుతుందో ఇవాళ తెలియదు. కాబట్టి ఏరోజుకారోజూ ప్రతి రోజూ పరీక్షే" అని చెప్పాడు సత్యమూర్తి.

"అవుననుకోండి... ఇంక మమ్మల్ని ఏం చేయమంటారో చెప్పండి" అని అడిగాడు రవి.

"మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి" అని నవ్వాడు సత్యమూర్తి.

"మీరు కాస్త ధైర్యాన్నిస్తే ఆకాశానికి ఎగురుతాం మాష్టారూ" అన్నాడు రవి.

"అవును మీ శిష్యుడు ఆంజనేయుడంతటివాడు" అంది తనూజ వత్తాసు పలుకుతూ.

"నన్ను ఆంజనేయుడు, హనుమంతుడూ అన్నావంటే, నే బ్రహ్మచారిగా ఉండిపోవాల్సి వస్తుంది. చూసుకోమరి..."

"ఆంజనేయుడికి కూడా సువర్చల ఉంది కదా..." అని గుర్తు చేసింది.

"ముందు మన సంగతి తేలనీ. తర్వాత వాళ్ళ సంగతి తేలుద్దాం" అన్నాడు రవి.

"మా నాన్న కూడా నిన్న నా పెళ్ళి టాపిక్ తెచ్చారండి. సంబంధాలు చూడటానికి వెళ్తానన్నారు...."

"విష్ యు ఆల్ ద బెస్ట్..." అన్నాడు సత్యమూర్తి.

"థాంక్యూ సర్... కానీ నాకు 'ఆ ఆల్ ది బెస్ట్' ఏమిటో మీకు తెలుసు. నిజంగా మీ విష్ ఫలించాలంటే, మీ దీవెన నిజమవ్వాలంటే, ఏం చెయ్యమంటారో చెప్పండి..."

"నేను చెప్పినట్టల్లా చేస్తారా?" అని సూటిగా అడిగాడు సత్యమూర్తి.

"చేస్తామండీ" అనిద్దరూ కోరస్‌గా.

"అయితే మీ నాన్నను సంబంధాలు వెతకటానికి వెళ్ళనీ..." అన్నాడు సత్యమూర్తి.

"అదేమిటండీ?....? అని ఆత్రంగా ప్రశ్నించాడు రవి.

"ఇప్పుడే కదా నేచెప్పినట్లల్లా చేస్తామన్నారు?" అని ఎదురు ప్రశ్నించాడతను.

ఇంకేం మాట్లాడాలో ఇద్దరికీ తోచలేదు. కొంచెం సేపటికి తనూజ, రవి మైదానంలో పెద్ద బండ మీద కూర్చుని ఉన్నారు.

"మాష్టారి వరస చూస్తే, మాటలగారడీ చేసి చివరకు ఒట్టిచేతులు చూపిస్తారేమోనని అనుమానంగా ఉంది తనూ..."

"మరి ఆయన తప్ప మనల్ని ఆదుకునే వాళ్ళూ గట్టెక్కించేవాళ్ళూ ఇంకెవరున్నారు చెప్పు?..." అని ప్రశ్నించింది తనూజ.

"ఆయన డబుల్ గేమ్ ఆడుతున్నారని తెలుస్తూనే ఉంది. అయినా ఇంకా ఆయన్నే మనం నమ్ముకునే కూర్చుంటే ఎలా?" అని అడిగాడు రవి.

"మరేం చేద్దామంటావ్?"

"మన పెళ్ళి మనమే చేసుకుందాం... అయితే గాంధర్వ వివాహం, లేదంటే రాక్షస వివాహం చేసుకుంటాను, నిన్ను మీ ఇంట్లో నుంచీ బలవంతాన ఎత్తుకుపోయి..."

"గాంధర్వ వివాహం చేసుకోవడానికి మనం గంధర్వులం కాదు, రాక్షస వివాహం చేసుకోవడానికి మనం రాక్షసులం కాదు. మనం సాధారణ మానవులం గనుక, సాదా సీదా ప్రేమ వివాహం చేసుకుందాం. ఎగిరిపోవటం కష్టం కాదుగానీ, మా నాన్నకు మనల్ని పట్టుకోవటమూ కష్టం కాదు. అందుకని కదా..." అని చెప్పింది తనూజ.

"కానీ ఆయన మాటలు విన్నావు కదా....?"

"ఆయన పైకి అలాగే అంటారు. కానీ చివరకు ఆయన ఓటు మనకే వేస్తారు. నాకు తెల్సు సంగతి. ఒకవేళ ఆయన మళ్ళీ ఏదన్నా నాటకమాడినా, ఈసారి మనం మోసపొయ్యేది లేదు. నా కంఠంలో ప్రాణం ఉండగా, ఈ కంఠంలో మరొకడు మాంగల్యం కట్టలేడు" అంది తనూజ సీరియస్‌గా.

"అయితే ఏదీ నా కంఠాన్నీ ఆ పరిసరాల్నీ ఓసారి చూసుకోనీ" అంటూ ఆమె మీదకెళ్ళాడు రవి.

"ప్రస్తుతానికిది ఇంకా నా కంఠమే. నీ మెడకాయ నీ తలకాయకిందే ఉంది. కావాలంటే ఎన్నిసార్లయినా తడుముకో ఎవరూ ఏమీ అనుకోరు" అని గుర్తుచేసింది తనూజ.

మర్నాడు తనూజ మాష్టారిని ఒంటరిగా కలుసుకుంది.

"నిజం చెప్పండి. మీరేదో చేస్తారని కొండంత ఆశ పెట్టుకున్నాం. ఏదన్నా చేయూతనిస్తే, జన్మంతా చేతులెత్తి మొక్కుతూనే ఉంటాం. లేదంటే చెప్పండి, మాదోవ మేం చూసుకుంటాం..." అన్నది

"మీ నాన్నగారిని ఎదిరించగల శక్తి ఇక్కడెవరికీ లేదు. ఆయన ఏ మాత్రం కాస్త మీరు తొందరపడినట్లు కనిపించినా, తప్పకుండా జాగ్రత్తపడతారు. అంటే మీరింక మళ్ళీ మొహాలు చూసుకునే ఆశకూడా ఉండదు. ఇందులో నేను అడ్డుపడి చేయగలిగిందేమీ కూడా లేదు..."

"అంతేనంటారా?" అంది తనూజ ఆ పిల్ల కళ్ళల్లో నీళ్ళు చూసాక సత్యమూర్తికి జాలేసింది. ఇంకా ఏడిపించటం, పరీక్షించటం బావుండదనుకున్నాడు. నిట్టూర్చాడు.

"ప్రేమలో పడిన ప్రతివాళ్ళూ పడే బాధలేనమ్మా, ఇవన్నీ, మీరింక నయం కదా, ప్రైవేటు పేరుతో వచ్చి ప్రైవేటుగా కలుసుకుని గంటలు గంటలు కూర్చుని అన్నీ చెప్పుకుంటున్నారు. నోరు విప్పి పలకరించుకోలేని ప్రేమైక జీవులూ, కన్నులారా చూసుకోని నోచుకోని జంటలు కూడా ఎన్నో ఉంటాయి. వాళ్ళ మీద మీరు చాలా మేలుకదా.. సంబంధాలు చూడటానికి మీ నాన్న వెళతారన్నావు కదా. అప్పుడే మీ పెళ్ళి ప్రయాణానికి ముహూర్తం పెట్టానమ్మా. కానీ ఆ టైం వచ్చేదాకా నోరుజారకు. ఆయన చెవిని పడిందంటే ఇంక ఇంతే సంగతులు మరి..." అన్నాడు.

తనూజ ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యింది.

అనుకున్నట్లుగానే నాలుగురోజుల తర్వాత ముకుందరావు కూతురికి పెళ్ళి సంబంధాలు చూడటానికి బయలుదేరాడు.

"ఏమ్మా నీకెవరు కావాలి? డాక్టరా, యాక్టరా, ప్లీడరా. లీడరా, ఎవరు కావాలో చెప్పు..."

"మీకు సలహాలు చెప్పగలదాన్నికాదు నాన్నా.." అంది తనూజ.

"సలహాలు కాదమ్మా.. నీ మనసులో ఏముందో చెప్పు..."

"జన్మనిచ్చి నన్ను పెంచి పెద్ద చేసిన వాళ్ళు... మీకు తెలియదా నాన్నా నా మనసు..."

"సరేనమ్మా... నాలుగు సంబంధాలూ మంచివేనంటున్నారు. ఈ నాలిగింట్లో ఏది బావుందో నేను సెలెక్ట్ చేసి ఫిక్స్ చేసుకొస్తాను. నీ పెళ్ళి చేసి పంపిస్తే, నాకు గుండెల మీద కుంపటి దించుకున్నట్లు ఉంటుదమ్మా" అన్నాడు ముకుందరావు.

తనూజ తండ్రి వంక చూసి ఏడ్చేసింది. ఆపుకుందామన్నా ఆగని దుఃఖం ముంచుకొచ్చేసింది. ఆయన దగ్గరకొచ్చి కూతురు కన్నీరు తుడిచి గుండెలకదుముకున్నాడు.

"ఎందుకమ్మా? ఈ కన్నీరెందుకు?"

"నేను మీకు గుండెల మీద కుంపటిలా ఉన్నానా నాన్నా" అని మళ్ళీ ఏడ్చేసింది. అది సాధారణంగా ప్రతి తండ్రీ అనే మాటే. తనూజ అది సాకుగా చెప్పింది కానీ, ఆమెకు పొంగి పొర్లుకొస్తున్న దుఃఖానికి కారణం వేరే ఉంది.

ఆయన బయలుదేరే సమయం దగ్గరపడుతున్న కొద్దీ, ఆ ఇంటికి, ఆ తండ్రికీ, ఆ పరిస్థితులకు, పరిసరాలకూ శాశ్వతంగా దూరమయిపోయే క్షణాలు ఆమెకు దగ్గరపడుతున్నాయి. ఇంక తన తండ్రిని చూడటం ఇదే ఆఖరిసారి కావచ్చునన్న ఆలోచన రాగానే కన్నీరు కట్టలు తెంచుకుని ప్రవహిస్తోంది.

తనూజ ఏడుస్తున్నంత సేపూ, ముకుందరావు ఆమె కన్నీరు తుడిచి తల నిమిరి, ధైర్యం చెప్పి, మామూలు మనిషిని చేయడానికి ప్రయత్నించాడు.

"నాన్నను వదిలిపోవాలంటే ఇప్పుడింత కష్టంగా ఉండేమాట నిజమేకానీ, రేపు మూడుముళ్ళూ పడ్డాక, ఆయన మీద ధ్యాస

మళ్ళాక, ఈ నాన్న దగ్గర ఉండమన్నా ఉంటావా అమ్మా?....” అన్నాడాయన.

తనూజ సమాధానం చెప్పలేదు. కానీ తండ్రిని ఏడుస్తూనే సాగనంపింది చివరకు ఆయనే అన్నాడు -

"తప్పమ్మా... శుభమా అని పెళ్ళి సంబంధాలు చూడటానికి వెళుతుంటే, ఎవరో పోయినట్లు ఇలా ఏడవకూడదు..." అని చెప్పి, ‘నీకు మంచి మొగుడిని తీసుకొస్తాను గదా‘ అని బుజ్జగించి వెళ్ళాడాయన.

ఆయనటు వెళ్ళగానే, స్నేహితురాలి పెళ్ళికి వెళుతున్నానని, వారం రోజుల దాకా రానని ఇంట్లో పని వాళ్ళందరికీ చెప్పి, చిన్న సూట్‌కేస్ తీసుకు బయలుదేరింది తనూజ. వెళ్ళేముందు ఇన్నేళ్ళుగా తనకు ఆశ్రయం ఇచ్చిన ఆ ఇంటినీ, తన గదినీ, గదిలోని ప్రతి వస్తువునూ ఓ సారి ఆప్యాయంగా చూపులతోనే పలకరించింది. ఆ కుర్చీ, టేబుల్, పుస్తకాలు అవన్నీ ప్రాణం లేని వస్తువులు కావు. ప్రాణసమానమైన స్నేహితులే. ఇంక వస్తాను మరి, అని ఆ నేస్తాలన్నిటికీ మౌనంగా చెప్పి వచ్చేసింది.

మర్నాటికల్లా తనూజ, రవితో కలిసి సత్యమూర్తి తన స్వగ్రామం వచ్చాడు. మరో రెండు రోజులకి, రవికి, తనూజకీ ఆ పల్లెటూళ్ళో అతి నిరాడంబరంగా పెళ్ళి జరిగిపోయింది.

కొత్త దంపతులు ఇద్దరూ సత్యమూర్తి పాదాలకు నమస్కరిస్తే పదికాలాలపాటు చల్లగా వర్ధిల్లమని దీవించాడు నిండుగా.

తనూజకు వెంటనే తండ్రి గుర్తొచ్చాడు. ఇంకా తనకోసం పెళ్ళి కొడుకుని వెతుకుతూనే ఉంటాడాయన.

‘నేను చేసిన పని, నీ గుండెల్లో ఆరని మంటలు రగిలిస్తాయని నాకు తెలుసు. కానీ ఇలా చేయకపోతే ఈ ప్రేమాగ్ని నా గుండెల్లో మంటలు రేపి, నన్ను సర్వనాశనం చేస్తుంది.... అయినా పిల్లలు తప్పులు చేయటం, పెద్దవాళ్ళు క్షమించటం మామూలే గనుక, నన్ను క్షమించు నాన్నా...’ అనుకుంది మనసులో.

మిల మిలా మెరుస్తున్న కన్నీటిబొట్లు మాత్రం తళ తళా మెరుస్తున్న సరికొత్త మంగళ సూత్రాల మీద రాలినయి...

మర్నాడు వాళ్ళిద్దర్నీ రైలు ఎక్కించాడు సత్యమూర్తి. అప్పుడు తనూజతో అన్నాడు -

"ఇదే మీనాన్న జరిపించి ఉంటే నీ పెళ్ళి ఎంత ఘనంగా జరిగి ఉండేదో నేను ఊహించుకోగలను. అన్నీ వదులుకుని వచ్చి, ఇతని చేయి ముందుకు నడుస్తున్నావు. నువ్వు చేస్తున్న త్యాగం మాటల్లో చెప్పడానికి వీల్లేనిది" అన్నాడు సత్యమూర్తి.

"మా పెళ్ళి ఎంత ఘనంగా జరిగిందన్నది కాదు ప్రధానం. ఎంత ప్రశాంతంగా జరిగిందన్నది ముఖ్యం. మీరు తీసుకొచ్చి దగ్గర నిలబడి చేయించారు కాబట్టిగానీ రవికీ, మానాన్నకీ, ఎన్ని కొట్లాటలు, ఎన్ని కలహాలు జరిగేవో, ఎన్ని కన్నీటి కాలువలు ప్రవహించేవో ఏం చెప్పగలం?" అంది తనూజ.

"మమ్మల్ని ఇలాగ గట్టెక్కించారుగానీ, మీరు మాత్రం నిండా మునిగిపొయ్యారు మాష్టారూ. ముకుందరావుగారు మా మీది కోపం మీమీద చూపిస్తారు. ఆయన ఆగ్రహానికి తట్టుకుని ఆ ఊళ్ళో నిలబడటం అనేది అసాధ్యం. ఇంకేం జరగబోతుందో ఊహించుకోటానికే భయంగా ఉంది" అన్నాడు రవి.

"ఒంటరిగాణ్ణి నాకేమైనా ఫర్వాలేదు. మీ ఇద్దరూ పడిన బాధ ఏమిటో నాకు తెలుసు. కనుకనే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఇంతవరకూ జరిగింది ఒక ఎత్తు అయితే, ఇక ముందు జరగబోయేది మరో ఎత్తు - జీవితంలో ఎన్ని సూర్యోదయాలుంటాయో, అన్ని సూర్యాస్తమయాలూ ఉంటాయి. చీకటి చుట్టేసుకుందని, భయపడకండి. చీకటిని చీల్చుకుని మళ్ళీ వెలుతురొస్తుంది. ఇంతకీ జీవితం అంటే కొండంత కష్టం, రవ్వంత సుఖం, ఒక వంతు నిద్రా, మూడొంతుల మెలుకువా.. గుప్పెడు ఆశలూ, గంపెడు నిరాశలూ - అయినా - అధైర్య పడకండి. ఏమున్నా లేకున్నా మీరిద్దరూ ఒకరి కోసం మరొకరు ఉన్నామన్న ధైర్యంతో కలిసి ఉండండి... ఇదే మీరు మాష్టారుకిచ్చే బహుమతి... అఫ్‌కోర్స్ పదినెలలు నిండకముందే పండంటి పాపాయినెలానూ ఇస్తారనుకోండి..." అన్నాడు సత్యమూర్తి వాతావరణాన్ని తేలికపరుస్తూ.

"మాష్టారు ఏం చెబుతున్నారో వింటున్నావా?" అన్నాడు రవి కూడా తనూజ ధ్యాసను మరల్చాలని.

కానీ తనూజ ముఖంలో గంభీరం మాత్రం వదల్లేదు. ఎంతో భయపడుతూంది.

"ఇన్నాళ్ళూ లోకానికి ఎదురీదగలమని అనుకున్నాం. కానీ తీరా ఇప్పుడు నీటిలోకి దూకాక, గుండె గుభిల్లుమటోంది. బొత్తిగా ఈతరాదన్న విషయం మునకలేస్తున్న సమయంలో ఇప్పుడు గుర్తొస్తోంది. పైగా ఎదురుగుండా అన్నీ కష్టాల సుడిగుండాలే, రేపట్నించీ నువ్వూ దూరమై పోతే ఇది మంచీ చెడూ అని మాట చెప్పేవాళ్ళు కూడా మాకు లేరుగదన్నయ్యా..." అని ఏడ్చేసింది.

"నువ్వు కంట తడి పెట్టాల్సిన సమయం కాదది. ఊరుకో... మీరు హైదరాబాద్ చేరగానే, నేను ఇచ్చిన నెంబరుకు ఫోన్ చేసి, మల్లికతో మాట్లాడు. నా పేరు చెప్పు చాలు. మీకు కావల్సిన ఏర్పాట్లు అన్నీ చేస్తుంది..." అని చెప్పాడు సత్యమూర్తి.

"నిజంగా ఆమె మమ్మల్ని ఆదుకుంటుందా? ఆమె నాకేం తెలియదు పొమ్మంటే, మేమేమైపోవాలి?" అని అడిగింది తనూజ.

భవిష్యత్తు మీద బోలెడంత భరోసాతో వెళుతున్నారు. దార్లో సుందరస్వప్నాలే కాదు. క్రూరమైన సర్పాలు ఉంటాయి. అందులోనూ మాములుగా కొత్త దంపతుల మధ్య పొరపొచ్చాలొచ్చినా, అటువాళ్ళూ ఇటువాళ్ళూ కలగజేసుకుని ఇద్దరికీ సర్ది చెబుతారు. కానీ ప్రేమించుకుని పెళ్ళాడిన వాళ్ళని మాత్రం, ఎప్పుడు వీలు దొరుకుతుందా చెరోపక్కా లాగేద్దం అనే చూస్తారు. అందుచేత మూడో మనిషిని మీ మధ్యకు రానివ్వకండి. మీరే ఒకళ్ళకొకళ్ళు కొండంత అండగా ఉండిపొండి. కొన్నాళ్ళ పాటు విడదీయరాని జంటగ ఉంటే, ఇంక దేవుడు కూడా మిమ్మల్ని విడదీయలేడు. ఈ రహస్యాన్ని గుర్తుంచుకోండి..." అన్నాడు సత్యమూర్తి వీడ్కోలు చెబుతూ.

ఎంతో అనుభవంతో, కాలజ్ఞానం తెలిసినవాడిలాగా, జరగబోయేవన్నీ ముందే వివరించి చెబుతున్న జ్ఞానిలాగా వాళ్ళకు కనిపించాడు సత్యమూర్తి.

అతను ఆ ప్లాట్‌ఫారం మీద ఉండి, ఆ రైల్లో వెళుతున్న వాళ్ళిద్దరికీ దూరమైపొయ్యాడు. తనకున్న ఒకే ఒక ఆపుడు పరమాత్ముడు దూరమైపోతున్నందుకు తనూజ ఏడుస్తూనే ఉంది. రైలు మరింత వేగం పుంజుకుంది.

**



హైదరాబాదు చేరాక లాడ్జిలో రూం తీసుకుని ఆ రోజంతా బయట ప్రపంచంతో సంబంధం లేకుండా, ఆ నాలుగు గోడల మధ్యా ఒక మన్మధ సామ్రాజ్యాన్ని సృష్టించుకుని, దానికి వాళ్ళిద్దరూ ఆధిపత్యం వహిస్తూ ఉండిపొయ్యారు.

పది గంటలు దాటినా ఆ జంటకింకా తెల్లారలేదు. ఇద్దరి మధ్యా గాలి దూరటానికి కూడా సందివ్వనంత బిగి కౌగిలిలో బిగుసుకుపోయారు. రాత్రంతా మోయలేని హాయిని మోసి మోసి అలసిపొయ్యారు.

తనూజకు మెలుకువ వచ్చింది. కలువ రేకులాంటి కనురెప్పల్ని విప్పింది. ఎందుకో లేవబుద్ధి కాలేదు. ఎంతో నీరసంగా ఉంది. ఒళ్ళంతా నొప్పులుగానూ, బద్ధకంగాను, బడలికగానూ ఇంకా ఏమిటేమిటోగానూ, ఎందుకో తెలియని ఆనందంగానూ, అంతా కొత్తగానూ గమ్మత్తుగానూ ఉంది. రాత్రి జరిగినవన్నీ గుర్తుకొచ్చి, సిగ్గొచ్చి, చిరునవ్వొచ్చి, తల పక్కకు తిప్పి చూసింది.

ఎన్నో యుద్ధాలు చేసి, సామ్రాజ్యాలు జయించిన జగదేకవీరుని మాదిరిగా ఎంత నిశ్చింతగానిద్రపోతున్నాడో? తన మీద ఉన్న అతని చేతులని పక్కకు తప్పించి లేచి కూర్చుని, జారి పక్కకు పడిపోయిన చీర - జాకెట్టు అందుకుని, అతని లుంగీని సరిగ్గా కప్పి, బాత్‌రూమ్‌లోకి దూరింది. వేడి నీళ్ళతో స్నానం చేశాక, బడలిక తగ్గి ఒంట్లోకి కాస్తంత ఓపిక వచ్చింది.

టర్కీ టవలు చుట్టబెట్టుకుని ఇవతలకొచ్చి, డ్రెస్సింగ్ మిర్రర్ ముందు నిలబడి, అద్దంలో చూసుకుంటే తన ముఖం తనకే కొత్తగా ఉంది. ఇదేమిటి? ఒక్క రోజులో ఇంత మార్పు సాధ్యమా? ఒళ్ళు అంతా తడిమి చూసుకుంటే ఇన్నేళ్ళుగా ఎరుగని పులకింతలేవో అణువణువునా చిగురిస్తున్నాయి. నరనరానా హాయి వెల్లువై ప్రవహిస్తోంది.

సూట్‌కేసు తెరిచి కాశ్మీరు సిల్కుచీర తీసి, కట్టుకుంటూ ఉంటే, రవి వెనక నుంచీ ఉప్పెనలా వచ్చి ఆమెను చుట్టుకుపొయ్యాడు. అసలే సిల్కుచీర, ఇట్టే జారిపోయింది. గుండ్రంగానున్న ఆమె భుజాల మీద నుంచీ ముద్దులు పెట్టుకుంటూ వస్తున్నాడు మత్తు వీడని నేత్రాలతో.

"తెల్లారే సరికే నీళ్ళోసుకున్నావేమిటోయ్?" అని అడిగాడు రవి ఆమె చెవిలో రహస్యంగా -

"పది గంటలు అయింది తెలుసా?" అంది తనూజ కనురెప్పల్ని పక్షి రెక్కల్లా టపటపలాడిస్తూ.

"అబ్బా పది గంటలు అయిందా? అందుకే నిద్ర ముంచుకొస్తోంది. రా పడుకుందాం..." అంటూ పరుపుమీద వాలాడు.

"రాత్రి పదికాదు, పగలు పది..."

"ఇప్పుడు మనకు వేరే పనేముంది?.... దా..."

"కొత్త బిచ్చగాడు పొద్దు ఎరుగడట..."

"మరే మూడేళ్ళనుంచీ నీ చుట్టూ తిరుగుతున్నాను, బిచ్చం కోసం."

"భిక్ష పెట్టానుగదా, ఇంకా ఏమిటి?"

"ఏరోజు బిక్ష ఆరోజుకే సరిపోతుంది. మళ్ళా ఆకలవుతోంది."

"ఉండు, టిఫెన్ చెప్తాను" అంటూ కాలింగ్ బెల్ నొక్కింది.

ఒక గంట తర్వాత ఇద్దరూ రెడీ అయ్యారు.

తనూజ సత్యమూర్తి ఇచ్చిన నెంబరుకు ఫోను చేసింది. అవతల నుంచీ ఎవరో మాట్లాడుతున్నారు.

"మల్లికగారు కావాలండీ?" అని అడిగింది తనూజ.

"మల్లికనే మాట్లాడుతున్నాను... మీరెవరు?"

"నేను ఎవరో చెప్పినా మీకు తెలియదు, నేను సత్యమూర్తిగారి దగ్గర నుంచి వచ్చాను. ఆయన మిమ్మల్ని కల్సుకోమన్నారు. మీకో లెటర్ రాసి ఇచ్చారు. నాకు సిటీ కొత్త, మీ ఇంటికి ఎలా రావాలో చెబితే.."

"సత్యమూర్తి దగ్గరనుంచీ వచ్చారా? అయితే మీరు నాకోసం శ్రమపడటం ఎందుకు? నేనే మీ దగ్గరకొస్తాను. మీరెక్కడున్నారో చెప్పండి" అంది మల్లిక.

"అది కాదండి మిమ్మల్ని కలుసుకోవడానికి వెళ్ళమన్నారు గానీ...." అని సంశయించింది తనూజ.

"ఇట్ మేక్స్ నో డిఫరెన్సు. మీరెక్కడున్నారో చెప్పండి" అంది మల్లిక.

తనూజ తాము దిగిన లాడ్జి పేరు చెబితే - "ఇప్పుడే వస్తున్నా"నని చెప్పింది. రవి, తనూజ ఆమెకోసం ఎదురు చూస్తూ ఉండిపొయ్యారు.

అరగంట తర్వాత కాలింగ్ బెల్ నొక్కి, తలుపు తీసుకుని లోపలికొచ్చింది మల్లిక, సుగంధ పరిమళాలు వెదజల్లుకుంటూ.

విశాలమయిన నుదురు, తళాతళా మెరిసే కళ్ళూ, తీర్చి దిద్దిన ముఖారవిందం, వొత్తుగా ఉన్న నొక్కుల జుట్టూ, స్లీవ్‌లెస్ జాకెట్టూ, అందంగా, హుందాగా ఉంది. చూడగానే చెప్పొచ్చు ఆమెకున్న స్థాయి ఏమిటో, స్థైర్యం ఏమిటో. అడ్డం వచ్చిన వాటినన్నిటినీ నరికేసుకు వెళ్ళగల వ్యక్తిలా అనిపించింది తనూజకు.

వచ్చి కూర్చోగానే ఎంతో ఆదరంగా ఎక్కడినుంచీ వచ్చారు, ఎప్పుడొచ్చారూ. అంటూ ప్రశ్నించింది మల్లిక. తనూజ క్లుప్తంగా తమ గురించి చెప్పింది. సత్యమూర్తి ఇలాంటి పెళ్ళిళ్ళు కూడా చేయిస్తున్నందుకు లోలోపలే సంతోషించింది మల్లిక. పైకి మాత్రం వాళ్ళిద్దర్నీ అభినందించింది.

తనూజ ఆమెకో ఉత్తరం ఇచ్చింది సత్యమూర్తి ఇచ్చాడంటూ, మరుక్షణంలో ఆమె ఆ ఉత్తరం చదవటంలో నిమగ్నమైపోయి, ఇంక వీళ్ళ ఉనికినే మర్చిపోయింది.

"డియర్ మల్లికా -

బావున్నావా? అప్పుడెప్పుడో నీవు రాసిన ఉత్తరం ఒకటొచ్చి ఒళ్ళో వాలింది. మళ్ళా 'పలకరించ'నైనా లేదేమి? పోనీ నేనే నీ మెడలో ఓ అక్షరాల మూల వేద్దామన్నా, అదీ వద్దన్నావు. నీ మాట నాకు సుగ్రీవాజ్ఞ కదా మరి. అయినా ఇప్పుడిలా రాయటం మాత్రం అనివార్యం అయింది.

ఇక నా సంగతి అడిగావు కదా - నాకేం, నిక్షేపంలా ఉన్నాను. పగలు కాలేజీకి ఇంటికీ మధ్య దినచర్య భుజాన వేసుకుని గానుగెద్దులా తిరుగుతుంటాను. రాత్రి అయినా ఏకాంతా చెంత చేరదు కాబట్టి అంతా ఏకాంతమే. అయినా ప్రియమల్లికా, నీకు తెలీదా?

నా హృదయం ఇప్పుడొక శిథిల సమాధి. ఇక్కడికెవరూ రారు. ఒంటరిగా నాకు నేనే కాపలా తిరుగుతుంటాను. మండే కళ్ళల్లో వొత్తులు వేసుకుని, ఎర్రని జ్యోతులు వెలిగించుకుని.

నీకు కొన్ని అయినా వెన్నెల రాత్రులు వస్తాయి. నీవులేని నాకన్నీ చీకటి రాత్రులే. అర్థరాత్రిళ్ళు నా సంతాపాశ్రుసాగర తీరాల వెంట వెర్రిగా పరుగులు తీస్తుంటాను కనిపించీ కనిపించని నీకోసం. ఎదలోని రొదతో ఎదురుగా ఎగిసిపడుతూ వచ్చి, రెక్క పుచ్చుకు లాక్కుపోయే కల్లోల ఉల్లోలాలు తెల్లవార్లూ ఇంతే. కలతలు, కలవరింతలూ, కన్నీళ్ళూ, కలహాసాలూ - ఇవన్నీ ఎవరికోసం? దయ తలచని దేవత కోసం. నీకోసం.

మెత్తని పూలగుత్తిలా వచ్చి హృదయానికి హత్తుకునే దానివి, చూడు, సరిగ్గా ఇప్పుడక్కడే, నునులేత కోరికల పీకలు కోసిన చిక్కని నెత్తురు. అర్ధరాత్రి ఉలిక్కిపడిలేచి "మల్లికా" అని పిలుస్తాను. కానీ ఎవరూ రారు. కనీసం జాలిపడి అయినా ఇటుకేసి రాదు, లాలిపాడి నిద్రపుచ్చటానికి. నిట్టూర్పుల్లో వేగిపోతూ కూర్చుంటాను, తొలికోడి కూసేదాకా.

అప్పుడేమోగానీ, ఇప్పుడు పరాయివాడి భార్యవు గనుక నీ గురించి తల్చుకోవటం కూడా తప్పేనని తెలుసు. కానీ నిన్ను మర్చిపోలేని నా బాధనీ, బలహీనతనీ నీకు గాక ఇంకెవరికి చెప్పుకోగలను? తప్పదు గనుక, రోజుల చేదు బిళ్ళల్ని చప్పరించేస్తుంటాయి అలవాటు చొప్పున.

ఒకప్పుడు నాకే దిగులూ ఉండేది కాదు. మా తాతలు పోతూ పోతూ నాకై మిగిల్చిపోయిన మడులూ మాన్యాలూ ఏమీ లేవు.. పుడుతూనే పేదరికపు పేగును మెడను వేసుకు పుట్టినవాడిని. ఇంతకన్నా అధికమైన బాధ ఏముంటుందిలే అనుకునేవాణ్ణి ఏమీ తెలియని రోజుల్లో. అలా చిమ్మ చీకట్లో నిలబడ్డ నాకు నీవు కొన్నాళ్ళొక కాంతి కిరణంలా కనిపించావు. స్నేహం కలిసి, చేతులు కలిపి నీతో

నడిపించుకు వెళ్ళిన అద్భుతమైన సమయాల జ్ఞాపకాలు మాత్రమే మిగిలాయి. కొండవాగులా స్వచ్ఛంగా సాగిన మన స్నేహం చివరకు గుండెల బండరాళ్ళల్లోనే కదా ఇంకిపోయింది.

అయినవాళ్ళు అర్థం చేసుకోకపోవటం, అర్థం చేసుకున్నవాళ్ళేమో పరాయివాళ్ళు అయిపోవటం - ఇదే కదా అసలైన ట్రాజెడీ, నిజానికి నీ నుంచీ నేనేమీ ఆశించటం లేదు. నీతో సుఖాన్నీ కాంక్షించటం లేదు. కానీ నిన్ను చూడాలన్న చిన్న కోరికను మాత్రం అణుచుకోలేక పోతున్నాను. కనుక ఏదో ఒక రోజు నిన్ను వెతుక్కుంటూ నీ గుమ్మంలోకి వస్తాను నేస్తం. రానిస్తావా గుమ్మం దాకా అయినా?

ఇక అసలు విషయానికొస్తే, ఇప్పుడు నీకు పరిచయం అయిన ఈ జంటదీ మనలాంటి కథే. మనం చేయలేని పని వాళ్ళు చేశారు. పెళ్ళి చేసుకున్నారు అందుకనే చేయగలిగిందల్లా చేసి, ధైర్యం చెప్పి నీదగ్గరకు పంపిస్తున్నాను. వాళ్ళను ఏం చేస్తావో మరి?

మనమంతా ప్రేమికులం. కనుక మనదో కులం. మనవాళ్ళను మనమే ఆదుకోవాలని మరి. మిగతా వాళ్ళకేం అవసరం వీళ్ళ సంగతి పట్టించుకోవటానికి?

మళ్ళా నిన్ను చూడగలిగే రోజు కోసం ఎదురు చూస్తూ -

ఉండనా మరి.

నీ సత్య.

ఆ లెటరు చదువుకున్నాక మల్లిక కళ్ళు మూసుకుని అంతర్ముఖురాలైపోయింది. ఉత్తరం మడిచి రెండు వేళ్ళ కొసలతో అదేపనిగా రాపాడిస్తూ ఉండిపోయింది. తెరిచి చూసుకుని మొదటి సగం మళ్ళా చదువుకుని, మడత పెట్టుకుని, నిట్టూర్చింది.

రవికి, తనూజకీ థాంక్స్ చెప్పి, వస్తానంటూ వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపొయ్యాక రవి, తనూజ వెర్రి మొహాలేసుకుని చూస్తూ కూర్చుండిపొయ్యారు.

"ఈవిడ దగ్గరికెళితే చాలు, కల్ప వృక్షంలా కావల్సినవన్నీ అడగకుండానే ఇచ్చేస్తుందని ఆశపడుతూ వచ్చాం. ఈవిడేమో మాట మాత్రం అయినా మీకేం కావాలని అడగకుండా వెళ్ళిపోయింది. ఏమిటి చెయ్యటం?" అని నీరసపడిపోయింది తనూజ.

"ఉన్నవన్నీ వదిలేసుకుని పారిపోయి వచ్చిన దానివి. పోలీసులు లాక్కుపోయి లాకప్‌లో పారెయ్యకుండా ఉంటే, కల్పవృక్షాలూ, కామధేనువులూ ఎదురై వరాలిచ్చినంత అదృష్టంగా భావించాలి. ఇంకోటి చెప్పనా? ఈ లోకంలో ఎవరి కష్టాలూ, ఎవరి కన్నీళ్ళూ వాళ్ళవే. పక్కవాళ్ళ గురించి పట్టించుకునే ఓపికా, తీరికా ఎవరికీ లేవు..." అన్నాడు రవి.

"ఇప్పుడేం చేద్దాం మరి?" అంది తనూజ బేలగా, భయంగా.

"చూద్దాం, ఏదో ఒకటి చేద్దాం" అన్నాడు రవి అన్యమనస్కంగానే.

ఇద్దరికీ ఇంక మాటలే కరువైనాయి. ఆ రాత్రంతా నిరుత్సాహంగానే గడిచింది. భవిష్యత్తు మీద భయం, బెంగ మొదలైనాయి.

మర్నాడు దిగులుగా కూర్చున్న తనూజ దగ్గరకు వచ్చాడు రవి. ప్రేమగా రెండు చేతుల్లోకి తీసుకుని ఆమె మొహాన్ని పైకెత్తి చూస్తే, ఆమె కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతున్నాయి.

"ఏమిటిది?" అని అడిగాడు.

"మన దగ్గర పెద్దగా డబ్బూ లేదు. చదువుకున్నందుకు గుర్తుగా చేతిలో డిగ్రీ సర్టిఫికెట్టూ లేదు. అండగా నిలబడి ఆదుకునే నాథుడూ లేడు. ఎన్నాళ్ళు ఈ హోటల్లో ఉండగలం? నాలుగు రోజుల తర్వాత నడి రోడ్డు మీద మండుటెండలో నిలబడితే నీడకు రమ్మని పిలిచే దిక్కు అయినా లేదు కదా రవీ" అని ఏడ్చేసింది తనూజ.

రవి ఆమెను ఎలా ఓదార్చాలో చేతగాక, కన్నీరు తుడిచి గుండెలకు హత్తుకున్నాడు.

అప్పుడు గుమ్మంలో నిలబడి ఈమాటలు విన్న మల్లిక అడిగింది.

"చదువుకున్నాం అంటున్నారు. లోకం పోకడ ఈ మాత్రం అయినా అర్థం చేసుకోలేకపొయ్యారా? పోనీ అన్నీ తెలిసిన మహానుభావుడు మీ మాష్టారు అయినా మీకు చెప్పలేకపొయ్యాడా రేపటినుంచీ ఎదురయ్యే సమస్యలేమిటో?"

"మా మాష్టారిని ఏమీ అనకండి - ఆయన మాకు అన్నీ చెప్పే పంపించారు" అన్నాదు రవి.

"ఏం చెప్పారేమిటి?" అని అడిగింది మల్లిక.

"జీవితంలో ఎన్ని సూర్యోదయాలు ఉంటాయో, అన్ని సూర్యాస్తమయాలూ ఉంటాయి. ఎన్ని ఆశలు ఎదురవుతాయో, అంతకు రెట్టింపు నిరాశాలూ ఎదురవుతాయి..." అన్నాడు రవి.

"ఫర్వాలేదే..." అని నవ్వింది మల్లిక.

కాఫీలు తాగాక, మీకేం కావాలి..చెప్పమంది

"మీకు తెలియందేముంది? ఏదన్నా చిన్న ఉద్యోగం ఒకటి ఇప్పించండి.." అంది తనూజ.

"నీకా?" అని అడిగింది మల్లిక.

"ఇద్దర్లో ఎవరికైనా సరే..."

"ఒకరికి చాలా?"

"ఇద్దరికీ దొరికితే అదృష్టమే, కానీ..."

"అవును ఇంట్లో నుంచీ పారిపోయి వచ్చామంటున్నారు. పోలీసు రిపోర్టులు గ్రటాలాంటి గొడవలేమీ రావా?" అని అడిగింది మల్లిక -

"తనూజ వైపు నుంచీ ఆ భయమూ ఉంది..." అన్నాడు రవి.

"అలాంటిదేదైనా ఎదురైతే అప్పుడూ మీరే మాకు దిక్కు" అంది తనూజ.

మల్లిక నవ్వేసింది. ఏదో నెంబరుకు ఫోన్ చేసింది.

"గుడ్ మార్నింగ్ సంపత్... మిసెస్ హరిశ్చంద్రప్రసాద్ హియర్. క్వయిట్ ఆల్‌రైట్.. ఏం లేదు ఓ చిన్న ఫేవర్ చేయగలరేమోనని... ఏం లేదు మాకు కావాల్సిన అతను... కొంచెం ఇబ్బందుల్లో ఉన్నాడు... అర్జంటుగా ఉద్యోగం కావాలి... అలాగే పంపిస్తాను" అని ఫోన్ పెట్టేసి రవిని తన కారులో ఆ ఆఫీసుకు పంపించింది.

రవి సంపత్‌ను వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆయన రవిని కూర్చోబెట్టుకుని ఏం చదివిందీ, ఎక్కడ చదివిందీ వివరాలు అడిగాడు. ఇంకా "సర్టిఫికెట్ల విలువ మాకు బాగా తెలుసు..." అన్నాడాయన.

"మేం కాపీలు కొట్టలేదండి..." అన్నాడు రవి.

"అంటే అందరూ చేసే పని కూడా మీరు చేయలేరన్నమాట. దటీజ్ అనదర్ డిస్‌క్వాలిఫికేషన్... సరే, జీతం ఎంత కావాలి?

"ఈ మహానగరంలో ఇద్దరు మనుషులు బతకటానికి ఎంతకావాలో అంత ఇవ్వండి..." అన్నాడు రవి.

"ఇక్కడ అయిదొందలతో హాయిగా బతికేస్తున్నవాళ్ళూ ఉన్నారు. అయిదువేలు చాలక అవస్థపడుతున్న వాళ్ళూ ఉన్నారు..." అన్నాడాయన.

ఒక క్షణం ఆగి ఆయనే అన్నాడు. "మొక్కుబడిగా పని చేసేవాళ్ళకు మేమూ మొక్కుబడిగానే జీతాలిస్తాం. కష్టపడి పనిచేసే వాళ్ళకు శ్రమకు తగ్గ ఫలితాన్ని ముట్టచెబుతాం. ప్రైవేటు కంపెనీలకు, గవర్నమెంటు ఆఫీసులకూ ఉన్న తేడా ఇదే. శ్రద్దగా పనిచేస్తే, మిగతా వాళ్ళతో సంబధం లేకుండా మీ పొజిషనూ మారుతుంది, మీ జీతమూ పెరుగుతుంది. ఇదీ మా పరిస్తితి. ఇక రూల్సు సంగతంటారా? రూల్స్ ఆర్ మేడ్ ఫర్ ఫూల్స్...." అని చెప్పాడాయన.

ఆ నాలుగు మాటలు రవికి గీతా రహస్యాన్ని బోధించినట్లే ఉన్నాయి.

ఆ వేళ ఉద్యోగంలో చేరాడు.

సాయంత్రం రూంకు వచ్చి మల్లికకు ఫోన్ చేసి థాంక్స్ చెప్పాడు. తనూజ కూడా కృతజ్ఞతలు చెప్పింది.

మల్లిక వాళ్ళింటికి కొంచెం దూరంలోనే ఒక చిన్న పోర్షన్ అద్దెకు కుదిర్చింది. తనూజా, రవీ అందులో దిగి, కొత్త కాపురం మొదలెట్టారు. మల్లిక మధ్యాహ్నం తనూజ దగ్గరకు వస్తోంది. ఇద్దరూ కార్లో వెళ్ళి కొత్త సంసారానికి కావాల్సినవన్నీ కొని తెచ్చుకుంటున్నారు. డబ్బు లేనందువల్ల తనూజ అన్నింటికీ వెనకాడుతున్నా, మల్లిక అర్థం చేసుకుని తనే కొనేస్తోంది.

వారం రోజుల్లో రవి, తనూజ కొత్త ఇంట్లో, కొత్త జీవితానికే అలవాటుపడ్డారు. నెమ్మదిగా కుదుటపడుతున్నారు. మళ్ళీ ఇద్దరి ముఖాల్లో పాత ఉత్సాహం చోటుచేసుకుంటోంది. కనుక సరస సల్లాపాలూ మొదలవుతున్నాయి. అలాంటి సమయంలో వీళ్ళను చూసిన మల్లిక ఏమిటో అయ్యిపొయ్యేది.

నిజానికి వీళ్ళింకా ఇప్పుడిప్పుడే అన్నీ అమర్చుకుంటున్నారు. తనకు అలా కాదు. చాలామంది దృష్టిలో తన జీవితం వడ్డించని విస్తరి. మేడలూ, కార్లూ, భోగభాగ్యాలతోపాటు ఎంతో సమర్ధుడైన డాక్టరుగా పేరున్న భర్త, కన్న తల్లికన్నా మిన్నగా చూసుకునే అత్తగారు, అమితమయిన ఆదర్శాన్ని చూపే మామగారూ - ఏలోటూ లేదు మరి. ఇవన్నీ పైకి అందరికీ కనిపించేవి. ఆమెకు మాత్రమే కనిపించి, గుండెను పిండేసే విషయం - భర్త నిరాదరణ.

డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్కు భార్యతో మాట్లాడేందుకు తీరిక ఉండదు. ఎప్పుడేనా ఒంటరిగా ఉన్నప్పుడు మల్లిక ఏదైనా కల్పించుకుని ఏమన్నా అడిగినా ఆయన ఉలకడూ, పలకడూ, వినబడలేదేమోనని ఒకటికి రెండుసార్లు అదే ప్రశ్న వేస్తుంది. సమాధానం రాదు సరికదా, ఆయన అక్కడినుంచీ లేచి వెళ్ళిపోతాడు.

ఒకే ఇంట్లో ఉంటూ, ఒకే టేబులు మీద తింటూ, ఒకే గదిలో పడుకుంటూ రోజుల తరబడి, నెలల తరబడి ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా సహజీవనం చేయటం నేర్చుకున్నారు. ఎప్పుడేనా మల్లిక పలకరించాల్సిందేగానీ, డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్కు భార్యను పలకరించే అలవాటులేదు. అలాంటిది ఇవాళ అతనే స్వయంగా భార్య దగ్గరకొచ్చి అడిగాడు.

"ఈ మధ్య నువ్వు ఎవ్వరికో ఉద్యోగాలు ఇప్పించావుట..."

మల్లిక మాట్లాడలేదు, తీక్షణంగా చూసింది.

"నిన్నే అడిగేది? నాకు తెలియకుండా నువు రికమెండ్ చేసి ఉద్యోగాలు ఇప్పించి ఆదరించేంత ఆప్తుడా అతను?...." అని అడిగాడు మళ్ళీ.

"మీ ఉద్దేశ్యం ఏమిటో స్పష్టంగా చెప్పండి" అని అడిగింది మల్లిక.

"నా భార్య నాకు దూరం అవుతున్నందుకు కాదు, ఎవరికి దగ్గరవుతోందో తెల్సుకుందామని. నీకూ అతనికీ ఏమిటి సంబంధం?" అన్నాడతను.

"ఇన్నాళ్ళకు భార్య ఒకతి బతికి ఉందన్న విషయం సుప్రసిద్ధ డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్కు గుర్తొచ్చిందని సంతోషించనా? లేక ఇలా అనుమానించి, అవమానించినందుకు విచారించనా?" అంది మల్లిక.

"నువ్వు నాకేమీ చెప్పనవసరంలేదు. నాకు అన్నీ తెలుసు."

మర్నాడు - ఆయన నిద్రలేచి కిందకి వచ్చేటప్పటికి కింద హాల్లో మల్లిక రవి, తనూజతో మాట్లాడుతోంది. బయటకు వెళ్ళబోతున్న భర్తను పిలిచి పరిచయం చేసింది.

"ఇతను రవి అని, తెల్సినవాళ్ళబ్బాయి. నాకూ ఇతనికీ సంబంధం ఉందీ అంటే ఉంది, లేదూ అంటే లేదు. అయితే ఇతనూ, ఈ అమ్మాయి ప్రేమించి మొన్నీమధ్యే పెళ్ళి చేసుకుని వచ్చారు. పెద్దవాళ్ళని ఎదిరించి వచ్చినందువలన, వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడాల్సి వచ్చింది. పోనీలేకదాని, మాట సాయమేకదాని సంపత్‌గారితో చెప్పి..." అని మల్లిక అంటూనే ఉంది. ఆమెకు దుఃఖం పొంగిపొర్లుకొస్తూనే ఉంది.

"ఏనుంది వస్తా" నంటూ డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ అక్కడి నుంచీ హడావిడిగా వెళ్ళిపొయ్యాడు.

వీళ్ళ వ్యవహారం ఏమిటో అర్థం కాక తనూజ, రవి ఆశ్చర్యపోయారు.

తర్వాత మల్లిక తనూజ దగ్గరకు వచ్చినప్పుడు అడిగింది.

"మాకు తెలియకుండా మిమ్మల్ని ఏమన్నా ఇబ్బంది పెడుతున్నామా?"

"అదేం లేదమ్మా... ఎంతోకాలం తర్వాత మా ఆయన నిన్నే నన్ను పలకరించాడు... అదీ మీ మూలంగా..."

"చాలా కాలం తర్వాత పలకరించాటమేమిటి?" అని ఆశ్చర్యంగా అడిగింది తనూజ.

"అది అంతేనమ్మా. కిందటి జన్మలో నేను బంగారు పూల పూజచేసుకున్నాను ఈ భర్త కోసం..." అంది మల్లిక. అప్పుడు మళ్ళీ కళ్ళలో గిర్రున సుళ్ళు తిరుగుతున్న నీళ్ళు తుడిచేసుకుంది. వెంటనే మళ్ళీ మాట మార్చేసింది.

"అవునుగానీ, సత్యమూర్తికి లెటరు అయినా రాశావా? లేక అవుటాఫ్ సైట్ కాగానే అవుటాఫ్ మైండ్ అయిపోయావా? -" అని అడిగింది మల్లిక.

"ఇప్పుడు మా నాన్న పోలీసు సాయంతో వలవిసిరి ఉంటాడు. మేం ఉత్తరం రాసినా అది మా నాన్న చేతుల్లో పడి, మా ఉనికి ఇట్టే తెల్సిపోతుంది. అందుకని ఆయనే రాస్తామన్నారు. కానీ మా అడ్రసు అయినా ఆయనకు తెలియదు కదా... అందుచేత జాబులూ జవాబులూ లేని మాట నిజమేగానీ, అక్కడాయనా, ఇక్కడ మీరూ మాకు చేస్తున్న సాయం, మావల్ల పడుతున్న ఇబ్బందులూ మేం ఎలా మర్చిపోగలం ముఖ్యంగా మీ రుణం నేనెలా తీర్చుకోగలను?" అని అడిగింది తనూజ -

మల్లిక నిట్టూర్చింది. ఒక క్షణం ఆగి, దూరంగా ఎటో చూస్తూ అంది. జీవితంలో మళ్ళా కలుసుకోవటం సాధ్యపడదేమోననుకున్న సత్యమూర్తి, నీద్వారా ఉత్తరం రాసి పంపాడు - 'ఏదో ఒక రోజున నిన్ను వెతుక్కుంటూ వస్తాను నేస్తం - అంటున్నాడు. అందుచేత నాకు నువ్వే రుణపడిపోతున్నావో, నీకు నేనే రుణపడి పోతున్నానో, అప్పుడే ఎలా చెప్పటం?" అంది మల్లిక మనసులోని బాధనంతా మాటల్లోకి కుదించి.

తనూజ నిశ్చేష్టురాలై చూస్తూ నిలబడింది.

అయిదు లక్షల కట్నంతో పాటు పది ఎకరాల పొలమూ పెళ్ళికి ముందే అల్లుడికి అందించడానికి అంగీకరించి ఒక సంబంధం ఖాయం చేసుకు వచ్చాడు ముకుందరావు. ఫోటో చూసి అమ్మాయి నచ్చిందని అన్నారు. అయితే వాళ్ళకు ఫోటోలో అమ్మాయి నచ్చిందో, అమ్మాయి ఆస్థిపాస్తులు నచ్చాయో చప్పున చెప్పటం కష్టమే.

ఇంటికి రాగానే సంబంధం కుదుర్చుకు వచ్చిన శుభవార్త తనూజకు చెప్పాలని సరాసరి ఆమె గదికే వెళ్ళాడు ముకుందరావు. కానీ ఆ పిల్ల ఎక్కడా కనిపించలేదు.

ఎవరో స్నేహితురాలి పెళ్ళి అని చెప్పి ఊరికి వెళ్ళిందని వినగానే, నిజమేనేమో అనుకున్నాడు. సమయం గడిచేకొద్దీ పెళ్ళి ఏర్పాట్లు భారీగా చెయ్యాలన్న ఆలోచనతోపాటే, తనూజతో ఈ విషయాలు చెప్పాలన్న ఆత్రమూ ఎక్కువైంది. ఇంక వివరాలు అడుగుతూ ఆరాలు తీయటం మొదలుపెట్టేటప్పటికి అనుమానాలు ఎక్కువైనాయి.

తను వెళ్ళిన రోజే తనూజా వెళ్ళిందట. అయితే మరి, ఆ రోజే స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళబోతున్నట్లు తనూజ తనతో ఎందుకు చెప్పలేదు? ఒకవేళ తర్వాత అనుకుని బయలుదేరినా వారం రోజులదాకా తిరిగి రాకుండా ఎందుకుంటుంది? పోనీ వాళ్ళ బలవంతం మీద ఉండిపోయిందనుకున్నా, ఇంటికి లెటరు అయినా రాయకుండా, ఫోను అయినా చేయకుండా ఎందుకు ఉంటుంది? అసలు ఎవరి పెళ్ళికి వెళ్ళింది? ఎక్కడకు వెళ్ళింది?

వీటికి సమాధానాలు చెప్పగలిగింది సత్యమూర్తి ఒక్కడేనని ఆయన కోసం కబురు చేస్తే, వారం రోజుల క్రిందటే ఆయనా ఊరికి వెళ్ళినట్టు తెలిసింది. దానితో ముకుందరావుకు అనుమానం ఎక్కువైంది.

ఆయన ఫోన్ చేస్తే అయిదు నిమిషాల్లో సూపర్నెంట్ ఆఫ్ పోలీసు వచ్చాడు. తనూజ ఇంట్లో నుంచీ వెళ్ళిపోయిందని, వారం రోజులైనా రాకపోవటం ఆశ్చర్యంగా ఉందని అంటూ రవి, తనూజ ప్రేమ వ్యవహారం, మధ్యలో సత్యమూర్తి మధ్యవర్తిత్వం అంతా ముకుందరావు ఆ పోలీసు అధికారికి చెప్పాడు.

"అయితే అమ్మాయి ఆ కుర్రాడితో ఏమన్నా వెళ్ళిందేమో కనుక్కుంటాం. ఎక్కడున్నా అమ్మాయిని తీసుకొచ్చి మీకు అప్పచెబుతాం..." అన్నాడు ఎస్.పి లేచి నిలబడి.

"చూడండి, అమ్మాయికి పెళ్ళి సెటిల్ అయింది. ఆమె ఇంట్లో నుంచీ వెళ్ళిపోయిన విషయం అసలు బయటకు పొక్కకూడదు.... వాళ్ళ ముగ్గురిలో మీకు ఎవరు కనిపించినా, నా దగ్గరకు తీసుకురండి. తర్వాత సంగతి నేను చూసుకుంటాను...." అన్నాడు ముకుందరావు.

అలాగేనని చెప్పి వెళ్ళాడు యస్.పి.

పరీక్షలు అయ్యాక రవి కూడా ఎక్కడా కనిపించటం లేదని తెలిసాక, ఇక అందరికీ ఒకటే అభిప్రాయం ఏర్పడింది. అయితే ఎక్కడికి వెళ్ళారన్నదే కనుక్కోవాల్సిన విషయం అయింది.

ఎన్నాళ్ళో దాగలేడు గనుక సత్యమూర్తి వచ్చేశాడు. వచ్చిన రెండో నిముషంలోనే ఒక కానిస్టేబుల్ ప్రత్యక్షమయ్యాడు. ముకుందరావుగారు రమ్మంటున్నారని చెప్పి తీసుకెళ్ళాడు.

ముకుందరావును చూడగానే సత్యమూర్తికి జాలేసింది. మునుపటి ఠీవి, డాబూ, దర్పం అంతా ఏమైనాయో గానీ, ఒక్కరోజులోనే డబుల్ టైఫాయిడ్ పడి లేచినవాడిలా అయిపొయ్యాడు, సోఫాను ఆనుకుని కింద తివాచీ మీద కూర్చున్నాడు. యుద్ధంలో నడుములు విరిగి నేల కూలిన వాడిలా నిస్సహాయంగా చూస్తున్నాడు.

సత్యమూర్తిని చూశాక, లేని ఓపిక తెచ్చుకుని, దిగ్గున లేచి సోఫాలో కూర్చున్నాడు. సత్యమూర్తినీ కూర్చోమన్నాడు. అతని ముఖం లోకి నిప్పులు కురిపిస్తూ.

"తనూజ నీ సొంత చెల్లెలే అనుకోమన్నాను. దాని క్షేమం కోరి వాళ్ళిద్దర్నీ విడదీయమన్నాను. మొదట్లోనే నువు కాదంటే అదోరకంగా ఉండేది. అంతా నాకు అనుకూలంగానే చేస్తున్నట్టు నటించి, పెద్ద కుట్రపన్ని, నా కూతుర్ని నాకు కాకుండా చేస్తావా? నా వేలితో నా కంట్లోనే పొడిచి, ఇంకా ఈ ఊళ్ళో కొచ్చి బతికి బట్టకడదామనే అనుకుంటున్నావా?" అని అడిగాడు ముకుందరావు.

"మీ కంట్లో నేను పొడవటం ఏమిటి?" అని అమాయకంగా అడిగాడు సత్యమూర్తి.

"తెలియనట్లే అడుగుతున్నావే? తనూజ ఈ ఇంటికి దీపం, నా కంటికి వెలుగు. దాన్ని నేను పువ్వుల్లో పెట్టి చూసుకుంటూ వచ్చాను. కానీ అదీ ఇలా గుండెల్లో ఫెళ్ళున తన్నేసి వెళ్ళిపోతుందనుకోలేదు...'

"ఆమె మీ గుండెల మీద తన్నేసి వెళ్ళిపోయే పరిస్థితిని మీరెందుకు కలిపించుకున్నారు? ఇప్పుడిలా కనిపించిన వాళ్ళందర్నీ 'చంపుతా నరుకుతా' అనే బదులు బాధ్యతగల తండ్రిగా మీ కూతురు ఆలోచనలు సక్రమంగా ఉన్నాయా లేదా మీరు సక్రమం అనుకుంటున్న మార్గాన నడుస్తుందా లేదా? లేకపోతే ఏం చేయాలి? అని ఎక్కడన్నా ఆలోచించారా?..." అని సూటిగా అడిగాడు సత్యమూర్తి.

"అదంతా పైకి చెప్పుకోలేని బాధ గనుకనే నిన్ను నమ్మి, బాధ్యత నీకు అప్పగించాను. చివరకు నువ్వు చేసిన నిర్వాకం ఇది..."

సత్యమూర్తి నవ్వాడు.

"ముకుందరావుగారూ... ఈ ప్రపంచం రెండు మూలలనుంచీ ఇద్దరు పిల్లల్ని తెచ్చి ఒక చోట చేర్చి చూడండి. భాష, కులం, మతం, రంగు ఇవన్నీ వేరయినా ఆ పిల్లలిద్దరూ చప్పున స్నేహితులయిపోతారు. చిన్నతనంలో మీరూ, నేను అలాగే మన ఈడు వాళ్ళతో నేస్తం కడతాం. అప్పుడు స్వచ్ఛమయిన స్నేహం కన్నా మనకింకా ఏమీ అక్కరలేదు. కానీ క్రమంగా పెరిగి పెద్దయ్యేకొద్దీ ఎన్నో అనవసరపు విషయాలు నేర్చుకుని, ఎంతో సంకుచితంగా ఆలోచించి, మీ చుట్టూ మీరూ, నా చుట్టూ నేనూ గిరి గీసుకుని అది దాటి రావటానికి చస్తే ఒప్పుకోం. కానీ ఈ అంతస్తులు, అంతరాలూ తెలియని పిల్లలు స్నేహాన్నే కోరుకుంటారు. కానీ మనం వాళ్ళను కలవనివ్వం. స్వేచ్ఛగా తిరగనివ్వం. వినకపోతే మనలో మనమే కుమిలిపోతాం. మనల్ని కాదని వెళ్ళిపోతే కక్షకట్టి వాళ్ళ మీద కత్తులు నూరుతాం. ఇదేకదా మీకూ నాకూ చేతనయిన పని. అది చెయ్యనివ్వలేదనే కదా, నన్ను చంపుతానంటున్నారు" అన్నాడు సత్యమూర్తి.

"ఇంతకీ తనూజ ఇప్పుడెక్కడుందో చెప్పు."

"నాకు తెలీదు."

"నీకు తెలీదన్నంత మాత్రాన నమ్మేంత అమాయకుడిని కాదు. జరిగిన దానికి నువ్వే సూత్రధారుడివి."

"మీరు ఏమనుకున్నా సరే... మీ అమ్మాయి ఎక్కడుందో నాకు తెలీదు..."

"ఇంత చదువుకున్నావు. ఇంతమందికి ఇన్ని పాఠాలు చెబుతావు. అబద్దాలు చెప్పటానికి నీకు సిగ్గుగా లేదూ?"

"లేదు. అవసరమైతే అబద్దాలూ ఆడవచ్చునని పెద్దవాళ్ళే చెప్పారు. వారిజాక్షులందు, వైవాహికములందు అంటూ..."

"వైవాహికం కూడా అయిపోయిందా?...." అన్నాడు ముకుందరావు ఆత్రంగా.

"నాకు తెలీదు..."

ముకుందరావు రెచ్చిపొయ్యాడు. "నా గురించి నీకు పూర్తిగా తెలిసినట్లు లేదు. నిన్ను ఇక్కడ నరికిపోగులు పెడితే, నీకు దిక్కెవడు?"

"ఎవడూ లేడు. ఏదో ఒకరోజు చనిపోవాల్సినవాళ్ళమే అంచేత చావు భయం నాకెప్పుడూ లేదు..."

ముకుందరావు కోపంతో విసిగిపోయి చేసేది లేక బతిమలాడాడు.

"నా కన్నతల్లి ఒక్కరోజు కనిపించకపోతే నాకు పిచ్చెక్కిపోతుందయ్యా... నన్ను కనికరించి, నా మీద దయచూపించి చెప్పవయ్యా, నా తనూజ ఎక్కడుందో..." అని చేతులు జోడించి నమస్కరించి, రుద్ధకంఠంతో అడిగాడు.

"అయినా సరే నిజంగానే వాళ్ళెక్కడున్నారో నాకు తెలీదు..."

"ఆఖరుసారిగా అడుగుతున్నాను. నీకు ప్రాణాలమీద ఆశవుంటే తనూజ ఎక్కడుందో చెప్పు..."

"మొదటిది - నాకు ప్రాణాల మీద పెద్ద ఆశలేమీ లేవు. రెండవది తనూజ ఎక్కడుందో నిజంగా నాకు తెలియదు. మీరెన్ని వందలసార్లు అడిగినా, నా దగ్గరనుంచీ వచ్చే సమాధానం అదే.." అన్నాడు సత్యమూర్తి నిశ్చలంగా నిలబడి.

పళ్ళు పటపటా కొరికి, పిడికిళ్ళు బిగించి "సరే ఇంక దయచెయ్" అన్నాడు ముకుందరావు.

నిశ్శబ్దంగా లేచి బయటకు నడిచాడు సత్యమూర్తి.

ముకుందరావు కనుసైగల కోసం కాచుకుని కూర్చున్న ఇద్దరు వ్యక్తులు సత్యమూర్తి వెనకాలే బయలుదేరారు.

సత్యమూర్తి ఇంటి ముందు తాళం తీస్తుంటే, ఆ ఇద్దరు రౌడీలు అతన్ని ఆటకాయించారు. అర్థం చేసుకున్న సత్యమూర్తి వాళ్ళను తోసుకుని గేటు తీసుకుని లోపలికివచ్చి తలుపు తాళం తీశాడు. వాళ్ళూ అతని వెనకే వచ్చారు.

సత్యమూర్తి లోపలికి దూరి తలుపులు బిగించుకుంటుంటే, వాళ్ళు తలుపులు తన్నుకుంటూ లోపలికి వచ్చారు.

"ఏమిటి పంతులూ, మమ్మల్ని చూసి భయపడుతుండావే..." అన్నాడొకడు పళ్ళన్నీ వెళ్ళబెట్టి నవ్వుతూ.

"నాతో మీకేమిటి పని?" అని అడిగాడు సత్యమూర్తి.

"మీకాడ సదువుకుందామని... మీరు పాటాలు బాగా సెప్తారంటగదా..." అని ఒకడు ఒక్కొక్క అడుగే దగ్గరగా వేస్తూ వచ్చాడు.

"మా ఇంటికెదురుగా ఓ గుంటది ఉంది దాన్ని లేపుకుపోవాల. నిన్ను అడిగితే ఎలా లేపుకుపోవాలో సెబుతావని అన్నారు. అందుకని వచ్చాం...." అన్నాడింకొకడు.

"పిచ్చివాగుడు, వాగకుండా బయటకు నడవండి..". అని అరిచాడు సత్యమూర్తి.

"ఎల్తాంలే... ఎల్లక ఈడనే కూర్చుని కాపురం చేయడానికి నువ్వేమన్నా వయసులో ఉన్న పిల్లదానివా?.... ఇంతకీ లేపుకుపోవడం ఎలాగో సెప్పటం లేదు... ఇలాగేనా?..." అంటూ సత్యమూర్తి డొక్కలోగుద్దాడు.

సత్యమూర్తికి కడుపులో ఉన్న నరాలన్నీ తెగిపోయినంత బాధకలిగింది. అయినా ఒంట్లోని ఓపికనంతా కూడదీసుకుని వాడి మొహం మీద బలంగా గుద్దాడు. వాడు వెనక్కి పడేలోగానే ఇంకొకడు వచ్చి సత్యమూర్తి చొక్కా పుచ్చుకున్నాడు.

"అనవసరంగా పండంటి మనిషి, మా సేతిలో ఎందుకు పిప్పి పిప్పి అయిపోతావు గానీ, తనూజమ్మ ఎక్కడుందో సెప్పెయ్... మా దోవన మేం పోతాం..."

"నాకు తెలీదు..." సత్యమూర్తిది ఒకటేమాట... మరుక్షణం ఒకడు పిడికిలి బిగించి బలంగా దవడ కింద కొడితే, సత్యమూర్తి వెళ్ళి గోడకు గుద్దుకున్నాడు.

వాళ్ళు అడుగుతూనే ఉన్నారు. అతను తెలీదని చెబుతూనే ఉన్నాడు. వాళ్ళు ఇష్టం వచ్చినట్లు ఫుట్‌బాల్‌ను తన్నినట్లు తంతూనే ఉన్నారు. ఓపిక ఉన్నంతవరకూ ఎదురు తిరిగిపోరాడినా, వాళ్ళముందు అతని బలం చాలలేదు.

ఒళ్ళంతా హూనం చేసి, ఒంటినిండా గాయాలు చేసి, సత్యమూర్తిని కొన ఊపిరితో వదిలేసి వెళ్ళిపొయ్యారు వాళ్ళిద్దరూ.

✷✷✷✷

మల్లిక బాల్కనీలోకి కుర్చీ లాక్కుని కూర్చుంది. చల్లని వెన్నెల ఆమె పాదాలదాకా వచ్చి ఆగిపోయింది. ఆమెను తాకడానికి వెన్నెలకే ధైర్యం చాలటంలేదు మరి.

గడియారం వంక చూసుకుంది. ఒక్కొక్క క్షణం ఎంతో భారంగా కదులుతోంది. మల్లిక భర్తకోసం ఎదురుచూడటం మానేసి చాలాకాలం అయింది. అతని కోసం ఎదురు చూడకపోయినా వచ్చినప్పుడు ఎంత రాత్రి అయిందో చూడటం మాత్రం అలవాటైంది.

ఇప్పుడతను డాక్టర్ షీలాతో కలిసి సినిమాకో, షికారుకో, వెళ్ళివుంటాడు. లేక ఇద్దరూ ఈ వెన్నెట్లో, కౌగిట్లో కాలాన్ని కరిగిస్తూ ఉంటాడు.

నిట్టూర్చింది భారంగా.

సత్యమూర్తి గుర్తొచ్చాడు. ఏం చేస్తున్నాడో ఇప్పుడు? ఒక్కసారిగా ఏ ఇంద్రజాలమో జరిగిపోయి తను అతని దగ్గరకు వెళ్ళగలిగితే ఎంత బావుంటుంది?

సత్యమూర్తి, తనూజ ద్వారా పంపిన లేఖ తీసి చదువుకుంది. ఆ కాసేపూ అతనితో మాట్లాడుతున్నట్లే ఉంది. అతను కళ్ళముందు కదులుతున్నట్లే ఉంది.

ఇప్పటికే ఆలస్యమైంది. కనుక ఇకనైనా అతనికి జాబు రాద్దామనుకుని కాగితం, కలం తీసుకుని కూర్చుంది.

'డియర్ సత్యా' అని మొదలుపెట్టగానే,పిలిచినట్లే టెలిఫోన్ మోగింది. ఎవరో డాక్టరుగారి కోసం ఫోన్ చేస్తున్నట్లున్నారు. బహుశా అతను ఇప్పుడు డాక్టరు షీలాగారి గాఢ పరిష్వంగంలో ఉంటాడనీ, అందులోనుంచీ బయటపడేటప్పటికి అర్ధరాత్రి దాటుతుందనీ తెలీదు కాబోలు అని విసుక్కుంటూ వెళ్ళి రిసీవర్ అందుకుంది.

"హలో" అంది.

అవతల నుంచీ ప్రిన్సిపాల్‌గారి గొంతు వినిపించింది ట్రంక్‌కాల్ అది.

"హలో, మల్లికా - నేను, అంకుల్‌ని..."

"బావున్నారా?"

"సత్యమూర్తిని రౌడీలు కొట్టారు. చావు బతుకుల్లో ఉన్నాడు. ఈ రాత్రి గడుస్తుందో లేదో..."

వెయ్యి పిడుగులు పడినట్టు ఫీలయ్యింది. గొంతు తడారిపోయింది. గుండె వేగం ఎక్కువైంది.

"ఎ...ఎ...ఏం జరిగిందంకుల్!" అంది జీరపోయిన స్వరంతో. ఆయన సమాధానం చెప్పేలోపలే మళ్ళీ అంది. "నేను వెంటనే బయలుదేరుతున్నానంకుల్."

"నువ్వు వచ్చి చేసేదేమీలేదు. ఏ రకంగానూ ఇక్కడి పరిస్థితులు బాగాలేవు. ఈ రాత్రి గడవటమే కష్టం. చివరి క్షణాల్లో, గాలికి ఆరిపోతున్న దీపంలా ఉన్న అతనికోసం, ఇక్కడికి వచ్చి, నీ సంసారంలో అనవసరంగా గొడవలు సృష్టించుకోవద్దు.... నేను ఉండబట్టలేకనే నీకు ఫోను చేస్తున్నాను గానీ, నిన్ను రమ్మనికాదు..."

"ఇంత లక్షణంగా ఉన్న ఈ సంసారం ఏమవుతుందోనన్న భయంలేదు. కానీ నా కోసం పరితపించే ప్రాణి ఆఖరు క్షణాల్లో పక్కన ఉన్నానన్న తృప్తి అయినా మిగులుతుంది... నేను ఇప్పుడే బయలుదేరుతున్నాను..." అంది మల్లిక.

ఇంక ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా, కిందకు వచ్చి, డ్రైవర్ని పిలిచి కారు సిద్ధం చేయమంది.

"ఎక్కడికమ్మా?" అని ఆశ్చర్యంగా అడిగింది అత్తగారు.

"నా స్నేహితుడికి చాలా సీరియస్‌గా ఉందట. ఫోను వచ్చింది. నేను వెళ్ళి తీరాలి..."

"అయితే వెళ్ళిరామ్మా" అని అత్తగారు చెప్పేలోపలే, కారు గేటు దాటింది.

దార్లో తనూజ ఇంటిముందు కారు ఆపి, ఈ విషయం చెబితే, తనూజ ఏడ్చేసింది. తనూజ, రవీ ఇద్దరూ వస్తామని బయలుదేరారు.

"వద్దు ఇంత జరిగాక, మిమ్మల్ని కూడా బ్రతకనివ్వరు. అందుకని మీరు బయటపడవద్దు. ఏ మాత్రం వీలున్నా నేను అతన్నే ఇక్కడకు తీసుకువస్తాను..... " అని హడావిడిగా వెళ్ళి కార్లో కూర్చుంది.

కాసేపట్లోనే కారు హైదరాబాదు పొలిమేరలు దాటింది. మల్లిక స్మృతి పథంలో పాతరోజులన్నీ మెదులుతున్నాయి. సత్యమూర్తీ, తనూ చదువుకున్న రోజులూ, షికార్లు చేసిన సాయంత్రాలు, సిన్మాలు చూసిన సమయాలు, చెట్టాపట్టాలేసుకుని తిరిగిన వెన్నెల రాత్రులు... అన్నీ గుర్తుకొస్తున్నాయి.

మధ్య మధ్యలో మల్లిక డ్రైవర్‌తో అంటోంది.

"జాన్, ఇంకా స్పీడ్‌గా వెళ్ళలేవా?"

నిజానికి జాన్ చాలా స్పీడుగానే నడుపుతున్నాడు. కానీ ఆమె తొందర, ఆత్రం అలా అడిగిస్తోంది.

కొన్ని గంటల తర్వాత మల్లిక కారు ఆ ఊరు చేరి, ప్రిన్సిపాల్‌గారి ఇంటిముందు ఆగింది. ఆయన మల్లికను లోపలికి తీసుకు వెళ్ళి, ముకుందరావు, తనూజ, రవి, సత్యమూర్తికి ఎదురైన పరిస్థితి చెప్పాడు.

"పోలీసులూ, డాక్టరూ, అసలు ఊరు ఊరంతా ముకుందరావుగారు ఏం చెబితే అలా చేయాల్సిందే అతన్ని చావగొట్టి వెళ్ళినా, ఇంతవరకూ పట్టించుకున్న నాథుడు లేడు. కావాలని ముకుందరావుతో కయ్యానికి దిగే అవసరం ఎవరికి ఉంది? పైగా అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళాలన్నా ముందు పోలీసు రిపోర్టు ఇవ్వాలి. ఈ గొడవలు పడలేక చుట్టుపక్కల అంతా ఎవరింట్లో వాళ్ళు తలుపులు బిగించుకుని కూర్చున్నారు. నేనే నాకు తెలిసిన డాక్టర్ని బతిమలాడి తీసుకెళ్ళి ఫస్ట్ ఎయిడ్ చేయించాను. మా కుర్రాడిని అక్కడ ఉంచి నేనూ ఇప్పుడే ఇంటికొచ్చాను. ఈ మాత్రం చేశానుగానీ ముకుందరావుగారికి ఇష్టంలేని పనిచేసి, కొరివితో తలగోక్కోవటం నాకు చేతకాదు. అంచేత తెల్లారితే పరిస్థితి ఎలా ఉంటుందో తెలియు."

"సత్యమూర్తి..." వణుకుతున్న ఆమె కంఠంనుంచీ మాట పూర్తిగా రాలేదు.

"ప్రాణం కొట్టుకులాడుతోంది. దెబ్బలు మాత్రం బలంగా తగిలాయి. ఆశ లేనట్లే కనిపిస్తోంది" అన్నాడాయన.

"అయితే నేను అతన్ని హైదరాబాదు తీసుకువెళతాను."

"తీసుకువెళతావు సరే, ఇతను ఎవరూ ఏమిటీ అంటే, మీ అత్తగారికీ, నీ భర్తకీ ఏమని చెబుతావు? ఎవరని చెబుతావు?" అని అడిగాడాయన.

"ఉన్న విషయమే చెబుతాను....." అంది మల్లిక.

"నీ సంసారం ముక్కలైపోతుంది మరి..." అని హెచ్చరించారాయన.

"ఏమైనా కానీ... అవన్నీ ఆలోచించుకుంటూ కూర్చునే సమయంకాదిది. ఒక్కో క్షణం ఆలస్యమయినకొద్దీ అతన్ని బ్రతికించుకునే అవకాశాన్ని జారవిడుచుకున్నట్లే లెక్క.. పోదాం పద..." అంది మల్లిక.

మరో అయిదు నిముషాల తర్వాత సత్యమూర్తి ఇంటిముందు కారు ఆగింది. అంతా లోపలికి వెళ్ళారు.

ఒంటి నిండా గాయాలతో, రక్తపు బట్టలతో, ప్రాణం ఉందో లేదో అన్నంత అనుమానంగా ఉన్న సత్యమూర్తిని చూడగానే, ఇంతవరకూ తెచ్చిపెట్టుకున్న మేకపోతు గాంభీర్యమంతా ఏమైందోకానీ, ఏడుస్తూ అతని పక్కన కుప్పకూలిపోయింది.

ఆయన ఆమెకు ధైర్యం చెప్పి, టైం లేదని ఓదార్చి, కన్నీరు తుడిచి, లేవదీసి కార్లో కూర్చోబెట్టాల్సి వచ్చింది.

డ్రైవర్, ప్రిన్సిపాల్‌గారు కలిసి సత్యమూర్తిని మోసుకొచ్చి కార్లో వెనుక సీట్లో పడుకోబెట్టారు –

ఊరంతా నిశ్శబ్దంగా నిద్రపోతున్న అపరాత్రి సమయంలో ఆ కారు హైదరాబాదు వైపు బయలుదేరింది.




మల్లిక ఒళ్ళో తలపెట్టుకుని, పడుకున్న సత్యమూర్తి ఈ ప్రియురాలికి దూరంగా పోలేక, తనను ఎటో లాక్కుపోతున్న మృత్యువుతో హోరాహోరీ పోరాడుతున్నాడు. ఏ ఇంద్రజాలమో జరిగి సత్యమూర్తిని వడిలోకి తీసుకోగలిగితే బావుండునని కొద్దిగంటల మునుపే అనుకుంది. కానీ ఇలా అని అనుకోలేదు.

అతన్ని చూస్తూ మృదువుగా చేత్తో నిమురుతూ కన్నీటి వర్షం కురిపిస్తోంది.

"ఏదో ఒక రోజున నిన్ను వెతుక్కుంటూ నీ గుమ్మంలోకి 'వస్తాను నేస్తం' అని రాశావు - గుర్తుందా - నేనే నిన్ను వెతుక్కుంటూ వచ్చాను... నా ఇంటికి నిన్ను స్వయంగా తీసుకువెళదామని... కానీ ఇలా బతికున్నావో లేదో తెలియని స్థితిలో నిన్ను తీసుకెళ్ళాల్సి వస్తుందని మాత్రం కల్లో కూడా అనుకోలేదు... నేస్తం..." అనుకుంటూ ఏడ్చేస్తోంది మల్లిక.

ఇంతవరకు భర్తను తాను ఏమీ కోరలేదు - ఇప్పుడు సత్యమూర్తిని బతికించమని మాత్రం కోరదలిచింది. కానీ "ఏమంటాడో?" ఈ ప్రశ్న ఆమె ముందు నిలబడింది.

సరిగ్గా అదే సమయంలో ఇంటికొచ్చిన డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్‌కు తల్లి చెప్పింది. మల్లిక ఎవరో స్నేహితుడికి సీరియస్‌గా ఉందని వెళ్ళిందని.

కోపం పట్టలేక టీపాయ్‌ని ఒక్క తన్నుతన్నాడు. వెళ్ళి అంతదూరంలో పడింది దానిమీద అందమైన గాజు పలక పగిలి ముక్కలైంది.

✷✷✷✷

క్షణాలు గడిచే కొద్దీ -

కాళ్ళూ చేతులూ వేళ్ళాడేసి, కళ్ళు తేలేసి -

తన ఒడిలో నుంచి క్రమంగా మృత్యువు ఒడిలోకి జారిపోతున్న సత్యమూర్తి వంకే, భయంగా, బేలగా నిస్సహాయంగా చూస్తోంది మల్లిక.

అలవోకగా తాకినా చాలు, తన తనువులోని అణువణువులోనూ విద్యుత్తు ప్రవహింప చేసిన చేతులే, ఇప్పుడు నిస్సత్తువుగా తోలు తిత్తుల్లా పక్కకు వాలి పోతున్నాయి.

అందంగా చిరునవ్వులు చిందించి ప్రేమగా చుంబించిన పెదవులే, ఇప్పుడు తడి ఆరిపోతూ, కుమిలిపోతూ, వాడిపోతున్నాయి.

అయిపోతోందా?

ప్రాణానికి ప్రాణంగా మసిలిన మనిషి, తన ఒళ్ళో ప్రాణాలు వదిలేస్తుంటే, చూస్తూ కూర్చోవాల్సిందేనే?

ఆమె గుండె చెరువైపోతోంది. ఏం చేస్తోందో తెలియని స్థితిలో అతని తలను కొంచెంగా పైకెత్తి, బరువెక్కిన తన రొమ్ములకేసి హత్తుకుంది.

నచ్చిన నెచ్చెలి ఇచ్చిన ఆ వెచ్చని కౌగిలిలో ఉక్కిరి బిక్కిరి అయిన సత్యమూర్తి బాధగా మూలిగాడు. మల్లిక అతని మీదకు వంగి ఆశగా, ఆత్రంగా అడుగుతోంది."

"నేను... నీ మల్లికను... ఒక్కసారి కళ్ళు తెరిచిచూడు..."

చిరపరచితమైన మల్లిక స్పర్శా, మాటగుర్తు పట్టాడేమో సర్వశక్తులూ కూడదీసుకుని, కళ్ళు తెరిచి చూసేందుకు ప్రయత్నించాడు. ఆ మాత్రానికే మల్లిక సంతోష పడింది. ఆ ఆఖరు క్షణాల్లో అదే గొప్ప వరం.

కారు హైదరాబాదు వచ్చేసింది. ఆమె ఇంటి గేటు ముందుకు వచ్చి ఆగింది.

'నిన్ను వెతుక్కుంటూ నీ గుమ్మంలోకి వస్తాను నేస్తం' అన్న సత్యమూర్తి మాటలే గుర్తొచ్చి, అతని వంక ప్రేమగా చూసింది.

'నిజంగానే, నువ్వన్నట్లుగానే, నిండుగా నవ్వుతూ గేటు తీసుకుని లోపలికి వస్తావని, సాదరంగా ఆహ్వానించి, లోపలికి తీసుకెళ్ళే గడియలొస్తాయని ఆశగా ఎదురు చూశానే గానీ, ఇలా నీ శరీరాన్ని మోసుకు వస్తానని మాత్రం కల్లో కూడా అనుకోలేదు, నేస్తం...' అని బాధపడింది మల్లిక.

గేటు తెరవగానే కారు పోర్టికోలోకి దూసుకు పోయింది. మరుక్షణంలోనే మల్లిక కారు దిగి లోపలికి పరుగెత్తింది. ఒకేసారి రెండేసి మెట్లు గెంతుతూ మేడమీదకెళ్ళి భర్తను నిద్రలేపింది.

చిరాగ్గా నిద్ర లేచిన డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, తీక్షణంగా భార్యవంక చూశాడు.

"ఏమండి, తను చావు బతుకుల్లో ఉన్నాడు. ఒకసారి వచ్చి చూడండి. అతన్ని కాపాడండి.. ప్లీజ్.." అని ప్రాధేయ పడింది మల్లిక.

"ఎవరతను?" అని కోపంగా అడిగాడు డాక్టర్.

"నా ఫ్రెండ్.."

"కట్టుకున్న భర్తకు చెప్పకుండా రాత్రికి రాత్రి పారిపోయి కలుసుకోవాల్సినంత గొప్ప ఫ్రెండా?"

"తర్వాత మీకు అన్ని విషయాలూ తీరికగా చెబుతాను. అతన్ని ఎవరో కొట్టి పారిపొయ్యారు. చావుబతుకుల్లో ఉన్నాడు. ఒంటి మీద స్పృహ లేకుండా పడిపోయాడు. అతని పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది. దయచేసి అతన్ని బతికించండి ప్లీజ్...' అంటూ వేడుకుంది మల్లిక.

"అతనికి సరే, నీకు ఒంటిమీద స్పృహ ఉండే చేస్తున్నావా ఇవన్నీ, వాడెవడో, ఏ వెధవ పనో చేసి చావుదెబ్బలు తింటే, నువ్వు పరుగెత్తుకుంటూ వెళ్ళి, వాడి శవాన్ని మోసుకొసావ్తా? నిన్ను కట్టుకున్న మొగుణ్ణి నేను చచ్చాననుకున్నావా, బతికాననుకున్నావా?...

"నేను చేసింది తప్పేననుకుంటే, మీరే శిక్ష విధించినా భరించటానికి సిద్ధంగా ఉన్నాను. అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. ముందు అతని సంగతి చూడండి..." అని బ్రతిమలాడుతూనే ఉంది.

"మల్లికా, నీకు మతి ఉండే మాట్లాడుతున్నావా? దొమ్మీలు, ఖూనీ కేసులూ అంటే ఆషామాషీ అనుకుంటున్నావా? రేపటినుంచీ పోలీసులు, కేసులు, కోర్టులు, సాక్ష్యాలూ... వచ్చి మన మెడకు చుట్టుకుంటాయి. నా పరువు గంగపాలు చేయడానికి నీకింతకన్నా మంచి మార్గం కనిపించలేదా? చేసిన వెధవ పని చాలుకానీ, ఆ డ్రైవర్నే పంపించి తెల్లారకముందే ఆ శవాన్ని మూసీలో తోసేసి రమ్మను" అన్నాడు డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్.

"నో నో అలా జరగడానికి వీలులేదు. మూసీలో తోసెయ్యటానికి కాదు ఇంత దూరం తీసుకొచ్చింది. అతను బతకాలి, బతికి తీరాలి."

"నువ్వెంత పెద్ద తప్పు చేస్తున్నావో నీకు తెలియడం లేదు. ఇది నేరం తెలుసా?"

"తెలియదు. ఇంట్లోకొచ్చి ఒక మనిషి తల పగలగొట్టి పోతే, వాళ్ళదీ నేరం కాదు, చూస్తూ ఉరుకున్న చుట్టుపక్కల వాళ్ళదీ నేరం కాదు. అతన్ని చావగొట్టిపోతున్నారని ముందే తెలిసీ తెలియనట్లు, తమ కేమీ పట్టనట్లు, ముఖం చాటు చేసుకు కూర్చున్న అధికారులదీ నేరం కాదు. చనిపోతున్న ఒక మనిషిని బతికించడానికి నేను పడే పాట్లు మాత్రం క్షమించరాని నేరంగా కనిపిస్తున్నాయికదూ?" అంది మల్లిక ఆవేశంగా.

"అయినా ఈ గొడవలన్నీ నీ మెడకు చుట్టుకుంటాయి... నా పరువు బజారు పాలవుతుంది. చేసిన నిర్వాకం చాలు. తెల్లారకముందే, వాడిని ఒదిలించేసుకోవటం తప్ప గత్యంతరం లేదు..."

"వీల్లేదు. మీరు కాదంటే నేను ఇంకో డాక్టరు దగ్గరకు వెళతాను. ఎంత డబ్బు ఖర్చయినా అతన్ని బతికించుకుంటాను..." అంటూ ఆవేశంగా వెళ్ళబోయింది మల్లిక.

"నీకు పిచ్చి ఎక్కిందా ఏమిటి? బొత్తిగా అదుపు ఆజ్ఞలు లేకుండా ప్రవర్తిస్తున్నావ్. పెళ్ళి అయినదానివి, ఎవడో ఎవడ్నో కొడితే, రాత్రికి రాత్రి వాడి కోసం పరుగెత్తుకుపోవటం, చావుబతుకుల్లో ఉన్నవాడిని వెంటేసుకురావటం, కట్టుకున్న భార్యకన్నా ఎక్కువగా వాడికోసం పడి ఏడవటం - చివరకు, బరితెగించి పోయి, నీ ప్రియుడికి నాచేతే సేవలు చేయించాలనుకోవటం - దిస్ఈజ్ టూ మచ్ ఫర్ యూ..."

"వీటి అన్నిటికీ సమాధానాలు చెప్పి మీ నోరు మూయించగలను, కానీ నాకిప్పుడు అంత టైం లేదు. భార్యగా నాకివ్వవలసిన గౌరవాన్ని మీరు నాకిస్తే, భర్తగా మీకు ఇవ్వవలసిన గౌరవాన్ని నేనూ మీకు ఇవ్వాలి. ఆ అనుబంధాన్ని మీరే బలహీనపరచుకున్నారు... ఒక కాకి నేల కొరిగితే, పది కాకులు చుట్టూ చేరి, సహాయం చేయాలని తాపత్రయపడతాయి. మనిషి నేలకొరిగితే మాత్రం పక్కవాళ్ళు పట్టించుకోరు. ఒక మనిషి మీ గుమ్మంలో కొచ్చి ప్రాణాలు విడవబోతుంటే, కనీసం అతన్ని కన్నెత్తి చూసే సంస్కారం కూడా లేకపోగా, మూసీలో తోసెయ్యమని చెప్పగలిగిన మేధావులు మీరు. నీలాంటివాడు నాపాలిటబడటం నిజంగా నా దౌర్భాగ్యం..." అంటున్న మల్లిక మీదకు వెళ్ళాడు ఆమె భర్త.

"నోర్ముయ్..." అంటూ చెయ్యి ఎత్తాడు.

"నా మీద చెయ్యి పడిందంటే, నీ నెత్తురు కళ్ళ చూస్తాను. మర్యాదగా తప్పుకో..." అంది మల్లిక రెచ్చిపోయి.

"గడపదాటి బయటికెళ్ళావో, నీ బతుకు కుక్క బతుకు అవుతుంది తెలుసుకో..." అని అరిచాడు హరిశ్చంద్ర ప్రసాద్.

"ఈ గడప దాటితేగానీ నేను బాగుపడను. ఇన్నాళ్ళు ఈ ఇంట్లో కుక్కలాగే పడి ఉన్నాను. కనీసం కుక్కపిల్ల మీద చూపించే జాలిలో పదోవంతు అయినా నా మీద చూపించకపోగా నేనొకదాన్ని ఉన్నానన్న విషయమే మర్చిపోయి బయట కుక్కల కోసం పరుగెత్తావు.. ఇంక నాకు ఇక్కడ ఏం మిగిలిందని కుక్కలా పడి ఉండమంటావ్?" అని అడిగింది మల్లిక రగులుతున్న ఆవేదనంతా వెళ్ళగక్కుతూ.

ఇన్నాళ్ళూ బాధనీ, భయాన్నీ భుజాన వేసుకుని తిరుగుతూ, కుక్కిన పేనులా పడి ఉన్న మల్లిక ఒక్కసారిగా ఇలా అగ్ని పర్వతంలా బద్దలైపోతుంటే, ఆశ్చర్యంలో నుంచీ తేరుకోలేక పోతున్నాడు.

అయినా భార్యని ఆపటం కోసం గుమ్మానికి అడ్డుగా నిలబడ్డాడు. ఆదిశక్తిలా మారి, అతన్ని ఒక్క తోపు తోసి, పరుగు పరుగున వెళ్ళిపోతున్న మల్లికను చూస్తూ, కలా, నిజమా అన్న భ్రాంతిలో ఉండిపొయ్యాడు డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్.

కింద హాల్లో నిలబడి ఆశ్చర్యంగా చూస్తున్న అత్తా, మామల వంక కన్నెత్తి చూడకుండా వెళ్ళి కార్లో కూర్చుంది. కారు బయటకు దూసుకుపోయింది.

అయిదు నిముషాల తర్వాత డాక్టర్ బోస్ ఇంటి ముందు ఆగి కాలింగ్‌బెల్ నొక్కింది.

డాక్టర్ బోస్ వీళ్ళకు ఫ్యామిలీ ఫ్రెండ్ ఎన్నడూ గుమ్మం దాటని మల్లిక ఇలా రావటం, అదీ ఇంత తెల్లవారుఝామున వచ్చి తలుపు తట్టడం చూసి డాక్టర్ బోస్ ఆశ్చర్యపోతూ ఆమెను లోపలికి ఆహ్వానించాడు. మల్లిక క్లుప్తంగా చెప్పినదంతా విని, 'హరి ఏమన్నా డమ్మా' అని అడిగాడు.

"తన భార్యకో ఆప్తమిత్రుడు ఉన్నాడని తెలిస్తే, ఏ భర్త మాత్రం భరించగలడు? నా భర్త అందరిలాంటివాడే.. నేను చేస్తోంది తప్పో ఒప్పో ఆలోచించే శక్తి కూడా నాకు లేదు. న్యాయం, ధర్మం కూడా నాకు వ్యతిరేకంగా ఉన్నాయి. అంతా నన్ను తప్పుపట్టి దుయ్యబడతారు. తెలిస్తే పోలీసులూ వెంటబడతారు... అయినా ఇప్పుడు ఇవేవీ ఆలోచించే స్థితిలో నేను లేను. అతన్ని బ్రతికించుకోవాలన్న దొక్కటే ఇప్పటి నా లక్ష్యం... అతన్ని రక్షించగల దేవుడి కోసం వీధి వీధి తిరగదల్చాను.... చెప్పండి, మీరీ ఉపకారం చెయ్యగలరా? ఎంత ఫీజు అయినా తీసుకోండి, ఇస్తాను...." అంటోంది మల్లిక కడుపులోంచీ బాధ, దుఃఖ, ఆవేశం - అన్నీ కలిసి, కన్నీటి రూపంలో దొర్లుకుంటూ వస్తున్నాయి.

డాక్టర్ బోస్, నర్సింగ్‌హోమ్‌కి ఫోన్ చేస్తూ మల్లికతో అన్నాడు "వేళగాని వేళలో మీ ఇంటికి వస్తే నువ్వు తల్లిలాగా, చెల్లెలిలాగా ఆదరించి అన్నం పెట్టిన రోజులెన్నో ఉన్నాయమ్మా, అవన్నీ ఎలా మర్చిపోగలను?... నేనుండగా, నువ్వు ఇంకో డాక్టర్ దగ్గరకు వెళ్ళాల్సిన పనేం లేదు."

అయిదు నిముషాల్లో డాక్టర్ బోస్ తయారయి వచ్చాడు. పావుగంట తర్వాత నర్సింగ్ హోమ్‌లో సత్యమూర్తికి చికిత్స చేయటం మొదలుపెట్టాడు.

పేషెంట్‌ని చూడగానే డాక్టర్ బోస్‌కూడా ఏమీ ధైర్యంగా చెప్పలేకపోయాడు.




ఆపరేషన్ థియేటరులోకి వెళ్ళేటప్పుడు మాత్రం - "నేను చేయగలిగినదంతా చేస్తానమ్మా." అన్నాడు.

చేయాల్సిన మానవ ప్రయత్నమంతా చేసింది మల్లిక. అలసిపోయి, బల్ల మీద మూర్చుని, గోడకు ఆనుకుని, ఇంక భగవంతుడికి లోలోపలే మొక్కుకోవటం మొదలెట్టింది.

నిజమే ఇన్నేళ్ళ జీవితంలో ఆమెకెప్పుడూ, ఇలాంటి విపత్కర పరిస్థితి ఏర్పడలేదు. ఇంతగా గుండె బరువయిపోయిన సమయమూ ఎదురవలేదు. కనుకనే కనిపించే నర్సులూ, కాంపౌండర్ల దగ్గరనుంచీ, కనిపించని దేవుడిదాకా అందరికీ మనసులోనే నమస్కారాలు చేసుకుంటోంది.

ఒక గంట గడిచాక అప్పుడు మల్లికకు, తనూజ, రవీ గుర్తొచ్చారు, వెళ్ళి వాళ్ళనూ తీసుకొచ్చింది. ఈమెతో పాటు వాళ్ళూ పక్కన చేరి బిక్కమొహాలేసుకుని, దిక్కులు చూస్తున్నారు.

రెండు గంటల తర్వాత డాక్టర్ బోస్ బయిటకొచ్చి, మల్లికతో అన్నాడు.

"ఆపరేషన్ చేశాను. ఫర్వాలేదు. బాగానే రెస్పాండ్ అవుతున్నాడు. అసలు దెబ్బలు తగిలిన ఇన్ని గంటలదాకా సరైన ట్రీట్‌మెంట్

లేకపోయినా, బతికి ఉండటమే ఆశ్చర్యం. అతని 'విల్‌పవర్' ఒక్కటే అతన్ని కాపాడిందేమోననిపిస్తోంది... అయినా ఇవాళంతా గడిస్తేగానీ, చెప్పలేం..."

"మీరు మళ్ళా ఎప్పుడొస్తారు? మీకు తెలియదని కాదు. నా ఆదుర్దా కొద్దీ చెబుతున్నాను... ఎంత ఖరీదైనా సరే, అవసరమైన మందులన్నీ తెప్పించండి..."

"తెప్పించడం కాదమ్మా, నేనే స్వయంగా తీసుకువస్తాను. నా సామర్ధ్యానికి ఇదో పరీక్ష అనుకుంటాను... సరేనా?..." అన్నాడు డాక్టర్ బోస్ నవ్వేస్తూ.

మధ్యాహ్నమూ, సాయంత్రమూ కూడా డాక్టర్ బోస్ వచ్చి చూసి వెళ్ళాడు. మర్నాడు సత్యమూర్తి కళ్ళు తెరిచి చూశాడు. మల్లికను చూసి నవ్వాడు. ఆ మాత్రానికే మల్లిక మనసు సంతోషంతో గంతులు వేసింది. ప్రపంచంలోని సంపదనంతా చేజిక్కించుకున్నంత ఆనందంగా అతని చేతిని తీసుకుని గుండెలకు హత్తుకుంది. కన్నీళ్ళు తుడుచుకుంది. అయితే ఇవి దుఃఖాశ్రువులు కావు. ఆనంద బాష్పాలు.

చుట్టూ నిలబడ్డ మల్లిక, తనూజ, రవి - వీళ్ళ మధ్యకు ఎలా వచ్చి పడ్డాడో అతనికి తెలియలేదు. ఇంకో రోజు గడిచాక, కొంచెం తేరుకున్నాక, మల్లిక జరిగిన విషయమంతా చెప్పింది.

"మార్కండేయుడి కథ గుర్తుందా నీకు?: అని అడిగాడు సత్యమూర్తి నవ్వుతూ.

"ఇప్పుడు అదెందుకు?" అని అడిగింది మల్లిక.

"ప్రాణాలు లాక్కుపోవటానికి యముడొస్తే, మార్కండేయుడు శివుడిని కావలించేసుకున్నాడు. వాళ్ళిద్దరినీ విడదీయలేక యముడు ఒట్టి చేతులతోనే తిరిగి వెళ్ళాడు. అలాగే ఇప్పుడు నా ప్రాణాలు లాక్కుపోవటానికి వస్తే, నేనేమో మల్లిక ఒడిలో నుంచీ రానని మొండికేశాను. మనల్ని విడదీయలేకనే, యముడు మళ్ళా వోడిపోయి, వెళ్ళిపొయ్యాడు..." అన్నాడు సత్యమూర్తి.

"కాస్తంత ఓపిక వచ్చిందో లేదో, మళ్ళా కథలూ, కబుర్లూ మొదలుపెట్టావన్నమాట... నువు ఎదురుగా ఉన్నప్పుడు, తెలియకుండానే కాలం గడిచిపోతుంది. కానీ నువు దూరమైనప్పుడు, నీవు లేని వెలితి మరింత స్పష్టంగా తెలిసొచ్చి, ఆ బాధ పదింతలవుతుంది..." అంది మల్లిక అంతలోనే విచారంగా.

"ఇదివరకటిలాగా కాదుకదా... పరాయిదానివైపోయావు, ఎదురుగా ఉన్నా, మన మధ్య కొన్ని యోజనాల దూరం ఉంటునే ఉంటుంది. కనుకనే నా చేతికి నీవు అందవు..." అన్నాడు సత్యమూర్తి.

ఆవేళ భర్తతో గొడవపడి వచ్చిన తర్వాత మల్లిక మళ్ళా ఇంటికి వెళ్ళలేదు. తనూజ ఇంటికే వెళ్ళి స్నానపానాదులన్నీ పూర్తిచేసుకుని వచ్చి సత్యమూర్తి దగ్గర కూర్చుంటోంది.

నాలుగురోజులు గడచినా ఇంటి ముఖం చూడకపోవటంతో మల్లిక అత్తగారు శకుంతలమ్మ, కోడల్ని వెతుక్కుంటూ వచ్చింది మల్లికను ఇవతలకు పిలిచి చెప్పింది.

"చూడమ్మా, ఈ ప్రేమలూ, ఆకర్షణలూ ఇవన్నీ అందరికీ తెలిసినవే. ఆ కాసేపూ ఆ మోజులో పడిన వాళ్ళంతా చిలకపలుకుల్లా వల్లె వేసే ప్రేమ ప్రేలాపనలన్నీ నీటిమీద రాతల వంటివమ్మా. మనం చూస్తుండగానే చెరిగిపోతాయి. వాటి ఆనవాలు కూడా మిగలదు. అన్నీ తెలిసినదానవి, చదువుకున్నదానివి ఆలోచించు' అందామె.

"నాకు తెలియక కాదు. ఆ ఇంట్లో నా స్థానం ఏమిటో తెలిశాక, అక్కడ ఉండబుద్ధి కావటం లేదు, నేనిలా బయటకు రావడానికి కారణం నా ప్రవర్తన కాదు, మీ అబ్బాయి ప్రవర్తనే" అంది మల్లిక.

"పైకి ఎవరెన్ని చెప్పినా ఈ మగవాళ్ళంతా ఒకటేనమ్మా. వాళ్ళ మొహాల్లో తేడా ఉంటుంది గానీ, మనస్తత్వంలో మాత్రం తేడా ఉండదు. అయితే మరి అందరి ఆడవాళ్ళూ గుట్టుగా కాపురం చేసుకోవడం లేదా? ఇంటి ఆయనతో సరిపడక వెళ్ళిపోతానంటే, ఇంక పని మనిషికీ, పెళ్ళానికీ తేడా ఏముందమ్మా? అసలు ఆడదాని జీవితం అంటేనే సగం నిజం, సగం కల. రాత్రిళ్ళు ఏవేవో కలలుగంటూ, ఆ కలలోనివన్నీ జరగలేదే అని పగలంతా ఏడుస్తూకూర్చుంటాం" అని చెప్పింది.

"మీరు చెప్పింది నాకు అర్థమైంది. నేను సత్యమూర్తి కోసం కలలు కన్నమాట నిజమే, ఆ కల నిజం కాలేదని ఏడ్చిన మాటా నిజమే. నా బాధ అదొక్కటే అయితే నా కథ అందరి ఆడవాళ్ళలాగానే గుండెకీ, గొంతుకీ మధ్యనే కొట్టుమిట్టాడుతూ ఉండిపోయేది. కానీ నా దురదృష్టం కొద్దీ నా భర్తకి నేను అక్కర్లేక పోయాను..." అని నిట్టూర్చింది మల్లిక.

"పెద్దదాన్ని కాబట్టి, ఇంటి పరువు మర్యాదల కోసం పాకులాడుతున్నదాన్ని కాబట్టి, చెప్పాల్సిన ధర్మం నాకుంది కాబట్టి, చెప్పాను. నీ అంతట నీవే తీరిగ్గా ఆలోచించుకుని, ఇకనైనా ఇంటికి వస్తే మంచిది. తెగేదాకా లాగితే, నష్టపోయేది నువ్వే. కాల్లో ముల్లు దిగితే బాధగానే ఉంటుంది. బాధ పెట్టే ముల్లును తీసేసుకోవటం తెలివిగల వాళ్ళ పని, కాలే తీసేసుకోవటం తెలివి తక్కువ వాళ్ళ పని, ఇంతకన్నా నేనేం చెప్పగలను?" అని బాధపడుతూ వెళ్ళిపోయిందామె.

ఆమె వెళ్ళిన తర్వాత సత్యమూర్తి విషయం ఏమిటని అన్నాడు. మల్లిక చెప్పింది. అప్పుడు సత్యమూర్తి ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఇంట్లో వాళ్ళకి చెప్పే వచ్చి వెళుతున్నావని నేను అనుకుంటున్నాను. కానీ నా కోసం నీ ఇంటినీ, నీ భర్తనీ వదిలేసి వచ్చావా మల్లికా? ఇదేం బాలేదు" అన్నాడు సత్యమూర్తి

"నువ్వూ అదే మాట అంటున్నావా?"

"నీ మేలు కోరే వాళ్ళు ఎవరయినా అదే మాట అంటారు. ఒంటరిగాణ్ణి నాదేముంది? ఉన్నా లేకున్నా నన్ను తలుచుకునే వాళ్ళు ఎవరూ లేరు. నా లాంటివాడి కోసం ఇంత త్యాగం చేయడాన్ని నేనే హర్షించలేకపోతున్నాను" అన్నాడు సత్యమూర్తి.

"నీ హర్షామోదాల కోసం నేను చేయలేదు. నీ ఆపద గురించి వినగానే నాకు కలిగిన బాధకొద్దీ, నా ఆవేదన కొద్దీ చేయాలనుకున్నదేదో చేశాను. ఇంత శ్రమ పడినందుకు దేవుడు చల్లగా చూసి నిన్ను మళ్ళీ మనుషుల్లో పడేశాడు. నాకంతే చాలు" అంది మల్లిక.

"కానీ నాకు మాత్రం నువ్విలా ఇల్లు వాకిలీ వదిలేసుకుని రావటం మాత్రం ఇష్టంలేదు, దయచేసి ఇంటికెళ్ళిపో. నాకింకేం ఫర్వాలేదు."

"నా సంసారం ఎంత సలక్షణంగాఉందో, తెలిస్తే నువ్వీమాట అనవు...." అంది మల్లిక తలొంచుకుని.

"సమస్యలూ, బాధలూ లేనివాళ్ళు ఎవరున్నారు. చెప్పు... ఎన్ని కష్టాలొచ్చినా, సహించి, భరించాల్సిన అవసరం ఉంది కాబట్టే, ఆడదానికి భూదేవికున్నంత సహనాన్నీ, ఓపికనూ, ఇచ్చాడు దేవుడు...."

"ఆ సహనానికీ, ఓపికకూ కూడా ఒక హద్దు ఉంటుంది సత్యా... అవతలవాళ్ళ ప్రవర్తనను బట్టి, మన ప్రవర్తనా మారుతుంది..."

"మామూలుగా మనిషికీ మనిషికీ మధ్యగల సంబంధ బాంధవ్యాల విషయంలో అయితే కావచ్చు. కానీ ఆలుమగల సంబంధాలు మాత్రం విడదీయటానికి వీల్లేనివి. ఇవాళ ఆయన మీద ఇష్టం లేకపోవచ్చు. ఆయన పనులు కష్టంగా ఉండొచ్చు. కానీ తర్వాత ఎప్పుడో ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, ఇవన్నీ చాలా చిన్న చిన్న కారణాలుగా కనపడతాయి. దయచేసి, నా మాట విని, ఇంటికెళ్ళు మల్లికా..." అని బలవంత పెట్టాడు సత్యమూర్తి.

"ఆయన దగ్గర నేను ఉండలేను..." అని ఏడ్చేసింది మల్లిక.

"అందరు ఆడవాళ్ళలాగా నువ్వూ ఏడ్చేస్తున్నావా? తప్పు కదూ, ఏడ్చినంత మాత్రాన కష్టాలు తీరిపోవు. పరిస్థితులు మారిపోవు...."

"తెలుసు కానీ కన్నీళ్ళు రమ్మన్నప్పుడు రావు. ఎంత వేదన రగిలి, హృదయంలో మరిగి, ఈ కన్నీళ్ళుగా మారి, ఉబికి వస్తున్నాయో అర్థం చేసుకోలేవా?...."

"నువ్వెన్ని చెప్పినా నేను వినదలచుకోలేదు. భర్త 'హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ' అయితే, భార్య ఆ హెడ్‌ను మోస్తున్న మెడలాంటిది. మెడ ఎటు తిప్పితే, తల అటు తిరుగుతుంది. అలా తిరగటం లేదంటే, మెడలోనే లోపం ఉండొచ్చు. నా మీద నీకేదన్నా గౌరవం ఉంటే, వెంటనే ఇంటికెళ్ళు... ప్లీజ్... ఇంక నా దగ్గర మాత్రం ఉండొద్దు.."

"నువ్వు నన్ను నరకంలోకి వెళ్ళమంటున్నావు" అందామె చెమ్మగిల్లిన నేత్రాలతోనే చూస్తూ.

"స్వర్గం, నరకం - అన్నీ మనం అనుకోవడంలోనే ఉన్నాయి ఇంతకన్నా ఎక్కువ కష్టాలు పడుతూ, కాపురాలు చేసుకుంటున్న వాళ్ళు కోట్లమంది ఉన్నారు... నీ సంసారం సుఖదాయకం కావాలన్నదే నా కోరిక... అయినదేదో అయిపోయింది. పెద్ద ఆవిడ, మీ అత్తగారు వచ్చి అడిగినప్పుడు మొండికేసుకుని కూర్చోవటం మంచిది కాదు. వెళ్ళు... ఈ ఒక్కసారికి నా మాట విను..." అని ఆజ్ఞ, అభ్యర్థనో, తెలియని విధంగా చెప్పాడు.

మల్లిక కళ్ళు తుడుచుకుంది. లేచి నిలబడింది.

"ఇంత జరిగాక, ఇప్పుడు ఆయన దగ్గరకు వెళితే, ఆయనెంత ఘనంగా సత్కరిస్తాడో నాకు తెలుసు. నీ దగ్గరా ఉండవద్దు అంటున్నావు అటు ఆయనకూ, ఇటు నీకూ ఇష్టం లేనప్పుడు ఎవరికీ బరువుగా ఉండలేను... కనుక, ఇక వస్తాను నేస్తం..." అని చెప్పింది.

నాలుగు అడుగులు వేసి, ఆగి వెనక్కి తిరిగి చూసింది. ఇదే ఆఖరుసారి చూడటం" అన్నట్లుగా రెండు క్షణాలసేపు నిశితంగా చూసి, గబగబా అడుగులు వేస్తూ చీకట్లో కలిసిపోయింది.

✷✷✷✷

నిజంగా -

దేవుడికి అమితమైన జాలీ, దయా, ప్రేమా ఉండబట్టే గదా - మండే ఎండల్లో నిలబడి, గుండెల్ని బండలుగా మార్చుకున్న కొండల మీద కురిపిస్తున్నాడు సాంత్వనాన్ని ఒలికించే చినుకుల్ని, ఎండిన చెరువుల గుండెల్లోనూ వర్షిస్తున్నాడు పొంగి పొర్లే కృపను, అనాథల్లా నిలబడ్డ చెట్ల దాహాన్ని తీరుస్తున్నాడు దయతో, తీగలనంటి పర్వెత్తే విద్యుత్తును సృజిస్తున్నాడు ఆర్ద్రతతో.

మరి -

అంతటి జాలీ, దయా, ప్రేమాగల దేవుడే కొందరి జీవితాలను మాత్రం నిప్పులపాలు చేసి, నిర్లిప్తంగా చూస్తూ, నవ్వుకుంటూ ఉంటాడేం?

సత్యమూర్తి ఇదే ఆలోచించుకుంటున్నాడు.

ఇప్పుడతనికి బాగా నయం అయింది.

రవి, తనూజల ఇంటికి వచ్చి ఉంటున్నాడు. చేయటానికి పని ఏమీ లేదు అందుచేత అతనికి మల్లిక ధ్యాస ఎక్కువైంది.

ఎక్కడో దూరంగా ఉన్నంత కాలం, అదో బాధ. ఈ మధ్య నాలుగురోజులపాటు, మల్లిక పక్కనే కూర్చుని ఎంతో ధైర్యాన్నీ, ఊరటనీ కలిగించింది. ఆమె దగ్గరగా ఉంటే, ఈ ప్రపంచం అంతా ఎదురైౖ నిలిచినా ఫర్వాలేదనిపిస్తుంది. మందులూ మాకులవల్ల కాదు, ఆమె చల్లని చేతి స్పర్శవల్లనే, తన గాయాలు మానాయి - అనుకున్నాడు.

తనకోసం మల్లిక ఎంత తాపత్రయపడింది ఎంత ధైర్యం, తెగువా చూపించింది.

కానీ ఆమె కోసం తాను ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నాడు ప్రాణాలు కాపాడిన ఆ నేస్తానికి ఇవ్వటానికి తన దగ్గరేముంది కృతజ్ఞతాభావంతో కృంగిపోతున్న హృదయం తప్ప.... నర్సింగ్ హోం నుంచీ వచ్చాక సత్యమూర్తికి ఒకటే ప్రశ్న ఎదురై నిలిచింది. మల్లిక మనసు తాను అర్థం చేసుకోలేక, ఇంటికి పంపించేసి ఆమె హృదయాన్ని గాయపరిచాడా?

అక్కడికీ చెప్పనే చెప్పింది... '' ఆ ఇల్లు నరకం'' అని. అయినా సరే, వెళ్ళవలిసిందేనని ఆమెను బలవంతాన తరిమేశాడు. తనకోసం అంత శ్రమపడిన మల్లికను, నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపొమ్మన్నందుకు ఆమెకు కోపం వచ్చే ఉంటుంది.

ఇప్పుడే కాదు, ఇదివరలోనూ ఇలాగే ఆమె మనసును కష్టపెట్టిన సంఘటనలు చాలా ఉన్నాయి. అయినా అలిగినా, ఆగ్రహించినా కాసేపే. అలక తీరాకా, మళ్ళా చిరునవ్వు వెన్నెలలు కురిపించేది. కానీ ఈ సారి మాత్రం ఇంక తనను క్షమించదు.

సత్యమూర్తి దీర్ఘంగా నిట్టూర్పులు విడవటం మినహా మరేం చేయలేకపోతున్నాడు.

ఆ పోర్షన్ అంతా కలిపి రెండు రూములూ, వరండా మాత్రమే. రవి, తనూజలిద్దరికీ అయితే ఆ రెండు రూములూ చాలు, కానీ మూడో మనిషి వస్తే ఇబ్బందే

అందుకే సత్యమూర్తి ఎక్కువసేపు వరండాలోనే కాలక్షేపం చేస్తున్నాడు. ఇతను మొహమాటపడుతున్నాడని గ్రహించి లోపలికి రమ్మని వాళ్ళు బ్రతిమిలాడినా, అయిదు నిమిషాల తర్వాత మళ్ళా వరండాలోకే చేరుతున్నాడు సత్యమూర్తి.

రవి ఆఫీసుకు బయలుదేరుతున్నాడు. తనూజ అతనికి తలదువ్వుతూ హితబోధ చేస్తోంది డబ్బు దుబారా చేయవద్దని.

''నాకు టిఫిన్ డబ్బా అక్కరలేదు'' అన్నాడు రవి.

''ఏం హోటల్లో పడి అయిదో, పదో వదిలించుకుంటేగానీ, కడుపు నిండదా?''

''బయటికెళ్ళే తీరిక కూడా లేదు మా కొలీగ్ టిఫిన్ తీసుకొస్తోందిలే....'' అన్నాడు రవి తనూజను ఉడికించడానికి.

''కొలీగ్ అంటే?''

''నాతో పని చేస్తుంది... పెద్ద డబ్బా తెస్తుంది. ఇద్దరికీ సరిపోతుంది...'' అన్నాడు రవి.

''ఆహా, పోనీ ప్లేటూ స్పూనూ అయినా పట్టుకెళ్ళండి...'' అని సలహా ఇచ్చింది.

''ప్లేట్లో ఎందుకు ఏకంగా నోట్లోనే పెడుతోంది... టైం ఉండదు తెలుసా, చాలా బిజీగా ఉంటాం...'' అన్నాడు రవి అటు తిరిగి నవ్వుదాచుకుంటూ.

''ఓహో, లంచ్ టైంలో కూడా చాలా బిజీగా ఉంటున్నావన్నమాట.. రాత్రికి ఇంటికైనా వస్తారా, అందుకూ తీరిక ఉండదా?... పోనీ అక్కడే పడుకోండి, మీ కొలీగూ, మీరూ...''

''ఇంకో రెండు నెలలు పొయ్యాక పడుకుంటాం... అప్పుడు సీజన్ వస్తుంది...'' అన్నాడు రవి సీరియస్‌గా మొహం పెట్టి.

''పడుకోవటానికి కూడా సీజన్ ఉందన్నమాట. నాకు తెలీదే..'' అంది తనూజ వ్యంగ్యంగా.

''అన్నీ నీకు తెలియాలని రూలు ఏమన్నా ఉందా? అసలు నీకు పెళ్ళయి ఎన్నాళ్ళయింది? నీకున్న సర్వీస్ ఎంత?'' అని అడిగాడు రవి.

తనూజ మొహం మాడ్చేసుకుంది. మూతీ ముక్కూ విరిచేసింది. ''మీకుంది లెండి .... సర్వీస్....'' వెటకారంగా అంది.

"ముందు అసూయ పుట్టి, ఆనక ఆడవాళ్ళు పుట్టారు మాస్టారూ..." అన్నాడు రవి సత్యమూర్తి వంక చూసి నవ్వుతూ.

"ముందు అనుమానం పుట్టి, ఆనక మగాళ్ళు పుట్టారు మాష్టారూ..." అంది తనూజ కూడా సత్యమూర్తితో.

"తెలుస్తూనే ఉంది. ఎవరికి అనుమానం ఉందో..." అన్నాడు రవి.

"మీ కొలీగ్ పెద్ద డబ్బా పట్టుకొస్తే లంచ్‌లో ఇద్దరూ సర్దుకుంటే నాకేం అసూయ లేదు, అనుమానం లేదు. నేను ఉద్యోగం చేసేటప్పుడు నేనూ కుక్కర్ నిండా వండి పట్టికెళ్ళి, ఆఫీసులో అందరికీ పెట్టేస్తాను..." అంది తనూజ ఉక్రోషంగా.

"ఐడియా బాగానే ఉంది గానీ, రోజూ అలా చెయ్యాలంటే, వాళ్ళిచ్చే జీతం చాలదు మరి" అన్నాడు రవి, బూట్లు వేసుకుంటూ.

రవి వెళ్ళిపోయాక, తనూజ కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయింది. ఏదో ఆలోచనలతో సతమతమైపోతోందని సత్యమూర్తికి అర్థమైంది.

"ఏమిటమ్మా అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అని అడిగాడు నవ్వుతూ.

"ఒకసారి వాళ్ళ ఆఫీసుకెళ్ళి చూసొస్తాను ఆ కొలీగ్ ఎవరో?" అని చెప్పింది తనూజ.

"నిన్ను ఆటపట్టించటానికి అలా అంటున్నాడుగానీ, నిజానికి ఆ కొలీగ్ ఏ అరడజను మంది పిల్లల తండ్రో అయి ఉంటాడు..." అని చెప్పాడు సత్యమూర్తి.

"పిల్లల తండ్రే అయితే ఫరవాలేదు. తల్లి అయితేనే...." అని ఆగిపోయింది తనూజ. ఆ విషయం ఆమె సీరియస్‌గానే తీసుకుందని అర్థమైపోతోంది.

"ఒకవేళ నిజంగానే రవికి అక్కడొక స్నేహితురాలు ఉందనుకో, ఆమె టిఫెన్ పెట్టిందనుకో, తప్పేముందమ్మా... ఇంట్లో నీ ఎదురుగా ఉంటే, నాకు నువ్వు భోజనాలు, టిఫెన్లూ పెట్టటం లేదా?..."

"మీ సంగతి వేరు.... "

"పొద్దుటినుంచీ సాయంత్రం దాకా కలిసి పని చేసేటప్పుడు, అస్తమానం చిచ్చుబుడ్డి మొహం పెట్టుకుని కూర్చోలేరు కదా... ఇంట్లో కన్నా ఆఫీసులోనే ఎదురెదురుగా కూర్చుని ఎక్కువ సమయం గడిపేటప్పుడు, స్నేహం కలవకుండా ఎలా ఉంటుంది?

"అందుకని... పెళ్ళాం కన్నా వాళ్ళే ఎక్కువై పోతారన్నమాట..." అంది కోపంగా.

"ఎవరన్నారు, ఎక్కువైపోతారని... పెళ్ళాంతర్వాతనే ఎవరైనా..."

"పెళ్ళాం తర్వాతనే అంటే? పెళ్ళాం చాలదన్నమాట. ఇంట్లో ఈ పిచ్చి ముండ పతియే ప్రత్యక్షదైవం అని పూజలు చేస్తుంటే, మీరేమో బయట స్నేహితురాళ్ళతో తిరిగొస్తారన్నమాట, పైగా పెళ్ళాం తర్వాతనేట... తర్వాతనే... అసలు మీ మగబుద్దే అలాంటిది. ఈ కాడికి పెళ్ళి ఎందుకు, పెటాకులు ఎందుకు? ఎవరు ఎవరితో కావాలంటే వాళ్ళతో తిరగొచ్చుగా... ఇంక పెళ్ళికూడా ఎందుకు?..." అని తనూజ దులిపి వేసింది.

సత్యమూర్తి తనలో తనే నవ్వుకుంటుంటే, తనూజ మరింత ఉడికిపోయింది.

"మీరంటే నాకు చాలా రెస్పెక్ట్ ఉంది, కానీ ఈ విషయంలో మీరూ అందరిలాగా మాట్లాడుతున్నావు..." అంది.

"నాకు పెళ్ళి కాలేదుగదమ్మా. అందుకని దాని గురించి నాకు అంతగా తెలీదు. నువ్వు ప్రేమించి, లోకాన్ని ఎదిరించి, పెళ్ళి చేసుకున్నదానివి కదా. నువ్వు చెప్పు, ఇప్పుడన్నా తెలుసుకుంటాను" అన్నాడు సత్యమూర్తి.

"పెళ్ళి అనేది నూరేళ్ళ బంధం అతిపవిత్రమైన అనుబంధం..." అంది తనూజ. "నిజమేగానీ నువ్వన్న ఆ పవిత్రబంధాన్నిమనం ఏ స్థితికి తీసుకొచ్చామో చూడు. నూరేళ్ళ అనుబంధం ఏర్పరచుకునేటప్పుడు, ఆ మనిషి ఎవరో, ఎలాంటివాడో తెలుసుకునే ప్రయత్నం అయినా చేస్తున్నామా చెప్పు. పెళ్ళిచూపులకని ఇంటికొస్తాడు. పెట్టినవన్నీ తింటాడు, చెప్పినవన్నీ వింటాడు. వేల మీద బేరమాడుకుని, ఏ

పిల్ల ఎక్కువ డబ్బు ఇస్తానంటే, దాని మెడలో తాళికట్టేస్తాడు. ఇలాగేనా నువ్వు చెప్పిన అతి పవిత్రమైన నూరేళ్ళ అనుబంధాన్ని ఏర్పరచుకునే పద్ధతి?"

"పెద్దవాళ్ళు అన్నీ విచారించాకనే కుదురుస్తారు పెళ్ళి సంబంధాలు..."

"పెద్దవాళ్ళు విచారించేవి ఆస్తిపాస్తులు, ఐశ్వర్యాలు, ఇచ్చిపుచ్చుకోవడాలుమొదలైనవే కదా. ఆలుమగల్ని అన్యోన్యంగా ఉంచే ప్రేమ, అభిమానాలు వీళ్ళిద్దరి మధ్యా ఉన్నాయా లేవా అన్న ఆలోచన రానివ్వరు. అసలు మన వివాహ వ్యవస్థలోనే ఈ లోపం ఉంది. పెద్దవాళ్ళకు నచ్చిన సంబంధం తెచ్చి చేస్తారు;. వీళ్ళు తమ ఇష్టాఇష్టాలను చంపుకుని లోకం కోసం సహిస్తూ, భరిస్తూ కాపురం చేస్తారు. పాశ్చాత్య దేశాల్లో పిల్లలకు నచ్చిన సంబంధాలనే పెద్దవాళ్ళూ అంగీకరిస్తారు..."

"అయినా అక్కడ ఆలూమగలూ కొట్టుకు చావటం, విడాకుల కోసం పరిగెత్తడం ఎక్కువై పోతోంది..."

"అందుకు కారణం, వాళ్ళ మధ్య సహజంగా ఉండాల్సిన ప్రేమ పెళ్ళి అయ్యాక క్రమంగా లోపించటమే...."

"అయితే ఏం చెయ్యాలిమరి?"

"ముందు పెళ్ళి అంటే ఏమిటో, తెలుసుకోవాలి."

"పెళ్ళి అంటే తెలియంది ఎవరికి? అయిదేళ్ళ గుంటది కూడా పెళ్ళి అనగానే మెలికలు తిరిగిపోతుంది..."

"అయిదేళ్ళ దానికేకాదు, అరవై ఏళ్ళ ముసలి దానికీ పెళ్ళి అంటే, ఆడా మగా కలిసి మెలికలు తిరిగిపోవటం అని మాత్రమే తెలుసు. పెళ్ళి అయిపోతే పెద్ద ఘనకార్యాన్ని సాధించినట్లు, ఫీల్ అవుతారు. చిన్న మొక్కను తెచ్చి పెరట్లో పాతేసినంత మాత్రాన చాలదు, అది ఎండిపోకుండా చూడాలంటే, దానికి పాదు చేసి, నీరు పోసి, జాగ్రత్తగా పెంచుకోవాలి. వివాహ బంధమూ ఆ చిన్న మొక్కలాంటిదే. జీవిత భాగస్వామిపట్ల ప్రేమ, ఆదరం, చూపించటం నేర్చుకోవాలి. ఆ మనిషి కష్టం, సుఖం తనదిగా భావించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆ వ్యక్తి బరువు బాధ్యతల్ని సంతోషంగా భరించాలి. కానీ మనలో చాలా మంది తమ బరువును రెండో మనిషి మీదకు తోసేస్తారేగానీ, ఆ మనిషి బాధ్యతలని పట్టించుకోరు. పైగా ఆ మనిషి మీద తనకేదోహక్కు, అధికారం ఉన్నట్లు శాసించటం, దూషించటం మొదలుపెడతారు. అక్కడినుంచీ వాళ్ళు మానసికంగా దూరం అవుతుంటారు..."

"అదే ఇప్పుడు నాకు కావాల్సింది. అలా దూరం కాకుండా ఉండాలంటే ఏం చేయాలి?"

"దీనికి రెండు రెళ్ళు నాలుగు అన్నంత ఖచ్చితంగా సమాధానాలు చెప్పలేం. ఎందుకంటే, అన్యోన్యంగా ఉండేవాళ్ళందరి పరిస్థితులూ ఒకటేగానీ, విడిపోయే వాళ్ళ పరిస్థితులు మాత్రం ఎవరివి వాళ్ళవే. అసలు పెళ్ళి అనేది ఆర్థిక అనుబంధం మీద కాక, కాబోయే దంపతుల ప్రేమానుబంధాల మీద ఆధారపడి జరగాలి. అందులోనూ, వాళ్ళ ప్రేమ 'ఫిజికల్ ఇంటిమసీ' మీద కన్నా, 'మెంటల్ ఇంటిమసీ' మీద ఆధారపడి ఉంటే, ఒక ఇంటివాళ్ళు అయిన ఆ ఇద్దరూ నాలుగు కాలాలపాటు ఒక ఇంట్లో కలిసి కాపురం చేయగలుగుతారు. ఈ 'మెంటల్ ఇంటిమసీ' కోసమే పాశ్చాత్యదేశాల వాళ్ళు తాపత్రయపడుతూ, ఓ ఏడాదిపాటు ఇద్దరూ ఒక ఇంట్లో కలిసి ఉండి, ఒకర్నొకరు పూర్తిగా అర్థం చేసుకున్నాక పెళ్ళి చేసుకుందామనుకుంటున్నారు. వీటినే అమెరికా, కెనడా దేశాల్లో Trial marriages అని, companionate అని అంటున్నారు..."

"కొన్నేళ్ళ తర్వాత గొడవలు రావని గ్యారంటీ ఏమిటి?"

"గొడవలు రావని గ్యారంటీ ఏమీలేదు. ఎప్పుడైనా రావచ్చు. కాకపోతే ఈ ట్రయల్ పీరియడ్‌లో కాబోయే భాగస్వామిని చాలావరకు అర్థం చేసుకునే వీలుంది గనక తర్వాత విడాకులు పొందే అవకాశాలూ చాలా తక్కువని... అంతే"

"నేను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను. ఇప్పటికీ రవిని నేను అమితంగా ప్రేమిస్తున్నాను. కానీ అతనే వేరే వాళ్ళ ఆకర్షణకు లోనైతే అందులో నా తప్పు ఏముంది?"

"అందుకే ఇందాక 'ఫిజికల్ ఇంటిమసీ' కన్నా 'మెంటల్ ఇంటిమసీ' ముఖ్యం అన్నాను. అదీగాక - 'ప్రేమిస్తూనే ఉన్నాను' అని నీవు అనుకుంటే చాలదు. ఆ విషయం అనుక్షణం కాకపోయినా, అప్పుడప్పుడైనా నీ పార్టనర్‌కి, మాటల్లోనూ, చేతల్లోనూ, కనపరచాలి. ఇలా గుర్తుచేయటాన్నే 'జాయ్ ఆఫ్ లవ్' అంటారు. ఈ 'జాయ్ ఆఫ్ లవ్' అనేదే రెండు హృదయాల మధ్య కట్టే వారధికి వాడే సిమెంట్. పెళ్ళి చేసుకోవటం అంటే కేవలం రాత్రిళ్ళు పోటీపడటమూ కాదూ, పగలు పోటీలు పడి పోట్లాడుకోవటమూ కాదు. జీవితాంతం 'సహకరించటం సానుభూతి చూపటం' అనే రెండూ పెళ్ళికి కావాల్సిన ప్రధాన లక్షణాలు, వీటిని 'రొమాన్స్' అన్న అందమైన ప్యాకేజ్‌లో ఉంచి కానుకలుగా అందించుకోవాలి ఒకళ్ళకొకళ్ళు. అయితే పెళ్ళి అయిన ఆరు నెలలకల్లా రొమాన్స్ రొటీన్ అయిపోయినందువల్ల, సంసారంలో సారం లేకుండా పోతుంది. ఇంక అప్పుడు కళ్ళు తెరిచి చూస్తే, అవతల మనిషిలో అన్ని తప్పులూ, లోపాలూ కనిపిస్తాయి..." అని చెప్పాడు సత్యమూర్తి.

ఇంకా ఎన్నో అడగాలనుకున్నా తనూజ అడగలేకపోయింది కానీ ఒక్క ప్రశ్న మాత్రం అడగకుండా ఉండలేకపోయింది.

"ఇన్ని తెలుసుకదా నీకు. మరి నువ్వెందుకు పెళ్ళి చేసుకోలేదు?"

"ఇన్ని తెలిసినందువల్లనే..." అని నవ్వాడు సత్యమూర్తి.

కొద్ది క్షణాలు ఆగి తనూజ మళ్ళీ అడిగింది. "నీకు కోపం రాదంటే, చాలా రోజులుగా అడగాలనుకుంటున్న ఒక ప్రశ్న అడుగుతాను..."

"ఏమిటది?"

"మల్లికగారు నిన్ను ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?....."

"ఆ ప్రశ్న మల్లికనే అడిగితే బావుంటుంది... అన్నాడు సత్యమూర్తి.

"ఆ వేళ కోపం వచ్చి వెళ్ళిపోయింది. మళ్ళీ మనవైపు తిరిగి చూడలేదు మల్లికగారు... పోనీ సాయంత్రం ఒకసారి నేనే వాళ్ళింటికి వెళ్ళి చూసొస్తాను..." అంది తనూజ.

"అలాగే వెళ్ళిరా... నామీద కోపం తగ్గిందో లేదో చూసిరా... ఆమె మనసు కష్టపెట్టి ఉంటే నన్ను మన్నించమని చెప్పు. ఎందుకంటే ఆమెను వెళ్ళిపొమ్మన్నది ఆమె మంచి కోసమే" అన్నాడు సత్యమూర్తి బాధపడుతూనే.

సాయంత్రం తనూజ మల్లిక ఇంటికి వెళ్ళింది. కానీ తనూజను చూస్తూనే మల్లిక అత్తగారు ఎదురొచ్చింది. "ఎందుకొచ్చావ్?" అన్నట్లు చూసింది.

"మల్లిక గారి కోసం..."

"మల్లిక లేదు" అందామె ముభావంగా.

"లేదా? ఊరికెళ్ళిందాండీ..."

"ఏమో, ఎక్కడికెళ్ళిందో, ఎవడికి తెలుసు?" అనేసి లోపలికి వెళ్ళిపోయింది.

తనూజ ఇంటికొచ్చి సత్యమూర్తితో ఆ మాటలే చెప్పింది.

"అదికాదమ్మా... మనదగ్గరనుంచీ అక్కడికి వెళ్ళాక, తర్వాత ఇంకెక్కడికన్నా వెళ్ళిందా, అసలు ఆ రోజునుంచే కనిపించటం లేదా?" అని ఆత్రంగా అడిగాడు సత్యమూర్తి.

"ఏమో, ఆ ఒక్క ముక్కే మొహం మాడ్చుకుని చిరాగ్గా అనేసి లోపలికి వెళ్ళిపోయింది..."

సత్యమూర్తికి ఏం చేయాలో తోచలేదు. తనే స్వయంగా వాళ్ళింటికి వెళ్దామా అన్నంత ఆవేశం వచ్చింది. కానీ తన జోక్యం వల్లనే ఆమె పరిస్థితి మరీ క్లిష్టమైపోతుందన్న ఆలోచన రాగానే ఆగిపొయ్యాడు.

"అవును, నా వల్లనే ఆమెకీ కష్టాలు..." అన్నాడు సత్యమూర్తి లోలోపలే గొణుక్కుంటున్నట్లుగా.

"అసలు అన్నింటికీ మూలకారణం మేము, మావల్లనే ఇటు నీకూ అటు ఆమెకూ లేనిపోని సమస్యలన్నీ వచ్చిపడ్డాయి" అంది తనూజ బాధపడిపోతూ.

నిజానికి మల్లిక ఆవేళ సత్యమూర్తి దగ్గరనుంచీ వెళ్ళినప్పుడు తమ ఇంటికే వెళ్ళింది.

అత్తగారు కోడల్ని మెత్తమెత్తగానే కోప్పడింది.

"ఏదో పెళ్ళికాక ముందు, చదువులూ, సంధ్యలూ అంటూ ఎవరెవరితోనో తిరగటం - అదో దారి, కానీ పెళ్ళి అయ్యాక సంసారం చేసుకుంటూ కూడా, ఇల్లూ వాకిలీ వదిలేసి ఎవడికోసమో పరుగులు తీయటం, పరువూ మర్యాదాగల వాళ్ళు చేసే పనేనా? నీ మనసుకు ఎంత తోస్తే అంత చేసెయ్యటమేనా? కొంపలో మొగుడూ మొద్దులూ ఉన్నాడన్న జ్ఞానం అయినా ఉండాలా? అంటూ దీర్ఘాలు తీసింది.

భర్త మాత్రం కొరకొరా చూస్తూ నిలబడ్డాడు. మల్లిక మేడమీద గదిలోకి వెళ్ళాక, అతనుకూడా ఆమె వెనకే గదిలోకి వెళ్ళాడు.

"ఏమే, మళ్ళా ఎందుకొచ్చావ్?"

"మీ అమ్మ వచ్చి రమ్మని బ్రతిమలాడుకుంటే వచ్చాను" అంది మల్లిక.

"అంతేగానీ నువ్వు రావాలని రాలేదన్నమాట..."

"నా ఇష్టాఇష్టాలకు ఈ ఇంట్లో విలువ లేదు..." అని గుర్తు చేసింది, మల్లిక.

"విలువ లేదని మానేశావా? నీ ఇష్టం వచ్చిన వాడి దగ్గరకు వెళ్ళొస్తున్నావు కదా..."

"వెళ్ళడం నాకు తప్పనిసరి అయింది..."

"అంటే నీకు వాడు మొగుడికన్నా ఎక్కువన్నమాట..."

"ఎక్కువ తక్కువల ప్రసక్తి లేదు.. ఎవరి స్థానం వాళ్ళదే.."

"అదే నా స్థానం ఎక్కడా అని అడుగుతున్నాను"

"మీ ఇంట్లో మీ స్థానం ఎక్కడో నాకన్నా మీకే బాగా తెలియాలి..."

"ఇంట్లోకాదు. నీ హృదయంలో నా స్థానం వాడి తర్వాతనా... అని అడుగుతున్నాను"



"నేనే మీకు అక్కర్లేనప్పుడు, ఇంకా నా హృదయం గురించీ, దానిలోని స్థానం గురించి మీకెందుకు?" అని ఎదురు ప్రశ్నించింది మల్లిక.

"చేతిలో రెండు డిగ్రీలున్నాయనే కదా నీ పొగరు, జ్వరం వచ్చిన వాడికీ ఉంటాయే నూటనాలుగు డిగ్రీలు.... చదువుకున్నందుకుబుద్ధీ, జ్ఞానం ఉండాలి...." అని అరిచాడు ఆమె భర్త.

"మీకు నేను చెప్పదలచుకున్నది కూడా అదే" అంది అంత గట్టిగానూ.

డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ కోపం పట్టలేక మల్లికను ఛెళ్ళున చెంప మీద కొట్టాడు. వెంటనే మల్లిక భర్త చెంపనూ ఛెళ్ళుమని అంత శబ్దం వచ్చేటట్లే వాయించేసింది.

అతను కొద్దిసేపు నివ్వెరపొయ్యాడు. మైండ్ బ్లాంక్ అయిపోయింది.

ఇది తనను ఎదురు తిరిగి కొట్టింది? తన ఇంట్లో పడి తింటూ, తన కాళ్ళ దగ్గరపడి ఉండాల్సిన కుక్క ఎదురు తిరిగి కరుస్తోందా? దీన్ని బతకనివ్వటానికి వీల్లేదు.

అతని కళ్ళల్లోంచీ నిప్పులు కురిశాయి. మళ్ళీ చెయ్యి ఎత్తాడు ఆవేశం ఆపుకోలేక. ఆమె అతని చేతిని పట్టుకుంది. ఇద్దరికీ కోపం పట్టశక్యం కాలేదు. పళ్ళతో కొరుక్కుంటూ, చేతులతో రక్కుకుంటూ, జుట్టు పీక్కుంటూ -

చదువూ సంధ్యాలేనివాళ్ళలాగా - అలగాజనంలాగా - (వాళ్ళే నయం)

ఇద్దరూ కొట్టుకుంటున్నారు. తిట్టుకుంటున్నారు.

చేతికి అందినవి ఒకరిమీద ఇంకొకళ్ళు విసిరేసుకున్నారు.

భర్త విసిరేసిన ఫ్లవర్‌వాజు, మల్లిక ముక్కు మీద మూతి మీద తగిలింది. ముక్కులోంచీ రక్తం వచ్చింది.

"యూ బాస్టర్డ్..." అంటూ మల్లిక టీపాయ్ మీద ఉన్న కప్పులూ, సాసర్లూ విసిరేసింది.

అతను తప్పించుకుంటూ గది బయటికొచ్చి గడియపెట్టి తాళం వేసి, తాళం చెవి జేబులో వేసుకున్నాడు.

కిందకొచ్చి అందర్నీ పిలిచి చెప్పాడు.

"ఒళ్ళు బలిసికొట్టుకుంటోంది లంజాముండ... దానికి ఇవాళ నుంచీ తిండిపెట్టొద్దు. గుక్కెడు మంచినీళ్ళు అయినా ఇవ్వొద్దు. ఇచ్చారో, మిమ్మల్ని చంపేస్తాను...." అని బెదిరించాడు.

అంతటితో ఆగలేదు. మర్నాడు ఆమె గదిలోకి వెళ్ళి నీరసంగా పడి ఉన్న మల్లికను పెడరెక్కలు విరిచి కట్టేశాడు.

"నన్ను కొడతావా? చేతిలో ఏది ఉంటే అది విసిరేస్తావా. నీ తిక్క కుదురుస్తానే. నీ పిచ్చి అణిచేస్తా..." అంటూ చేతిమీదా, కాళ్ళమీదా వీపు మీదా సూదులతో గుచ్చాడు.

కెవ్వుమన్న కేకలతో ఆ గది దద్దరిల్లిపోయింది.

"నువ్వు డాక్టరివట్రా. ప్రాణాలు తీసే రాక్షసుడివి...థూ..." అని ఉమ్మేసింది మల్లిక.

"కార్పెట్ మీద, ఉమ్మువేస్తావంటే..." అంటూ కాలుస్తున్న సిగరెట్టుతో ఆమె పెదవులు మీద కాల్చాడు.

మల్లిక ప్రాణం విలవిల్లాడిపోయింది -

తిండి, తిప్పలూ లేకుండా చేసి, రోజూ మూడుపూటలా ఆమె గదిలోకి వెళ్ళి జుట్టు పట్టుకు ఈడ్చి, గోడకేసి కొట్టీ, సూదులతో గుచ్చి, సిగరెట్లతో కాల్చి శారీరకంగా, మానసికంగా హింసించటం మొదలెట్టాడు.

ఓపిక చచ్చిపోయి, నీరసించిపోయి, కృంగి, కృశించిన మల్లిక చివరకు అడిగింది.

." ఇదంతా నువ్వు ఎందుకు చేస్తున్నావో నాకు తెలుసు. కావాలనుకుంటే నీకు నచ్చిన షీలానే ఇంట్లో పెట్టుకో. నా దోవన నేను వెళ్ళిపోతాను. నన్ను వదిలేసెయ్..."

"వదిలేస్తే వెళ్ళిపోతావే? ఊరూ వాడా ఏకం చేసి నువ్వు చేసే గోల అంతా ఇంతా కాదుకదా... నిన్ను బయటికి పంపిస్తే లాభం లేదే, తిన్నగా పైకే పంపిస్తాను... మామూలుగా చావకూడదు నువ్వు... క్షణం క్షణం చస్తూ బతుకుతూ చస్తుంటే, చూస్తుంటాను... అదీ నాక్కావాల్సింది..." అన్నాడు డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్.

మల్లిక ఇంక ఈ నరరూప రాక్షసుడితో వాదించలేక, మాట్లాడే ఓపిక లేక తల తిప్పుకుని, కళ్ళు మూసుకుంది.

ఒకరోజు సత్యమూర్తి "చెకప్" కోసం డాక్టర్ బోస్ దగ్గరకెళ్ళాడు.

"చెకప్" అయ్యాక బోస్ సత్యమూర్తిని అడిగాడు.

"మల్లిక ఎలా ఉందో తెలుసా మీకు?"

"తెలీదు, ఎలా ఉంది? ఎక్కడుంది?" అని అడిగాడు ఆదుర్దాగా.

"వాళ్ళింట్లోనే ఉంది. మేడమీద గదిలో బంధించి ఉంచారు. ఎవర్నీ వెళ్ళనియ్యటం లేదు చూడనియ్యటంలేదు. నేను నిన్న కాజువల్‌గా వెళితే తెల్సింది. ఆమెకి తిండీ నీళ్ళూ ఇవ్వకుండా ఏడిపిస్తున్నారంట. అదీ నౌకరు చాటుగా చెబితే తెలిసింది" అన్నాడు బోస్.

సత్యమూర్తికి ఇంకేమీ వినిపించలేదు. వేగంగా అడుగులు వేస్తూ దాదాపుగా పరుగులు తీస్తూ మల్లిక ఇంటివైపు వెళ్ళాడు.

✷✷✷✷

ఆకలి రుచి ఎరగదు.

నిద్ర సుఖం ఎరగదు.

ప్రేమ పిరికితనాన్నీ ఎరగదు.

కనుకనే -

సత్యమూర్తి తానేం చేస్తున్నాడో కూడా తెలియని స్థితిలో ఎక్కుపెట్టి విడిచిన బాణంలా దూసుకుపోతున్నాడు.

మల్లిక ఇంటి గేటు తలుపులు తీసుకుని, తోసుకుని లోపలికి వస్తున్న ఇతన్ని వింతగా చూస్తూ నిలబడ్డారు పనిమనుషులు.

"మల్లిక ఎక్కడుంది?" అని అడిగాడు సత్యమూర్తి.

"మేడమీద ఉంది దొరా" అన్నది పనిమనిషి, ఇతడెవరో ఆమె తాలూకు చుట్టమో, పక్కమో అనుకుని.

సత్యమూర్తి గబగబా మేడ ఎక్కాడు. అక్కడ డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ ఎదురుపడ్డాడు.

"ఎవరు నువ్వు?" అని గదిమాడు సత్యమూర్తిని.

"మల్లిక ఎక్కడ?" అని ఎదురు ప్రశ్నించాడు సత్యమూర్తి.

"అసలు నువ్వు ఎవరు?" అని అదే ప్రశ్న మళ్ళీ వేశాడు డాక్టర్.

"మల్లిక ఎక్కడ?" అని రెట్టించాడు సత్యమూర్తి.

"దానికీ, నీకూ ఏమిటి సంబంధం?"

"మనిషికీ మనిషికీ మధ్య ఉండే సంబంధం..."

"నీకేం కావాలి?"

"నేను మల్లికను చూడాలి, ఆమెతో మాట్లాడాలి."

"మల్లిక నా భార్య. దారేపోయే వెధవలంతా ఇంట్లో జొరబడి - నీ భార్యను చూడాలి, మాట్లాడాలి - అంటే ఏం జరుగుతుందో తెలుసా? చెప్పు తీసుకుని కొడతారు..." అని మీదకొచ్చాడు డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్.

"ఆలుమగలు గుట్టుగా కాపురం చేసుకుంటున్నప్పుడు, మూడోవాడు ఇంట్లో చొరబడితే, నువ్వు అన్న సత్కారమే చేస్తారు. అదే ఆలుమగలు కీచులాడుకుంటుంటే, చుట్టూ ఉన్నవాళ్ళు చోద్యం చూస్తారు. నీలాంటివాడు పెళ్ళామే కదాని, చంపేస్తుంటే, నాలాంటి దారే పోయేవాడే వచ్చి అడ్డుపడతాడు...." అన్నాడూ సత్యమూర్తి.

"నా పెళ్ళాం. నా ఇష్టం. చంపుకుంటాను. నరుక్కుంటాను. నువ్వెవరు అడగటానికి..." అని మొండిగా చెప్పాడు హరిశ్చంద్రప్రసాద్.

"చదువు సంధ్యలు లేని మూర్ఖుడు అనాల్సిన మాటలు అవి. నీలాంటి డాక్టరు నోటి నుంచీ రావాల్సిన మాటలు కావు అవి."

"నా భార్య సంగతి నాకు తెలుసు.. నువ్వు చెప్పక్కర్లేదు. ముందు బయటకు దయచెయ్..." అని డాక్టర్ హరుశ్చంద్రప్రసాద్, సత్యమూర్తిని ఒక్క తోపు తోశాడు. అతను తమాయించుకుని నిలబడ్డాడు.

"మల్లికను చూసేదాకా నేను కదలను..." అని ఖచ్చితంగా చెప్పేశాడు.

"మర్యాదగా పోతావా, మెడబెట్టి గెంటమంటావా?" అని అడిగాడు డాక్టర్.

"గెంటటం దాకా వస్తే, ఇద్దరం బలాబలాలు చూసుకోవాల్సి ఉంటుంది. అందుకు నీకు అభ్యంతరం లేకపోతే, నాకూ లేదు..." అని చెప్పాడు సత్యమూర్తి.

"అక్రమంగా ఇంట్లో చొరబడినందుకు పోలీసులను పిలుస్తాను.." అంటూ ఫోన్ వైపు వెళ్ళాడు డాక్టర్.

"పిలవండి, పిలవండి... నేను పిలిస్తే ఎలాగూ రారు, పోలీసులు. మీరు పిలిస్తే, పరుగెత్తుకు వస్తారు. వాళ్ళముందే తేలుస్తాను మీ వ్యవహారం ఏమిటో..." అంటూ ఇంక అతని జావాబు కోసం ఎదురు చూడకుండా, ఎదురుగా ఉన్న గదిలోకి దూసుకు పోయాడు.

కదలలేని స్థితిలో ఉన్న మల్లికను చూసి ఒక్క ఉదుటన ఆమె దగ్గరకు చేరి, ఆమె చేతి కట్లు విప్పదీశాడు.



బక్కచిక్కిపోయిన మల్లిక మాట్లాడే ఓపిక కూడా లేక "వచ్చావా నేస్తం" అన్నట్లు చూస్తూ కన్నీరు నింపుకుంది.

"నేను వచ్చేశాను మల్లికా... నీకికేం భయం లేదు. మనం వెళదాం పద" అంటూ ఆమెను లేవదీసి నెమ్మదిగా నడిపిస్తుంటే ఎదురుగా గుమ్మంలో డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ నిలబడి కళ్ళల్లో నుంచీ నిప్పులు కురిపిస్తున్నాడు.

"ఏమే, నీ ఇష్టం వచ్చినవాడితో లేచిపోవటమేనా? నేను చచ్చాననుకున్నావా? బతికాననుకున్నావా?` అని అరిచాడు.

"బతికున్నాననేకదా బాధపడుతున్నాను" అంది నీరసంగా.

హరిశ్చంద్రప్రసాద్ భార్య చెయ్యి పట్టుకు లాగాడు. చెయ్యి మెలి తిప్పితే బాధతో గిలగిల్లాడిపోతూ కేకలు పెట్టింది. పక్కనే నిలబడ్డ సత్యమూర్తి చూడలేకపోయాడు. కోపంతో డాక్టర్‌ను మొహం మీద ఉక్కు పిడికిలితో ఒక్క గుద్దు గుద్దాడు. అతని ముక్కూ, ముఖం ఏకమైపోయాయి. కొద్ది క్షణాలసేపు కంటికేం కనిపించలేదు.

అతను తేరుకునే లోపల సత్యమూర్తి మల్లికను నడిపించుకుంటూ కిందకు వచ్చాడు. అప్పటికే పైన జరుగుతున్న గోలకు ఇంట్లోని వాళ్ళంతా ఆ హాల్లో చేరారు.

పరాయి మగవాడితో వెళ్ళిపోతున్న కోడల్ని చూస్తూ అత్తగారు క్షణం సేపు నోటిమాట రాక నివ్వెరపోయింది.

వాళ్ళు గేట్ దాటుతుండగా, మేడ దిగిన కొడుకుతో ఆవేశంగా అంది -

"వాడెవడో వచ్చి దాన్ని రెక్కపట్టుకు లాక్కుపోతుంటే, చేతగాని దద్దమ్మలా కళ్ళు అప్పగించి చూస్తూ కూర్చుంటావేంరా? పోలీసుల్ని పిలిచి, ఆ దొంగ వెధవను పట్టించకా?..."

"వాడిని పట్టించటానికి, కొట్టించటానికి ఇది సమయం కాదు... చావుకు సిద్ధంగా ఉన్న ఇది ఇంకా ఎదురు తిరుగుతుంది... ఇప్పుడు యాగీ చేస్తే, మనమే ఇరుకున పడతాం... దాన్ని బలవంతాన చంపుతున్నట్లు చెప్పి గోలచేసి మనల్ని రచ్చకీడుస్తుంది... ఒకసారి ఆడదాని మెడకు తాడు బిగించాక, నన్ను వదిలి పెట్టి ఎక్కడికీ పోలేదు. ఎంత దూరం వెళ్ళినా, తాడు పట్టుకు లాగితే వెనక్కి

రావాల్సిందే..... అందుచేత ఎక్కడికీ పోలేదుకానీ, ఇప్పుడు మనం తొందరపడి లాభం లేదు...'' అన్నాడు హరిశ్చంద్రప్రసాద్ పూర్వపరాలు ఆలోచించుకుంటూ.

''అది ఎవరితోనో లేచిపోయి, ఊరు వాడ అంతా తెలిసాక, ఇంక నువ్వు చేసేదేమిటి?'' అని నిలదీసింది ఆవిడ.

''అసలీ దరిద్రపుగొట్టు సంబంధం కుదుర్చుకొచ్చింది నువ్వు. పెళ్ళి కాకముందు నుంచీ అది వాడితో తిరిగింది. వ్యవహారం ముదిరి పొయ్యాక, ఇప్పుడేం చెయ్యాలి?...'' అని డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ తల్లి మీద ఎగిరిపడ్డాడు.

''పెళ్ళి కాక ముందు ఏం ఏడిచారో ఎవరు చూశాడు? నువ్వు మాత్రం నీకు నచ్చిన దానితో తిరగలా? ఈ రోజుల్లో వయసులో ఉన్న వాళ్ళు ఎవళ్ళు మడికట్టుకు కూర్చుంటున్నారు? పెళ్ళి అయ్యాక అయినా బాధ్యత తెలుసుకోవద్దూ. నలుగురిలో మసిలేటప్పుడు, మంచీ మర్యాదా అయినా పాటించవద్దూ... అది ఎవడితోనో తిరిగిందని నువ్వూ... నువ్వు ఎవత్తెనో ఉంచుకున్నావని అదీ ... ఇద్దరిద్దరూ బాగా సరిపొయ్యారు..... అందరి సంసారాలు ఎలా ఉన్నాయి, మీ సంసారం ఎలా ఉంది... ఇంతకీ ఇదంతా నా ఖర్మ...'' అందామె కళ్ళ నీళ్ళు పెట్టుకుని.

''ఇంత తెగించి వెళ్ళాక, నా పరువు గంగలో కలిసాక, అది బతకటానికి వీల్లేదు... చూపిస్తాను నా తడాఖా ఏమిటో...'' అన్నాడు డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ రోషంతో బుసలు కొడుతూ.

సత్యమూర్తి మల్లికను రిక్షా ఎక్కించాడు. ఆమె నడుస్తానని అంటున్నా వినకుండా.

గుమ్మంలో దిగిన మల్లికను చూసి తనూజ క్షణం సేపు గుర్తు పట్టలేకపోయింది. ఏమిటిలా అయిపోయింది? ఎదురెళ్ళి చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి, చాప పరచింది. మల్లిక చాప మీద పడుకుంది. తనూజ పక్కన కూర్చుంది.

సత్యమూర్తి జరిగినదంతా చెబుతుంటే, తనూజ మల్లిక వైపే చూస్తూ కూర్చుంది.

''మొదటిసారి మిమ్మల్ని చూసినప్పటికీ, ఇప్పటికీ ఎంతలో ఎంత మార్పు వచ్చింది? ఆ ధైర్యం, హుందాతనం ఠీవి, అవన్నీ ఏమైపోనాయి?....'' అని అడిగింది తనూజ.

తనూజ కాఫీ తేవటానికి వెళ్ళింది.

''నిజమే, తిండీ, నిద్రా సరిగ్గా ఉండి, మనసు ఉల్లాసంగా ఉంటే నా అంతవాడు ఎవడున్నాడని ఛాతీ విరుచుకు తిరుగుతాంగానీ, రెండు రోజులు తిండీ నిద్రా సరిగ్గా లేకపోతే శరీరం శుష్కించి, ఎంత పిరికితనం, ప్రాణభయం వచ్చేస్తాయి'' అన్నాడు సత్యమూర్తి.

కాఫీ, స్నానం, పానం, భోజనం అన్నీ అయ్యాక మల్లిక కొంచెం తేరుకుంది.

సత్యమూర్తి వెళ్ళి చెబితే డాక్టర్ బోస్ సాయంత్రం పూట కాసేపు మల్లికతో కబుర్లు చెప్పటానికి వచ్చాడు.

''వాడు నా స్నేహితుడు అని చెప్పటానికి సిగ్గుపడుతున్నాను... చచ్చిపోతున్న వాళ్ళని బ్రతికించాల్సిన ధర్మం మాకు ఉంది. డాక్టర్ అయి ఉండీ ఒక నిండు ప్రాణాన్ని తీయటానికి, అందులోనూ తనను నమ్ముకుని పడిఉన్న భార్యను చంపటానికి వాడికి మనసెలా ఒప్పిందో?'' అన్నాడు బోస్.

''రాజులకీ, డాక్టర్లకీ మనుషుల్ని చంపే హక్కు ఉందంటారు'' అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ .

''నో, నో, ఎవరికీ చంపే హక్కు లేదు, చచ్చే హక్కూ లేదు...'' అన్నాడు బోస్.

''కానీ ఆయన నన్ను చంపాలనే ధ్యేయంతోనే ఉన్నారు. ఇవాళ కాకపోతే, రేపు అయినా ఆయన తన పంతం నెరవేర్చుకుంటారు...'' అంది మల్లిక.

"హరి, షీలాల వ్యవహారం మా సర్కిల్‌లో అందరికీ తెలిసిందే. మొదటినుంచీ వాళ్ళ ప్రేమ వ్యవహారం నడుస్తూనే ఉంది. వీడి తల్లికి మాత్రం ఇష్టం లేక వేరే సంబంధం కుదిర్చి పెళ్ళి చేసుకు తీరాలని పట్టుబట్టి కూర్చుంది. నీకు కోడలుగా వస్తుంది కానీ, నాకు భార్యగా మాత్రం రాదు... అని వాడు ఆవేళే చెప్పాడు...." అన్నాడు డాక్టర్ బోస్.

"ఆవేళ ఎవరితో చెప్పాడా మాట? అమ్మతో కాదు, నాతో చెప్పి ఉంటే, నేను చేసుకునేదాన్ని కాదు, వాళ్ళ అమ్మమాట కోసం, నా బ్రతుకును చిత్రహింసపాలు చేసే హక్కు అతనికి ఎక్కడిది?..." అని ఆవేశంగా అడిగింది.

"నీ పాయింట్ కరెక్టే..." అని బోస్ అని ఒప్పుకున్నాడు.

"కొంచెం ఆలస్యంగానైనా, వాడికి మంచి బుద్ధి కలుగుతుందని ఆశిద్దాం... నేను చేయవల్సిన దేమన్నా ఉంటే మాత్రం తప్పకుండా చేస్తాను, నాలుగు రోజులు పొయ్యాక, నేను వెళ్ళి మాట్లాడతాను - రాజీ కుదురుస్తాను..." అన్నాడు బోస్ వెళ్ళబోయే ముందు.

మల్లిక  మాట్లాడలేదు, వినేసి ఊరుకుంది.

డాక్టర్ బోస్ వెళ్ళిపొయ్యాడు.

రాత్రి భోజనాలు అయినాక, రవి తనూజ అవతల గదిలో పడుకున్నారు. మల్లిక, సత్యమూర్తి ఇవతల గదిలో కూర్చున్నారు. ఆమెకు ఇంకా పూర్తిగా ఓపిక రాకపోయినా, తేలికగా నవ్వాలని ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా సత్యమూర్తి ముందు దిగాలుగా కనిపించరాదని అనుకుంటోంది.

"ఈ నాలుగురోజుల్లోనే బాగా చిక్కిపొయ్యావు..." అన్నాడు సత్యమూర్తి ఆమెనే చూస్తూ.

"నువ్వు రావటం ఆలస్యం అయితే, నేను చచ్చిపోయి ఉండేదాన్ని..." అంది మల్లిక ఆ మాటలు అంటున్నప్పుడు, ఆమె కళ్ళ వెంట అసంకల్పితంగానే కన్నీరు కురిసింది.

"ఇందులో నా తప్పే అధికంగా ఉంది. నువ్వు ఆ ఇంటికి వెళ్ళనని అన్నా, నేనే నిన్ను బలవంతంగా పంపించాను. అనవసరంగా నిన్ను కష్టాలపాలు చేశాను..."

"మానవత్వం అయినా లేకుండా సూదులతో గుచ్చి, సిగరెట్లతో కాల్చి... చూడు ... ఒంటి నిండా ఎలా గాయాలు చేసాడనీ..." అంటూ చేతులమీద, వీపుమీద అయిన గాయాలు చూపించింది.

"ఎలా భరించావు ఇంత కిరాతకాన్ని... అంత చదువుకున్నవాడు ఇలాంటి పనులు చేస్తాడంటే నమ్మశక్యం కాకుండా ఉంది..."

"చదువుకీ, సంస్కారానికీ సంబంధంలేదు. ఏ మాత్రం చదువుకోని వాళ్ళలోనూ ఉదాత్తంగా ఆలోచించగల వాళ్ళు ఎంతో మంది ఉంటారు. గొప్ప చదువులు చదివి పెద్ద పొజిషన్‌లో ఉన్న వాళ్ళలోనూ దుష్ట బుద్ధి గలవాళ్ళు ఉంటారు.. ఉన్నత స్థానంలో ఉన్నవాళ్ళంతా ఉదాత్త చరితులు అని అనుకోవటానికి వీల్లేదు. కొంతమందికి ఏ అర్హత లేకపోయినా, ఎక్కడో పుట్టుమచ్చ ఉండి పైకి వచ్చిన వాళ్ళు ఉంటారు, అలాంటి వాళ్ళ దగ్గర నుంచీ ఏం ఆశించగలం?..." అంది మల్లిక.

"ఇందాక డాక్టర్ బోస్ ఏమన్నాడో విన్నావు కదా?... నాలుగు రోజులు పొయ్యాక, రాజీకి ప్రయత్నం చేస్తానంటున్నాడు..." అని గుర్తు చేశాడు సత్యమూర్తి.

"ఇంకానా? ఇంత జరిగాక, ఇప్పుడు ఆయనకు కావాల్సింది భార్య కానేకాదు. భార్య తన దగ్గర నుంచీ వెళ్ళిపోయి ఎక్కడో ఉంటోందన్న అనుమానాన్ని భరించటం కన్నా, భార్య చనిపోయిందని లోకానికి తెలియజేయడానికే ఆయన ఇష్టపడతాడు. అంచేత ఒక వేళ ఏ రాజీ అయినా కుదిర్చి నన్ను అక్కడకు పంపుతున్నారు అంటే, నా శవాన్ని చూడటానికే అలా చేస్తున్నారన్న మాట..." అంది మల్లిక.

"కానీ లోకులు ఏమనుకుంటారోనని..."

"లోకులు కాకులు కదా కాకులు ఏమనుకుంటే మాత్రం మనకేం?" అని తేల్చేసిందామె.

సత్యమూర్తి ఇంకేమీమాట్లాడలేదు. ఆమెవంకే చూస్తూ కూర్చున్నాడు. గదిలో దీపం లేదు. ఎక్కడినుంచో వచ్చిన ఒంటరి కాంతికిరణం చెవి దుద్దుల రాళ్ళ మీద పడి పగిలి, తళుక్కున మెరుస్తోంది. చిక్కిన ఆమె మేను మీద వంపులు, సొంపులూ చూస్తున్నాడు సత్యమూర్తి.

"చక్కనమ్మ చిక్కినా అందమే అన్నారు" అన్నాడతను ఆమె ధ్యాసను మళ్ళిద్దామని.

ఒక క్షణం ఆగి, దీర్ఘంగా గాలి వదిలి, ఏదో ఆలోచిస్తూ విచారంగా అంది మల్లిక "... చక్కనమ్మ చిక్కవలసిన వాళ్ళకు చిక్కకపోవటం, దక్కకపోవటం... చిక్కకూడని వాళ్ళ చేతికి చిక్కటం... దక్కటం... దిసీజ్ నథింగ్ బట్ ఫేట్..."

ఆమె ఆ ధ్యాసలోంచి బయటపడలేక పోతోందని అర్థమైంది సత్యమూర్తికి.

"ఇంక ఆ సంగతి మర్చిపో, మల్లికా... వేరే ఏదైనా మాట్లాడు" అన్నాడు సత్యమూర్తి.

"నా కళ్ళముందు అవే దృశ్యాలు కదలాడుతున్నాయి. భర్త దగ్గర నుంచీ మొదట్లో నిర్లక్ష్యం, నిరాదరణ ఎదురైనాయి... గోరుచుట్టు మీద రోకటి పోటులా ఆయనకు మరో.... ఆవిడిని ఆయనగారి గళ్‌ఫ్రెండ్ అనాలో కీప్ అనాలో తెలియదు - కానీ నాకన్నా మాత్రం ఏన్నో వేల రెట్లు ఆయన్ను డామినేట్ చేసింది. ఏం మంత్రం వేసిందో ఏం మాయ చేసిందో గానీ ఆమె అంటే పడి చస్తాడు. అందరూ ఆడవాళ్ళే అయినా, కొందరు ఆడవాళ్ళు అంటేనే కొందరు మగాళ్ళకు ఎందుకంత వ్యామోహమో తెలియదు..... వాళ్ళ కంటికి ఆ మొహాలు ఎలా కనపడతాయో, మరి... వాళ్ళ కోసం వెర్రి వాళ్ళ అయిపోతారు. పిచ్చివాళ్ళు అయిపోతారు.. ఆయన పేషెంట్స్‌ను చూసేటప్పుడే కాదు, థియేటర్‌లో ఆపరేషన్ చేసేటప్పుడూ ఆమె పక్కనే ఉండాల్సిందేనట... సరే, ఇక పక్కలో సంగతి చెప్పేదేముంది... ఇన్ని అవమానాలూ భరించటం ఒక ఎత్తు అయితే, తిట్టటం, కొట్టటం, వాతలు పెట్టటం - ఇవన్నీ సహిస్తూ ఎందుకు పడి ఉండాలి?"

ఒక నిముషం ఆగి మళ్ళా ఆమే అంది.

"మగాడు కాబట్టి, అడిగేవాడు లేడు కాబట్టి ఆయన తనకు నచ్చిన వాళ్ళతో ఎంత 'ఇదిగా' అయినా ఉండొచ్చు... అని సరిపెట్టుకుని ఉన్నాను. అంతా తెలిసి ఏమీ తెలియనట్లు కుక్కినపేనులాగా, కుక్కలాగా, ఆ ఇంట్లో పడివున్నా నన్ను ఎప్పుడు ఎలా వదిలించుకుందామా అన్న ధ్యాసలోనే ఆయన ఉన్నట్లు నాకు అర్థమైంది. బహుశా వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుందామనుకుంటున్నారేమో..."

"అందుకు నిన్ను చంపాల్సిన పనేం ఉంది. నీకు విడాకులు ఇవ్వొచ్చు కదా...." అని సూచించాడు సత్యమూర్తి.

"విడాకులా... ఇవ్వవచ్చు... కానీ మగాడి సైకాలజీ నీకు పూర్తిగా అర్థమైనట్లు లేదు. తను ఎవరితోనైనా ఎంతవరకైనా చనువుగా అయినా ఉండొచ్చు కానీ తన భార్య... సంబంధాలు తెంచేసుకుని విడాకులు పుచ్చుకున్నాక అయినా సరే, ఇంకొకడి వంక చూసినా, నవ్వినా, మాట్లాడినా... కనీసం అలా అని తెలిసినా, పురుష అహంకారం దెబ్బతింటుంది.,.... అదొక తీరని అవమానంలా గుండెల్లో రగులుతుంటుంది. ఆమె మరొకడితో ఉండటం కన్నా, అసలీ లోకంలో లేకుండా చేయటమే నయం అనుకుంటాడు.... అయినా మగవాడివి ఈ విషయాలు నాకన్నా నీకే బాగా తెలిసి ఉండాలే?...." అని చిన్నగా నవ్వింది మల్లిక.

"నువ్వు అన్నదాంట్లో నిజం లేకపోలేదు. భార్య అనేది తన ప్రైవేటు ఆస్తి, ఆ ఆస్తి వంక మరొకడు కన్నెత్తి చూడటం పురుషుడు భరించలేని మాట నిజమే. ఆడదాని కోసం హత్యలు జరిగాయి. యుద్ధాలు జరిగాయి. సామ్రాజ్యాలు సర్వనాశనం అయ్యాయి. కానీ ఆ దశ దాటి మనం చాలా దూరం వచ్చేశాం కదా. స్త్రీ ఇప్పుడు ఎంతో స్వాతంత్రం సంగతా?... ఎవరో అన్నట్లుగా, ఆడది తలుపు చెక్కలాంటిది. గుమ్మం దాటి రానంత వరకూ, అక్కడక్కడే అటూ ఇటూ తిరుగుతూ ఉండటానికి బోలెడంత స్వేచ్ఛ ఉంది. వేళ్ళ మీద లెక్కపెట్ట దగిన సంఖ్యలో ఎక్కడో ఒక ఇందిరాగాంధీ, ఒక సిరిమావో, ఒకథాచర్ ఉండొచ్చు. వాళ్ళ గురించి మనం ఆలోచించాల్సిన

పనిలేదు. వాళ్ళే మన గురించి ఆలోచిస్తారు. కనుక మనం ఆలోచించాల్సింది కోట్ల సంఖ్యలో ఉన్న నాలాంటి మల్లికల గురించే..." అని చెప్పింది మల్లిక.

సత్యమూర్తి నవ్వేసి ఊరుకున్నాడు.

మర్నాడు లేచినప్పటి నుంచీ రవి, తనూజ వెనకాలే తిరుగుతున్నాడు. అతనేదో అడుగుతున్నాడ. తనూజ విసుక్కుంటోంది.

"తనూజా, ఇవ్వాళ నువ్వెంతో బాగున్నావ్..."

"మీ కొలీగ్ కంటేనా?..." అని అడిగింది తనూజ.

"ఇప్పుడు ఆ సంగతి ఎందుకు? నేను నీ సంగతి మాట్లాడుతున్నాను... "

"నాదేముంది లెండి... ఇంట్లో పడి ఉండేదాన్ని..."

"ఎక్కడ పడుకున్నా నా ప్రాణం నువ్వే..."

"ఏమిటి ప్రొద్దున్నే ఇలా మొదలెట్టారు"

"ఏం లేదు, జస్ట్ ఒక వంద ఉంటే చూద్దూ..."

"మీ కొలీగ్‌ను అడగండి.."

"అడిగితే లేవనదు. కానీ అస్తమానం అడగటం బావుండదు కదా...."

"అంటే అడపా దడపా అడుగుతున్నారన్నమాట..."

"ఏదోలే... మేం కిందా మీదా పడుతుంటాం గానీ..."

"ఎక్కడ, ఆఫీసులోనేనా?"

"ప్చ్ నోట్లో నుంచి మాట జారితే చాలు, పట్టుకుంటావ్.... అదిసరేగానీ, నాకు టైం అవుతోంది..."

"నాదగ్గరేం లేదు..."

"నీ దగ్గర లేకపోతే వరల్డ్ బ్యాంక్ లోనే లేదన్నమాట. సపోజ్ రాజీవ్ గాంధీ నీ దగ్గరకొచ్చి ఓ వంద అప్పు ఇవ్వమని అడిగాడనుకో ఇస్తావా, ఇవ్వవా?"

"రాజీవ్ గాంధీ వచ్చి అడిగితే వంద ఏమిటి రెండొందలు ఇస్తాను..."

"ఇప్పుడాయన అడగలేదుకదా, ఆ రెండొందలు నాకు ఇచ్చెయ్యకూడదూ...."

"తెలివితేటలు ఎక్కువైపోతున్నాయి" అంది తనూజ

"మరే, కొందరికి బుర్ర పెరుగుతుంటుంది, కొందరికి బొర్ర పెరుగుతుంటుంది... సరేగానీ నా సంగతేమిటి?" అని రవి ఆమెను వదలకుండా పట్టుకున్నాడు.

చివరకు తనూజ సూట్ కేస్ తెరిచి వందరూపాయలు రవికి ఇచ్చింది.

"ఇంతకీ దేనికి డబ్బు?..." అని అడిగింది.

"మగవాడికి సవాలక్ష ఖర్చులుంటాయి, అవన్నీ చెబితే నీ గుండె పగులుతుంది... అంచేత అడక్కు..."

"మీ కొలీగ్‌కు ఏమన్నా ప్రెజెంటేషన్ కొంటున్నారేమోనని..." అని అనుమానంగా చుసింది తనూజ.

"అరే, ఆ సంగతి నీకెలా తెలిసింది?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"అంటే అది నిజమేనన్నమాట..." అంటూ కోపంగా చూసింది.

ఇదంతా మల్లిక, సత్యమూర్తి చూస్తూనే ఉన్నారు. రాత్రి మల్లిక చెప్పిన మాటలు సత్యమూర్తికి గుర్తొచ్చాయి... ఆడది మగవాడి కోసం సంపాదిస్తోందా, మగవాడు ఆడదాని కోసం సంపాదిస్తున్నాడా అడగబోయేంతలో మల్లిక రవిని అడిగింది.

"ఏమిటీ, తనూజను ఏడిపిస్తున్నావ్?"

"ఏడిపిస్తే మాత్రం, ఎవరు ఏడవమన్నారండి..." అని నవ్వాడు రవి.

"అది మా జన్మ హక్కులే గానీ, అసలు విషయమేమిటి?" అని అడిగింది మల్లిక.

"ఏం లేదు. ఆయనకు కొత్త ఫ్రెండ్స్ ఎక్కువైనారు. ఖర్చులూ పెరుగుతున్నాయి..." అని చెప్పేసింది తనూజ.

"అవునా? " అని అడిగింది మల్లిక.

"నిజమేనండి" అని ఒప్పుకున్నాడు రవి.

"నేను ఎక్కడికైనా వెళ్ళిపోదామనుకుంటున్నాను" అంది తనూజ సీరియస్‌గా ఆలోచిస్తూ.

"ఎక్కడికి?" అని అడిగింది మల్లిక.

"ఎక్కడికైనా సరే... ఇక్కడినుంచీ మాత్రం వెళ్ళిపోతాను" అంది తనూజ.

"ఇదేమిటి? అంత గాఢంగా ప్రేమించుకుని, పారిపోయి, పెళ్ళి చేసుకున్నారు, పెళ్ళికోసం కలలు కన్నన్ని రోజులు కూడా పట్టలేదు. పెళ్ళిచేసుకుని, అప్పుడే వెళ్ళిపోతానంటావేమిటి?" అంటూ మల్లిక తనూజ దగ్గరకు వెళ్ళి, భుజం మీద చెయ్యి వేసి, ప్రశ్నించింది.

"మీ ప్రేమకీ మాప్రేమకీ చాలా తేడా ఉందండి. మీరు ఒకళ్ళ కోసం ఇంకొకళ్ళు ప్రాణాలిచ్చుకుంటారు. మాకు అంత గొప్ప సెంటిమెంట్స్ ఏమీ లేవు..."

"సెంటిమెంట్స్ లేవంటే, అసలు లేవని కాదు. అంత స్థిరంగా లేవని... ఆమె ప్రేమించింది. నేను ప్రేమించాను. మధ్యలో ఆమె మనసు మార్చుకుంది. నేనూ మార్చుకున్నాను, విడిపోదామనుకున్నాం. మళ్ళా ఆమె మనసు మార్చుకుని ప్రేమించింది. నేనూ మనసు మార్చుకుని మళ్ళా ప్రేమించటం మొదలు పెట్టాను. పెళ్ళి చేసుకున్నాం. ఇప్పుడామె మళ్ళా మనసు మార్చుకుంటోంది..." అని చెప్పాడు రవి.

మల్లిక తనూజ వంక చూసింది. ఆమె ముఖం ఇంకా గంభీరంగానే ఉంది.

"ఏం తనూజా.... మనసు మార్చుకోవటం ఏమిటి?" అంటూ ఆరా తీయబోయింది మల్లిక –

"పరిస్థితుల్ని బట్టీ మనమూ మారాల్సి వస్తుంది" అంది తనూజ తలదించుకుని అక్కడే సూట్‌కేస్ దగ్గరే నిలబడి ఉంది.

అసలు వీళ్ళకు గొడవ ఎందుకొచ్చిందో అర్థంకాని మల్లిక ఆత్రంగా సత్యమూర్తి వంక చూసింది.

సత్యమూర్తి చిరునవ్వు నవ్వాడు.

కానీ –

ఆ నవ్వు చూస్తుండగానే మాయమైపోయి గంభీరత అలుముకుంది.

సమయానికి ఎవరో పిలిచినట్టుగా –

ఆటో దిగిన ముకుందరావు లోపలికి వచ్చాడు!

గుమ్మంలో నిలబడ్డ ఆయన్ను చూసి నలుగురూ చేష్టలుడిగిన బొమ్మల్లా నిలబడ్డారు. ముఖ్యంగా తనూజ కలో నిజమో నమ్మలేనట్లు చూసింది.

"అమ్మా, తనూజా..." అంటూ ఆయన కూతురు దగ్గరకొచ్చాడు.

"నాన్నా..." అంటూ ఉంటే, ఆ రెండూ అక్షరాల కన్నా ముందు దుఃఖావేశం, కన్నీళ్ళు ముంచుకొచాయి. ఒక అడుగు ఆయన వైపు ముందుకు వేసింది.

ఇటునుంచీ రవి, అటునుంచీ సత్యమూర్తి కూడా ఒక అడుగు ముందుకు వేశారు.

ఈ ప్రేమలూ, అభిమానాలూ, సెంటిమెంట్సూ లేకపోతే మనిషికీ పశువుకీ తేడాయే లేదు.

కానీ రాను రాను ఇవన్నీ అర్థంలేని మాటల్లా కనిపిస్తున్నాయి.

ఇప్పుడు సర్వే సర్వత్రా కనిపించేది ఒక్కటే -

'స్వార్థం.'

ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకుంటూ, ఎదుటి వాళ్ళకు మాత్రం నీతులు వల్లిస్తారు. ఇదీ ఇవాల్టి పరిస్థితి.

ముకుందరావు చెప్పబొయ్యేది కూడా తన స్వార్థం వెనుక దాగిన నీతులేనని సత్యమూర్తికి తెలుసు. అయినా అతను జోక్యం కలుగజేసుకోలేదు. రవిని తొందర పడవద్దని సైగ చేశాడు. అంచేత అతను ఆగాడు.

తండ్రిని చూడగానే తనూజ సహజంగానే దుఃఖం ఆపుకోలేక ఏడ్చేసింది. కూతురి తల నిమురుతూ ముకుందరావు అన్నాడు -

"నిన్ను కని పెంచి పెద్దచేసినవాడిని, కంటికి రెప్పలా కాపాడుకుంటున్నవాడిని నాకన్ను గప్పి ఇలా రావటానికి నీకు మనసెలా ఒప్పిందమ్మా..."

నేను చెప్పినా వినిపించుకునే పరిస్థితిలో లేవు. అంచేత ఇలా రావటం నాకు తప్పనిసరి అయింది నాన్నా..." అంది తనూజ కన్నీరు తుడుచుకుని.

"నేను బ్రతుకుతోంది నీకోసమేనమ్మా..." అన్నాడు ముకుందరావు బాధపడిపోతూ.

"కావచ్చు. కానీ నేను నువు కోరుకున్న విధంగానే బతకాలని నీ ఉద్దేశం...."

"అవునమ్మా, ఇవాళ నేను నీకంటికి శత్రువులా కనిపిస్తూ ఉండవచ్చు. కానీ గుండెను చీల్చి చూసినా కనిపించేది తనూజ మీద ప్రేమ, మమకారం మాత్రమే.... నువ్వు గర్వంగా చెప్పుకోదగ్గ వరుడ్ని తెచ్చి పెళ్ళిచేయాలని, నువ్వు అన్నివిధాలా సుఖశాంతులతో కళకళలాడుతుండాలని నేను కలలు కనటంలో తప్పేముందమ్మా?..."

"నీ ఆలోచనలు చెడ్డవనీ నేను ఎప్పుడూ అనను, అనుకోను. కాకపోతే నాకూ ఒక మనసు ఉండటం, వయసొచ్చినప్పటి నుంచీ అదీ కొన్ని కలలు కనటం, నీవు కనే కలలకీ, నేను కంటున్న కలలకి ఎక్కడా పొంతన లేకపోవటం - ఇక్కడే మనకు చిన్న స్పర్ధ వచ్చి, చెపితే ఒప్పుకోవని, ఇలా చెప్పకుండా వచ్చేశాను. అంతకన్నా..."

"ఏమిటమ్మా నువు కన్న కలలు? చాలీచాలని జీతాలు, ఏనాటికీ ఓ స్థితికిరాని జీవితాలు, ముంచుకొచ్చే అవసరాలు. పీకల్లోతు అప్పులు, జానెడు గదుల్లో, చినిగిన చీరెల్లో, 'అమ్మా ఆకలి' అంటూ కాళ్ళకూ చేతులకి చుట్టుకుపోయే పిల్లలతో, కన్నీళ్ళు నింపుకుంటూ నిలబడే రోజుల గురించేనా నువు కన్న కలలన్నీ... నా తనూజకు అలాంటి దౌర్భాగ్యపు స్థితి కలుగుతుందన్న ఊహనే భరించలేక పోతున్నాను.... వ్రతం చెడ్డా ఫలం దక్కాలని, కులం తక్కువ వాణ్ణి చేసుకున్నా, సుఖం అయినా దక్కాలి కదా... "

"కొన్నాళ్ళు సుఖాలు అనుభవించాక, కష్టాలు అనుభవించాం. కన్నీళ్ళ పర్యంతం అయ్యే మాట నిజమే. కానీ నేను నీలాంటి గొప్పవాడి ఇంట్లో పుట్టలేదని, నిరుపేద కుటుంబంలోనే పుట్టానని, ఇదే నా అసలైన స్థానం అనుకుని, అన్నీ సహించి, భరించటానికే సిద్ధపడుతున్నాను..." అంది తనూజ.

"నీకు అంత ఖర్మ ఏమొచ్చిందమ్మా?"

"ఇందులో ఖర్మ ఏముంది? నేను కావాలనే మనస్ఫూర్తిగానే, అన్నీ తెలిసే, చాలా రోజులు రాగల పరిస్థితులన్నీ ఆలోచించుకునే, అన్నిటికీ సిద్ధపడే, కావాలనే రవిని చేసుకున్నాను..." అంది తనూజ.

"నడక వచ్చీరాని వయస్సులో తప్పటడుగులు వేస్తూ మెట్టుమీద నుంచీ కిందకి పడిపోతే, నేనే లేవదీసి గుండెలకు హత్తుకుని ఇలాగే ఏడుస్తున్న నిన్ను ఓదార్చాను... 'నడత' నేర్చుకునే ఈ వయస్సులోనూ తప్పటడుగువేసి, తప్పుదోవన పడిపోతున్నావు. ఇప్పుడు సరియైన దారిన పెట్టాల్సిన బాధ్యత నాదేకదమ్మా..." అన్నాడు ముకుందరావు.

"ఇదుగో, మనకు పేచీ ఇక్కడే వస్తోంది. నువ్వు నడక నేర్పిన మాట నిజమే కావచ్చు. కానీ బాగా నడవటం, పరిగెత్తడం వచ్చాక, ఇంకా నీ చెయ్యి పట్టుకునే నడవాలి, నీ అడుగులోనే అడుగువేస్తూ ముందుకెళ్ళాలీ అంటే.. ఎలా కుదురుతుంది? ఎదిగిన పిల్లలకి ఇష్టాఇష్టాలు ఏర్పడతాయి. వ్యక్తిత్వం ఏర్పడుతుంది. అంచేత వాళ్ళని గౌరవించి వాళ్ళ బతుకులు వాళ్ళను బతకనివ్వడమే అందరికీ శ్రేయస్కరం నాన్నా..." అంది తనూజ.

"ఇవన్నీ నీకెవరు నూరిపోస్తున్నారో నాకు తెల్సునమ్మా" అన్నాడు ముకుందరావు కోపంగా సత్యమూర్తి వంక చూస్తూ.

"ఎప్పుడు ఎవరి మనసు ఎవరిమీద లగ్నం అవుతుందో, ఎవరూ చెప్పలేరు. కాళ్ళావేళ్ళాపడి యాచించినా, కొందరిని ప్రేమించలేం. మనవంక కన్నెత్తి క్రీగంట చూడకపోయినా, కొందరిని ప్రేమించకుండా ఉండలేం, వర్షంలాగా, వెన్నెలలాగా ఈ ప్రేమలూ, అభిమానాలూ వాటంతటవే వచ్చి మనలని ముంచెత్తాలేగానీ, వాటికోసం మనం పరుగెత్తలేం. ఆ సమయమే వచ్చి, అవి మనల్ని హాయిగా చుట్టేసుకున్నప్పుడు, ఎవరూ చెయ్యడ్డం పెట్టి ఆపనూలేరు" అంది తనూజ. ఆ మాటలకు ముకుందరావు ఆశ్చర్యపోయాడు.

ఒళ్ళో కూర్చుని కథలు చెప్పించుకుని, అదేమిటి ఇదేమిటని సవాలక్ష ప్రశ్నలు వేసిన తన చిన్నారి కూతురు తనూజేనా, ఇవాళ ఎవరి ఊహకీ అందని ఉపమానాలతో, ప్రేమకి నిర్వచనాలు చెబుతోంది. చూస్తుండగానే, తన కళ్ళముందే ఎంతగా ఎదిగిపోయిందీ పిల్ల!

"చాలా విషయాలు నేర్చుకున్నావు. సంతోషం. కానీ నేను నీకన్నా వయసులో పెద్దవాణ్ణి. అనుభవం ఉన్నవాణ్ణి ఆ గౌరవం అయినా ఉంచి, ఇంటికి రామ్మా వెళదాం..." అని అడిగాడాయన.

"వస్తాను నాన్నా. కానీ ఇప్పుడు కాదు. ఆ సమయం వచ్చినప్పుడు తప్పకుండా వస్తాను" అంది తనూజ.

"జరగవల్సిన అపకారం అంతా జరిగిపోయాక ఇంక అప్పుడు నువ్వు వచ్చినా మాత్రం నేను చేయగలిగిందేముంటుంది? నిన్ను చూసి కుమిలిపోవటం తప్ప..." అన్నాడు ముకుందరావు.

"నా బాధలేవో నేనే పడతానుగానీ, నిన్ను బాధపెట్టనులే. చూడాలనిపించినప్పుడు వచ్చి, రెండురోజులు నీతో సరదాగా ఉండటానికి మాత్రమే వస్తాను..." అంది తనూజ.

"నువ్వు నాకు దూరమైపొయ్యాక, నేను ఇంకెవరి కోసం బతకాలమ్మా?" అని అడిగాడాయన మనసులోని బాధనీ, ఆవేదననీ వ్యక్తం చేస్తూ.

"నేను ఎవరింటికో ఒకరింటికి కోడలుగా వెళ్ళవలసినదాన్నే కదా. పుట్టగానే ఆడపిల్ల అన్నారు. అంటే ఏదో ఒకరోజున 'ఆడ'కు పొయ్యే పిల్లేగానీ 'ఈడ' పిల్ల కాదన్న భావం ఆ మాటలోనే ఉంది..."

నువ్వు ఎక్కడికీ వెళ్ళక్కరలేకుండా నేను అన్ని ఏర్పాట్లూ చేస్తాను. ఇంటికెళ్ళి మాట్లాడుకుందాం, దా..." అంటూ ముకుందరావు తనూజ చేతిని పట్టుకుని లాక్కుపోవటానికి ప్రయత్నించాడు.

రవి తనూజ రెండో చేతిని పట్టుకుని, ఆమె మొహంలోకి చూశాడు ఆ చూపుల్లో ఆవేదన ఉంది. అభ్యర్థన ఉంది. హృదయ నివేదన ఉంది. 'నువు లేకుండా నేను బ్రతకలేనన్న' భావమూ ఉంది. తనూజ ఆ చూపుల్లోని భావానికి కరిగి నీరైపోయింది.

"నేను రాలేను, నాన్నా" అంది.

"నీకు రావాలని ఉన్నా వీళ్ళంతా చుట్టూ చేరి మాయచేసి నీ మనసు విరిచేస్తున్నారమ్మా. ఈ కూపంలో నుంచీ బయట పడితేగాని నువ్వు బాగుపడలేవు. నేను ఉన్నంతవరకూ నీకే భయమూలేదు రా వెళదాం..." అంటూ కూతురిని పొదవి పట్టుకుని తీసుకువెళుతున్న ముకుందరావుకు సత్యమూర్తి అడ్డుతగిలాడు గుమ్మానికి అడ్డంగా నిలబడి.

"నువ్వు తప్పుకో "అన్నాడు ముకుందరావు.

"మీరు తనూజను తీసుకెళ్ళడానికి వీలులేదు" అన్నాడు సత్యమూర్తి.

"అది నా కూతురు. దాన్ని నా ఇంటికి తీసుకెళుతున్నాను. ఎవడు అడ్డువస్తాడో రమ్మను" అన్నాడు ముకుందరావు.

"నేనే అడ్డొస్తున్నాను. తనూజ మీ కూతురే కావచ్చు. కానీ ఆమె ఇప్పుడు రవికి భార్య. మీరాపిల్లను తీసుకుపోయి రవి కట్టిన తాళి తెంచేసి మరొకడి చేత మూడుముళ్ళూ వేయిస్తారు. అంచేత తనూజ మొగుడిని వదిలి రాలేదు. ఆమెను వదిలేసి దయచేసి మీరు వెళ్ళిపొండి..." అన్నాడు సత్యమూర్తి.

సరిగ్గా తన మనసులో ఉన్నదేమిటో స్పష్టంగా తెలుసుకోగలిగిన సత్యమూర్తితో వాదించలేనని ముకుందరావుకి అనిపించింది. ఇంకా గొడవచేసి, గోలచేసి, తనూజను తీసుకెళ్ళేందుకు వీలులేదు. వాళ్ళదే పై చేయిగా ఉంది. తనూజకూడా అటే మొగ్గుతోంది. వాడికి భార్యననే చెప్పుకుంటోంది. కనుక ఇది పద్ధతికాదని ముకుందరావుకూ అర్ధమైపోయింది.

కానీ కోపాన్ని చంపుకోలేక, బుసలు కొడుతూ వెళ్ళిపోయాడు ముకుందరావు.

ఆయనంత తేలికగా వెళ్ళిపోతాడని ఆశించని రవి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"థాంక్స్ మాష్టారూ... మీరున్నారు కాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే తనూజను లాక్కుపొయ్యేవాడే.." అన్నాడు రవి.

"వెళ్ళినంత మాత్రాన కూతురిమీద ఆశవదులుకుని ఆమెను నీకే వదిలేసి ఊరుకుంటాడనుకోవటానికి వీల్లేదు. ఆ వయసులో వాళ్ళకు, అందులోనూ ఆ స్థాయిలో ఉన్నవాళ్ళకు తమ మాట నెగ్గించుకోవాలన్న పంతం రోజురోజుకీ పెరుగుతూ ఉంతుంది" అని చెప్పాడు సత్యమూర్తి.

అది నిజమేనని మల్లిక కూడా ఒప్పుకుంది.

వంటింట్లోకి వెళ్ళిన తనూజ వెనకే వెళ్ళాడు రవి.

"థాంక్యూ డియర్... నువ్వు మీ నాన్నతో వెళ్ళిపోతావేమోనని భయపడ్డాను..." అన్నాడు రవి.

తనూజ రవి వంక తీక్షణంగా చూసింది. మాట్లాడలేదు. వెనక్కి తిరిగి పనిలో నిమగ్నమైంది.

"నామీద కోపం తగ్గలేదా?" అని అడిగాడు రవి ఆమెకు దగ్గరగా వచ్చి.

"మీ మీద నాకెందుకండీ కోపం? అసలు మీరెవరు? నేనెవరు?" అంది ఇంకా కోపంగానే.

"నేను రవిని, నువ్వు తనూజవి"

"నేను మీకు ఏమవుతాను గనుక?" అని ప్రశ్నించింది.

"దార్లో ఎదురవుతారు కనుక..."

"అంతేలెండి. నేను దార్లో ఎదురయ్యేదాన్ని. అంతకన్నా ఇంకేమీ కాను... " అంటున్న తనూజ కళ్ళల్లో నీళ్ళు గిర్రున సుళ్ళు తిరిగాయి.

"పిచ్చీ... ప్రతిదానికీ ఇంత కోపం అయితే, ఎలా?" అన్నాడు రవి వెనుక నుంచీ వచ్చి ఆమెను చుట్టేసుకుని.

తనూజ విసురుగా విడిపించేసుకుంది. అవతల సత్యమూర్తి, మల్లిక ఉండటంతో, రవి భార్యను బ్రతిమాలుకోవటానికి అంతకన్నా ఎక్కువ వీలులేకపోయింది.

రవి భోంచేసి ఆఫీసుకు వెళ్ళిపొయ్యాడు.

మిగతా ముగ్గురూ కూడా భోజనాలు చేశారు. మల్లిక పుస్తకం చదువుతూ తీవ్రంగా ఆలోచిస్తోంది.

సత్యమూర్తి ఆమె దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. తండ్రిని కాదని వచ్చి, రవిని చేసుకోవటం, ఉన్నవన్నీ వదులుకుని వచ్చి ఇక్కడ అన్నిటికీ వెతుక్కుంటూ సరికొత్త జీవితం ఆరంభించటం, ఇంతలో తండ్రి వచ్చి తీసుకువెళతాను రమ్మనటం, రానని పంపించెయ్యటం - ఇవన్నీ ఆమెను తీవ్రంగా కదిలించివేసే విషయాలే. కనుకనే ఆమె అంతరంగంలో తుఫాను గాలులు వీస్తుంటాయని సత్యమూర్తి తేలికగానే ఊహించాడు.

"ఏమిటమ్మా, ఒంటరిగా కూర్చుని సీరియస్‌గా ఆలోచిస్తున్నావ్?" అని అడిగాడు.

"ఏం లేదు అన్నయ్యా" అంది తనూజ కన్నీళ్ళు తుడిచేసుకుని.

"ఏడుస్తున్నావా?"

తనూజ మాట్లాడలేకపోయింది.

"జరిగినవన్నీ నీ మనసును వేధించే విషయాలే. కాదనలేను కానీ, ఇప్పుడు ఇంతదూరం వచ్చాక, జరిగిపోయినవన్నీ తలుచుకుంటూ కూర్చుంటే లాభంలేదు... నో రిగ్రెట్స్..."

అయినా తనూజ తలెత్తలేదు. మాట్లాడనూలేదు.

"దేనికోసమమ్మా నువు బాధపడటం? మీనాన్న అన్నమాటలకేనా?"

అవునన్నట్లుగా చూసింది తనూజ.

"మనకు తెలియనిదీ, ఆయన కొత్తగా అన్నదీ ఏముది?.... ఆయన నీ సంసారం ఎలా ఉంటుందో వర్ణించి చెప్పినందుకేనా ఆ బాధ. అది మనం అనుకున్నదే జరిగిపోయినదంతా గతం. దాన్ని తవ్వుకుంటూ కూర్చున్నందువల్ల ఒరిగిందేమీలేదు, మరింత మనస్తాపం కలగటం తప్ప. ఇంక భవిష్యత్తులో ఏం జరగబోతుందో మనకు తెలియదు. తెలియని దాని గురించి బాధపడుతూ కూర్చోవటమూ అవసరమే, మనం బతికేది గతంలోనూ కాదు, భవిష్యత్తులోనూ కాదు. వర్తమానంలో కనుక ఇప్పటి పరిస్థితి ఏమిటి, ఏం చేయాలీ అని మాత్రం ఎప్పటికప్పుడు ఆలోచించుకోవాలి.

ఈ పెళ్ళివల్ల ఏం పొందావూ, ఏం పోగొట్టుకున్నావూ అన్న ప్రశ్న మాత్రం రానీకు ఎందుకంటే పెళ్ళి అనేది వ్యాపారం కాదు, లాభనష్టాలు బేరీజు వేసుకోవటానికి. అదొక అనిర్వచనీయమైన, అరుదైన, అందమైన అనుభూతి. ఒకవ్యక్తి తన మనసునీ, తనవునీ మరొక వ్యక్తికి సంతోషంగా అర్పించుకునే అద్భుతమైన సమయం అది. సర్వాంతర్యామి అయిన దేవుడి చుట్టూతా గుళ్ళూగోపురాలూ కట్టి, ఆయన్ను లోపలకు నెట్టి తలుపులూ తాళాలూ వేసినట్లుగానే, ఆడామగా తేడా గల ఇద్దరు వ్యక్తుల కలలకు, పెళ్ళి అనే పేరు పెట్టి దాన్ని కులాలు, మతాలు, కట్నాలూ, కానుకలు, మంత్రతంత్రాలు, బాజాభజంత్రీల నడుమకు నెట్టి నానా హంగామా చేసిపారేశారు... "అసలు పెళ్ళిళ్ళు చూసినప్పుడల్లా నాకు నవ్వొస్తూ ఉంటుంది. ఆడా మగా తమ కలయిక అతిరహస్యంగా ఉండాలని కోరుకుంటారు. ఆ కాసేపూ గదిలో దూరి తలుపులు బిడాయించుకుంటారు. కానీ అంతకు ముందు, అందరిముందూ మేమిద్దరం కలుసుకోబోతున్నామని ఊరూవాడా ఏకం చేసి, ఎందుకత రాద్ధాంతం చేస్తారో తెలియదు..." అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ.

"ఛీపో..." అంది తనూజ. సిగ్గునూ, నవ్వునూ దాచేందుకు మొహం అవతలకు తిప్పుకుంది.

"పెళ్ళి కాలేదు కదా, నాకు తెలిసి చావదా గొడవ. అందుకని నిన్ను అడిగాను. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఆ కాసేపూ అలా కళ్ళుమూసుకుపోతాయి. కాబట్టే ప్రేమ గుడ్డిది అన్నారమ్మా" అన్నాడు సత్యమూర్తి.

"ప్రేమ గుడ్డిది అని విన్నాను గానీ, దాని వెనక ఉన్న కథ ఇదీ అని తెలియదులే" అంది తనూజ సత్యమూర్తి వంక చూసి నవ్వేసి.

"ప్రేమ గుడ్డిది అయితే పెళ్ళి మూగదీ, చెవిటిదీ, అవిటిదీ - ముఖ్యంగా ఆడదాని విషయంలో, ఎందుకంటే పెళ్ళి అయ్యాక ఆడది అసలు వ్యక్తిత్వాన్నే కోల్పోతుంది. తానుగా బతకటం మానేసి అతని భార్యగా బతకటం మొదలెడుతుంది... అయితే, రోజులు మారుతున్నాయి పిల్లల్ని కంటూ, వంటచేసి పెడుతూ ఉండే స్థాయి నుంచీ ఎదిగింది కనుకనే సమస్యలూ పెరిగి ఇప్పుడు చాలా మంది రకరకాల కారణాల వల్ల సంసారంలో ఇమడలేక సతమతమైపోతున్నారు.... కానీ బయటపడలేక పోతున్నారు."

"ఎందుకని? చదువుకున్నవాళ్ళు, సంపాదిస్తున్నవాళ్ళు ఇష్టంలేని మొగుడితోనే పడివుండటం ఎందుకు?' అని అడిగింది తనూజ.

"మొదటిది Social Stigma. దానికి భయపడే, ఇష్టం లేక పోయినా ఆ నాలుగు గోడల మధ్యే పడి ఉంటున్నారు. రెండో కారణం ఒంటరిగా ఉండలేకపోవటం, తగిన రక్షణ లేకపోవటం, మూడో కారణం - అతన్ని కాదని వచ్చి ఇంకొకడిని చేసుకున్నా, వీడూ మగాడే కదా, అతనికంటే ఘనుడు ఇతను కావచ్చుకదా. పెనం మీదనుంచీ గెంతి పొయ్యిలో పడ్డట్లు అవుతుందేమోనన్న భయమూ ఉంది. ఇక పిల్లలుంటే తమ కోరికలన్నీ చంపుకుని పిల్లలకోసం బ్రతికేవాళ్ళూ ఉన్నారు."

సత్యమూర్తి చెప్పటం ఆపేశాడు. తనూజకు కావల్సిన సమాధానం దొరకలేదు. అడగాలని ఉన్నా, అడగలేకపోతోంది.

చివరకు నెమ్మదిగా అంది.

"అదికాదన్నయ్యా. రవికి ఎవరో కొలీగ్ ఉందట. ఆమెతో చనువుగా ఉంటున్నాట్ట..."

"ఎవరు చెప్పారు?" అని నవ్వుతూ అడిగాడు సత్యమూర్తి.

"ఆయనే చెప్పారు" అంది తనూజ.

"ఇలాంటి చిన్న చిన్న కారణాలతో అనవసరంగా బాధపడకు. ఎందుకంటే ముందు ముందు మరికొన్ని సమస్యలు నీకోసం కాచుకుని ఉన్నాయి. నీ మొగుడు కులం తక్కువవాడని, జీతం తక్కువవాడనీ అతన్నీ నిన్నూ కూడా చిన్న చూపు చూసే సందర్భాలు తప్పకుండా నీకు ఎదురవుతాయి. వాళ్ళు ఆ స్థాయినుంచీ ఎదగలేనందుకు వాళ్ళ మీద జాలిపడాలే తప్ప, బాధపడకూడదమ్మా...

కులం తక్కువవాడైనందుకు కాదు, గుణం తక్కువవాడైనందుకే విచారించాల్సి ఉంటుంది. మన కళ్ళముందే కనిపిస్తోంది కదా మల్లిక. లోకం దృష్టిలో ఆమెకే లోటూ లేదు. నిజానికి భర్త సరైనవాడైతే ఏలోటూ లేకుండా ఉండేది..... నీకు అలాంటి గుణహీనుడు దొరకనందుకు సంతోషించాలి. నీలో నువ్వే గర్వపడాలి, తెలిసిందా?..." అని అడిగాడు సత్యమూర్తి.

తనూజ ఆలోచించుకుంటోంది.

"ఇంకో విషయం మర్చిపోవద్దు. నువ్వొక్కదానివే గొప్పత్యాగం చేసానని అనుకోవద్దు. నీ తండ్రికి నువ్వు దూరమైతే, అతని వాళ్ళందరికీ అతనూ దూరమైనాడు. వాళ్ళు లేనివాళ్ళు కావచ్చు. కానీ అభిమానాలు లేని వాళ్ళు కాదు. నీకోసం అతనూ కొంత త్యాగం చేసాడన్న చిన్న విషయాన్ని అప్పుడప్పుడు గుర్తుచేసుకో... పుణ్యం కొద్దీ పురుషుడన్నారు. నాకు రవిలో వెతికినా ఏ లోపమూ కనిపించడంలేదు. మంచికో చెడుకో అతనికి దగ్గరైనావు. ఇంక అతనికి దూరంకావాలన్న ఆలోచన మాత్రం రానివ్వకు. మీరిద్దరూ ఒకరిని విడిచి మరొకరు ఉండలేరు. నాకు తెలుసా సంగతి ఏకారణం చేత మీరు దూరమైనా, మీకు మనఃశ్శాంతి ఉండదు...." అని చెప్పాడు సత్యమూర్తి.

తనూజకు సత్యమూర్తి చెప్పినదంతా అక్షరాలా నిజమేననిపిస్తోంది.

ఇంతలో మల్లిక నిద్దరలేచి రావడంతో ప్రసంగం మారిపోయింది.

ఈ గొడవలు ఎప్పుడూ ఉండేవేగానీ, కాసేపు అలా తిరిగొద్దామని మల్లిక - అందరినీ లేవదీసింది.

సినిమాకి వెళ్ళారు. దార్లో హోటల్లో తినేసి ఇంటికి వచ్చారు. సినిమా హాల్లోనూ, దార్లోనూ కూడా తనూజ రవికి దూరంగా ఉంటూ వచ్చింది. ఇంక పడుకునేటప్పుడు రవి భార్యను బ్రతిమిలాడుకోవటం మొదలుపెట్టాడు.

మధ్యాహ్నం సత్యమూర్తి చెప్పిన మాటలకే తనూజ మనస్సులోని అనుమానాలన్నీ చెదిరిపోయినా, ఇంకా కొంచెం బింకం చూపిస్తోంది.

"తెలిసి తెలిసి నేనే నేరం చెయ్యలేదు, అనవసరంగా నామీద కోపం పెంచుకున్నావు - ఏం చేస్తే నీ కోపం తగ్గుతుందో చెప్పు..." అన్నాడు రవి.

తనూజ అతనివంక అదోలా చూసింది.

" సూటిగా చూడకోయ్. నేను మాడిమసైపోతాను... నువ్వు నవ్వి ఎన్నాళ్ళు అయింది? ఓ చిన్న చిరునవ్వు ఇటుపారేస్తే నీ సొమ్మేంపోయింది..."

"నా నవ్వులు మీకెందుకండీ, మీ కొలీగ్ ఉందిగా... నవ్వుతోంది వెళ్ళండి.....' అంది తనూజ అటు తిరిగి.

"ఇదుగో, ఇంక నేను కుండబద్దలు కొట్టి చెప్పేస్తున్నాను" అంటూ కూజావైపు వెళ్ళాడు. తనూజ అడ్డుపడింది.

"ఏయ్, ఆ కూజా బద్దలు కొట్టొద్దు. కొత్తది, మొన్నే కొన్నాను. కుండలూ, కూజాలూ బద్దలకొట్టక్కరలేదు, చెప్పదల్చుకున్నదేదో చెప్పు..." అంది తనూజ.

"మా కొలీగ్ నాకన్నా పదేళ్ళు పెద్దది. మా అక్కయ్య వయసుంది. అక్కా అనే పిలుస్తాను. ఇంటికి తీసుకొచ్చి నీ ముందే 'అక్కా' అంటాను. చాలా?"

"చాల్లే..." అంది తనూజ రాజీ పడుతూ.

"ఆవిడ మన ఫామిలీ..."

"అదుగో మళ్ళా..."

"ఫామిలీ అంటే కుటుంబమోయ్... మహాత్ములకు లోకం కుటుంబం అన్నారు కదా. అందుచేత మహాత్ముడు అవుదామని అందమైనవాళ్ళందరినీ మన ఫామిలీ కింద ట్రీట్ చేద్దామని" అన్నాడు రవి.

"అయినా మీరు మరీ పేట్రేగిపోతున్నారు. మీ వరస నాకేం నచ్చలేదు..." అంది తనూజ.

అంతవరకూ హుషారుగా కబుర్లు చెప్పిన రవి ఎందుకో కొద్దిక్షణాలు మౌనం పాటించాడు. తర్వాత నెమ్మదిగా చెప్పాడు.

"నా వరస నీకు నచ్చలేదా, తనూ... నిజానికి నా వరస నాకే నచ్చటంలేదు.. ఏదో చెయ్యాలనుకుంటూ, ఇంకేదో చేస్తున్నాను.... నీకు చాలాసార్లు చెప్పాను. మాది చాలా పెద్ద ఫ్యామిలీ, కానీ మా ఇంట్లో ఎవరికీ చదువూ సంధ్యా అంటలేదు. నేనొక్కడినే చదువుకున్నవాడిని. అందుకని వాళ్ళందరికీ నేనంటే ఎంతో ఇష్టం. వాళ్ళు తినటం మాని నా కోసం దాచిపెట్టి పెట్టేవాళ్ళు. నేను చదువుకుని, గొప్పవాడిని అయి, మా ఇంటి పేరు నిలబెడతానని మా పెద్దక్కయ్య ఎప్పుడూ అంటుండేది, అక్కయ్యకు నేనంటే వల్లమాలిన ప్రేమ.... నా చదువు అయిపోతుందని, ఇంక పెద్ద ఉద్యోగం చేసి అందరి కష్టాలూ తీర్చేస్తానని వెర్రి భ్రమలో ఉన్నారు వాళ్ళు. కానీ వాళ్ళెవరికీ మాట మాత్రం అయినా చెప్పకుండా ఇలా వచ్చేసాను. నేను ఏమైపోయానో తెలియక మా అక్కలూ, అన్నలూ, వదినలూ, వాళ్ళ పిల్లలూ రోజూ పదే పదే తలుచుకుని ఏడుస్తూ ఉండి ఉంటారు. వాళ్ళను తలుచుకున్నప్పుడల్లా నాకు కడుపులో నుంచీ వెర్రి దుఃఖం వచ్చేస్తుంది... నీ ముందు.. నీకు నా కన్నీళ్ళు చూపించటం ఇష్టం లేక... ఎంతో సంతోషంగా, సరదాగా ఉన్నట్లు నటించాలని

ప్రయత్నిస్తూ, నటించటం చేతగాక... నావరస నాకే నచ్చటం లేదు తనూజ..." అని అటు తిరిగి చాలా నిర్వికారంగా చెబుతున్నా, రవి కళ్ళవెంట ధారలు కారుతూనే ఉన్నాయి.

తనూజ అతన్ని తనవైపు తిప్పుకుని, కన్నీరు తుడుస్తూ "మీరూ ఏడుస్తున్నారా?" అని అడిగితే, రవి ఉద్వేగం పట్టలేక ఆమెను గట్టిగా కౌగిలించేసుకున్నాడు.

"నీకు చెప్పకూడదనికాదు. నా మనసు ఒకసారి ఉన్నట్లు ఇంకోసారి ఉండటం లేదు, కుదురుగా ఉండటం లేదు. కానీ ఒక్కటి మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. అది స్వార్ధం, సంకుచితత్వం కావచ్చు... ఎవరు ఎలా అనుకున్నా సరేగాని, రోజులో ఒక్క అరక్షణమైనా నీ వాలు చూపు నీడలో నిలబడకపోతే, నీ చిరునవ్వు వెన్నెల్లో తడవకపోతే మనసుకు తృప్తిలేదు, శాంతిలేదు. ఎక్కడో, ఏదో లోకంలో పడి ఉన్న నన్ను నీ హృదయ సామ్రాజ్యంలోకి పిలిచి, అందలం ఎక్కించి, ఒక్కరోజు అయినా నిన్ను చూడకుండా ఉండలేనంత పిచ్చివాణ్ణి ఎందుకు చేసావు తనూ...?" అని అడుగుతున్నాడు రవి.

ఆమె మాత్రం ఏం చెబుతుంది, అతని కౌగిలిలో కరుగుతున్న మైనంలా మారటం తప్ప....

"హృదయాలకు మాత్రమే తెలిసే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పటం ఎంత కష్టం?" అని మాత్రం అనగలిగింది తనూజ.

"ఎప్పటికీ నాకు దూరం కావు కదూ..." అని ఎన్నాళ్ళో అయ్యాక వచ్చి తల్లిని కావలించుకున్న చిన్నపిల్లడిలా అడుతుతుంటే, -

"లేదు. నేను మాత్రం మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళగలనా? వెళ్ళగలిగితే మా నాన్నతోనే వెళ్ళేదాన్ని గదా" అని బుజ్జగిస్తోంది తనూజ.

"అదే నా భయం. మీ నాన్నకు తెలిసిపోయింది మన ఉనికి. ఇంక ఊరుకుంటాడా?" అని అడిగాడు రవి.

తనూజకు మాత్రం ఏం తెలుసు, తెల్లారితే ఏం జరగబోతుందో?

అదే సమయంలో ఇవతలి గదిలో మల్లిక గోడకు ఆనుకుని కూర్చుని ఉంటే, సత్యమూర్తి బోర్లా పడుకుని ఆమె వంకే చూస్తున్నాడు.

చాలా సేపు అయ్యాక మల్లిక అడిగింది.

"నిద్రపోతున్నావా సత్యా?"

"ఊహూ, లేదు, ఏం?" అన్నాడు సత్యమూర్తి.

"ఏం లేదు. ఊరికేనే అడిగాను" అంది మల్లిక.

చీకటి, సామీప్యం, యవ్వనం, కలిసి ఏవేవో కోరికల్ని నిద్రలేపుతున్నాయి కానీ -

ఎదురెదురుగా ఉండీ మనసులో మరుగుతున్నదేమిటో, నోరుండీ అతను చెప్పలేకపోవటం, చెవులుండి ఆమెవినలేకపోవటం - అదే చెప్పలేని బాధ మరి.

ఆమె చెయ్యి అతని ముఖానికి దగ్గరగా ఉంది. చీకట్లో ఎర్రగా మెరుస్తున్న రాయివంక చూస్తూ అడిగాడు.

"ఉంగరం కుడి చేతికి పెట్టుకున్నావేం?"

"ఎడమ చేతికి నువ్వు చేయించే ఉంగరం పెట్టుకుందామని..."

"పోనీ కుడి చేతికైనా ఉంగరం వేలికి కాక, తప్పుడు వేలుకు పెట్టుకున్నావేం?"

"తప్పుడు వెధవను చేసుకున్నాను గనుక..." అంది మల్లిక.

అంతటితో మళ్ళా మూడ్స్ చెడిపోయాయి. ఇంకేం మాట్లాడితే, ఎటు దారి తీస్తుందోనని సత్యమూర్తి మౌనం వహించాడు.

మల్లిక కూడా పడుకుంది. కానీ నిద్ర ఎలా పడుతుంది? భర్త గుర్తుకొచ్చాడు. తిట్లు, కొట్లాటలూ, సూదులు గుచ్చటం, సిగరెట్లతో కాల్చటం అంతా గుర్తుకొచ్చింది.

తల దిండులోదూర్చి ఏడ్చింది. తలుచుకున్న కొద్దీ దుఃఖం క్రమంగా ఎక్కువైందేగానీ, తగ్గతం లేదు, వెక్కి వెక్కి ఏడుస్తోంది.

సత్యమూర్తి లేచి ఆమె పక్కకు వచ్చి భుజం తట్టి లేపాడు.

"ఇంక అస్తమానం ఇదే పనా?" అన్నాడు చీకట్లో ఆమె కన్నీళ్ళు తుడవడానికి చేత్తో తడుముతూ -

గుండెల్లో రగులుతున్న వేదనకు తట్టుకోలేని మల్లిక, అతన్ని బలంగా గుండెలకు హత్తుకుంది. ఎప్పటికో ఏడుపు ఆపి, హృదయభారాన్ని దింపుకుని, మల్లిక అతన్ని అల్లుకుపోయి పడుకుంది పసిపాపలాగా అతని మీద కాళ్ళువేసి, చేతులు వేసి.



ఏవేవో పీడకలలతో భయపడి పోతున్న ఆమె గుండెల చప్పుడు మాత్రం, అతని గుండెలకు వినిపిస్తూనే ఉంది తెల్లవారు ఝామువరకూ.

అయిదుగంటలు అయింది. మసకవెలుతురు అంతటా ఆవరిస్తోంది మల్లిక లేచింది. ఒంటిమీద బట్టలు సర్దుకుని లేచి పెరట్లోకి వెళ్ళింది.

తనూజ ఇంకా లేవలేదు. చలికాలంకదా! మగాళ్ళు ఈ కాలం వదిలితేకదా.. అని నవ్వుకుంది.

వాకిట్లో శుభ్రం చేసింది. బక్కెట్‌తో నీళ్ళు చల్లింది. వంగి ముగ్గు వేస్తోంది.

ఇంతలో - రయ్‌మని ఒక అంబాసిడర్ కారు దూసుకొచ్చి, ఆమె పక్కనే ఆగింది. ఎవరా అని ఆశ్చర్యంగా చుస్తుండగానే, ఇద్దరు కార్లోంచి దిగి, మల్లిక నోరు మూసేసి, గిలగిల్లాడుతున్నా, కార్లోకి ఈడ్చుకుపోయారు. మరుక్షణంలో కారువేగంగా దూసుకుపోయింది.

కారు ఆగిన శబ్దం, మళ్ళా బయలుదేరిన శబ్దం విని సత్యమూర్తి బయటకొచ్చి చూసేసరికి కారు మలుపు తిరిగిపోయింది.

ఖాళీ బక్కెట్టూ, ముగ్గు డబ్బా అతనికి కొంతవరకూ విషయాన్ని చెప్పగలిగాయి.

మల్లికను ఎవరు ఎత్తుకుపొయ్యారు? ఆమె హరిశ్చంద్రప్రసాదా? లేక తనూజ కోసం ముకుందరావు మనుషుల్ని, కారునీ పంపిస్తే ఆ కిరాయి వెధవలు తనూజ అనుకుని మల్లికను ఎత్తుకు పొయ్యారా?

"ఏదైనా కావచ్చు"ననుకున్నాడు సత్యమూర్తి. వెనక్కి తిరిగి చూసేటప్పటికి తనూజ, రవి ఇంటిలో నుంచీ వస్తున్నారు. మల్లికను ఎవరో కార్లో ఎత్తుకు పొయ్యారని వినగానే ఇద్దరికీ నోట మాట రాలేదు.

****

*ఎక్కడో దూరంగా అడవుల్లో కాదు -*

*ఇక్కడే -*

*మన నాగరిక నగరాల నడిబొడ్డునే, అనాగరికత ఆదమరచి నిద్రపోతూ ఉంటుంది. ఎప్పుడో నిద్రలేచి ఒళ్ళు విరుచుకుని వికటాట్టహాసంతో మీద పడిపోతుంది.*

*న్యాయం, ధర్మం, చట్టం అన్నీ మన చుట్టూ ఉన్నా, మనిషిలోని పైశాకత్వం వికృతంగా నవ్వినప్పుడు, మన కళ్ళముందే దారుణాలు జరుగుతున్నప్పుడు, నిస్సహాయంగా చూస్తూ నిలబడటం మినహా మరేమీ చేయలేని చేతగానివాళ్ళమైపోతాం. ఇది కటిక నిజం.*

తన కళ్ళముందే, తమ ఇంటి ముందే ఎవరో ముక్కూ మొహం తెలియని వాళ్ళొచ్చి మల్లికను లాక్కుపోతే ఏం చేయాలో తెలియక, చేష్టలుడిగి, కళ్ళు అప్పగించి చూస్తూ నిలబడ్డాడు సత్యమూర్తి.

ఎప్పటికో తేరుకుని, లోపలకి వచ్చాడు.

రవి, తనూజ కూడా మాట్లాడటం లేదుగానీ, ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

ఇది ఎవరు చేసిన పని?

ఎందుకు మల్లికను అపహరించుకుపొయ్యారు? ఆమెను ఏం చెయ్యబోతున్నారు?

ఎవరు చెపుతారు వీటికి సమాధానాలు?

"ఆమె భర్తా, అత్తా కలిసి ఈ ప్లాను వేసి ఆమెను ఎత్తుకు వెళ్ళారు. స్పష్టంగానే తెలుస్తూనే ఉందిగదా..." అంది తనూజ.

సత్యమూర్తి మాట్లాడలేదు. రవి ఆవేశంగా అన్నాడు.

"మనిద్దరం వాళ్ళింటికి వెళ్ళి, వాళ్ళను అదిలించి, బెదిరించి తీసుకురాగలిగాను. ఇప్పుడొకవేళ మల్లికను వాళ్ళే ఎత్తుకుపోయినా, ఈసారి అన్ని ఏర్పాట్లూ కట్టుదిట్టంగా చేసుకునే ఉంటారు. గేటు ఇవతలే మన అంతు చూస్తారు. కనుక ప్రతిసారీ అదే పద్ధతి పనికి రాదు..." అన్నాడు సత్యమూర్తి.

"మరయితే ఏమిటి చెయ్యటం?" అని అడిగింది తనూజ.

"క్రిందటి సారి మల్లికను విడిపించుకు వచ్చే ప్రయత్నంలో డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ మొహం మీద కొట్టాను. అప్పటికి ఆగి, ఇదుగో ఒప్పుడిలా ఎదురు దెబ్బ కొట్టాడు. మా దెబ్బలు, ఎదురు దెబ్బలు ఎలా ఉన్నా, మల్లిక మాత్రం భర్త చేతుల్లోనే చిక్కితే, ఇంక ఆమెను బతకనివ్వడు... చంపేస్తాడు... ఒకరకంగా ఆమెనీ స్థితికి తెచ్చి, ఆమెకు ప్రాణాల మీదకు తెచ్చిన వాణ్ణి నేనే కనుక ఆమెను రక్షించటానికి చేయవల్సిందల్లా చేయటం నా ధర్మం. పైగా మల్లిక ఎవరో కాదు. నా పంచప్రాణాలూను... ఆమె నాకే దక్కనవసరంలేదు. నా దగ్గరే ఉండనవసరం లేదు. ఎక్కడున్నా ఫర్వాలేదు. తను హాయిగా, సంతోషంగా నిండుగా నవ్వుతూ ఉండగలిగితే నేనూ అంతకన్నా హాయిగా, సంతోషంగా ఉండగలను. కానీ ఆమె కష్టాల కోరల్లో చిక్కిందని వింటే చాలు, ముందు నాప్రాణం గిలగిల్లాడిపోతుంది. నేను విలవిల్లాడిపోతాను.... అసలు తప్పంతా నాది..." అంటూ జరిగిపోయినవన్నీ తవ్వుకుంటూ కూర్చున్నాడు.

"మనం వెళ్ళి పోలీసులకు కంప్లైంటు ఇద్దాం మాష్టారూ" అన్నాడు రవి.

"పోలీసులు, కేసులూ, ఇవన్నీ సాలెగూడులాంటివి. ఇందులో చిక్కుకున్న చిన్న చిన్న క్రిములూ, కీటకాల్లాంటివి. అవి ఈ సాలెగూడునే లాగేసి, దారిచేసుకు వెళ్ళిపోతాయి. మనుషుల విషయంలోనూ అంతే. నువ్వూ నేనూ తిండిలేని వాళ్ళం. మనం యుద్ధం చేసేదేమో అంగబలం, అర్థబలం పుష్టిగా ఉన్నవాళ్ళతో. అలాంటివాళ్ళతో ధర్మయుద్ధాలు చేసి మనం గెలవలేం. వాళ్ళ ఆయువుపట్టు ఎక్కడో చూసి, అక్కడ దెబ్బ కొట్టాలి" అన్నాడు సత్యమూర్తి.

"మరి వాళ్ళ ఆయువుపట్టు ఎక్కడ?" అని అడిగింది తనూజ.

"కలవారి కూతురివి, నీకు తెలియదా ఆ మాత్రం?" అని అడిగాడు సత్యమూర్తి.

ఒక అరగంట తర్వాత సత్యమూర్తి పోలీసు స్టేషనుకు బయలుదేరాడు. రవి కూడా వస్తానన్నాడు.

"అసలే, మన రోజులు బాగాలేవు. తనూజను ఒక్కదాన్నీ ఇంట్లో వదిలేసి వెళ్ళటం మంచిది కాదు..." అన్నాడు సత్యమూర్తి.

అందుకని రవి ఆగిపొయ్యాడు, కానీ ఎన్నాళ్ళు బయటకు వెళ్ళకుండా భార్యకు కాపలా కూర్చోగలడు? - అన్న ప్రశ్న ఎదురైంది. ఇంక అన్నీ సమాధానాలు దొరకని ప్రశ్నలే ఎదురవుతాయని అనుకున్నాడు.

సత్యమూర్తి దగ్గర్లో పోలీసు స్టేషనుకు వెళ్ళాడు. ఆవేళ జరిగినదంతా చెప్పాడు.

"ఆమె ఎవరు? నీకేమవుతుంది?" అని అడిగాడు సబ్‌ఇన్స్పెక్టర్.

"ఆమె మల్లిక. డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ గారని డాక్టరు. ఆయన భార్య. కానీ వాళ్ళిద్దరి మధ్యా కార్డియల్ రిలేషన్స్ లేవు. ఈ భార్యను ఏదోవిధంగా హతమార్చి, మరొకరిని చేసుకోవాలనే ఉద్దేశంతో ఉన్నాడు. అంచేత ఆమె భర్త దగ్గర నుంచీ వచ్చి, మా దగ్గర తల దాచుకుంటోంది..."

"ఆమె వచ్చిందా, నువ్వే వెళ్ళి తీసుకొచ్చావా?" అని అడిగాడు యస్.ఐ. ఈ ప్రశ్నలతో సత్యమూర్తికి అర్థమైపోయింది. తనకన్నా ముందే వాళ్ళే ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకొచ్చారని.

"ఇంతకుముందే వాళ్ళే నీ మీద కంప్లైయింట్ ఇచ్చారు.. మేమే మీ దగ్గరకు రావాలనుకుంటున్నాం. ఇప్పుడు నువ్వొచ్చి ఆమెను ఇంకెవరో ఎత్తుకు పోయారని అంటున్నావు. సంథింగ్, మిస్టీరియస్..." అన్నాడు యస్.ఐ.

"ఇంతకీ ఆమె మీకు ఏమవుతుంది?" అని అడిగాడు అతనే మళ్ళీ

"ఆమె నా క్లాస్‌మేట్. అప్పటినించీ క్లోజ్‌ఫ్రెండ్.." అని చెప్పాడు సత్యమూర్తి.

"మీరు ప్రేమించుకున్నారా? పెళ్ళి చేసుకోవాలనుకున్నారా?" అని అడిగాడు యస్.ఐ.

"అఫ్‌కోర్స్..." అని ఆగిపోయాడు సత్యమూర్తి.

"so you are a frustrated lover…"

"కావచ్చు. ఈ ప్రపంచంలో నూటికి తొంభైమంది మీరు అన్న భగ్న ప్రేమికులే. వాళ్ళల్లో నేనూ ఒకడ్ని, కనుక అదో పెద్ద విశేషమేమీ కాదు..."

"సాధారణంగా ఈ భగ్న ప్రేమికుల్లో ఒకరికి పెళ్ళి అయ్యాక ఆ కథకు అక్కడితో ఫుల్‌స్టాప్ పడుతుంది. కానీ మీరలా ఆగలేదు.... డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ చాలా ఫేమస్ డాక్టరు. ఎంత కాంప్లికేటెడ్ కేసు అయినా ఆయన సక్సెస్‌ఫుల్‌గా డీల్ చేయగలరు. మినిస్టర్లనుంచీ చాలా మంది పెద్దవాళ్ళతో ఆయనకు పరిచయాలున్నాయి. నీకు ఆయనతో పరాచికాలు ఏమిటి? ఆయనింట్లోకి వెళ్ళి, ఆయన భార్యను ఎత్తుకు వెళ్ళేంత గొప్పవాడివా? ట్రెస్‌పాస్ చేసినందుకు, కిడ్నాప్ చేసినందుకు నీమీద నేరారోపణలున్నాయి. పైగా ఇప్పుడేమీ ఎరగనట్లు వచ్చి ఆమెను ఎవరో ఎత్తుకు పొయ్యారంటూ కట్టుకథలు చెబుతున్నావా? ఆవిడిని ఎక్కడ దాచిపెట్టావ్? నువు మర్యాదగా చెబితే, మా శ్రమ తగ్గించిన వాడివి అవుతావు... లేదంటే నిజం తెలుసుకునేందుకు, మా పద్ధతులు మాకు ఉండనే ఉన్నాయి..." అంటూ యస్.ఐ. సత్యమూర్తిని మల్లికను ఎక్కడ దాచిందీ చెప్పమని వేధించటం మొదలు పెట్టాడు.

మల్లికను నిజంగానే ఎవరో ఎత్తుకుపొయ్యారని, ఇప్పుడామె ఎక్కడుందో తనకు తెలియదని సత్యమూర్తి ఎన్నిసార్లు చెప్పుతున్నా, అతను వినిపించుకోలేదు. రెండు గంటలు కూర్చోపెట్టాక, ఇంకేదో పనిమీద వెళుతూ సత్యమూర్తి అడ్రసు నోట్ చేసుకోమని, కానిస్టేబుల్‌కు చెప్పి వెళ్ళాడు.

సత్యమూర్తి అక్కడినుంచీ తిన్నగా లాయర్ దగ్గరకు వెళ్ళాడు. విషయం అంతా చెప్పాక, లాయరు అన్నాడు.

"కోర్టులో ఆమెను హాజరుపరచమని మనం పిటీషన్ పడేసినా పెద్దగా ప్రయోజనం ఉంటుందని నేను అనుకోను. ఇది చాలా పెక్యూలియర్ కేసు. పైగా పలుకుబడి, పోలీసులు అండ అటువైపే ఉన్నాయని అంటున్నారు కదా... ఇకపోతే భర్త ఇంటి నుంచీ ఆమెను తీసుకొచ్చినట్లు మీరే ఒప్పుకుంటున్నారు. ఆమె భర్తే ఆమెను ఎత్తుకుపోయి ఉంటాడనటానికి కారణాలున్నాయి గానీ, అతనే అపహరించుకు పోయాడనటానికి రుజువులు ఉన్నాయా? కనీసం కారు నెంబరైనా చెప్పలేకపోతున్నారు మీరు..."

"అయినా సరే, మీరు కోర్టులో ఫిటీషన్ పడేయండి. తర్వాత సంగతి నేను చూసుకుంటాను..." అన్నాడు సత్యమూర్తి.

ప్లీడరు ఫీజు మాట్లాడుకుని ఇంటికి వచ్చాక, తనూజ అడిగింది.

"ఇందువల్ల ఏమన్నా ప్రయోజనం ఉందంటావా?"

"ఏమీ ప్రయోజనం లేకపోవచ్చు. ఇంకేమీ చెయ్యలేక చూస్తూ కూర్చోలేక, చేస్తున్న విఫల ప్రయత్నాలు ఇవన్నీ..." అన్నాడు సత్యమూర్తి.

సత్యమూర్తి తరపున లాయరు కోర్టులో వేసిన దావా పెద్ద సంచలనాన్ని సృష్టించింది. ఒక మనిషిని వేధించి, హింసించి చంపటానికి ప్రయత్నించే హక్కు ఎవరికీ లేదని, భర్త అయినంత మాత్రాన ఆమెను అక్రమంగా నిర్బంధంలో ఉంచటానికి, మానసికంగా, శారీరకంగా చిత్రహింసలపాలు చేయటానికి వీల్లేదని సంఘంలో గౌరవ, ప్రతిష్టలు పుష్కలంగా ఉన్న డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ క్రూరంగా భార్యను చంపాలని చూశారని, సత్యమూర్తి సహాయంతో ఆమె ఆ ఇంట్లోంచి బయటపడినా, మళ్ళా ఎత్తుకుపొయ్యారని, కనుక ఈ పరిస్థితుల్లో అసలు విషయం తెలుసుకునేందుకు మల్లికను కోర్టులో హాజరు పరచాలని సత్యమూర్తి తరపు లాయర్ వాదించాడు.

అయితే డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ పక్షాన హాజరైన లాయర్ కూడా తమవైపు కథను కోర్టుకు విన్నవించుకున్నాడు. తనూజ, రవి హైదరాబాదు వచ్చేటప్పుడు, సత్యమూర్తి వాళ్ళ చేత మల్లికకు ఒక ఉత్తరం పంపాడు. దాన్ని కోర్టులో దాఖలు చేశాడు. ఈ సత్యమూర్తికీ మల్లికకూ పూర్వ పరిచయం ఉందని, ఆమెకు వివాహం అయిన తర్వాత కూడా సత్యమూర్తి ఆమె కోసం పరితపించి పొయ్యాడని, ప్రేమలేఖలు రాసాడని, ఇతను చావు బతుకుల్లో ఉంటే ఆమె పరుగెత్తికెళ్ళిందనీ, తీసుకొచ్చి చికిత్స చేయించిందనీ, తర్వాత ఇతను ఆమె ఇంటికే వెళ్ళటం మొదలు పెట్టాడని, భర్త అభ్యంతరం పెడితే, అఘాయిత్యం చేసి ఇంట్లో నుంచీ వెళ్ళిపోయి అతనితోనే ఉంటోందని, సత్యమూర్తి దగ్గర ఉండగానే మల్లిక మాయమైపోయిందని, మోజు తీరాక ఇతనే ఆమెను వదిలించుకునేందుకు ప్రయత్నించాడని స్పష్టంగా తెలుస్తోందని, ఆమెను ఎవరికో అమ్మివేయటమో, చంపివేయటమో జరిగి ఉంటుందని - డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ తరపు లాయరు వాదించాడు.

ఇద్దరూ ఆమె సంగతి తెలియదంటున్నారు గనుక, ఆమెను వెతికి పట్టుకోవాల్సిందిగా కోర్టు పోలీసులను ఆదేశించింది.

పోలీసులూ ఈ విషయంలో నిస్సహాయులుగానే కనిపించారు.

సత్యమూర్తి ఒక దినపత్రికలో పనిచేస్తున్న స్నేహితుడి దగ్గరకు వెళ్ళాడు. ఆ ఫ్రెండు సత్యమూర్తికి ఒకనాటి క్లాస్‌మేట్ అయినందువల్ల మల్లిక అతనికీ తెలుసు.

సత్యమూర్తి చెప్పినదంతా విని ఆ ఫ్రెండు జాలిపడ్డాడు.

"మీరిద్దరూ పెళ్ళి చేసుకుంటే బావుంటుందని, ఐడియల్ కపుల్‌లా ఉంటారని మేమంతా అనుకునేవాళ్ళం. కానీ మీ జీవితాలు ఇలా చిందరవందర అయిపోతాయని అనుకోలేదు..."

"అన్నీ మనం అనుకున్నట్లే జరగవు. ఏది ఎలా జరగాలో అలాగే జరుగుతుంది. పరిస్థితులూ, బుద్ధులూ అన్నీ మనల్ని అటే నడిపిస్తాయి... సరేగానీ మల్లిక మాయం కావటం, కోర్టులూ, కేసూ, ఇదంతా మీ పత్రికలో వేయించగలవ్ ? " అని అడిగాడు సత్యమూర్తి.

"మా పత్రికలోనే కాదు. అన్ని పత్రికల్లో వేయించగలను. అన్ని పత్రికల్లోనూ నాకు తెలిసిన వాళ్ళే ఉన్నారు. కానీ, పత్రికలకు ఎక్కినందువల్ల అందరికీ తెలియటం, మరింత చులకన కావటం తప్ప దీని వల్ల ఒరిగేదేముంది?" అని అడిగాడా ఫ్రెండ్

"ఏం జరుగుతుందో నేను చెప్పలేను. కానీ దానివల్ల కొంత మేలు జరుగుతుందేమోనన్న ఆశ ఒకటి కలుగుతోంది..." అన్నాడు సత్యమూర్తి.

"నీకూ, మల్లికకూ ఈ మాత్రం హెల్ప్ అయినా చేయగలిగినందుకు సంతోషిస్తాను. అప్పట్లో మీరిద్దరూ అంటే గొప్ప అడ్మిరేషన్ నాకు. ఇప్పటికీ ఆ ఆరాధనా భావం అలానే ఉంది...." అన్నాడతను సత్యమూర్తికి కాఫీ ఇచ్చి.

మర్నాడు అన్ని దినపత్రికల్లోనూ 'మాయమైన మల్లిక ఏమైంది?' అన్న శీర్షికతో వచ్చిన వార్త అందరి దృష్టినీ ప్రముఖంగా ఆకర్షించింది.

రవి పేపరు తీసుకొచ్చి చూపిస్తే, తనూజ కూడా చదివింది.

"ఇవన్నీ వీళ్ళకెవరో చెప్పినట్లే రాశారే?" అంది తనూజ.

"నేనే చెప్పి రాయించానమ్మా" అన్నాడు సత్యమూర్తి.

"ఎందుకు చెప్పావు అన్నయ్యా? ఇంటిగుట్టు రచ్చకెక్కించుకోవటం, అందరి దృష్టిలో పడటం తప్ప దీనివల్ల ప్రయోజనం ఏముంది?" అని అడిగింది తనూజ.

పోలీసులు, కోర్టులూ, కేసులూ - వీటి చుట్టూ నేను మల్లికను కాపాడుకోవటానికి చేయదగిన ప్రతి చిన్న పనీ చేయాలనీ... ఆమె భర్తే గనుక మల్లికను అపహరించుకుపోతే, ఈసారి ఆమెను చంపేస్తాడు. అందులో సందేహం లేదు. అయితే పట్టించుకునే దిక్కు లేకపోతే, డాక్టరు గనుక ఏ చిన్న ఇంజక్షనో ఇచ్చి ఆమెను ఇట్టే పైకి సాగనంపుతాడు. కానీ నేను పోలీసులు, కోర్టులూ, పత్రికలూ - అంటూ ఒక్క అవకాశమూ వదలకుండా, నానా రభసా చేస్తే, వెంటనే మల్లికను చంపటానికి భయపడతాడు. తన పథకాన్ని అమలు పరచటానికి మరికొన్నాళ్ళు ఖచ్చితంగా ఆగుతాడు. ఆమెను కబళించబోతున్న మృత్యువును ఒకరోజు, ఒక గంట, ఒక క్షణం అయినా ఆపగలనేమోనన్న ఆశ.... ప్రవాహంలో పడి కొట్టుకు పోతున్నవాడు, గడ్డిపోచ దొరికినా గట్టిగా పట్టుకుంటాడు నా పరిస్థితి ఇప్పుడలాగే ఉంది..." అన్నాడు సత్యమూర్తి.

మల్లిక ఆచూకీ కోసం సత్యమూర్తి చేయవల్సినదంతా చేస్తూనే ఉన్నాడు. కానీ ఆమె ఎక్కడుందో మాత్రం తెలియడంలేదు. చాలా ఘోరంగా ఓడిపోయాడని తెల్సిపోయింది. 'తాను ఓడటం, గెలవటం, ఇదొక పెద్ద విషయంకాదు. మల్లిక ఎన్ని అవస్తలు పడుతోందో? ఎన్ని చిత్రహింసలకు గురి అవుతుందో?' ఇదే సత్యమూర్తిని వేధిస్తోంది.

నిద్రాహారాలు మానేసి ఏదో ఆలోచించుకుంటున్నాడు. కళ్ళు ఎర్రగా జ్యోతుల్లావెలిగిపోతున్నాయి. గడ్డం పెరిగిపోతోంది. జుట్టు దువ్వుకోవటం మానేశాడు. ఎప్పుడూ ఏదో పరధ్యానంగా ఉంటున్నాడు. రెండు మూడుసార్లు పిలిస్తేగానీ పలకటం లేదు. అన్నం ముందు కూర్చుని మెతుకులు కెలుకుతుంటాడుగానీ, ముద్ద నోట్లోకి పోవటం లేదు.

ఎవరితో ఏమీ మాట్లాడకుండా ఒంటరిగా కూర్చుని, చుక్కల్లోకి చూస్తుంటాడు.

"మీకిదేమన్నా బావుందా?... మాకు ఎన్నో విషయాలు అర్ధమయ్యేటట్లు చెపుతారు. ఎంత చిక్కు సమస్యనైనా ఇట్టే పరిష్కరిస్తారు. ఆపదలో ఉన్నావాళ్ళకూ ధైర్యం చెబుతారు. ఇలా అయిపోవటం, ఏమన్నా బావుందా?"

"నిజమేనమ్మా. నేనిందుకిలా అయిపోతున్నానో నాకే తెలియదు.... బహుశా చెప్పటం తేలిక, చెయ్యటం కష్టం అయినందువల్ల కావచ్చు..."

"ఇన్ని తెల్సిన మీరు బాధపడటం ఏమిటి?"

"ఎన్ని తెల్సినా నేనూ మనిషినే. కష్టం, సుఖం, బాధ, ఆనందం - ఇవి అందరికీ అనుభవంలోకి వచ్చేవే. ఆ కాసేపూ ఆ అనుభూతికి లోనుగాక తప్పదు. 'అంతా మిథ్య' అనే మునీశ్వరుడూ నిప్పు ముట్టుకుంటే చెయ్యి కాలుతుంది. ముల్లుగుచ్చుకుంటే నొప్పిపుడుతుంది. ఈ తనువూ, మనసూ సజీవంగా ఉన్నంత వరకూ, ఈ అనుభూతులు ఉప్పెనలా వచ్చిపడి, మనల్ని ముంచెత్తుతూనే ఉంటాయి, తనూజా..." అన్నాడు సత్యమూర్తి.

"మీకులాగానే మల్లిక కూడా ఏ పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కోగలదు. కనుక ఆమెను గురించి మనం భయపడాల్సిన పనిలేదు" అని ధైర్యం చెప్పబోయింది తనూజ.

సత్యమూర్తి అదోలా నవ్వాడు. "భయం మన పరిధిలో ఉన్నంతసేపే మనం ధైర్యంగా ఉండగలం. ఈ పరిధి దాటి వెళితే ఎంత భయం? ఊళ్ళో ఉన్నంతసేపూ రొమ్ములు విరుచుకు తిరుగుతాం. కానీ అడవిలోకి వెళితే చచ్చేంత భయం. పులి మనల్ని చంపేస్తుందని మనకు భయం. మనం దాన్ని చంపేస్తామని దానికి భయం. పాము పడగ ఎత్తితే మనకు భయమేసి పారిపోతాం. మనం కర్ర ఎత్తితే దానికిదానికి భయం వేసి అది పారిపోతుంది.... అంతలా ఉంటుంది మన ధైర్యం, మన భయం..."

తనూజ కొంత సేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత అడిగింది "మల్లిక వాళ్ళింట్లోనే ఉందంటావా?"

"అది తెలియకేగదా, ఇంత బెంగా? రెండే రెండు చోట్ల అనుమానాలున్నాయి. డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ తన భార్య మరో చోట ఉండటం ఇష్టం లేక ఆమెను ఎత్తుకుపోయి ఉండవచ్చు. లేదా - మీ నాన్న వచ్చి నిన్ను చూసి వెళ్ళాడు కదా - నిన్ను లాక్కుపోవటానికి మనుషుల్నిపంపితేం వాళ్ళు నీవే అనుకుని మల్లికను అపహరించుకుపోయి ఉండాలి. ఈ ఇద్దరికీ తప్ప ఇంక మిగతావాళ్ళకు ఆమెను ఎత్తుకుపోవాల్సిన అవసరం ఏముంది?" అన్నాడు సత్యమూర్తి.

"డాక్టరుగారింట్లో ఉందేమోనని తెలుసుకోవడానికి చేయవల్సిన ప్రయత్నాలన్నీ చేశారుకదా! అయినా ఏమీ తెలియలేదు. కాబట్టి మా నాన్న దగ్గర మల్లిక బందీగా పడి ఉందేమో చూసిరావడానికి వెళతాను.." అంది తనూజ.

సత్యమూర్తి ఆశ్చర్యంగా చూశాడు. "నువ్వు మీ ఇంటికి.. మీ నాన్న దగ్గరకి వెళతావా?

"ఏం మా ఇంటికి వెళ్ళటానికి, మా నాన్న దగ్గరకి వెళ్ళటానికి ఇంక భయం ఎందుకు? ఎలాగూ ఆయనకి మన ఉనికి తెల్సిపోయింది. ఆయన రావటం. రమ్మనమని అడగటం వీలున్నప్పుడు నేనే వస్తానని చెప్పటం జరగవలసినదంతా జరిగిపోయిందికదా... వెళ్ళి మల్లిక అక్కడ ఉందేమో తెలుసుకుని వస్తాను. మా నాన్న దగ్గర ఉన్నదీ లేనిదీ తెలుసుకుంటే ఇంక ఇక్కడ ఉన్నదీ లేనిదీ ఒక నిర్ధారణకు రావచ్చు..." అంది తనూజ.

"నిజమేగానీ.. ఇప్పట్లో నువ్వు మళ్ళా ఆ ఇంటికి వెళితే, ఏం జరుగుతుందో తెల్సా? అని అడిగాడు సత్యమూర్తి.

"పరాయివాళ్ళని అంటే చంపిస్తాడేమోగాని, కడుపున పుట్టినదాన్ని కదా. చూస్తూ చూస్తూ నన్ను చంపలేడు. అంతవరకు నమ్మకమే..." అని పేలవంగా నవ్వింది తనూజ.



"చంపడుగానీ, ఇంక చచ్చినా నిన్ను బయటకు కదలనివ్వడు. ఆ ఇంట్లోనే నీకూ ఒక జైలు గది తయారవుతుంది...."

"ఆడదాని జీవితం అంటేనే జైలు జీవితం. మొదటిసారి జైలుకు వెళ్ళేటపుడే భయం, జంకు... తర్వాత అంత సంకోచం ఉండదులే. కొన్నాళ్ళ కిందట 2 ఇంట్లోనుంచి బయటపడి, రవితో రావటానికి ఎంతో ఆలోచించాల్సి వచ్చింది. బోలెడంత మధన పడాల్సి వచ్చింది. ఈ కొద్ది రోజుల అనుభవం తర్వాత నాలో వచ్చిన మార్పు నాకే తెలుస్తోంది. నేనిప్పుడు మా నాన్న దగ్గరకు వెళ్ళగలను. ఆయనకు సమాధానం చెప్పగలను. మళ్ళా వెనక్కి రాగలను.... " అని చెప్పింది.

"నువ్వు రావాలనుకున్నా మీ నాన్న రానిస్తాడా అన్నదే నాకు అనుమానం..." అన్నాడు సత్యమూర్తి.

తనూజ ఇంకేం చెప్పినా వినదల్చుకోలేదు. రవితో చెబితే, అతని కొంచెం సేపు ఏమీ మాట్లాడలేదు.

"నిన్ను వెళ్ళమనీ చెప్పలేను, వద్దనీ చెప్పలేను" అన్నాడు.

"వాళ్ళ మనకోసం చాలా శ్రమ పడ్డారు. ఎంతో రిస్క్ తీసుకున్నారు. మనం ఈ మాత్రం అయినా చేయకపోతే బావుండదు" అంది తనూజ.

"మాష్టార్ని చూస్తుంటే నాకూ బాధగానే ఉంది. మల్లిక దగ్గర నుంచిఆయన ఏం కోరి ఆశిస్తున్నాడో, ఏం కోరుకుంటున్నాడో తెలియదు గానీ, ఆమె కోసం ఆయన మరీ పిచ్చివాడైపోతున్నాడు..."

"ఇందాక నేనూ అదే అన్నాను... అంటే ఏమన్నారో తెలుసా? ఎదుటివాళ్ళకు ఎన్ని అయినా చెప్పొచ్చు. మనదాకా వస్తేనే, ఆ బాధేమిటో తెలియదులెమ్మన్నారు... " అంది తనూజ.

"నిజమే నువ్వు వెళ్ళిపోతానంటే నాకూ చాలా బాధగా ఉంది. నిన్ను విడిచి ఉండలేకపోతున్నాను, తనూజా..." అన్నాడు రవి ఆమెను దగ్గరకు లాక్కుని.

నేను మాత్రం మిమ్మల్ని విడిచి ఉండగలనా? మళ్ళీ వచ్చేస్తానుగదా? " అంది తనూజ.

ఒకరి కౌగిలిలో మరొకరు ఇమిడిపోయారు, ఒకరి కళ్ళల్లోకి ఇంకొకరు చూసుకుంటూ, ఒకరి కన్నీరు ఇంకొకరు తుడుచుకుంటూ చాలా సేపు అలాగే ఉండిపోయారు.

తండ్రి దగ్గరకు వెళ్ళాక తనూజ బందీ అయి, పంజరంలోని పక్షిలా మారితే ఏంచేయాలో, విషయం తనకు ఎలా తెలియజేయాలో రకరకాల ఐడియాలతో తనూజకు చెప్పాడు రవి. మేడమీద బాల్కనీలో తెల్లపూలు, తెల్లజేబుగుడ్డ వేలాడగడితే, ఆమె అక్కడ లేదని ఎర్రజేబు గుడ్డకడితే తానే కష్టాల్లో పడిపోయినట్లని ఎన్నో గుర్తులు చెప్పి, తనూజను రవి ఆమె తండ్రి దగ్గరకు, ముకుందరావుగారింట్లోకి పంపించాడు.

****

*మన్మధ లోల లోచనాలతో చూస్తూ -*

*ఎదలో మెదిలే మోహన లాహిరితో కదులుతూ -*

*నవ్విస్తూ, కవ్విస్తూ, మైమరిపిస్తూ ఉండే తనూజ వెళ్ళి పోతే, జీవితంలోని వెన్నెలంతా ఆసాంతంగా వెళ్ళిపోయినట్లే ఉంది రవికి పట్టపగలే చుట్టుముట్టిన చిమ్మ చీకట్లో అన్నిటికీ తడుముకుంటున్నట్లే ఉంది.*

లోకం అంతా మామూలుగానే ఉంది. ఒక్క తనూజ పక్కన లేదన్న మాటేగాని, మిగతా ప్రపంచం అంతా సజావుగానే ఉంది. కానీ రవికి మాత్రం ఏమీ తోచటం లేదు. బుర్ర పని చేయటం లేదు. అసలు బుర్ర ఉందా లేదా అన్న అనుమానం వల్ల కాబోలు, నిముష నిముషానికి తల తడిమి చూసుకుంటున్నాడు. నిన్నటిదాకా ఈ ఇంట్లో చైతన్యాన్ని నింపిన తనూజ, ఇప్పుడు ఇక్కడ లేదన్న భావమే రవిని మానసికంగా కృంగదీస్తోంది. తింటున్నాడో, లేదో తెలియదు. కంచం ముందు కూర్చుని లేస్తున్నాడు. నిద్రపోతున్నాడో లేదో అతనికే తెలియదు, పడుకుని లేస్తున్నాడు.



ఇదంతా గమనిస్తున్న సత్యమూర్తి రవితో అన్నాడు.

"ఏమిటి అస్తమానం పరధ్యానంలో ఉంటున్నావ్?"

"నాకు ఒకటే ధ్యానం, మాష్టారూ, తనూజ ధ్యానమే. ఆమె లేకపోవడంవల్ల ఏం తోచటంలేదు. తనూజ పక్క గదిలోనో పెరట్లోనో ఉందనే అనిపిస్తోందిగానీ, ముకుందరావుగారి దగ్గరకు వెళ్ళిపోయిందనిపించటం లేదు. అసలు ప్రపంచంలో మగాళ్ళంతా పెళ్ళాలను వదిలి ఎలా ఉండగలరా - అనిపిస్తోంది..." అన్నాడు రవి.

"పెళ్ళాలను కాదు పెళ్ళాన్ని అను. బహువచనం కాదు, ఏకవచనం వాడాలి. పెళ్ళాం ఊళ్ళో లేకపోతేనే మగాడికి నిజమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించేది. ఉదాహరణకు పెళ్ళాం లేకపోతే మంచం మీద అటునుంచైనా, ఇటునుంచైనా పడుకోవచ్చు. అసలు మంచం అంతా నీవే దొర్లొచ్చు..." అని అతనికి ఏదో చెప్పి మురిపిద్దామని చూస్తున్నాడు సత్యమూర్తి.

"నిద్రపట్టకనేకదండీ మంచమంతా దొర్లేది. తనూజ ఉంటే నిద్రపట్టకపోవడం అనేది ఉండదు... మీకూ తెలుసుకదండీ. మీరూ దాదాపుగా ఇలాంటి బాధలోనే ఉన్నారు గదా. మీరు గడ్డం ఎందుకు చేసుకోవటం లేదు, చెప్పండి..." అని అడిగాడు రవి.

"నాకు పెరిగేది అదొక్కటే... ఉద్యోగం లేదు. జీతం లేదు. కరువుభత్యం లేదు. కనుక అవేమీ పెరుగుతాయన్న ఆశలేదు. ఊరికినే పెరుగుతున్న ఒక్క గడ్డానికే ఎందుకు అడ్డం పడాలని..." అని నవ్వాడు సత్యమూర్తి.

"మీరింత బాధలోనూ ఎలా నవ్వగలుగుతున్నారు సర్..." అని అడిగాడు రవి.

"బాధలు ఉంటూనే ఉంటాయ్. బాధలున్నాయని మనం నవ్వటం మానేస్తే, అసలు నవ్వటమే మర్చిపోవాల్సి వస్తుంది. తల్లి కడుపులో నుంచి బయటపడగానే కొంపలు అంటుకు పోయినట్లు కెవ్వుమని ఏడుస్తాం. నాలాంటి మొండివెధవ 'మీరే ఏడవండి, నేనేం ఏడవనని' మొండికేస్తే, కొట్టిమరీ ఏడిపిస్తారు. అలా పుట్టి భూమ్మీద పడిన మరుక్షణంలో మొదలెట్టిన ఏడుపు, ఎన్నేళ్ళొచ్చినా ఆపకుండా, దేనికో ఒకదానికి ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటారు కొందరు. ఇంకొందరేమో, ఆ ఏడుపు అప్పుడే మానేసి, కేరింతలు కొడుతూ నవ్వుతూనే ఉంటారు జీవితాంతం... అది ఒక్కొక్కళ్ళ మనస్తత్వం....." అన్నాడు సత్యమూర్తి.

"మీరు నేను ఏడుపుగొట్టు వెధవనని అనుకున్నా, నాకేం అభ్యంతరంలేదు. నేను ఎప్పుడు దేనికోసమూ ఏడవను కానీ తనూజ కోసం ఏడుస్తున్నాను. ఎందుకంటే... హి ఈజ్ మై బెటర్ హాఫ్. ఆ బెటర్ హాఫ్ లేకపోతే, నేను నిజంగా వరస్ట్ ఆఫ్..." అన్నాడు రవి.

"చాల్లే ఊరుకో, అక్కడికి నీకొక్కడికే భార్య ఉందనుకోకు. అందరూ పుట్టింటికి వెళ్ళటం లేదా? రావటం లేదా?.." అని అడిగాడు సత్యమూర్తి.

"అందర్లా అలా వెళ్ళి ఇలా వస్తే, తనూజ గురించి నేనింత బాధ పడకపోదును మాష్టారూ... కావటానికి అదొక పెద్ద భవనం అయినా నిజానికి అదొక ఎలుకల బోను. ఎలుక అందులోకి వెళ్ళటం తేలికే కానీ ప్రాణాలతో బయటకు రాలేదు... తనూజ కూడా ఎలుకల బోనులో దూరినట్లే అనిపిస్తోంది నాకు. అందుకే నేను అక్కడికి వెళ్ళివద్దామనుకుంటున్నాను..." అన్నాడు రవి.

"నువ్వా? అక్కడికి వెళ్తావా? వద్దు రవీ... ప్రాణాలతో చెలగాటాలాడతాడాయన, నువ్వు ఆ ఇంటివైపు, ఆ వీధివైపు వెళ్ళావని తెలిసినా, ఊరుకోడు..." అన్నాడు సత్యమూర్తి.

"వెళ్ళకుండా ఎలా ఉండగలనండీ... నాప్రాణం, నా సర్వం... అయిన తనూజ అక్కడ ఉంటే, జీవశ్చవంలా ఇక్కడ నేనెలా ఉంటాను..." అని బాధపడ్డాడు రవి.

"తనూజ తానే వచ్చేస్తానని చెప్పింది కదా..." అని గుర్తు చేశాడు సత్యమూర్తి.

"రానిస్తే కదా? పంజరంలో చిలకలా అయిపోయిందేమో..." అని సందేహం వెలిబుచ్చాడు రవి.

"ఏమైనా, నువ్వా ఇంట్లోకి వెళ్ళొద్దు. నీకు తెలియదు. ఆయన నిన్ను కోడిపెట్టను పట్టుకున్నట్టు పట్టుకుని, నీ పీక విరిచేస్తాడు..."

"నేను ఆయన కంటపడను. ఊరు నాకు కొత్తేంకాదు. నా ఫ్రెండ్స్ చాలా మంది ఉన్నారు. ఒక ఫ్రెండ్ ఇంట్లో ఉంటాను. నేను ఆ ఫ్రెండ్ ఇంట్లోంచి బయటకు రాకుండానే, ముకుందరావుగారింట్లో ఏం జరుగుతుందో తెలుసుకోగలను...." అన్నాడు రవి.

"ఎలా?"

"కొన్ని ట్రాన్స్‌మీటర్స్ పెట్టుకున్నాం సర్..." అని నవ్వాడు రవి.

"ఫర్వాలేదు అయితే" అని సత్యమూర్తి కూడా నవ్వాడు.

రవి ఆ వేళే బయలుదేరి వెళ్ళాడు. సత్యమూర్తి ఎన్నో జాగ్రత్తలు చెప్పి పంపించాడు.

***

తనూజ తండ్రి ఇంట్లోకి వెళ్ళాక, కూతుర్ని చూసి ముకుందరావుగారు ఆత్రంగా ఎదురొచ్చారు.

"వచ్చావా అమ్మా... వాళ్ళు నిన్ను రానిచ్చారామ్మా..." అని అడిగారు.

"నేనే వచ్చేశాను నాన్నా..." అంది తనూజ.

"పోన్లేమ్మా. ఇప్పటికైనా నీ తప్పు తెలుసుకుని వచ్చేశావు. అదే సంతోషం. తప్పులు అందరూ చేస్తారు. కానీ సరియైన సమయంలో తెలుసుకుని, తప్పుదిద్దుకుని, మళ్ళా దారిలో పడటమే తెలివైన వాళ్ళ లక్షణం.."

తనూజ ఏం మాట్లాడలేదు, తలదించుకుంది.

"నేను చెప్పిన మాటలు నీకు రుచించలేదు. నీకిప్పుడు జీవితం పాఠాలు నేర్పితేగానీ తెలిసిరాలేదు... ఆడపిల్లల్ని పెంచటమే కష్టం. వయసులో ఉన్న ఆడపిల్ల మీద ప్రేమ అనే మత్తుమందు జల్లి, మైకంలోకి లాగి ఎంత రభస చేస్తారో నీకు తెలియదు. తప్పు తెలుసుకుని నువ్వు వచ్చేసినా వాడు ఇంతటితో వదిలేసి ఊరుకోడు. జీవితాంతం, నీడలా వెంటాడుతూ నిన్ను బ్లాక్ మెయిల్ చేస్తూనే ఉంటాడు - అలాంటివాడిని అడ్రసు లేకుండా చేయటమే బెటర్... ఆ విషయం నాకొదిలెయ్..." అన్నాడు ముకుందరావు. తనూజ ఉలిక్కిపడింది.

"నాన్నా, రవిని నువ్వేం చెయ్యొద్దు. ఇందులో నా పాత్రకూడా చాలా ఉంది. అతడిని ఒక్కడ్నే శిక్షించటానికి వీల్లేదు, శిక్ష అంటూ అనుభవిస్తే ఇద్దరం సమానంగా అనుభవించాలి..." అంది తనూజ.

"నువ్వింత పిచ్చితల్లివి కనుకనే, వాళ్ళంత తేలికగా మోసం చేయగలిగారు. మోసగాడు ఎప్పుడూ ముందు నమ్మకాన్ని సంపాదిస్తాడు. వాడిమీద నమ్మకం కుదిరాకనే, అదునుచూసి దెబ్బతీశాడు. నువ్వూ అలాగే మోసపోయావు.. కనుక నువ్వేం శిక్షలూ, జరిమానాలూ పొందనవసరంలేదు... అదేదో వాడికే వెయ్యాలి.." అన్నారాయన.

అంతటితో తనూజ ఆ ప్రసంగం ఆపేసింది.

ముకుందరావు కూతురికి తెలియకుండా చుట్టూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాడు. ఇరవై నాలుగంటలూ ఆమెను కనిపెట్టుకుని చూసేందుకు నలుగురు మనుషుల్ని పెట్టాడు.

తనూజ నోట్లో మాట నోట్లో ఉండగానే వాళ్ళే అన్నీ ఏర్పాటు చేస్తున్నారు. భోజనానికి లేవకపోతే, అదీ ఆమె గదిలోకే తెచ్చారు. మంచి నీళ్ళు వంకపెట్టుకుని కిందకి దిగుదామన్నా దిగనివ్వటంలేదు.

లాన్‌లోకి వెళ్ళి పూలు కోసుకొద్దామనుకుంటే, 'ఏ పూలు కావాలో చెప్పండి మేం తెస్తాం' అన్నారు వాళ్ళు.

తనూజకు పరిస్థితి అర్థమైంది. తను హౌస్ అరెస్టు కూడా కాదు. రూం అరెస్టు.

సాయంత్రం కిందకి దిగబోతే ద్వార పాలకులు అడ్డుపడ్డారు.

"మీకేం కావాలో చెప్పండి మేం తీసుకొస్తాం" అన్నారు

"ఒరేయ్, నేను కాస్తగాలి పీల్చుకోవాలిరా... ఆ గాలి కూడా నా బదులు మీరే పీల్చుకుంటారా?" అని అడిగింది.

"గాలి కావాలంటే కిటికీలు, కర్టెన్లూ తెరుస్తామండి... అంతేగానీ మీరు బయటకు మాత్రం వెళ్ళటానికిల్లేదండి..."

"ఎందుకని?"

"అది అంతేనండి అయ్యగారి ఆర్డరు..."

"అదేమిటో అయ్యగార్నే అడుగుతాను ఉండు" అంది తనూజ.

"అందుక్కూడా వెళ్ళటానికిల్లేదండి.."

"నీ బోడి పెత్తనం ఏం(టా?" అంటూ తనూజ వాడిని తోసేసి కిందకి వస్తుంటే వాడు ఆమెతో పాటు పరుగెత్తుకొచ్చాడు.

"ఏమిటి నాన్నా ఇది" అని అడిగింది తనూజ.

"నీ మంచికోసమేనమ్మా..." అన్నారాయన.

"ఏమిటి నాన్నా, నా మంచి? ఇంట్లో కూడా తిరగటానికి వీల్లేదా?"

"ఇంట్లో తిరగకూడదని కాదు. నౌకర్లున్నారుగా... నీకు కావల్సిన వన్నీ వాళ్ళే ఏర్పాటు చేస్తారు..."

"చూడు నాన్నా.... నువ్వు నన్ను" ఎంత బందిఖానాలో పెట్టినా, ఇనుపగొలుసులు వేసి కట్టేసినా, వెళ్ళదల్చుకుంటే వెళ్ళిపోగలను... ఒకసారి వెళ్ళాను కదా... నువ్వు వెతుక్కుంటూ వచ్చి రమ్మన్నా రాలేదు. కానీ, నేను రావాలనుకున్నప్పుడు, నా అంతట నేనే వచ్చాను గదా... వచ్చినందుకా నాకీ బంధికానా...."

"ఆడపిల్ల జీవితమే ఒక పెద్ద బందిఖానా -"

"ఈ ఉపన్యాసాలు నేనూ ఇవ్వగలను..."

"మరి అంత తెల్సినదానివి నువ్వు చేసిన పనేమిటి? ఇష్టం వచ్చిన వాడితో లేచిపోయి..."

"నేను లేచిపోలేదు... పెళ్ళి చేసుకున్నాను..."

ముకుందరావు నవ్వాడు. "పెళ్ళా, పెద్దగా అనకు. పిచ్చెక్కిందనుకుంటారు. నీకు పెళ్ళివారం రోజుల్లో జరగబోతోంది?"

"నాకు మళ్ళా పెళ్ళా?"

"మళ్ళా ఏం లేదు. ఇదే ఫస్ట్‌టైం..." అన్నారాయన.

తనూజ నివ్వెరపోయింది. తాను ఇంతదూరం వచ్చి? ఈ ఇంట్లో చిక్కుకుపోయింది ఇందుకా?... అన్న ప్రశ్న ఎదురైంది.

"అయితే వచ్చిన పని వేరు. మల్లిక విషయం తెలుసుకోవాలి అందుకే ఆవేశపడకూడదు, తొందరపడకూడదు" అనుకుంది తనూజ.

కనుకనే తండ్రి పెళ్ళిమాట ఎత్తితే, సమాధానం చెప్పలేదు.

ఆ రాత్రి ముకుందరావు పక్కన చేరి కాసేపు కబుర్లు చెప్పిన తర్వాత తనుజ అన్నది.

"మొన్నీ మధ్య నువ్వు నాకోసం వచ్చావు చూశావా, అప్పుడు మా ఇంట్లో ఇంకొక ఆమె ఉంది, గమనించావా?"

"అవును..."

"ఎవరామె?"

"మల్లిక అని మా పొరుగింటామె. నేను అక్కడికి వెళ్ళినప్పటినుంచీ నాతో స్నేహంగా ఉంటూ చాలా సాయం చేసింది. నాకు అక్కయ్య లేని కొరత తీర్చింది... కానీ ఒకరోజు పొద్దుటే ఎవరో ఆమెను కిరాయి వెధవలు నేనే అనుకుని, మల్లికను ఎత్తుకు పొయ్యారేమోనని... చాలా బయపడిపొయ్యాను..." అంది తనూజ.

"నాకా ఆలోచన రాలేదమ్మా. నీకై నీవే వస్తానన్నావుగదా. అలా వచ్చేరోజు ఎంతో దూరంలో లేదని నాకు అక్కడున్న కాసేపట్లోనే అర్థమైపోయింది. అంచేత నిన్ను నేను ఎత్తుకు రావాల్సిన పనిలేదు. పరిస్థితులే ఇక్కడకు పంపుతాయని తెల్సు..." అన్నాడు ముకుందరావు.

"అవును నాన్నా... పరిస్థితులే నన్నిక్కడికి పంపాయి" అంది తనూజ.

మల్లిక విషయంలో తండ్రి చెప్పినదాంట్లో అనుమానించాల్సిందేమీ కనిపించలేదు తనూజకు. కనుక, మల్లిక ఇక్కడ లేదన్న సంగతి పోయింది. అనవసరంగా వచ్చి మళ్ళా కథ మొదటికి తెచ్చానని అనుకుంది.

ఇదివరకంటే నమ్మకంతో ఆయన వదిలేసి ఊరుకున్నాడు కాబట్టి, రవిని కల్సుకోగలిగింది. ఇంట్లోంచి పారిపోగలిగింది.

ఇప్పుడలా కాదు. చుట్టూ కూర్చుని నిద్రాహారాలు మాని కాపలా కాస్తున్నారు. బయటపడటం ఎలా? - ఈ ప్రశ్నకు తనూజకు సమాధానం దొరకక ముందే, ముకుందరావు మళ్ళా అడిగారు.

"హైదరబాదు సంబంధం ఖాయం చేశానమ్మా. ఆ కుర్రవాడు చాలా మంచివాడు. నీ ఫోటో చూసి పెళ్ళికి వప్పుకున్నాడు. కానీ, ఇంతలో నువ్వు ఇంట్లోంచి పారిపోవటంతో, నేనే - మాకు కొంత టైం కావాలని వాయిదా వేశాను. నువ్వు వచ్చేశావు గనుక, మళ్ళా ఫోను చేసి చెప్పాను. పదిరోజుల్లో ముహూర్తం ఉంది... వాళ్ళు సిద్ధంగానే ఉన్నారు. అంచేత ఆ ముహూర్తం ఖాయం చేశాను..."

"నాకొకసారి పెళ్ళి అయింది నాన్నా..."

"వదిలించుకుని వచ్చేశావు కదమ్మా, ఇంక వాడు లేడు అనుకో, ఏదో ప్రమాదంలో పోయాడనుకో..."

"ఎలా అనుకోను? ఉన్నాడు కదా..."

"మనకు సరిపడనప్పుడు, మనకు సంబంధించినంత వరకు ఇంకలేడని - మనసును సరిపెట్టుకోవాలమ్మా, తెలిసో తెలియకో తప్పటడుగు వేశావు. తప్పు తెలుసుకున్నావు. సరిదిద్దుకుంటున్నావు. ఇది సరియైన పద్ధతి, అంతేగాని అలాంటి వాడికోసం నీ నిండు జీవితాన్ని పాడుచేసుసుకుంటావా?.... జరిగిందేదో జరిగిపోయింది. ఇంక నీ సొంత తెలివితేటల మీద ఆధారపడి లాభంలేదు. నా మాటవిని ఈ పెళ్ళి చేసుకుని, నువ్వు సుఖపడితే, చుసి సంతోషిస్తానమ్మా... నిన్ను కని పెంచి పెద్ద చేసినందుకు, నిన్ను నేను ఇంకేమీ కోరటంలేదు. ఈ ఒక్క ముచ్చటా తీర్చు తల్లీ. జరిగినదాని గురించి ఆందోళన పడకు. ఇలాంటి వాటిని ఎలా తొక్కిపెట్టాలో నాకు బాగా తెలుసు..." అన్నాడు ముకుందరావు.

తనూజ ఏమని సమాధానం చెప్పగలదు? మౌనంగా తలదించుకుంది.

ఆమెకు రవి గుర్తొచ్చాడు. తనకోసం పిచ్చెక్కిపోయి వెర్రిగా ఇల్లంతా వెతుక్కుంటూ ఉండి ఉంటాడు. తనను చూడకుండా ఉండలేడు. 'మళ్ళా తప్పకుండా వస్తాను నేస్తం' అని నమ్మకంగా చెప్పివచ్చింది. వచ్చాక ఇంకెవర్నో చేసుకుని అతనికి దూరమైపోతే, రవి బతకలేడు. తలబద్దలు కొట్టుకుని చచ్చిపోతాడు.

తను మాత్రం ఎలా ఉండగలదు? ఇంత బలంగా అనుబంధాలు ముడివడిపొయ్యాక వాటిని తెంచేసుకుని, అతని జ్ఞాపకాలన్నిటినీ చెరిపేసుకుని, - తనను తాను మోసం చేసుకుంటూ, ఇటు రవిని మోసం చేసి అటురాబోయేవాడ్ని అతడ్నీ మోసం చేసి సుఖపడగలదా?

తండ్రి మాత్రం సుఖపడమనే అంటాడు.

మనిషన్నాక అంతరాత్మ ఉండదా? అందరినీ మోసం చేసినా, అంతరాత్మను మోసం చేయటం ఎలాగా?

తనూజను ముకుందరావు ఇంకేమీ అడగలేదు. మర్నాటి నుంచీ పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ  చేయటం మొదలుపెట్టాడు.

తనూజ నిస్సహాయంగా గుడ్లనీరు కుక్కుకుంటూ, దుఃఖాన్ని గొంతులోనే దిగమింగుకుంటూ -

"దేవుడా, నన్నేం చేయమంటావో చెప్పు" అంటూ నోరులేని దేవుడికి, నోరువిప్పి చెప్పుకుంటోంది.

ఎప్పట్లా నవ్వుతూ చూస్తున్నాడా దేవుడు.

పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ జరిగిపోతున్నాయి. శుభలేఖలు అచ్చు అయినయి. ముకుందరావుగారు వాటిని ముఖ్యమైన వాళ్ళందరికీ స్వయంగా ఇచ్చివచ్చే పనిలో ఉన్నాడు .

***

ఆ వేళ రాత్రి ఏడుగంటలప్పుడు గదిలో నుంచి దిగులుగా చూస్తున్న తనూజకు రోడ్డుమీద ఆగిన స్కూటర్ కనిపించింది. ఆ స్కూటర్ మూడుసార్లు బజర్ మోగించి, మూడుసార్లు లైటు వెలిగించి ఆర్పేసింది. అది రవి తనకు పంపిస్తానన్న సిగ్నల్.

తనూజ కూడా మూడు సార్లు లైటు ఆర్పేసి వెలిగించింది.

ఒక పావుగంట  తర్వాత ఆ స్కూటర్ అక్కడ్నించి వెళ్ళిపోయింది. కానీ అతను రవి కాదు.

ఆ వచ్చినవాడు రవి, తనూజకీ క్లాస్‌మేట్ ప్రభాకర్... రవి వచ్చి ఆ స్నేహితుడిదగ్గరే దిగాడు. ప్రభాకర్ సహాయాన్ని అర్థించాడు.

"మూడుసార్లు లైటు వెలిగించి ఆర్పేస్తే అర్థం ఏమిట్రా? " అని అడిగాడు ప్రభాకర్.

"తనూజ తనకు మూడుముళ్ళు వేయించబోతున్నట్లు, చెప్పినట్లు.. అలా చేస్తే..."

"భలేగా ఉందిరా, మీ కోడ్.. ఇంకా ఏమన్నా సిగ్నల్స్ ఉన్నాయా?" అని అడిగాడు ప్రభాకర్.

"రేపు పగలు కూడా నువ్వు ఆ ఇంటి ముందునుంచే వెళ్ళు........ కిటికీకి కట్టిన రిబ్బన్లు బయటకు ఎగురుతూ కనిపిస్తాయి, అవి ఏ రంగు రిబ్బన్లో వచ్చి చెప్పు..." అన్నాడు.

మర్నాడు అలాగే చూసివచ్చి చెప్పాడు. తెలుపు రంగు, ఎరుపు రంగు రిబ్బన్లు రెండు కనిపించాయన్నాడు.

"తెలుపురంగు రిబ్బన్‌కు అర్థం - మల్లిక అక్కడ లేదని, ఎరుపు రంగుకు అర్థం తాను బయటికి రాలేని స్థితిలో ఉన్నానని..." అని వివరించాడు రవి.

"భలేగా ఉన్నాయిరా, మీ టెలీకమ్యూనికేషన్స్..." అని నవ్వాడు ప్రభాకర్.

"ఇదంతా మా ఖర్మ.. ఏం చేస్తాం చెప్పు.. పెద్ద యుద్ధాన్ని జయించాలంటే, ఒక్కోసారి ఇలాంటి గూఢచారి సంకేతాలే ఆధారం అవుతాయి. నిక్సన్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు వాటర్ గేట్ స్కాండల్ పేపర్లో వస్తుండగా.. వెయ్యికళ్ళతో అధ్యక్షుని సిబ్బంది కనిపెట్టి చూస్తుండగా... రహస్య సమాచారాలు ఎలా బయటికెళ్ళాయో తెల్సా?.... ఇలాగే..."

"అబ్బో... చాలా స్టడీ చేసి, యుద్ధానికి దిగావే?... తర్వాత కార్యక్రమం ఏమిటి?"

"నువ్వు తనూజతో మాట్లాడిరావాలి" అన్నాడు రవి.

"నేనా?"

"నువ్వే" అన్నాడు రవి.

ముకుందరావు ఎవర్నో పెళ్ళికి పిలవటానికి వెళ్ళిన సమయం చూసి ప్రభాకర్ వాళ్ళింటికి వెళ్ళాడు.

బ్యాండు మేళం మాట్లాడి రమ్మన్నారని, కుదుర్చుకుని వచ్చానని ఈ విషయం ముకుందరావుగారు లేకపోతే తనూజతో చెప్పాలని, నౌకర్లతో చెప్పి, ఆమె దగ్గరకు వెళ్ళాడు ప్రభాకర్.

తనూజ గుర్తుపట్టింది. అర్థం చేసుకుంది.

"బాగున్నావా? అని అడిగింది.

"నేను బాగానే ఉన్నాను... రవి నీకోసం వచ్చాడు. మనిషి నీకోసం చిక్కి శల్యమైపొయ్యాడు.. తెల్సా?"

"నేనేం చెయ్యను? నా పెళ్ళికి మానాన్న అన్ని ఏర్పాట్లు చేసి, నా నోరు నొక్కేస్తున్నాడు. ఏం చేయాలో తెలియని అయోమయంలో పడ్డాను. ఎలాగైనా రవినే వచ్చికాపాడమను" అంటూ శుభలేఖ ఇచ్చింది. ప్రభాకర్ చేతికి.

ప్రభాకర్ తెచ్చిన శుభలేఖ చూసి రవికి ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియలేదు.

హైదరాబాదులో వాళ్ళు అద్దెకున్న ఇంటివాళ్ళకు ఫోన్ ఉంది. ఆ నెంబర్‌కి ట్రంక్‌కాల్ చేసి సత్యమూర్తితో మాట్లాడాడు.

"నువ్వక్కడ ఉండటం చాలా రిస్క్... వెంటనే వచ్చేసెయ్..."

"తనూజను ఇలా వదిలి ఎలా రావటం?" అని అడిగాడు రవి.

"మనం ఇటునుంచి నరుక్కొద్దాం, రా...." అన్నాడు సత్యమూర్తి.

"ఇటునుంచి అంటే?"

"నువ్వు వెంటనే బయలుదేరి వచ్చేయ్. చెపుతాను" అన్నాడు సత్యమూర్తి.

రవికి ఇష్టం లేకపోయినా మాష్టారే ఏమైనా చేయగలరన్న ఆశతో హైదరాబాదు బయలుదేరాడు.

***

*ఆవేశం ముంచుకొచ్చినప్పుడు -*

*అసలు ఆలోచననే రాదు.*

*ఆ కాసేపు పగ, ద్వేషం, కోపం. ఇవే మనిషినీ, మనసునీ ఊపేస్తాయి. కనుకనే అలాంటప్పుడు ఎంత తెలివి గల వాళ్ళు అయినా తెలివి తక్కువ పనులు చేస్తారు.*



తనూజకు, ప్రాణప్రదమైన తన భార్యకు, ఆమె తండ్రి మరో పెళ్ళి చేస్తున్నాడని తెలిసి రవి చూస్తూ ఎలా ఊరుకోగలడు? సహజంగానే కోపంతో ఉడుకెత్తి పోతాడు. వెర్రెత్తి పోతాడు. ఆ ఆవేశంలో యుక్తాయుక్త విచక్షణా జ్ఞానమే ఉండదు. తనూజ కోసం ఏ సాహసమో చేయబోయి, ముకుందరావు చేతికి చిక్కాడంటే, ఇంక రవి మీద ఆశలు వదులుకోవాల్సిందే

అందుకనే తనూజ పెళ్ళి విషయం రవి ఫోన్ చేసి చెప్పగానే, రవిని తన దగ్గరకు వచ్చెయ్యమన్నాడు సత్యమూర్తి.

మల్లికను ఎవరో ఎత్తుకుపొయ్యారు. ఎక్కడుందో, ఏమైందో తెలీదు. మల్లిక కోసం తనూజ స్వయంగా వెళ్ళి, తండ్రి చేతిలో చిక్కి బయటకు రాలేక గిలగిల్లాడిపోతోంది. మెడలు వంచి మళ్ళీ నిస్సహాయంగా చూస్తోంది.

ఇంక మిగిలింది రవీ ఒక్కడూ - ఇతన్నీ దూరం చేసుకోలేడు. ఏం జరగాల్సి ఉంటే అదే జరుగుతుందని సత్యమూర్తి, రవిని ఉన్నపళంగా హైదరాబాదు వచ్చెయ్యమన్నాడు.

తనుకు మిగిలిన ఒకే ఒక్క శ్రేయోభిలాషి అయిన మాష్టారి మాట కాదనలేక, రవి వచ్చేశాడు. కానీ ప్రాణం అంతా తనూజ దగ్గరే కొట్టుకులాడిపోతోంది.

రాగానే అక్కడ తాను సేకరించిన సమాచారం కాస్తా చెప్పాడు రవి.

"ఎల్లుండి పెళ్ళి తనూజ ఇంకొకడికి భార్య అయిపోతుంది. అతనితో అత్తారింటికి వెళ్ళిపోతుంది. మొదట్లో నాలుగు రోజులు నా గురించి బాధపడుతుందేమో.. తర్వాత ఇంక నేను గుర్తుండకపోవచ్చు. కొత్తగా వచ్చే భర్త నాలాగా ఆమెను అన్నింటికి వేధించడు లేనిపోనివన్నీ చెప్పి ఆమె మనసు కష్టపెట్టడు. అసలు దేనికి నొప్పించడు. కాలుకింద పెడితే కందిపోతుందేమోన్నంత ఆదరంగా చూసుకుంటాడు. ఇంక ఆ లోకంలో పడిపోతుంది. పూర్తిగా నన్ను మర్చిపోతుంది.... కలవారి అమ్మాయి కనుక, కలవారి కోడలుగానే చివరకు స్థిరపడిపోతుంది. మధ్యలో నాతో గడిపిన ఈ కొద్దిరోజుల అనుబంధం ఇదో పీడకలగా మర్చిపోతుంది, మాష్టారూ" అన్నాడు రవి గద్గద స్వరంతో. "పరిస్థితులు ఆమెను అటువైపు నెడుతున్న మాట నిజమేగానీ, తనూజ అంత తేలికగా నిన్ను మర్చిపోతుందంటే, నేను నమ్మలేను..." అన్నాడు సత్యమూర్తి.

"ఉన్నన్ని రోజులూ నేను తనూజ మనసు కష్టపెట్టాను మాష్టారూ. ఉన్నవాళ్ళ కుటుంబంలో పుట్టిన అమ్మాయిగనక, ఆమెకు మొదటినుంచీ కొంచెం కోపం ఎక్కువ రావటంలో వింతేమీ లేదు. నేనే కొంతకాలం ఓపికతో వెధవ జోకులు వెయ్యకుండా ఉంటే బావుండేది..... మల్లిక వంక చెప్పిందికానీ విసుగొచ్చి అసలు కావాలనే వెళ్ళిపోయి ఉంటుంది మాష్టారూ..." అన్నాడు రవి. తనూజ కోసం తెగబాధపడిపోతూ.

రవిని చూస్తుంటే సత్యమూర్తికి జాలేస్తోంది. అస్తమానం తనూజనే గుర్తుచేస్తున్నాడు. ఆమెకు ఏం అలవాట్లున్నాయో, ఎలాంటి ఇష్టాలున్నాయో, అడగకుండానే సత్యమూర్తికి చెబుతున్నాడు.

సత్యమూర్తి వినకపోయినా, గోడకో, కుర్చీకో, దేనికో ఒకదానికి చెప్పుకుంటున్నాడు, తన విరహవేదన.

తనూజ దక్కకపోతే, వీడు పిచ్చివాడైపోతాడు - అనుకున్నాడు సత్యమూర్తి.

"వెళ్ళిపోయే ముందు రోజు తనూజ ఈ కిటికీ దగ్గరే నిలబడి తల దువ్వుకుంటోంది. నేను వెనకనుంచీ వచ్చి రెండు చేతులూ నడుం చూట్టూ చుట్టి, ఆమె భుజం మీద తల వాల్చేశాను. తనూజ విసుక్కుంది. చుట్టు పక్కలవాళ్ళు టీవీ చూట్టం మానేసి, మన కిటికీ వంకే చూస్తున్నారంది విడిపించుకుంటూ.... వాళ్ళింక కిటికీ వంక చూడక్కర్లేదు. ఎంచక్కా వాళ్ళ టీవీలే చూసుకోవచ్చునండీ, ఎందుకంటే ఇంక తనూజ ఇక్కడికి రాదు..." అంటున్నాడు రవి కిటికీ దగ్గర నిలబడి.

"రవీ, నేను ఇక్కడున్నాను. నీవు అక్కడ ఎవరితో మాట్లాడుతున్నావ్?" అని అడిగాడు సత్యమూర్తి.

"ఈ గాలీ, ఈ మేఘాలూ అన్నీ అటువైపే వెళుతున్నాయి. తనూజతో చెబుతాయేమోనని" అన్నాడు రవి ఆకాశం వంక చూస్తూ.

సత్యమూర్తి దీర్ఘంగా నిట్టూర్చాడు.

తనూజ పెళ్ళికి వేయించిన శుభలేఖ ఒకటి తెచ్చాడు రవి. దానిలో పెళ్ళికొడుకు పేరు, అతను చేసే ఉద్యోగం వివరాలూ క్లుప్తంగా ఉన్నాయి. ఆ మాత్రం ఆధారం దొరికినందుకే, సత్యమూర్తి సంతోషించాడు.

అతని పేరు శ్రీకాంత్. పేరు మోసిన ఒక ప్రైవేటు కంపెనీలో ఇంజినీర్. ఆ కంపెనీకి వెళ్ళి శ్రీకాంత్ గురించి అడిగితే అతను శలవులో ఉన్నాడని, ఆ వేళ సాయంత్రమే పెళ్ళికి తరలి వెళుతున్నారనిచెప్పారు. ఇంటి అడ్రసు వాళ్ళనే అడిగి తెలుసుకుని ఇంటికెళ్ళాడు.

అది ఆగర్భశ్రీమతుల భవంతి అని చూడగానే చెప్పొచ్చు. ఇంటి ముందు లాన్. అక్కడ షామియానా వేశారు. కుర్చీల్లో చాలామంది కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. కాసెట్ పెట్టినట్లున్నాడు సన్నాయి వాయిద్యం వినసొంపుగా వినిపిస్తోంది.

సత్యమూర్తి షామియానాలోకి అడుగు పెట్టగానే, తెల్లని లాల్చీ పైజమాలో, సన్నగా పొడుగ్గా ఉన్న ఒక యువకుడు ఎదురొచ్చి నవ్వుతూ కరచాలనం చేశాడు. ఎంతో పరిచయస్తుడిలా లోపలికి రమ్మని ఆహ్వానించాడు.

"మిస్టర్ శ్రీకాంత్..." అని ఆగిపొయ్యాడు సత్యమూర్తి.

"అయామ్ హిజ్ బ్రదర్ రవికాంత్... అన్నయ్య లోపలున్నాడు. పెళ్ళికొడుకును చేస్తున్నారు. లేడీస్ ఫార్మాలిటీస్ ఉంటాయికదా" అని చిన్నగా నవ్వాడు రవికాంత సత్యమూర్తి పక్కనే కూర్చుని.

"మా ఇల్లు తేలిగ్గా కనుక్కోగలిగారా?" అంటూ రెండూ నిముషాలు మాట్లాడాడు.

"భోజనాలకు లేటు అవుతుంది. ఈలోగా కొంచెం టిఫెన్, కాఫీ తీసుకుందురుగాని రండి" అంటూ రవికాంత్ లేచాడు.

సత్యమూర్తి ఎంత వద్దని చెప్పినా వినకుండా, రవికాంత్ చిన్నపిల్లాడిలా సత్యమూర్తి చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళి ఒక పట్టుచీర అమ్మాయిని పరిచయం చేశాడు 'మా చెల్లి విజయ' అంటూ.

హాల్లో చాలామంది ఆడాళ్ళు ఉన్నారు. సోఫాలో కూర్చున్న అతనే శ్రీకాంత్ అయిఉంటాడు. బుగ్గన నల్ల చుక్క పెట్టుకున్నాడు. నుదుట కళ్యాణం తిలకం దిద్దుతోంది. ఒక నడివయసు స్త్రీ. పెద్దగా కబుర్లు చెప్పుకుంటూ ఆడవాళ్ళు గలగలా నవ్వుకుంటున్నారు.

విజయ సత్యమూర్తిని పక్కగదిలోనుంచి వెనకవైపు వరండాలోకి తీసుకెళ్ళింది. డైనింగ్ టేబుల్ ముందు సత్యమూర్తిని కూర్చోబెట్టింది విజయ. స్వీటూ, హాటూ తెచ్చి అతని ముందు పెట్టి చాలాకాలం నుంచి పరిచయం ఉన్నదానిలాగా పక్కనే కూర్చుని 'తీసుకోండి' అంది. తాను ఎవరో, ఎందుకొచ్చాడో ఈమెకు తెలియదు. ఈ ఇంట్లో ఆనందాన్ని చెల్లా చెదురు చేయటానికి వచ్చిన వ్యక్తి అని తెలియక, ఇంత మర్యాద చేస్తుంటే, సత్యమూర్తి ఏమనలేకపోతున్నాడు.

"మీరు చాలా మొహమాటపడుతున్నారు. మా అన్నయ్య ఇంతకు ముందెప్పుడూ మిమ్మల్ని మా ఇంటికి తీసుకురాలేదు. ఒకసారి చూసి ఉంటే, నేను ఎవరినీ మర్చిపోను... అరె అలా చూస్తూ కూర్చున్నారేం, తీసుకోండీ... ప్లీజ్" అంది విజయ.

"లేదమ్మా నేనేమీ తీసుకోలేను" అన్నాడూ సత్యమూర్తి.

"మీరేమీ తినకపోతే, మేం చాలా బాధపడతాం. ఇవాళ మమ్మల్ని అలా మనసు కష్టపెట్టొద్దు. హావ్ సంథింగ్..." అంటూ విజయ ఎంతో చనువుగా, ఆప్యాయంగా అంటుంటే సత్యమూర్తికి ఏమనాలో తెలియలేదు.

కానీ తాను వచ్చింది వీళ్ళ విందులు ఆరగించటానికి కాదు. ఎంత వద్దన్నా విజయ వినిపించుకోలేదు. ఆ కాస్తా తినిపించిగాని వదల్లేదు. సాయంత్రం ఎన్ని గంటలకు పెళ్ళికి బయల్దేరాలో చెబుతోంది. సత్యమూర్తిని పెళ్ళికొడుకుతోపాటు కార్లో వచ్చేస్తారా, లేక రైల్లో వస్తారా అని అడిగింది విజయ. సత్యమూర్తి నవ్వేసి ఊరుకున్నాడు.

వీళ్ళంతా బాగా ఉన్న వాళ్ళే కాదు. మంచి మనసున్న వాళ్ళు ఆదరణ, ఆప్యాయతా అందరికీ పంచిపెట్టే వాళ్ళు - అన్న విషయం ఈ కొద్దిసేపట్లోనే సత్యమూర్తి గ్రహించాడు.

"అమ్మా, మీ అన్నయ్యను కొంచెం పిలుస్తావా?" అని అడిగాడు విజయను.

విజయను లోపలికి వెళ్ళి, ఆడవాళ్ళ మధ్య కూర్చుని పెళ్ళికొడుకు అవుతున్న శ్రీకాంత్ చెవిలో ఏదో చెప్పింది.

శ్రీకాంత్ చుట్టూ ఉన్న వాళ్ళందర్నీ తప్పించుకుని ఇతని దగ్గర కొచ్చి ఆప్యాయంగా చెయ్యి చాచి "అయామ్ శ్రీకాంత్" అన్నాడు నవ్వుతూ. ఎంతో హుందాగా, అందంగా ఉన్నాడు.

"నా పేరు సత్యమూర్తి నేను మీతో కొంచెం సేపు మాట్లాడాలి...." అన్నాడు.

"చెప్పండి" అన్నాడు కొంచెంగా రెండు అడుగులు గ్రిల్‌వైపు వేసి.

"ఇక్కడిలా నిలబడి చెప్పమంటే చెప్పలేను... మనం కొంచెం బయటకు, ఎక్కడికన్నా వెళదాం..." అన్నాడు సత్యమూర్తి.

"ఇప్పుడా, బయటికా, చూస్తున్నారుగా, చుట్టూ ఎంతమంది నన్ను చుట్టుముట్టేసి ఉన్నారో? రెండు రోజుల దాకా బయటకు రావటం వీలుపడదు... ఇంతకీ మీరు.." అని మధ్యలో ఆగిపోయాడు శ్రీకాంత్.

"నేను మీకు తెలియదు. కానీ మీరు చేసుకోబోయే తనూజ నాకు బాగా తెలుసు. ఆమె విషయం మీతో కొంచెం వివరంగా మాట్లాడాలి... ఇప్పటికే బాగా ఆలస్యం అయింది. ఇప్పుడు మీతో ఈ విషయం మాట్లాడకపోతే, ఇంకెప్పుడూ ఈ విషయం మీ ముందుకు తేవటం కుదరదు" అన్నాడు సత్యమూర్తి.

శ్రీకాంత్ మొహంలో రంగులు మారినాయి. "వాడ్డూయూ మీన్?" అన్నాడు.

"ఆ చిన్న ప్రశ్నకు నేను చాలా పెద్ద సమాధానం చెప్పాలి... అందుకు ఇక్కడ వీలుపడదు. కనుకనే దయచేసి, నాకో అరగంట స్పేర్ చేస్తారేమోనని అడగటానికి వచ్చాను..." అన్నాడు సత్యమూర్తి.

శ్రీకాంత్ ఒక్క నిముషం ఆలోచించి, తర్వాత 'రండి వెళదాం' అన్నాడు. 'ఇప్పుడే వస్తాం' అని విజయతోనూ, రవికాంత్ తోనూ చెప్పి, శ్రీకాంత్ కారు బయటకు తీసి, సత్యమూర్తిని కార్లో ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. గేటుదాటుతున్న కారువంకే, విజయ, రవికాంత్ ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నారు.

ఒక పావుగంట తర్వాత వాళ్ళిద్దరూ ఒక హోటల్లో కూర్చున్నారు. శ్రీకాంత్ కాఫీకి ఆర్డరిచ్చాడు. కొంచెం ముందుకు వంగి అడిగాడు.

"ఇంక చెప్పండి?" అన్నాడు.

"మీ ఇంట్లో వాతావరణం చూశాను. మీరంతా ఎంతగా ఆనందకోలాహంలో మునిగి ఉన్నారో అదీ గమనించాను. నేను చెప్పబోయేది వింటే మీరంతా చాలా అప్‌సెట్ అవుతారు... ఈ కొద్ది సేపట్లోనే మీరంతా ఎంత మర్యాదస్తులో అర్థంచేసుకున్నాను. నిష్కారణంగా మిమ్మల్నిలా కష్టపెట్టటం, బాధపెట్టటం చాలా అన్యాయమని తెలుసు... అయినా మీతోచెప్పుకోక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది..." అన్నాడు సత్యమూర్తి.

"మీరు చెప్పదల్చుకున్నదేదో చెప్పండి. నేను వినటానికి రెడీగా ఉన్నాను..." అన్నాడు శ్రీకాంత్.

"వినటమే కాదు?మీకు చేయవల్సిన సాయమూ చాలా ఉంది..."

"ముందు విషయం ఏమిటో చెప్పండి..." అన్నాడు శ్రీకాంత్ మళ్ళీ.

సత్యమూర్తి ఒక క్షణం ఆగి శ్రీకాంత్‌ను అడిగాడు.

"తనూజను మీరు పెళ్ళి చేసుకోబోతున్నారు కదా.. ఆ అమ్మాయిని మీరు చూశారా?"

"చూశాను" అన్నాడు శ్రీకాంత్.

"ఎప్పుడు?" అని అడిగాడు సత్యమూర్తి.

"ఏడాది కిందట మా బంధువుల ఇంట్లో పెళ్ళికి వచ్చింది. అప్పుడే మా చెల్లెలు విజయ, నేనూ తనూజను చూశా, కాసేపు నాతో తనూజ మాట్లాడింది. అప్పుడే ఒక అభిప్రాయానికొచ్చాను... ఐలైక్‌డ్ హర్..."

"బావుందండి తర్వాత?

"విజయ ఇంటికొచ్చాక, మా వాళ్ళతో చెప్పింది - మా పేరెంట్స్ తెలిసినవాళ్ళ ద్వారా ముకుందరావుగారిని కాంటాక్టు చేశారు. ఆయన వచ్చి, మాట్లాడి సెటిల్ చేశారు..." అన్నాడు శ్రీకాంత్.

అంతేగాని మీరు తనూజను చూడటానికి వెళ్ళలేదన్నమాట..." సత్యమూర్తి.

"ఆ అవసరం లేకపోయింది" - శ్రీకాంత్.

"కానీ, ఆ అవసరం తనూజకు అయినా ఉండొచ్చుకదా... తనూజ చదువుకున్న పిల్ల, అందరిలోనూ చాలా సరదాగా, ఫ్రీగా మాట్లాడుతుంది. మీతోనూ అలాగే మాట్లాడి ఉంటుంది. ఆ మాట్లాడిన రెండు నిముషాల్లో మీరు ఇష్టపడి ఉండొచ్చు. కానీ, ఆ పిల్ల ఇష్టాఇష్టాల్ని కనుక్కోవాలి కదా. మీరు కూడా ఇలా చేశారేమిటి?' అని అడిగాడు సత్యమూర్తి.

"ఆమెకు ఇష్టం లేదన్న విషయం నాకు ఎలా తెలుస్తుంది?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"తెలిసే అవకాశం లేకుండా చేసుకున్నారు. మీ అంతట మీరే పెళ్ళికి నిర్ణయం తీసుకున్నారు...."

"వాళ్ళ నాన్నగారే వచ్చి..."

"నాన్నగారికి నచ్చి ఉండొచ్చు. మీరు చేసుకోబోయేది తనూజను. ఆ పిల్ల రేపువచ్చి మీ ఇంట్లో కాపురం చేయాలి. అందుకా అమ్మాయి సిద్ధంగా ఉందా లేదా అన్న సంగతి తెలుసుకోవాలి కదా మీరు..."

"ఇష్టం లేకపోతే మేం కబురు చేసినప్పుడే చెప్పాల్సింది మాకు -"

"మీరు కబురు చేసింది ముకుందరావుగారికి, సంబంధం నచ్చనిది తనూజ... ఏం జరుగుతోందో ఆ అమ్మాయికి చివరి నిముషం దాకా తెలియదు. ఇప్పుడు తెలిసీ ఏమీ చేయలేని స్థితిలో ఉంది..."

"ఆమెకు ఇష్టం లేదని మీకెలా తెలుసు?" అని అడిగాడు శ్రీకాంత్.

"ఆమెకు ఇష్టమైన వాడితో దగ్గరుండి పెళ్ళి జరిపించినవాడిని నేనే గనుక..." అన్నాడు సత్యమూర్తి.

"ఏమిటన్నారు?" అని ఆశ్చర్యపొయ్యాడు శ్రీకాంత్.

"అవును తనూజకు ఇదివరకే, ఇటీవలే పెళ్ళి అయింది. నేనే ఆ పెళ్ళికి సారథ్యం వహించాను' అంటూ సత్యమూర్తి రవి తనూజల విషయం అంతా చెప్పాడు.

"ఒకసారి పెళ్ళి అయిన పిల్లకు, మళ్ళా పెళ్ళిచేస్తున్నారంటే నేను నమ్మలేకపోతున్నాను..." అన్నాడు శ్రీకాంత్.

"తనూజ తాను కోరుకున్నవాడితో ఎక్కడకో వెళ్ళిపోయి పెళ్ళిచేసుకుంది. అంచేత ముకుందరావుగారు దాన్ని పెళ్ళికాదు పొమ్మంటున్నాడు. బహుశా రవి కట్టిన తాళిబొట్టును తెంచి అవతల పారేసి ఉంటాడు. చేతిలో ఉన్న పనికాబట్టి తాళి తెంచగలిగాడు. కానీ కొన్నిరోజుల పాటు ఆమెతో రవితో కాపురం చేసింది. దాన్ని కాదనటం ఎలా...? ఎవరో పెళ్ళి చేసుకుని కొంతకాలం సంసారం చేసి, చుట్టంచూపుగా తండ్రి దగ్గరకి వెళితే, ఆ పిల్ల మెడలు వంచి మళ్ళీ మీ చేత తాళికట్టిస్తున్నారు. రేపు బలవంతంగా ఆమెను మీ ఇంటికి తెచ్చుకున్నా, ఆమె మనసు మాత్రం, తను ప్రేమించినవాడి చుట్టూనే తిరుగుతుంటుంది. అప్పుడా అమ్మాయి మీతో పైకి నవ్వుతున్నా, లోపల ఏడుస్తూనే ఉంటుంది. అక్కడ రవీ ఆమె కోసం ఏడుస్తూనే ఉంటాడు.... అంత గాఢంగా ప్రేమానుబంధంతో కౌగిలించుకున్న వాళ్ళను చెరోపక్కకు లాగి, ఆమెను మీ కౌగిట్లోకి లాక్కోవాలనుకోవటం - ఎంత న్యాయమో ఆలోచించండి.... ఇది రాక్షసులు చేయాల్సిన పనిగానీ, మనుషులు చేయాల్సిన పనికాదు... ఏమంటారు?" అని ఆగాడు సత్యమూర్తి.

"నేను ఇంకా తనూజను చేసుకోవాలన్న ఆరాటంలో ఉండి కాదు, మీకు సమాధానం చెప్పలేకపోవటం... ఇది నిజమా, ఇలా జరుగుతుందా అన్న సందిగ్ధంలో నుంచి తేరుకోలేకపోతున్నాను..." అన్నాడు శ్రీకాంత్.

"నిజమే మీకు అలాంటి అనుమానం రావటమూ సహజమే. మీరు నాతో మా ఇంటికి వస్తే, తనూజను పెళ్ళిచేసుకుని, ఆమెతో కాపురం చేసి, ఇప్పుడామె దూరమైనందుకు అలమటించిపోతున్న వ్యక్తిని చూపిస్తాను" అన్నాడు సత్యమూర్తి.

"పదండి... నాకూ అతన్ని చూడాలని ఉంది" అన్నాడు శ్రీకాంత్.

ఇద్దరూ సత్యమూర్తి ఇంటికొచ్చారు. శ్రీకాంత్ రవిని చూసాడు.

"మీరు తనూజను పెళ్ళిచేసుకున్నట్లు నమ్మించటానికి రుజువులేమైనా ఉన్నాయా?... ఇంకా నమ్మకం కుదరకే ఇలా అడుగుతున్నాను" అన్నాడు శ్రీకాంత్.

"సర్... తనూజ ఎవరో కాదు షి ఈజ్ జస్ట్ ఏన్ ఎ సెక్షన్ ఆఫ్ మై బాడీ అండ్ సోల్. తనూజ ఇక్కడినుంచీ వెళ్ళేదాకా, ఆమె మీద నాకు సర్వహక్కులూ ఉండేవి. ఆమె తనువులోని ప్రతి అణువూ నాకు పరిచయమే. తనూజ ఒంటిమీద ఎక్కడ పుట్టుమచ్చ ఉందో చెబుతాను. కావాలంటే వెళ్ళి తనఖీ చేసుకోండి..." అంటూ తనూజ శరీరం మీద ఎవరికీ కనిపించని చోట్ల ఉండే గుర్తులన్నీ చెప్పుకొచ్చాడు రవి.

"వీళ్ళు ఇక్కడ భార్యాభర్తలుగా ఉన్నారో, లేదో పక్కన వాళ్ళను విచారించండి. ఇంటివాళ్ళను పిలవమంటారా?" అని అడిగాడు సత్యమూర్తి.

"అక్కర్లేదు..." అన్నాడు శ్రీకాంత్.

"నన్ను ఇంతదూరం తీసుకొచ్చి ఇప్పుడు నన్నిలా వదిలేసి వెళ్ళి పోతే, ఇది దారుణం. కన్ను మూసినా, కన్ను తెరిచినా, ఇక్కడ తనూజే కనిపించి కనుమరుగైపోతోంది. ఈ దాగుడు మూతలు ఆడటం నాకు చేత కావటం లేదు. ఏది అయితే అదే అవుతుందని, తన దగ్గరకి వెళదామంటే, నన్ను చంపేస్తారని మాష్టారు భయపెట్టి ఆపేస్తారు. ఏం చేయాలో తెలియటం లేదు. మీరు వెళ్ళి పెళ్ళి చేసుకుంటారట కదా. పోనీ వెళ్ళి చేసుకోండి సార్... మీకు రావాల్సిన కట్నాలూ, కానుకలూ అన్నీ వసూలు చేసుకోండి... మీ వసూళ్ళు అన్నీ అయ్యాక తనూజను మాత్రం తెచ్చి ఇక్కడ వదిలెయ్యండి. షి ఈజ్ మై వైఫ్. షి ఈజ్ మై వైఫ్..." అంటున్నాడు రవి.

సత్యమూర్తి అందుకున్నాడు. "వాడేం మాట్లాడుతున్నాడో కూడా వాడికి తెలియటం లేదు. వాళ్ళ మధ్య అంతగా అటాచ్‌మెంట్ పెరిగిపోయింది. తల్లికోసం తల్లడిల్లే పిల్లాడిలా అల్లాడిపోతున్నాడు. ఇప్పటికీ మీకు నమ్మకం కుదరలేదా?"

శ్రీకాంత్ కొద్ది క్షణాలు దీర్ఘంగా ఆలోచించుకున్నాడు. తర్వాత కిటికీలో నుంచి వీధిలోకి చూస్తూ అన్నాడు.

"నన్ను పెద్ద ఇరకాటంలో పెట్టేశారు. ఇంత జరిగాక తనూజను నేను చేసుకోవాలన్న తలంపేరానివ్వలేను. కానీ, ఇంటినిండా జనం ఉన్నారు. ఇంకో నాలుగు గంటల్లో అంతా బయలుదేరబోతున్నారు. వాళ్ళందరికీ ఇవన్నీ చెప్పలేను. ఒకవేళ చెప్పినా, ఇంతదూరం వచ్చాక, పరువు కోసం ప్రాకులాడే పెద్దవాళ్ళు ఈ ప్రేమ గొడవను తేలిగ్గా కొట్టిపారేసి, తమ పంతం నెగ్గించుకుంటారు. ఈ పెళ్ళి తప్పించటం ఎలాగో తెలియటం లేదు..." అన్నాడు శ్రీకాంత్.

"నిజమే. ఈ చివరి నిముషంలో పెద్దవాళ్ళకు నచ్చచెప్పి, వాళ్ళ మనసులు మార్చటం సాధ్యంకాదు... ఇప్పుడింక ఒకే ఒక్కదారి కనపడుతోంది..." అన్నాడు సత్యమూర్తి.

"ఏమిటది?" అని అడిగాడు శ్రీకాంత్.

"మీరో చిన్న నాటకం ఆడాలి..."

"నాటకమా? ఏం నాటకం?"

"కొంపలంటుకుపోయే కారణాలుంటేగానీ, ఈ పెళ్ళిళ్ళు ఆగవు అంచేత మీరు ఏదో వంక చెప్పి, రెండురోజులు ఆస్పత్రిలో వెంటనే పడక వేసెయ్యాలి. అదొకటే మార్గం...."

శ్రీకాంత్ సత్యమూర్తి వంక ఆశ్చర్యంగా చూశాడు.

"మీకిలాంటి సలహా చెప్పాల్సి రావటం నా మటుకు నాకే సిగ్గుగా ఉంది. కానీ ప్రస్తుతానికి ఇంతకన్నా వేరే గత్యంతరం లేదు. ఒక కుటుంబాన్ని నిలబెట్టటానికి పడుతున్న తాపత్రయం ఇది. ఇందులో మీ సహాయమూ మాకు తప్పనిసరి అవుతోంది... " అన్నాడు సత్యమూర్తి –

"నేను ఆస్పత్రిలో రెండూ రోజులు పడుకుంటే, వీళ్ళ సంసారం ఎలా చక్కబడుతుంది? మహా అయితే ప్రస్తుతానికి పెళ్ళివాయిదా పడుతుంది..." అన్నాడు శ్రీకాంత్.

"మనవాళ్ళు సెంటిమెంటల్ ఫూల్స్. అందులో అనుమానంలేదు. పెళ్ళికి బయలుదేరే రోజునే, పెళ్ళికొడుక్కి గుండెపోటు వచ్చిందంటే, ఇంకా పెళ్ళి జరిగితే ఏమవుతాడో నన్న చిన్న సందేహం వెలిబుచ్చితే చాలు. ఈ పెళ్ళి ఇంకా ఎప్పటికీ కాదు..." అని తర్వాత జరగాల్సిన విషయమూ ఊహించి చెప్పాడు.

"సరే, నన్ను అంటే, ఏదో చెప్పి, అడ్డూపడి, ఆపేశారు. కానీ తనూజకు ముకుందరావుగారు మరో సంబంధం కుదుర్చుకొస్తే, అప్పుడేం చేయగలరు?" అని అడిగాడు శ్రీకాంత్.

"తనూజ, రవి ప్రేమగురించి ఆ ఊళ్ళో చాలామందికి తెలుసు. పెళ్ళి గురించి కొంతమందికి తెలుసు. ఇవన్నీ కప్పిపుచ్చి, మీతో మళ్ళీ పెళ్ళి చెయ్యాలనుకున్నారు మా అదృష్టం కొద్దీ మీరు మమ్మల్ని సానుభూతితో అర్ధంచేసుకుని, సాయం చేయదలచారు, కనుక ఇప్పటికి గండం గడిచినట్లే లెక్క. ఆయన మళ్ళీ మొదటికొస్తే, అప్పుడు మేమూ మళ్ళా మొదటికొచ్చి ఆలోచిస్తాం... ఆటలో ఒకడు గోల్ చేసి గెలవటానికి ప్రయత్నిస్తే, ఆ గోల్ చేయకుండా ప్రత్యర్ధి అడ్డుపడతాడు. అంత మాత్రాన, ఆట గెలిచినట్లుకాదు. రెండోవాడిని ఓడించటానికి ఇద్దరూ ఎవరి ప్రయత్నాలు వాళ్ళు చేస్తూనే ఉంటారు. ఈ గేమ్ కూడా అలాంటిదే. " అని విశదంగా చెప్పాడు సత్యమూర్తి.

తర్వాత ఏ డాక్టరు దగ్గరకెళ్ళాలీ, ఏం చెప్పాలీ - అని ఆలోచించుకున్నారు. శ్రీకాంత్ ఒక నర్శింగ్ హోమ్ ముందు కారు ఆపాడు. సత్యమూర్తి, శ్రీకాంత్ లోపలికి వెళ్ళి డాక్టర్ని కలుసుకున్నారు,

గుండెల్లో విపరీతంగా నొప్పి వస్తుందన్నాడు. డాక్టర్ టెస్ట్ చేశాడు. అలవాట్లు ఏమైనా ఉన్నాయా అని అడిగాడు.

ఏ అలవాట్లూ లేవని చెప్పాక, ఏదన్నా దెబ్బతగిలిందా అని అడిగాడు.

"యు ఆర్ ఆల్‌రైట్" అన్నాడు డాక్టరు.

"ఎందుకైనా మంచిది. రెండురోజులు నర్సింగ్‌హోంలో చేర్చుకోండి" అని శ్రీకాంత్, సత్యమూర్తి ఇద్దరూ పోరితే, ఆయన సరేనన్నాడు.

శ్రీకాంత్‌ను అడ్మిట్ చేశాక, సత్యమూర్తి రవికాంత్‌కు ఫోన్ చేసి చెప్పాడు.

ఒక అరగంట ఎంత అభయం ఇచ్చినా శ్రీకాంత్ గుండెల్లో నొప్పి విపరీతంగా వచ్చిందని చెప్పగానే, వచ్చినవాళ్ళంతా తలా ఒకమాట అన్నారు.

"శుభమా అని పెళ్ళికి బయలుదేరుతుంటే ఇదేమిటి?" అని ఒకావిడ అంది.

"ఈ వయసులో గుండెనొప్పి రావటం ఆశ్చర్యమే..." అని ఇంకొకరు అన్నారు.

"అందుకే గొడ్డొచ్చిన వేళా, బిడ్డొచ్చినవేళా అన్నారు. మహాతల్లి అడుగుపెట్టకముందే ఇలా జరిగిందంటే, ఇక ఇంటికొచ్చాక ఇంకేం జరుగుతుందో..."

"నయం...ముందే మనకు వార్నింగ్ ఇచ్చినట్లు అయింది. ఇంతోసి సంబంధం దొరక్కపోదు. కాన్సిల్ చేసేద్దురూ..." అని మరొకరు ఉచిత సలహా ఇచ్చారు.

ఒకరిద్దరు పెళ్ళి వాయిదా వేద్దాం అన్నా, మిగతా వాళ్ళు "ఇంకీ సంబంధం మనకొద్దు" అని తీర్మానించేశారు.

విజయకు మాత్రం ఏదో అనుమానం వచ్చినట్లుంది. సత్యమూర్తిని ఇవతలికి పిలిచి కన్నీరు నింపుకుని "ఏం జరిగిందండీ?" అని అడిగింది.

"ఈ వయసులో గుండెనొప్పి రావటం.. అదీ ఈవేళ రావటం.. ఇదంతా మన దురదృష్టం. అయినా డాక్టరు భయపడాల్సిందేం లేదంటున్నాడు. కనుక పెద్ద ప్రమాదం తప్పినట్లే ... ఇంతకీ పెళ్ళి సంగతి ఏం చేయదలచుకున్నారు?" అని అడిగాడు సత్యమూర్తి.

"ఇంకేం పెళ్ళి... ఈ సంబంధం కాన్సిల్" అనేసింది విజయ.

"మరా విషయం వాళ్ళకు ఫోన్ చేసి చెప్పాలి కదా?"

"ఫోనుకూడా ఎందుకు, అదో దండగ. మీరేవెళ్ళి ఒక టెలిగ్రాం ఇచ్చిరండి" అంది విజయ గదిలోకి వెళుతూ.

సత్యమూర్తి వెళ్ళి "మీ సంబంధం మానుకుంటున్నాం" అని ముకుందరావుకు టెలిగ్రాం ఇచ్చాడు.

****



*మనం చాలా సార్లు అనవసరంగా సిగ్గుపడిపోతుంటాం. మన గురించే, మన బంధువుల గురించే, మన సంసారం గురించే, సంపాదన గురించే, ఉన్నదున్నట్లుగా మన శరీరాన్ని నలుగురికీ నగ్నంగా చూపించటానికీ సిగ్గుతో మెలికలు తిరిగిపోతాం.*

కాలి గోరు దగ్గర నుంచీ, నెత్తిమీద జుట్టు దాకా అన్నిటికీ రంగులు పులిమి, వందలూ వేలూ ఖరీదు చేసే హంగులెన్నో కప్పుకుని, మన గొప్పల డప్పుల చప్పుళ్ళు మనమే మోగించుకుంటూ, గర్వంగా ఛాతీ విరుచుకు తిరుగుతాం. అలా లోపాలన్నీ కప్పిపుచ్చుకుని లేని గొప్పలన్నీ ఆపాదించుకోవటమే - పరువుగా బ్రతకటం అంటే.

ఏమీలేనివాళ్ళు దీని గురించి ఏమీ పట్టించుకోరు. బాగా ఉన్నవాళ్ళు మాత్రం, ప్రాణం పోయినా ఫర్వాలేదుగానీ, పరువు పోవటాన్ని మాత్రం సహించలేరు. ముకుందరావు పరిస్థితీ అదే

కూతురి జీవితం మీద పడిన మరకల్ని చెరిపేసి, ఆమెకు మంచి సంబంధం తెచ్చి, ఆ చుట్టుపక్కల ఎవరూ కనీవిని ఎరగనంత కూతురి పెళ్ళి చేయాలని ఆరాటపడిపోతున్నాడు.

తెల్సినా, తెలియకున్నా పెద్ద పెద్ద నాయకులందరికీ ఆహ్వానాలు పంపి, సాదరంగా ఆహ్వానించారు. వాళ్ళంతా ఒక పూట ముందుగానే వచ్చి ఈయన దిద్దిన పెళ్ళి పందిట్లోకి ఊర్లోని వాళ్ళంతా వస్తున్నారు. అయితే, రవిగాని, సత్యమూర్తి గానీ ఆ వీధిలోకి రాకుండా చూడటానికి, ముకుందరావు మనుషులు వీధి మొదట్లో కాపలాలు కాస్తున్నారు.

పైన మేడ మీద గదిలో మాత్రం తనూజ రెండు రోజుల నుంచీ ఏడుస్తూనే ఉంది. ముహూర్తం దగ్గర పడుతున్నకొద్దీ ముంచుకొస్తున్న ఈ ఉపద్రవాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియటం లేదు.

తండ్రి వచ్చి కోప్పడితే, ఆయనతో అంది.

"నాన్నా, నేనీ పెళ్ళి చేసుకోలేను....."

"ఈ పెళ్ళి జరిగి తీరుతుంది. ఇంత దాకా వచ్చాక ఇంక ఆగే ప్రసక్తే లేదు. నీకు తెలుసుకదా. నేను పరువుగా బతుకుతున్న మనిషిని. పరువుపోయిన తర్వాత, ఇంక నేను బతకటం అనవసరం.... రవి, సత్యమూర్తి చుట్టుపక్కలకు రాకుండా, కట్టుదిట్టంగా కాపలా ఏర్పాటు చేశాను. రెండు రోజులనుంచీ రైలు స్టేషన్, బస్స్టాండుల్లోనే మన జనం ఇరవై నాలుగు గంటలూ నిఘా వేసి చూస్తున్నారు. వాళ్ళిద్దర్లో ఎవరు ఊర్లోకి దిగినా, వాళ్ళ అడ్రసు ఉండదు. కనుక వాళ్ళ భయం మనకేమీ లేదు. ఇక నువ్వుకానీ, పెళ్ళిపందిట్లో ఏదైనా పిచ్చివేషాలు వేసి, నా పరువు తీయటానికి ప్రయత్నిస్తే, నా శవాన్ని మాత్రమే కళ్ళ చూస్తావ్.... గుర్తుపెట్టుకో..." అని బెదిరించి వెళ్ళిపొయ్యాడు ముకుందరావు.

తనూజ మనసు, నడిసముద్రంలో తుఫాను బీభత్సంలో చిక్కుకున్న నౌకలా ఉంది. ఎటూ దారీతెన్నూ తోచటం లేదు. తండ్రి పట్టుదల కోసం ఆయన ఎవరి ప్రాణాలైనా అవలీలగా తీయించగలడు. ఆయన బెదిరించి నట్లుగానే పరువుపోతే ఇంక బ్రతకటం దేనికని ఏ ఆత్మహత్యో చేసుకున్నా చేసుకోగలడు. ఎందుకంటే, ఆయనకు పరువుపోతే ప్రాణం పోయినట్లేమరి.

ఇంతకీ తండ్రి ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నా, ఆ కాఠిన్యం వెనుక ఆయనకు తనమీద ఉన్న మమకారం ఎంతటిదో కూడా తనూజకు తెలిసివస్తోంది. ఎవరిని పెళ్ళి చేసుకోవాలీ అన్న విషయంలో వచ్చిన ఈ చిన్న విభేదాన్ని తప్పిస్తే, నిజానికి తమమధ్య వైరుధ్యం ఏముంది? ఈ ప్రపంచంలో ఏ తండ్రీ, ఏకూతుర్నీ ప్రేమించలేనంత గాఢంగా ఆయన తనను ప్రేమిస్తున్నాడన్న విషయమూ తనూజకు అర్థం అవుతోంది.

అలాంటి తండ్రిని పొట్టన బెట్టుకుని, ఆయన శవం మీదనుంచీ దాటుకుని, రవి దగ్గరకు వెళ్ళాలంటే, తనూజ తెగించలేక పోతోంది. అంత ధైర్యం చెయ్యలేక పోతోంది.

అలా అని మరి ఆయన చెప్పినట్లల్లా చేయటానికి ఈ జీవితం తనదికాదు. రవితో ముడిపడిపోయింది... ఆ ముడిని తెంచేస్తానంటాడు తండ్రి. అక్కర్లేదనుకున్నప్పుడల్లా మెడలోని తాళి అంత తేలికగ్గా తెంచి అవతల పారెయ్యటానికి, అది చింతపండు పొట్లానికి చుట్టిన దారంపోగు కాదుకదా.... అది రెండు మంగళ సూత్రాలను, అంటే రెండు ప్రేమిక హృదయాలను ఒకటిగా కలిపే సుందరమైన బంధం.

రవీ, తనూ ఇప్పుడు శారీరకంగా దూరం అయినారే గానీ, నిజానికి ఇద్దరూ ఒకటేకదా... ఉరుకులూ, పరుగులతో వచ్చిన రెండు వాగులూ ఒక నిండు నదిలా కలిసిపొయ్యాక, విడదీయాలంటే ఎలా? ఏ నీటి బిందువు ఏ వాగుదో ఎలా తెలుస్తుంది? అలాగే తమరెండు శరీరాలనూ శరీరాల్లోని నరాలూ, నరాల్లో ప్రవహించే నెత్తురూ ఒకటిగా కలిసిపొయ్యాక, ఇంక ఈ ఇద్దరినీ ఎవరు మాత్రం ఎలా విడదీయ గలరు? అలా ఒకరుగా కలిసిపొయ్యాక ఆ శరీరాన్ని సగానికి కోసి, ఇంకొకరికి కన్యాదానం పేర దానం చేస్తే మాత్రం ప్రయోజనం ఏముంది? దానం పట్టిన వాడు మాత్రం ఏం చేసుకుంటాడీ జీవం లేని కట్టెను?

తను జీవశ్చవంలా మారి మరొకడి చేత, మరొక తాళి కట్టించుకోనూ లేదు. కాదూ కూడదని నానారభసా చేసి, తన చేతుల మీదుగా తండ్రి శవాన్ని బయటకు సాగనంపనూ లేదు... ఇప్పుడు ఏం చెయ్యాలి? ఏం చెయ్యకూడదు? ఎవరు చెబుతారు సలహా?

తనూజకు అప్పుడు సత్యమూర్తి గుర్తొచ్చాడు. అతను దగ్గర లేనందుకు మళ్ళా దుఃఖం పొర్లుకొచ్చింది.

"అన్నయ్యా, నా బాధ నీతో చెప్పుకుంటే, ఈ గుండె బరువు తగ్గుతుంది. నువ్వు నా కన్నీరు తుడిస్తే, నాకు అంతులేని మనశ్శాంతి లభిస్తుంది. కానీ ఎలాగ? నీకు వందల మైళ్ళ దూరంలో పంజరంలో చిలకలా, ఈ గదిలో చిక్కుకుపోయినాను. ఎక్కడున్నావో, ఏం చేస్తున్నావో, నువ్వు నా మొర ఆలకిస్తున్నావో లేదో నాకు తెలియదు. కానీ నాకున్న ఒకే ఒక ఆపుడవు. పరమాత్ముడవు నీవే....." అంటూ మౌనంగానే సత్యమూర్తిని స్మరించుకుంది తనూజ.

ఎందుకో పెళ్ళివారు రావాల్సిన వేళకు రాలేదు. ఎన్ని గంటలకు బయలుదేరిందీ తెలుసుకోవటం కోసం ముకుందరావు ట్రంకాల్ బుక్ చేశాడు. కానీ ట్రంక్‌కాల్ కనెక్షన్ రాకముందే, టెలిగ్రాం వచ్చింది - పెళ్ళి ఆగిపోయిందంటూ.

ముకుందరావు ఆ మాట వినగానే నోటమాట రాకుండా నిశ్చేష్టుడైనాడు. నిముషాల మీద ఈ వార్త అందరికీ తెలిసిపోయింది.

పెళ్ళికొడుకుకి గుండెపోటు వచ్చిందనీ, ఆస్పత్రిలో చేరాడని తెలియగానే, అలాంటి రోగిష్టివాడికి, రేపో మాపో గుండె ఆగి చచ్చేవాడికి బంగారంలాంటి పిల్లనిచ్చి పెళ్ళిచేయటం ఏమిటని అందరూ ఆయన ముఖాన్నే అనేశారు.

ఇంతలో టెలిఫోన్ మోగింది. ముకుందరావు టక్కున రిసీవర్ అందుకున్నాడు వియ్యంకుడే మాట్లాడాడు. శ్రీకాంత్ గుండె నొప్పితో ఆస్పత్రిలో చేరిన మాట నిజమేనట - పెళ్ళి కాన్సిల్ చేసుకుంటున్నామని ఆయన అంటే, ముకుందరావే రాజీ ధోరణిలో అన్నాడు.

"అది కాదండీ.... కాన్సిల్ చేయటం ఎందుకు! కావాలంటే, నెలరోజులు వాయిదా వేద్దాం... అవసరమైతే మరికొంత డబ్బు......"

"అసలీ సంబంధం గురించి ఇంక ఒక మాట మాట్లాడటానికి వీల్లేదని మావాళ్ళంతా నిర్ణయించేశారు. సారీ..." అని అవతల ఆయన ఫోన్ పెట్టేశాడు.

ముకుందరావు మొహాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. అన్నీ పకడ్బందీగా ఏర్పాట్లు చేసినా, దైవం అనుకూలించలేదు. పాతికేళ్ళ కుర్రాడు, ఉక్కుపిడుగులా ఉన్నాడు, అతనికి గుండె జబ్బు ఏమిటి, - అని మధనపడుతుంటే, పక్కన చేరిన వాళ్ళు అందుకున్నారు.

"తెలియక ముందు అంటే ఏదో అనుకున్నాంగానీ, గుండె జబ్బు మనిషి అని తెల్సాక, వాళ్ళు కాళ్ళావేళ్ళాపడి చేసుకుంటానంటే మాత్రం, మనం పిల్లనెలా ఇస్తామండీ? చూస్తూ చూస్తూ ఆ అమ్మాయి గొంతు కోస్తామా?" అని అందరూ తలా ఒకమాట అంటూ సుముచిత సలహాలు ఉచితంగా ఇచ్చారు.

ఇదంతా వింటూనే తనూజ సోఫాలో కూర్చున్న మనిషి, కూర్చున్నట్లే పక్కకు పడిపోయింది. అంతా కంగారు పడిపొయ్యారు. నీళ్ళు తెచ్చి మొహాన చల్లారు. కాళ్ళూ, చేతులూ రాస్తూ కూర్చున్నారు.

దగ్గర్లోనే ఉన్న డాక్టరు వచ్చి, తనూజను పరీక్ష చేశాడు. ముకుందరావును పక్కకు పిలిచి ఆయన చెవిలో చిన్నగా అన్నాడు.

"షి ఈజ్ ప్రెగ్నెంట్........."

ముకుందరావు పక్కన పిడుగు పడింది. కాసేపు పంచేంద్రియాలూ పనిచేయటం మానేశాయి.

ఆ మాట వినగానే తనూజ మొహాన మాత్రం చవితినాటి చంద్రుడిలా సన్నని చిరునవ్వు వెలిసింది. మనిషి అంటే అక్కడినుంచి కదలలేక పోయింది గానీ, మనసు మాత్రం రెక్కలు విచ్చుకున్న విహంగంలా అలా అలా గాలిలో తేలిపోయింది.

ఇదే అక్కడ ఉండివుంటే, రవికి చెప్పివుంటే, ఆనందం పట్టలేక ఎంత అల్లరి చేసేవాడో? ఏవో రాగాలు తీసి, సరాగాలు చేసి, ఎంత ఆట పట్టించేవాడో, ఎన్ని జోక్‌లు వేసేవాడో?.... అవన్నీ ఊహించుకుంటుంటేనే తనూజ మనసు పులకించిపోయింది.

రవికి ఈ విషయం తెలియజేయకుండా ఎలా ఉంటుంది! అందుకనే ఆ రాత్రి గదిలో కూర్చుని ఉత్తరం రాసి మర్నాడు, తనకు బాగా నమ్మకమైన మనిషి చేతికిచ్చి, స్టాంపులు అంటించి పోస్టులో వేయమంది. అందుకు అతగానికి బహుమానమూ ఇచ్చింది.

మూడోనాడు ఆ ఉత్తరం అందుకున్న రవి ఎగిరి గంతేశాడు. ఉత్తరం చించి చదవకుండానే వందసార్లు అటు తిప్పి, ఇటు తిప్పి ముద్దులు పెట్టుకుంటూ కూర్చున్నాడు.

"ఆ కవర్లోపల కూడా ముద్దులు మూటగట్టే విషయాలు చాలా ఉంటాయి తీసి చదువుకో"అన్నాడు సత్యమూర్తి.

అప్పుడు గానీ రవి కవరు చింపలేదు.

"ఈ పరిస్థితుల్లో తనూజ దగ్గర నుంచి లెటర్ రావటమే గొప్ప విషయం మాష్టారూ.......... ఈ ఉత్తరం వచ్చి చేతుల్లో వాలితే, తనూజే వచ్చి వాలినట్లుగా ఉందండీ..." అన్నాడు రవి.

"ఉత్తరం కాబట్టి అన్ని వందలసార్లు ముద్దెట్టుకున్నా, తట్టుకుంది రవీ. అదే తనూజ అయితే, ఊపిరాడక... ఉక్కిరి బిక్కిరి అయిపొయ్యేది" అన్నాడు సత్యమూర్తి.

రవి లెటర్ చదువుకోవటంలో నిమగ్నమైపొయ్యాడు.

"నాప్రాణానికి ప్రాణం అయిన రవీ -

ఎలా ఉనావు? అసలు మనం ఒకరిని విడిచి మరొకరం ఎలా ఉండగలుగుతున్నాం? ఎడబాటులో ఇంత బాధ ఉందన్న విషయం ఇప్పుడే తెలిసింది. ఒక విధంగా ఇదీ మన మంచికే. ఎదురుగా ఉన్నంత కాలం, నన్నేదో అనటం, నేను దేనికో అలగటం - ఇది అలవాటైపోయింది మనకు కోపం వచ్చినప్పుడు, ఆ కాసేపు నీ దారి నీదీ, నా దారి నాదీ చేసుకుని వెళ్ళిపోదాం అనిపించేది. కానీ ఈ అనుభవం తర్వాత ఇంకెప్పుడూ నిన్ను విడిచివెళ్ళాలన్న ఊహను కూడా రానివ్వను.

ఏదీ...... ఎన్నాళ్ళు అయింది నేస్తం  నీ చేతులు నాతో ఆడుకుని... ఎన్నాళ్ళు అయింది ఈ గుండెల్లోకి నిన్ను లాక్కుని... నీ రాకకోసం చకోర పక్షిలా ఎదురు చూస్తున్నాను... కానీ తొందరపడి నిన్ను రమ్మని అనలేను తెగించి నేను రాలేను. చూడు... మన చుట్టూ ఈ కత్తుల బోను... ఎలా దాటి రాను? కానీ రాకుండా, నిన్ను చేరకుండా ఎలా ఉండగలను? అందుకే రవ్వంత ఓపిక పట్టు...... మనకీ మంచిరోజులొస్తాయి. రేపో మాపో. నువ్వు నావల్ల ఇబ్బందుల్లో చిక్కుతావోనన్నదే నా భయం. అంచేత నాక్కొంచెం నమ్మకాన్ని చిక్కనివ్వు. నేనూ ఆ ఘడియకోసమే ఎదురు చూస్తున్నాను....మళ్ళా నీలో లీనం కావటం కోసం....

ఇంతకీ నేను వచ్చిన పనివేరు. మల్లిక ఇక్కడెక్కడా లేదు. అంతవరకూ రూఢీగా తెల్సింది. కానీ ఇక్కడికి వచ్చి నేను చిక్కుబడిపొయ్యాను. అన్నయ్య అన్నంత పనీ జరిగింది. నాకు మళ్ళీ పెళ్ళికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. నీవు ఇక్కడికి వచ్చి వెళ్ళిన సంగతి తెల్సింది.కానీ జాగ్రత్త సుమా.... ఈసారి నువ్వు చిక్కావంటే ఇంక ఇంతేసంగతులు..... అందుచేత నేను రాలేను, నిన్ను రమ్మనమని అనలేను. నేనుగా రాలేను. రాకుండా ఉండలేను.... ఒకపక్క భయం, ఒక పక్క ఆత్రం... గుండెల్ని కలిచివేస్తున్నాయి.

మీరేదో మంత్రం వేసి పెళ్ళి తప్పించారని నాకు అర్థమైంది. ఇందులో తప్పకుండా అన్నయ్య జోక్యం చేసుకునే ఉంటాడు. ఆయన రుణం ఎలా తీర్చుకోగలను.

ఇంకో విషయం చెప్పనా? నాకు సిగ్గేస్తోంది, నేను చెప్పను........... నవ్వుతున్నావా? ఇప్పుడు నీకు నవ్వులాటగానే ఉంటుందిలే...... నిన్ను చూసి నేను నవ్వే రోజులూ దగ్గర్లోనే ఉన్నాయి....... ఇంతకీ విషయం ఏమిటంటే నీకు ప్రమోషన్ రాబోతుంది. ప్రమోషన్ అంటే ఆ ప్రమోషన్ కాదు. కొత్త డ్యూటీ అన్నమాట. ఆ డ్యూటీ ఏమిటంటే అమూల్ స్ప్రే పాలడబ్బాలు మోయటం... నువ్వలా పడుతూ లేస్తూ పాలడబ్బాలు తెస్తూ ఉంటే కళ్ళారా చూడాలని ఉందోయ్, నేస్తం.......... తెలుగు వీర లేవరా, పాల డబ్బా మోయరా. అని పాడుకోవాలని ఉంది.

డాక్టర్ చెప్పినప్పటినుంచీ ఎంత సంతోషంగా ఉందో ఎలా చెప్పను? కడుపులో ఇప్పుడు కదిలీ కదలక కదలాడే ఈ పిడికెడు మాంసం ముద్దే, రేపు రూపురేఖలు సంతరించుకుని మన చేతుల్లోకి వస్తుంది చిన్నారి పాపగా మారి. పాప తానేమో ఏడుస్తుంది, మనల్నేమో నవ్విస్తుంది ... అవును గానీ పాపకి ఏం పేరు పెడదాం.... ఏంటీ అప్పలమ్మా?... అది మీవాళ్ళు పెట్టుకునే పేరు. నేను పెట్టుకునే పేర్లు వేరుగా ఉంటాయి. ఇంకొకటి చెప్పు.... ఏంటీ... అలివేలుమంగా బాల త్రిపుర సుందరా?... అయిదుగురి పేర్లూ ఒక్క పిల్లకే పెడితే, పెద్దయ్యాక ఒక్కతే అయిదుగురి మోయన తయారవుతుందేమో .... పుట్టినప్పుడే పెద్ద పేరు తెచ్చుకోనక్కర్లేదు. పెరిగి పెద్దయ్యాక అప్పుడు పెద్ద పేరు తెచ్చుకోవాలి... అదీ మన అమ్మాయి ఘనత. తెల్సిందా?

అది కనీసం ఐ.ఏ.ఎస్. చదవాలి. ఎన్నో ఉద్యోగాలు చేసి, ఊళ్ళు ఏలాలి. అదంతా అన్నయ్య బాధ్యత అని చెప్పు. పుట్టబోయే పాప అన్నయ్య పెంపకంలోనే పెరుగుతుంది. ఆయన తెలివితేటల్లో పదోవంతు వచ్చినా చాలు, నా కూతురు నాకు గర్వకారణం అవుతుంది. చిన్నప్పటి సుమతీ శతకం పద్యం గుర్తుందా? పిల్లలు పుట్టినప్పుడు కాదు, వాళ్ళు ప్రయోజకులు అయినప్పుడు కదా మనకు నిజమైన ఆనందం. ఏమంటావు?

సరే ఇక ఉండనా మరి, నీకోసం నిలువెల్లా కళ్ళు చేసుకుని ఎదురు చూస్తుంటాను. అలాని తొందరపడి నువ్వు మాత్రం ఇటువైపు రావద్దు. వీలు చూసుకుని నేనే వస్తాను నేస్తం... నీ తనూజ."

రవి సత్యమూర్తికి చెప్పాడు. "మీకు మేనకోడలు పుట్టబోతోంది" అని.

సత్యమూర్తి రవికి అభినందనలు తెలిపాడు.

ఆ వేళ రవి సత్యమూర్తికి పార్టీ ఇచ్చాడు.

"అసలు పొద్దుటినుంచీ ఇవాళ ఎందుకో తలనొప్పిగా ఉందండి" అన్నాడు రవి.

"అంతే! ఈ తల ఉన్నంతవరకూ తలనొప్పి వస్తూనే ఉంటుదిలే" అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ.

"నాకు తలకాయ లేదని మీరన్నా ఒక సర్టిఫికెట్ ఇవ్వండి. అంగవికలాంగుడిని అని చెప్పుకుని ఇంకో మంచి ఉద్యోగాని కన్నా ట్రయ్ చేసుకుంటాను..." అన్నాడు రవి.

సత్యమూర్తి నవ్వాడు. "సర్టిఫికెట్ నేను ఇస్తే చెల్లదు. నీకు తలకాయ లేదన్న సర్టిఫికెట్ మీ ఆవిడ ఇవ్వాలి. లేదా డాక్టరు ఇవ్వాలి..."

"మా ఆవిడ కాదుగాని, నేను యం.బి.బి.యస్..." అన్నాడు రవి.

"అంటే?..."

"యం.బి.బి.యస్ అంటే మా భాషలో మెంబర్ ఆఫ్ భార్యా బాధితుల సంఘం... నేను భార్యా బాధితుడ్నేనండి. మా ఆవిడ మనసు వెన్నపూసేగానీ, కొంచెం ముక్కు మీద కోపం ఎక్కువ...." అన్నాడు రవి.

"తనూజ రానీ చెపుతాను. ఆవిడ వెన్నపూసో, నీ వెన్నుపూసో తేల్చుకుంటుంది..........

"నిజమేనండీ. తనూజ నా జీవితానికే వెన్నుపూస. నా గుండెకాయ. నా ఊపిరి, నా సర్వస్వం........" అన్నాడు రవి.

ఇంటికొచ్చాక రవి సత్యమూర్తితో అన్నాడు.

"తనూజ ఉత్తరం చూసినప్పటినుంచీ నా తలనొప్పి ఎగిరిపోయిందండీ. మనసు ఎందుకో ఉరకలు వేస్తోంది. పరుగులు తీయాలనిపిస్తోంది. మీకెలా ఉంది మాష్టారూ?" అని అడిగాడు రవి.

"ఏమో, నాకు ఇలాంటి అనుభవాలు లేవు కదా" అన్నాడు సత్యమూర్తి.

ఆ రాత్రి తనూజ తండ్రితో కూర్చుని కబుర్లు చెబుతోంది. మాటల్లో మల్లిక ప్రసంగం వచ్చింది.

"మల్లిక... ఆమె గురించి నీకు తెలియదు నాన్నా.... చాలా మంచిది. ముఖ్యంగా నాకు బాగా నచ్చిన మనిషి.. ఒకసారి ఆమెను చూడాలని ఉంది నాన్నా..."

"రేపు నీకు మల్లికను చూపిస్తాను" అన్నాడూ ముకుందరావు.

తనూజ ఉలిక్కిపడింది. ఆశ్చర్యంగా అడిగింది. "మల్లికను చూపిస్తావా? నీకు తెలియదన్నావ్? ఇక్కడ లేదన్నావ్?"

"రేపు ఉదయం వెళదాం. రెడీగా ఉండు" అన్నాడు ముకుందరావు.

ఇంక తనూజకు రాత్రంతా నిద్దరేపట్టలేదు. మర్నాడు ఎనిమిదింటికే రెడీ అయిపోయింది.

ముకుందరావు తనూజను డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాడు.

"ఇక్కడెందుకు? మల్లికను చూపిస్తానన్నావు కదా." అని అడిగింది.

"వెళదాం. ఇప్పుడు నువ్వు ఒట్టిమనిషివి కాదుకదా పనిలో పని డాక్టరు దగ్గర చెకప్ చేయించుకో...." అన్నాడు ముకుందరావు.

ఆయన ముందుగానే డాక్టరుతో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేసే తీసుకొచ్చాడని తనూజకు తెలియదు. ముందుగా చెపితే రానని గోల చేస్తుందని, ఈ నెపంతో తనూజను డాక్టరు దగ్గరకు తీసుకొచ్చాడు.

డాక్టరు తనూజకు మత్తుమందు ఇచ్చింది.

ఆమె తెలివి వచ్చాక తెలుసుకుంది, తనకు అబార్షన్ అయిందని.

తండ్రిని నిలదీసి అడిగితే ఆయన అన్నాడు.

"వాడి తాలూకు చిహ్నాలేవీ నా ఇంట్లో ఉండటానికి వీల్లేదు."

"రవికి ప్రతిరూపం నా కడుపులో ఉందని తీసేయించావు. కానీ నేనే రవి రూపంలో ఉన్నాను. మేం ఇద్దరం ఒక్కటే. వేరు కాదు. నన్ను చంపేస్తే అతని రూపం చెరిగిపోతుంది" అని భోరున ఏడ్చింది.

అనవసరంగా రవికి ఉత్తరం రాసి ఎన్ని ఆశలు కల్పించింది..!

రేపు అతను అడిగితే ఏం సమాధానం చెబుతుంది? -

****

*సృష్టిలోని సౌందర్యం అంతా స్త్రీలోనే నిండి ఉంది.*

*ఆ మాటకొస్తే స్త్రీ అంటేనే ప్రకృతి. కొండలూ, కోనలూ, నదీనదాలూ, సముద్ర జలాలూ, ఎండలూ, వానలూ, వెన్నెలా, చీకటీ - అన్నీ ఆమెలోనూ, ఆమె ప్రతి కదలికలోనూ సాక్షాత్కరిస్తాయి. ప్రకృతి లాగానే, పడతీ ఎప్పటికప్పుడు కొత్తగా, నిత్యనూతనంగా కనిపిస్తూ ఉంటుంది.*



కనుకనే స్త్రీతో స్నేహం చేయటం ప్రపంచంలోని విలువైన వాటి అన్నిట్లోకి విలువైనదిగా భావిస్తాడు పురుషుడు. ఆస్తులూ, అంతస్తులూ, కట్టుబాట్లూ, సాంప్రదాయాలూ, సింహాసనాలూ, సామ్రాజ్యాధికారాలూ - ఈ విస్తృత జగత్తులోని సమస్తమూ ఆమె స్నేహం ముందు బహు స్వల్పమైనవీ, చాలా అల్పమైనవిగా కనిపిస్తాయి. అందుకనే వీటి నన్నింటినీ తృణప్రాయంగా తన్నేసుకుంటూ వెళతాడు, ఆమె స్నేహ హస్తాన్ని అందుకోవటం కోసం.

అయితే -

అందరూ అందరితో స్నేహం చేయలేరు. స్నేహం చేసినా, చాలా మంది స్వార్థంతో దాన్ని కలుషితం చేసి, త్వరలోనే ఆ స్నేహాన్ని నిలబెట్టుకునే అర్హతను కోల్పోతారు.

నిజమైన స్నేహితులు హృదయాలను ఇచ్చిపుచ్చుకుంటారు. అలా స్నేహితునికి ఒకసారి ఇచ్చిన హృదయాన్ని తిరిగి పుచ్చుకోరు. ఆ స్నేహితుని సుఖాలూ, సంతోషాలూ, బాధలూ, కష్టాలూ, అన్నీ

తమవిగానే భావించి, ఆదుకుంటారు. ఆదరిస్తారు. వాళ్ళకోసం ఎలాంటి త్యాగాలైనా సంతోషంగా చేస్తారు.

మల్లిక, సత్యమూర్తిల స్నేహం ఇలాంటిదే కనుకనే వాళ్ళు ఒకళ్ళ కోసం మరొకళ్ళు ప్రాణాలివ్వటానికి కూడా సిద్ధంగా ఉన్నారు. రెండోవాళ్ళ నుంచి ప్రత్యుపకారాన్ని ఆశించి చేస్తున్న పనులుకావు అవి.

అయితే, సత్యమూర్తి బాధపడే విషయం ఒక్కటే. తనవల్లనే ఆమె అనవసరంగా సుఖాన ఉన్న ప్రాణాన్ని కష్టాలపాలు చేసుకుంది. చావుబతుకుల మధ్య ఊగిసలాడింది. ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడినట్లు?

ముకుందరావు మనుషుల చేతుల్లో తను చావు దెబ్బలు తిన్నానని తెలియగానే, ఆగలేక పరుగు పరుగున మల్లిక తనకోసం ఎందుకు వచ్చింది? ఒకనాటి స్నేహితుడి కోసం, ఇప్పటి జీవితాన్ని, సంసారాన్ని చిందర వందర ఎందుకు చేసుకుంది? ఆ సమయంలో, ఆ ఆదుర్దాలో ఈ ప్రశ్నే ఆమెకు తట్టి ఉండదు.

ఇప్పుడింక పనేం లేదు కనుక, సత్యమూర్తి మల్లికను గుర్తుచేసుకుంటూ కూర్చున్నాడు. ఆమె జాడ తెలుసుకునే మార్గం ఏదైనా ఉంటే బావుణ్ణు, ఆ ప్రయత్నంలోనన్నాపడి, తనను తాను మర్చిపోయేవాడు -

ఈ ఆలోచనలతో సగ్గమతమవుతున్న సత్యమూర్తి దగ్గరకు రవి వచ్చి కూర్చున్నాడు.

"సర్, సడన్‌గా డబ్బు సంపాదించి ధనవంతుడైపొయ్యే మార్గం ఏదన్నా చెప్పండి.." అని అడిగాడు.

"ఏముంది? ఉన్నవాడి ఇల్లు చూసి, అమావాస్యనాడు అర్ధరాత్రి పలుగూ, పారా తీసుకుని వెళ్ళటమే" అని చెప్పాడు సత్యమూర్తి.

"కానీ మనకు అదీ చేతకాదు కదండీ. మనం అమావాస్యనాడు కన్నం వెయ్యటం మొదలెడితే, పౌర్ణమి నాటికైనా పూర్తికాదే. ఇంకో మార్గం చెప్పండి...."

"పోనీ, నోట్లు అచ్చుగుద్దటం మొదలెట్టు..."

"అదీ పెద్ద ఆర్టే, మనం అందుకూ పనికిరాం... అందుచేత నేను ఫారిన్ వెళ్ళి డబ్బు సంపాదించుకుని వద్దామనుకుంటున్నానండి..." అన్నాడు రవి.

"ఏదో సామెత చెప్పినట్లుంది. ఉట్టికి ఎగరలేనమ్మ, స్వర్గానికి ఎగిరినట్లుంది..." అన్నాడు సత్యమూర్తి.

"అది చాలా పాత సామెతండి..."

"పోనీ కొత్త సామెత ఏమిటంటే, కోఠీకి వెళ్ళలేనివాడు ఊటీకి వెళతానన్నాడట...."

"నీ పని అలాగే ఉంది. ముకుందరావుగారింటికెళ్ళి, తనూజను తెచ్చుకోలేవుగాని, ఫారిన్ వెళ్ళి డబ్బు సంపాదించుకొస్తావా?".... అని నవ్వాడు సత్యమూర్తి.

"ఆయన గర్వం డబ్బు ఉందనే కదా. నేనూ నాలుగయిదు ఏళ్ళల్లో డబ్బు సంపాదిస్తుకొస్తాను విదేశాలకు వెళ్ళొచ్చి నాలుగురాళ్ళు వెనకేసుకుంటే, అప్పుడైనా ఆయన నన్ను గౌరవిస్తాడేమో.." అన్నాడు రవి.

"ఐడియా బాగానే ఉందిగానీ, నాలుగురాళ్ళు వెనకేసుకోవడం కోసం విదేశాలకు వెళ్ళాలా? ఇండియాలో నీకు నాలుగురాళ్ళే దొరకవా?" అని అడిగాడు సత్యమూర్తి.

"ఈ గులకరాళ్ళు దేనికీ పనికిరావండీ. అక్కడనుంచీ తెచ్చేవి మాత్రం రాళ్ళు కాదండీ. అవి రత్నాలు, వజ్రాలు, వైఢూర్యాలు... తనూజ కోసం ఏమైనా చేస్తాను...."

"కానీ నువ్వు ఆమెను ఆయన దగ్గిర వదిలేసి వెళితే, నువ్వు వచ్చేటప్పటికికి తనూజ పూర్తిగా నిన్ను మర్చిపోయి, మరొకడి భార్యగా జీవితంలో సెటిల్ అయిపోవచ్చు."

"నా తనూజ నన్ను ఆ మాత్రం అర్ధంచేసుకోలేదా, మాష్టారూ...... నేనిప్పుడు బతుకుతున్నదే ఆమె కోసం. ప్రతి క్షణం, ప్రతి నిముషం తనూజే నా కళ్ళముందు కదులుతోంది. నా కింకో ధ్యాస లేదు. ఊహ లేదు... ఆమె ఆలోచనలూ, జ్ఞాపకాలూ, ఇవే నన్ను చూసుకున్నావని తనూజ అనుకోవచ్చుకదా "

"కమ్యూనికేషన్ లేకపోతే, ఎవరి మనసులో ఏ ప్రేమావేశాలు పెల్లుబుకుతున్నాయో, ఏ ఆగ్రహోదగ్ర ఆవేశకావేశాలు మరుగుతున్నాయో రెండో వాళ్ళకు ఎలా తెలుస్తుంది?" అన్నాడు సత్యమూర్తి.

"మీరు చెప్పింది, నిజమే. నా తనూజను నేనే దూరం చేసుకున్నాను. ఇప్పుడు నా బాధ ఇదీ అని చెప్పుకోలేని స్థితిలో ఉన్నాను. ఇక్కడ నుంచీ, ఈ డాబామీదికెక్కి, గొంతు చించుకు అరిచినా, ఊరంతా విని నన్ను పిచ్చివాడనుకుంటారేకాని, వినిపించవల్సిన అసలు మనిషికి మాత్రం వినిపించదు.... ఏమండీ తనూజ ఇంక నా దగ్గరకు రాదా? నా మొహం కేసి చూడదా?" అని జీరవోయిన గొంతుకతో చిన్నపిల్లాడిలా రవి అడుగుతుంటే, సత్యమూర్తి జాలిపడుతున్నాడు. తనూజ తప్ప ఇంక ఇతడికి వేరే లోకం లేదు. ఆమెను తలుచుకుంటూ సడెన్‌గా మెంటల్ బాలెన్స్ పోగొట్టుకుంటున్నాడు. ఆఫీసు నుంచి మధ్యాహ్నమే బయలుదేరి బయటికి వస్తున్నాడు ఇలా అయితే ఆ ఉద్యోగం కూడా ఇంకెన్నాళ్ళో ఉండదు.

"ఏం చేయ్యాలి?" అని సత్యమూర్తి ఎంత ఆలోచించినా భవిష్యత్ అంతా అంధకారబంధురంగా ఉంది. సరైన దారే కనిపించటంలేదు.

ఒక్కోరోజు రాత్రంతా ఏడుస్తున్నాడేమో - రవికి తెల్లారేసరికి కళ్ళూ వాచిపోతున్నాయి. పొద్దున్నే లేచి పెరటి గుమ్మంలో దిగాలుగా కూర్చున్న రవితో సత్యమూర్తి 'ఏమిట్రా ఇది?' అంటే, రవి ఏదో గుర్తుచేసుకునేవాడు.

"ఊరికే అలా చనువుగా, సరదాగా కోపం తెచ్చుకుని మూతీ ముక్కు అందంగా విరుస్తుంది గానీ, నిజంగా నేనంటే తనకి ప్రేమే ఉంది. నాకు తెల్సా సంగతి. నేనేదన్నా అంటే ముందు కొరకొరలాడుతూ చూసేది. తర్వాత నాకిష్టమైనవి కరకరలాడేవి చేసి పెట్టేది. కానీ ఇప్పుడా కొరకొరలూ లేవు... ఏమైతే అదే అవుతుంది. ఇవాళ తనూజ దగ్గరకి వెళ్ళి వాళ్ళింట్లోకి వెళ్ళిపోయి, చెయ్యి పట్టుకుని లాక్కొచ్చేస్తానండి" అని లేచాడు రవి.

"రవీ, యూ ఆర్ గోయింగ్ మాడ్? నీకు పిచ్చెక్కిపోతోంది. నువ్వా ఇంట్లోకి వెళ్ళి తనూజను లాక్కొస్తావా? నీ తల అక్కడే బద్దలై పోతుందిరా..." అన్నాడు సత్యమూర్తి.

"అయితే ఏమండి? ఇంకోసారి తనూజ చెయ్యిపట్టుకోగలిగితే చాలు... తల వెయ్యి ముక్కలైపోయినా ఫర్వాలేదు... నా బాధ మీకు ఎవరికీ అర్థం కాదండి... నేను తనూజను దూరం చేసుకున్నాను. మళ్ళీ ధైర్యంగా వెళ్ళి తెచ్చుకోనలేని నా చేతగానితనాన్ని చూసి తనూజ తిట్టూకుంటూ ఉంటుంది. అంచేత, నన్ను వెళ్ళనివ్వండి..." అని సత్యమూర్తిని వేడుకున్నాడు రవి.

"నువ్వేం మాట్లాడుతున్నావో, ఏం చేస్తున్నావో కూడా నీకు తెలియటం లేదు. ఈ స్థితిలో నిన్ను అక్కడకు పంపించలేను. తనూజను వెళ్ళనివ్వటమే నేను చేసిన పొరపాటు. నిన్ను కూడా పంపించి, అంతకన్నా పెద్ద పొరపాటు చేయలేను..." అని ఖచ్చితంగా చెప్పాడు సత్యమూర్తి.

"మీకేమండి? మీరు అలాగే అంటారు. నేను తనూజను చూడకుండా ఒక్కరోజు, ఒక్కగంట, ఒక్క నిముషం ఉండలేకపోతున్నాను... సో అయామ్ గోయింగ్, సర్..." అని లేచాడు రవి.

"పిచ్చి వేషాలు వేశావంటే, కాళ్ళూ చేతులు కట్టి పడేస్తాను" అని బెదరించాడు సత్యమూర్తి.

రవి బయట పడుతున్నాడు, సత్యమూర్తి బయట పడటం లేదన్న మాటేగానీ, రవి తనూజ కోసం నిప్పుల మీద నడవటానికైనా ఎలా ఉరుకలు వేస్తున్నాడో, మల్లిక కోసం సత్యమూర్తి అంతకన్నా అధికంగా పరుగులు తీస్తున్నాడు.

మల్లిక భర్త హరిశ్చంద్రప్రసాద్‌తో ఒకసారి మాట్లాడితే బావుండుననీ అనుకున్నాడు. కానీ ఆయనకు తన మీద సరియైన అభిప్రాయం లేదు. తన పొడగిట్టనప్పుడు, తన మాట మాత్రం ఎలా నచ్చుతుంది? ఆయన ఇంట్లో వాళ్ళు ఎవరూ కూడా తన మొహం చూడరు.

ఇక డాక్టరు హరిశ్చంద్ర ప్రసాద్ ఫ్రెండ్ డాక్టర్ షీలా - ఆమె అయినా తనను రానిస్తుందో లేదో? అయినా ప్రయత్నించటంలో తప్పు లేదు కనుక, సత్యమూర్తి డాక్టర్ బోస్ దగ్గరకు వెళ్ళి ఆమె అడ్రసు తెలుసుకున్నాడు.

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలకు ఆ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆ కాలనీలో వీధి చివరగా ఉన్న ఇల్లు, గేటు దగ్గర బోర్డు మీద ఆమె పేరు, ఉద్యోగం, వివరం, సంప్రదించు వేళలూ రాసి ఉన్నాయి. సాయంత్రం మాత్రమే రోగులు ఆమెను చూడటానికి రావాలి. అందుచేత పొద్దునపూట వైద్యం కోసం వచ్చేవాళ్ళు ఎవరూ ఉండరు.

సత్యమూర్తి కాలింగ్ బెల్ నొక్కితే, ఆయా వచ్చి తలుపు తీసింది. ఎవరూ, ఏం కావాలీ అని అడిగి, డాక్టరమ్మతో మాట్లాడాలంటే సాయంత్రం రమ్మనమని చెప్పింది. కానీ సత్యమూర్తి ఆమెతో ఇప్పుడే మాట్లాడాలని పట్టుపడితే లోపలికి వచ్చి కూర్చోమంది. ఆయా వెళ్ళి చెప్పిన అయిదు నిముషాల తర్వాత కర్టెన్ తొలిగించుకుని ఒకామె ఇవతలికి వచ్చింది.

ఆమె అంత పొడుగూ కాదు, అంత పొట్టీ కాదు. అంత సన్నమూ కాదు. మనిషి పసుపు పచ్చని దబ్బపండు రంగులో, ఇంతలేసి కళ్ళతో చూస్తూ విలక్షణమైన అందంతో, ఆకర్షణీయంగా ఉంది.

'మాక్సీ' గౌనులో ఆమె వంపుసొంపులు కనిపించీ, కనిపించకుండా ఉన్నాయి.

టేబ్‌లు ముందు కూర్చుంది. ఎదురుగా సత్యమూర్తి ఉన్నాడు. ఇద్దరిమధ్యా ఎవరి గుండె చప్పుడును అయినా వినిపించే స్టెతస్కోప్ ముడుచుకుని కూర్చుంది.

డాక్టర్ షీలా కొంచెంగా ముందుకు వంగి 'యస్' అంది.

"నా పేరు సత్యమూర్తి" అన్నాడు.

ఆ పేరు వినగానే ఆమె ముఖంలో రంగులు మారాయి. కనుబొమ్మలు చిట్లించింది. నుదురుమీద గీతలు కనిపించాయి. అతనే చెప్పటం మొదలుపెట్టాడు.

"నేను మీ దగ్గరకు వైద్యం కోసం రాలేదు. పర్సనల్ విషయం ఒకటి మాట్లాడాలని వచ్చాను."

"ఎవరి పర్సనల్ విషయం.... ?"

"మీకూ, నాకూ సంబంధించిన ఇద్దరి పర్సనల్ విషయం... డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్, మల్లికల విషయం..." అన్నాడు సత్యమూర్తి.

"పోలీసులూ, కోర్టులూ, కేసులూ, పేపర్లూ, - అన్నీ అయిపొయ్యాక, ఇంక నా దగ్గర కొచ్చారా?" అని అడిగింది షీలా.

"నిజమే, మీరన్నట్లు వాటి అన్నిటి చుట్టూ నేను తిరిగిన మాట వాస్తవమే. అయితే, నేను సరదా కొద్దీ చేసిన రభస కాదు అది. మల్లికను ఎవరో ఎత్తుకుపొయ్యారు. వాళ్ళు ఆమెను చంపేస్తారని నా భయం. అందుకని పోలీసుల దగ్గర కెళ్ళాను. వాళ్ళవల్లా ప్రయోజనం లేకపోయింది. అందుకని కోర్టు కెళ్ళాను. అక్కడా మల్లికకు కావాల్సిన రక్షణ దొరకలేదు. అసలు ఆమే దొరకలేదు. అంచేత పేపర్లో వేయించి పదిమందికి తెలియపరిస్తే లోకానికి అయినా వెరచి, ఆమెను చంపటం కొన్నాళ్ళు వాయిదావేస్తారేమో, ఈలోగా ఏ దైవం అయినా కరుణించి, ఏ అద్భుతమైనా జరిగి, ఆమెను వాళ్ళ చేతుల్లో నుంచి తప్పించి, మల్లికను కాపాడగలనేమోనన్న ఆశతో, భ్రమతో అందరి చుట్టూ తిరుగుతున్నాను. ఇప్పుడు మీ దగ్గరికొచ్చాను... "

"నేనేం చేయగలను?" అని అడిగింది మల్లిక.

"డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ మీకు మంచి ఫ్రెండు అని విన్నాను.... "

"నేనూ విన్నాను. మల్లిక మీకు ప్రాణం కంటే ఎక్కువేనని, ప్రేమించుకున్నారని, పెళ్ళిచేసుకోవాలనుకున్నారని.... చాలా విన్నాను..." అంది షీలా, కుర్చీలో సర్దుకుని కూర్చుని, వెనక్కివాలి రిలాక్స్ అయి.

"అదంతా విన్నారు కాబట్టి, మళ్ళా మీకు చెప్పుకోవాల్సిన అవసరంలేదు అనుకుంటాను. నా ప్రమేయం లేకపోయినా, నా మూలంగా ఆమెకూ, ఆమె భర్తకూ మధ్య కలతలు పెరిగాయి. కలహాలు జరిగాయి. తిట్టుకున్నారు. కొట్టుకున్నారు. ఇప్పుడేమో చంపుకుంటున్నారు. మల్లిక ఇటు నా స్నేహితురాలు అయితే డాక్టర్ గారూ మీకు మంచి స్నేహితుడు కనుక, వాళ్ళకోసం మనం ఏదైనా చేయగలమేమో అడగటానికి వచ్చాను... ఆయన మీ మాట కాదనరేమోనని నా ఆశ...." అన్నాడు సత్యమూర్తి.

"డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ గారు చెబితే నేను వినటమేగాని, నేను చెపితే ఆయన వినే ప్రసక్తిలేదు. ఆయనకు చెప్పగల సామర్థ్యంకూడా నాకూ లేదు..."

"కానీ ఒక సంసారం కూలిపోతుంటే, మీకు కనీసం ఫీలింగ్ అయినా లేదా? మీరు డాక్టర్ కనుక, పుట్టుక, చావు - ఈ రెండింటితో మీకు రోజూ కత్తులూ కఠార్లూ పెట్టి ఆడుకుంటూ ఉంటారు కనుక, ఒక మనిషి చావు మీకు చాలా రొటీన్‌లా కనిపించవచ్చు. కానీ మాకు అలా కాదు ప్రతి చిన్న కష్టానికీ, సుఖానికీ అతిగా రియాక్ట్ అయ్యే మేము, చావు పుట్టుకలకు చాలా ప్రాముఖ్యతనిస్తామండీ.." అన్నాడు సత్యమూర్తి.

"మీరు చాలా పొరపాటు పడుతున్నారు. మేం కత్తులూ, కఠార్లతో ఆడుకునే మాట నిజమేకాని, రోజూ మా చేతుల మీదుగా జరిగే ప్రతి పుట్టుకకూ, చావుకూ, మేమూ ఎంతో ప్రాముఖ్యత నిస్తాం.." అంది షీలా.

"మరి మల్లిక విషయంలో మీరెందుకు ఇంత ఉదాసీనంగా, పట్టనట్లు కూర్చుంటున్నారు?...." అని అడిగాడు.

డాక్టర్ షీలా నిట్టూర్చింది. తర్వాత నెమ్మదిగా చెప్పటం మొదలు పెట్టింది.

"డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్‌తో నాకు ఏర్పడిన పరిచయం ఈనాటిది కాదు. చదువుకునే రోజుల్లోనే మేమిద్దరం చాలా క్లోజ్‌గా ఉండేవాళ్ళం. వాళ్ళది బాగా ఉన్నవాళ్ళ కుటుంబం అయితే, మాది లేనికుటుంబం. అందుచేత ఎన్నోసార్లు చదువు ఆపేద్దామనుకున్నాను. ఎప్పటికప్పుడు, హరి అడ్డుపడి నన్ను చదివించాడు. తనతో పాటు మెడిసన్‌లో చేర్పించాడు. అతనికి ఇక్కడ సీటు వచ్చింది. నాకు రాలేదు. నాకోసం ఇక్కడ తనకు వచ్చిన సీటు వదులుకున్నాడు. ఇద్దరం కలిసి చదువుకోవాలన్న ఉద్దేశ్యంతో, ఇద్దరికీ డొనేషన్స్ కట్టి మంచి చోట సీట్లు సంపాదించాడు. నన్ను హాస్టల్‌లో ఉంచాడు. నాకు తెలియనివి ఎన్నో విషయాలు చెప్పాడు. తిండీ బట్టా, నాకు అవసరమైన ప్రతి చిన్న ఖర్చూ తానే భరించాడు. ఇక్కడ జాబ్ ఇప్పించాడు. ఇప్పుడు నేను ఉంటున్న ఈ ఇల్లూ, ఈ ఇంట్లోని వస్తువులూ - అన్నీ ఆయనవే - అసలు ఈ షీలా జీవితమే ఆయనది. కనుక ఆయనకు నా మీద పూర్తి హక్కులున్నాయి. ఆయన ఏం చెబితే అలా చెయ్యటమే నా పని...."

"మీ అనుబంధం ఎంత గొప్పదైనా, మీరు పెళ్ళి చేసుకోలేదు. లోకం దృష్టిలో మీరు ఆయన భార్య కాదు..."

"తెలుసు, నేను డబ్బులేనిదాన్ని అయినందువల్ల నన్ను పెళ్ళిచేసుకోవటానికి హరి తల్లి అడ్డుపడింది. ఆమెకు ఇష్టం లేకపోయినా నన్ను పెళ్ళిచేసుకోవాలని హరి అనుకున్నాడు. కానీ నేను అలా చేయవద్దు అన్నాను. తర్వాత తల్లి కోరిక తీర్చడం కోసం హరి, మల్లికను చేసుకున్నాడు. హరి కోరికను తీర్చటం కోసం నేనిలా మిగిలిపొయ్యాను. లోకం దృష్టిలో నేను అతని భార్యను కాదు. ఈ అనుబంధం మా ఇద్దరికీ అర్థం అవుతుంది. నేను హరికోసం ఎదురు చూస్తూ ఇలాగే ఉండిపోతాను. హరీ నేనూ కరెన్సీ నోటుకు అటూ ఇటూ ఉండే రెండూ వేర్వేరు డిజైన్‌లలాంటివాళ్ళం. మా ఇద్దర్లో, ఏ ఒక్కరులేకపోయినా, రెండోవాళ్ళ జీవితానికి అర్థం లేదు. ఉయ్ ఆర్ ఇన్‌కంప్లీట్ వితౌట్ ది అదర్..."

సత్యమూర్తి అన్నాడు "అంత బలమైన బంధం ఉన్నప్పుడు, ఇంత చదువుకుని, స్వేచ్ఛగా మాట్లాడుకోగల చనువు ఉన్నప్పుడు, మీరు పెళ్ళి చేసుకుని ఉంటేనే బావుండేది..."

"నా జీవితానికా అదృష్టం లేదు ..."

"అని మీరు సరిపెట్టుకున్నారు సరే. అటు మల్లిక, డాక్టర్ హరిల జీవితాలకూ అర్థం లేకుండా పోయింది. నౌకరుకు నచ్చకపోతే, పని మానేసి వెళ్ళిపోతుంది. కొడుకూ, కోడలకూ నచ్చకపోతే, వేరే కాపురం పెట్టుకుని విడిగా ఉండిపోతారు. ఒక ప్రియుడికీ, ప్రియురాలికీ సరిపడకపోతే ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారు. కానీ భార్యాభర్తల సంగతి అలా కాదు. వాళ్ళ మధ్య ప్రేమాభిమానాలు లేకపోతే, ఆ ఇల్లు నరకం వాళ్ళ బ్రతులుకు దుర్భరం. ఇంకో విషయమేమిటంటే, ఆలుమగల మధ్య నాలుగు గోడల మధ్యా ఎన్ని గొడవలున్నా ఫర్వాలేదు. ఏదో విధంగా సర్దుబాటు చేసుకుంటారు. కానీ వాళ్ళ మధ్య గొడవలున్నాయని లోకమంతా తెలియటం మాత్రం - అన్నిటికన్నా బాధాకరమైన విషయం" అని చెప్పాడు సత్యమూర్తి.

"ఇందాకే చెప్పాను. నేను స్వంతంగా నిర్ణయాలు తీసుకోవటం లేదు. హరి చెప్పినట్లు చేయటమే నాకు తెలుసు. హరి మల్లికను పెళ్ళిచేసుకున్నాడేగానీ, మొదటిరోజు రాత్రంతా నాతోనే గడిపాడు. మీ దృష్టిలో, సంఘం దృష్టిలో, మల్లిక ఆయన భార్య కావచ్చు, నేను పరాయి దాన్ని కావచ్చు. కానీ మా దృష్టిలో ఆయనే నా భర్త. నేనే ఆయన భార్య..." అంది షీలా.

"ఏమండి. ఒక చిన్న విషయం ఆలోచించండి . ఎవరికి నచ్చిన వాళ్ళతో వాళ్ళు ఉంటూ లోకంతో మాకు పని లేదు మా లోకం వేరు అని గిరిగీసుకుని ఉండటం మొదట్లో బాగానే ఉంటుంది. కానీ తర్వాత వచ్చే సమస్యలే జటిలమైనవి. బాల్యం, యవ్వనం గడిచాక, పెళ్ళిచేసుకోవాలి, తల్లి కావాలి, పిల్లలు కావాలి. వాళ్ళకు చదువూ సంధ్యా చెప్పించాలి. మంచీ మర్యాదా నేర్పాలి. మీ పిల్లలకు సంఘంలో గౌరవమైన స్థానాన్ని కల్పించాలి. డాక్టర్ హరిగారి భార్యగా కాక, ఆయన భార్యలాంటి మనిషిగా ఉంటూ ఇవన్నీ సాధించగలరా? ధైర్యంగా పిల్లల్ని కనగలరా?..." అని అడిగాడు సత్యమూర్తి.

"నేను అలాంటి ఆశలేం పెట్టుకోలేదు. ఇలాగే ఒంటరిగా ఉండిపోతాను. రోజూ హరి వస్తాడు. ఆ కాసేపూ నా ఇంట్లో వెన్నెల కాస్తుంది. ఈ దశలేవీ నా జీవితంలో లేవు. ఈ చీకట్లోనే ఆయన కోసం ఎదురు చూస్తూ గడిపేస్తాను... ఇంతే..." అంది షీలా. ఆ మాటలు అంటున్నప్పుడు కంటి కొసల నుంచీ కన్నీరు జారింది. చేత్తో తుడిచేసుకుంది.

"మీలాంటి మనిషిని నేనెక్కడా చూడలేదు..." అన్నాడు సత్యమూర్తి.

"ఇది తిట్టో, దీవెనో నాకు తెలీదు. నాలాంటి మనిషిని చూడలేదంటే, నాలాంటి పనికిరానిదాన్ని చూడలేదనా?" అని ఇంతలేసి కళ్ళతో చూసింది షీలా.

"మీ జీవితం, మీ ఇష్టం. వ్యాఖ్యానించటానికి నేనెవర్ని? కానీ మీ వల్ల మల్లిక బ్రతుకు బండలైపోతోంది..." అన్నాడు. సత్యమూర్తి.

"నా వల్లనే అని ఎందుకు అనుకోవాలి? ఆమె బతుకు బండలు కావటానికి మీరూ కారణమే... " అంది షీలా.

"అదే నా బాధ కూడా. అయితే మీకు కనీసం ఆ ఫీలింగ్ కూడా లేదు. జాలీ, దయా కూడా లేకుండా పోయినయి" అన్నాడు సత్యమూర్తి.

"మాటలు మర్యాదగా రానివ్వండి... నేను చేయగలిగిందేమీ లేదని ముందే చెప్పాను...."

"మీరు చేయగలిగింది కొంత ఉంది చేస్తారా మరి!" అని అడిగాడు సత్యమూర్తి.

"ఏమిటది?"

"మీరు డాక్టర్ హరి జీవితం నుంచి తప్పుకుంటే మొదట్లో కొంత కాలం ఆయన బాధపడినా, తర్వాత రాజీపడి, కుదుటపడి భార్యతో సెటిల్ అవుతాడు..." అన్నాడు సత్యమూర్తి. మళ్ళీ తనే

"వాళ్ళిద్దరి జీవితాలనుంచి తప్పుకుందాం మళ్ళా ఎప్పుడూ ఎక్కడా వాళ్ళ కంటపడకుండా ఉండేంత దూరంగా మీరూ, నేనూ ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోదాం. ఇందుకు మీరు ఒప్పుకుంటే, నాకూ ఇష్టమే.... సంతోషంగా ఇప్పుకుంటాను..." అన్నాడు సత్యమూర్తి.

"ఆలోచించుకునేందుకు నాకు కొంచెం టైం ఇవ్వండి...." అంది షీలా.

"మీకు కావల్సిన టైం తీసుకోండి. ఆలోచించండి. కానీ మరీ ఆలస్యం చేసి మల్లిక బ్రతుకు తెల్లారిపొయ్యేదాకా జాప్యం చేయకండి. మీరు డాక్టరు. ప్రాణాలు కాపాడవలసిన వాళ్ళు. మీ వల్ల ఒక మనిషి నిండు ప్రాణాలు పోకుండా చూడండి. డాక్టరు హరి జీవితంలో మీ జీవితం విడదీయలేనంతగా ముడిపడిపోయిందని తెలుసు కానీ ఎప్పటికీ మీరు మూడో మనిషే.. ఆ ఒక్క విషయం దృష్టిలో పెట్టుకుని ఆలోచించండి... నన్ను మళ్ళా ఎప్పుడు రమ్మంటారు?" అని అడిగాడు సత్యమూర్తి.

"రెండు రోజులు టైం ఇవ్వండి...."

"రెండు రోజులా? వీలుండదు. సాయంత్రం మళ్ళావస్తాను. నాలుగింటికి.... ఆలోచించండి... ఇవాళ ఆదివారమే కదా... ఇంట్లోనే ఉంటారు కదా... " అన్నాడు సత్యమూర్తి.

ఇంతలో ఆయా లోపలినుంచి వచ్చింది.

"అమ్మా డాక్టరు బాబు ఫోన్ చేశారు. మల్లిక గారి గురించి అడుగుతున్నారు" అంది.

సత్యమూర్తి ఉలిక్కిపడ్డాడు. "మల్లికా! ఎక్కడా? ఇక్కడుందా?" అంటూ ఇంట్లోకి దూసుకు వెళ్ళబోయాడు.

డాక్టర్ షీలా లోపలికి దూరి, అతని ముఖాన తలుపులు మూసేసింది.

✷✷✷

*మనుషులంతా ఒకేలా ఉంటారా అంటే,*

*అవుననీ, కాదనీ కూడా సమాధానం చెప్పొచ్చు.*

*అందరికీ ఒక మొహం, రెండు కళ్ళు, రెండు చేతులూ, రెండు కాళ్ళూ ఉంటాయి గనక అందరూ ఒకేలా ఉండరనీ చెప్పొచ్చు.*

*దేవుడు చేసిన మనుషులు ఇని కోట్ల మంది వున్నా ఎవరి పోలికలు వాళ్ళవే. ఒకరికీ మరొకరికీ పోలికలు లేనట్లే కనిపిస్తారు.*

*దేవుడు ఇన్ని రకాల మనుషుల్ని తయారు చేసి ఊరుకోలేదు. ప్రతిమనిషికీ ఒక మనసు ఇచ్చాడు. పైగా దానికి ఆలోచించుకునే నేర్పునూ ఇచ్చాడు. కనుక ఎవరి ఇష్టాఇష్టాలు వాళ్ళవే.*

కృష్ణుడి కంటికి రాధ రాగరంజిత హృదయాంతర్గత సంగీతాలను వినిపించే ప్రణయైక మూర్తినిగా కనిపిస్తే, భీముడు కంటికి హిడంబి ఇహలోక అపురూప సౌందర్య రాశిగా కనిపించింది. అంచేత ఎవరి టేస్ట్ వాళ్ళదే అది మిగతా వాళ్ళకు నచ్చకపోవచ్చు. వాళ్ళు మెచ్చకపోవచ్చు.

అలాగే -

సత్యమూర్తి మల్లికను ప్రేమిస్తే, షీలా, హరిశ్చంద్రప్రసాద్‌ను ప్రేమించింది. తాను ప్రేమించినవాళ్ళు చెప్పినట్లు చేయటం కన్నా, వాళ్ళను సంతోషపరచటం కన్నా, ఈ ప్రపంచంలో ప్రేమికులకు సంతృప్తి కలిగించే విషయం మరొకటి లేదు.

అందుకని మల్లికను ఎత్తుకొచ్చి డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ షీలా ఇంట్లో కట్టి పడేస్తే, షీలాకు ఇష్టం ఉన్నా లేకున్నా అతని మాట కాదనలేకపోయింది. మల్లికను ఇక్కడ దాచినట్లు ఎవరికీ చెప్పొద్దు అని అంటే, నోరు విప్పనూ లేకపోయింది.

మల్లిక ఆచూకీ కోసం సత్యమూర్తి చేసిన ఆర్భాటం అంతా షీలాకు తెలిసినా, తేలుకుట్టిన దొంగలా కిమ్మనలేక పోయింది. సత్యమూర్తి స్వయంగా ఆమె ఇంటికి వచ్చి అంతసేపు మాట్లాడినా, తన ఇంట్లోనే మల్లిక ఉందన్న విషయం బయట పడకుండా జాగ్రత్త పడింది.

కానీ ఎంత దాచినా దాగకుండా ఆ సంగతి సత్యమూర్తికి తెలియనే తెలిసింది. తెలిసాక తలుపులు మూసింది కదాని, ఎలా వెళ్ళిపోగలడు? బయటనుంచి తలుపులు బాదుతూనే ఉన్నాడు. అరగంట అయినా షీలా తలుపు తెరవలేదు, సత్యమూర్తి తలుపులు పగల కొట్టటం మాననూ లేదు.

చివరకు షీలా కిటికీ తెరిచింది.

"ఎందుకలా తలుపులు పగలకొడతారు. ఇప్పుడు వెళ్ళిపొండి సాయంత్రం రండి. ఈలోగా నన్ను ఆలోచించుకోనివ్వండి..." అంది.

ఈలోగా ఏం ఆలోచించుకుంటావ్? మల్లికను ఇక్కడనుంచి మరెక్కడికి తీసుకుపోవాలనా?" అని అడిగాడు సత్యమూర్తి.

"ఆవిడిని ఇక్కడ ఉంచమని నేనేం అడగలేదు. డాక్టర్ హరి తన భార్యను తీసుకొచ్చి ఈ ఇంట్లో ఉంచుతానంటే నేను కాదనలేక పోయాను. ఇదేకాదు ఆయన ఏది అడిగినా నేను కాదనలేను.... నీకిదివరకే చెప్పానా సంగతి..." అంది షీలా.

"నీ పాతివ్రత్యాన్నీ, ఆదర్శాన్నీ నేనూ మెచ్చుకుంటుంటున్నాను. కానీ మల్లికను చూడకుండా ఇక్కడినుంచి నేను కదిలే ప్రసక్తే లేదు..." అని ఖచ్చితంగా చెప్పాడు సత్యమూర్తి.

హరి అనుమతి లేకుండా మల్లికను ఎవరూ చూడటానికి వీల్లేదు. ఆయనొచ్చేవేళ అయింది. అనవసరంగా గొడవ చేయకుండా వెళ్ళి సాయంత్రం రా" అని చెప్పింది షీలా.

"నేనిప్పుడు వెళ్ళటం అంటూ జరిగితే పోలీసుల దగ్గరకే వెళతాను. మల్లిక ఎక్కడుందో వెతికి పట్టుకోవాలిసిన బాధ్యత వాళ్ళకు ఉంది. అంతకన్నా ముందు ఆమెను నేను చూసి తీరాలి. మర్యాదగా తలుపు తీయకపోతే, నేనే తలుపులు బద్దలు కొట్టి లోపలకు వస్తాను. మల్లికను చూడటానికి నాకు హరిహరాదుల అనుమతులేం అక్కర్లేదు..." అంటూ సత్యమూర్తి కాంపౌండు దగ్గర పెద్ద బండరాయి తీసుకొచ్చి తలుపు పగల కొట్టబోతే, అప్పుడు షీలాయే తలుపు తెరిచింది.

సత్యమూర్తి ఆమెను తోసుకుంటూ లోపలికి వెళ్ళాడు. పక్కగది తలుపు తీసింది షీలా. ఆ గదిలోనుంచి పిల్లి ఎదురొచ్చింది.

సత్యమూర్తి ఆ గదిలో ఒక మూలపడుకున్న మల్లిక దగ్గరకు వెళ్ళాడు.

మల్లిక చాలా బలహీనంగా పిలిచినా, తట్టినా, లేచేటట్లు లేదు.

సత్యమూర్తి ఆమె మీదకు వంగి 'మల్లికా' అని నాలుగుసార్లు పిలిస్తే బరువుగా మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరిచే ప్రయత్నం చేసింది.

"నువ్వా?" అంది.

"నేనే వచ్చాను. ఇంకేం ఫర్వాలేదు. మనం వెళ్ళిపోదాం" అన్నాడు సత్యమూర్తి.

మల్లిక విరక్తిగా నవ్వింది. "మనం ఎక్కడికి వెళతాం? నన్నింక మర్చిపో, నా పని అయిపోయింది, నేను వెళ్ళిపోతున్నాను...." అంది పైకి చూస్తూ.

"అలా కాదు. నేను ఇప్పటిదాకా షీలాతో మాట్లాడాను. అటు ఆమె, ఇటు నేనూ, మా ఇద్దరివల్లే మీ సంసారం నాశనమయింది., అంచేత మీ ఇద్దర్నీ - ఒప్పించి, మీరు కలిసి మెలిసి ఉంటానంటే, మేం ఇద్దరం దూరంగా వెళ్ళిపోతాం. జీవితంలో మళ్ళా ఎప్పుడూ మీకు కనిపించనంత దూరం, మా గురించి మీకు ఏమీ వినిపించనంత దూరం వెళ్ళిపోతాం, నేస్తం..." అన్నాడు సత్యమూర్తి.

మల్లిక బలహీనంగా నవ్వి, తలపక్కకు తిప్పేసుకుంది. "ఇంతకాలం మేం బద్ధ శత్రువుల్లా కత్తులు దూసుకున్నాం, కొట్టుకున్నాం, రోడ్డున పడ్డాం. కేవలం ప్రాణాలు కాపాడుకోవటం కోసం నేను ఆయన ఇంట్లోంచి నీ చేతి చలువ వల్ల అప్పుడు బయట పడినట్లే పడినా, మళ్ళా పట్టుకొచ్చి ఇక్కడ పడేశాడు. ఈ భూమి మీదనే కాదు, సప్తసముద్రాల్లో ఎక్కడ దాక్కునా, నన్ను వెంటాడి, వేటాడి చంపటానికే ఆయన కంకణం కట్టుకున్నాడు. ఈపాటికే నన్ను చంపి తన లక్ష్యం నెరవేర్చుకునే వాడే కానీ ఎందుకో ఆలస్యం చేశాడు..." అని ఆగింది మల్లిక.

"అందుకు కారణం బహుశా నేను బయట చేసిన హడావుడికావచ్చు. నువ్వు ఇక్కడుంటానన్న ఊహే రాలేదు. ఏమైపోయినావో తెలుసుకునేందుకు నేను చేయగలిగినదంతా చేశాను. అయినా అవేమీ ఫలించలేదు. అనుకోకుండా, ఇక్కడ ఇలా చూడగలిగాను...."

"నిస్త్రాణంగా ఉన్న నాకు చల్లని స్పర్శ తగలగానే తెలిసిపోయింది. వచ్చింది నువ్వేనని.. ఎక్కడున్నా, ఏ స్థితిలో ఉన్నా నా నేస్తానివి, నువ్వు నన్ను వెతుక్కుంటూ వస్తావని తెలుసు...." అన్నది మల్లిక.

"కానీ నేను వచ్చిన ప్రతిసారీ నీకు అనవసరమైన గొడవలు, కష్టాలూ ఇబ్బందులూ వస్తున్నాయి. అందుకే నేను నీ నుంచి దూరంగా చాలా దూరంగా వెళ్ళిపోదామనుకుంటున్నాను" అన్నాడు సత్యమూర్తి.

మల్లిక ప్రేమగా సత్యమూర్తి చెయ్యిపట్టుకుని అన్నది, "నాకీ కష్టాలు పెళ్ళయిన మర్నాటినుంచే మొదలైనవి. అయితే, నేను ఎవరికీ ఏమీ చెప్పుకోలేక, నా బాధ, నా దుఃఖం నాకే పరిమితం చేసుకున్నాను. నిన్ను చూసినప్పటి నుంచీ నేను ఒంటరిదాన్ని కాదు. నాకు కొండంత అండగా నువ్వు ఉన్నావన్న ధైర్యంతో ఉన్నాను. నన్ను ఇలా విడిచేసి వెళ్ళిపోతే, నాకు మనసు విప్పి చెప్పుకునే మనిషే కరువైనాడన్న వేదనతో, ఈ గుండెలు మరింత బరువెక్కిపోతాయి. ఊపిరాడక ఇలాగే ఎప్పుడో నిద్రలోనుంచి, ఇంక శాశ్వత నిద్రలోకి వెళ్ళిపోతాను. నేను చావటానికి సిద్ధపడుతుంటే, నా భర్త అంతదాకా ఓపిక పట్టలేక, ఇంకా తొందరగానే నన్ను సాగనంపటానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాడు. కనుక ఇంక నాకెంతో కాలం గడువులేదులే - ఈ చివరి ఘడియల్లో అయినా నువ్వు నా దగ్గర ఉండు సత్యా... తృప్తిగా కన్ను మూస్తాను." అని బాధ పడింది మల్లిక.

"నాకు జీవితం మీద ఆశలు లేవు. ఉన్న ఆశ అల్లా నిన్ను చేరుకోవాలనే, నువ్వులేకపోతే, నాకూ ఇంక ఈ లోకంతో పనేముంది?" అన్నాడు సత్యమూర్తి.

"అలా అంటే ఎలా? నీకు లోకంతో పని లేకపోవచ్చు. కానీ లోకానికి నీలాంటి మంచి వాళ్ళతో, స్నేహపాత్రులతో చాలాపని ఉంది. అదీగాక, నీకు పట్టుమని మూడు పదులైనా లేదు వయస్సు.." అని నవ్వలేక నవ్వింది.

"అంటే అక్కడికి నువ్వు నూరేళ్ళు బతికి, పండుటాకులా రాలిపోతున్నావనా, ఈ అప్పగింతలు చెప్పటం?" అని అడిగాడు సత్యమూర్తి.

"కొంతమందికి నూరేళ్ళు బతికినా ఇంకా పదేళ్ళ పిల్లల్లాగానే ఉంటారు. జీవితం మీద మమకారం చావదు కనక వాళ్ళు చావలేరు. కొందరికి అలా కాదు. ఒకరోజులోనే నూరేళ్ళ అనుభవాలు పొందుతారు. తలబొప్పి కట్టిపోతుంది. విరక్తి పెరిగిపోతుంది..."

"ఏ అనుభవమూ లేకుండా కాకిలా కలకాలం బతకాలన్నా అదీ నిస్సారంగానే ఉంటుంది... చేదుబిళ్ళల్లాంటి నీ అనుభవాలు ఇప్పుడు కష్టాల్లో ఉన్నా, ముందు ముందు ఈ మందు పనిచేసి ఆరోగ్యం కుదుటపడుతుందిలే, మల్లికా... నీ భర్తా, నువ్వూ నీ సంసారం... నీ ఇల్లూ, నీ పిల్లలూ... అందంగా ఆనందంగా.... కాలం గడిచే రోజులు రావాలని నా లలిత లలితమైన ఆకాంక్ష..."

"కాలక్షేపంకేం తక్కువగానీ, నేనూ, నా భర్తా కలవటం ఆనందంగా కాలక్షేపం చేయటం, ఒట్టి పగటి కల..."

"నేను కలుపుతాను. అవసరమైతే మీ ఆయనతో మాట్లాడుతాను. స్పష్టంగా అన్నీ తేల్చేసుకుందామనుకుంటున్నాను. ఇంక ఈ అసందిగ్ధ పరిస్థితి ఎన్నాళ్ళో సాగదు. ఆయన మనసులో ఏముందో స్పష్టంగా తెలుసుకుంటాను. నీ భవిష్యత్తు ఏం చేయదల్చుకునాడో తేల్చుకుంటాను.. జరిగినదంతా పీడకలలా మర్చిపోయి, నీతో కల్సిపొమ్మని ఆయన్ని అడుగుతాను." అన్నాడు సత్యమూర్తి ఆవేశంగా.

"చెప్పాను కదా! మావి ఉతర దక్షిణ ధృవాలు. కలవని ధృవాలు కలపాలని ఎందుకు నీకింత ఆరాటం?" అని అడిగింది మల్లిక.

"మీ ఇద్దరి మధ్యా ఏర్పడ్డ ఘర్షణకు, ద్వేషానికి నేను కారణం గనుక..."

"నీవొక్కడివే ఇక్కడ కారణం కాదు..." అని మల్లిక గుమ్మం వైపు చూసింది. అక్కడ షీలా నిలబడి వీళ్ళ సంభాషణ అంతా వింటూనే ఉంది.

"నన్ను బలవంతంగా ఎత్తుకు వచ్చినందుకు నేను బాధపడటం లేదు. కానీ తెచ్చి ఇక్కడ దీని కొంపలో పడేసినందుకే చెప్పలేనంత యాతన పడిపోతున్నాను..." అంది మల్లిక.

అప్పుడింక షీలా జోక్యం చేసుకుంది.

"ఆయనొచ్చే వేళ అయింది. మీరిక వెళ్ళిపొండి" అంది షీలా సత్యమూర్తితో.

"నేను ఇప్పుడిక వెళ్ళలేను. ఆయన్ని రానివ్వండి. అటో ఇటో తేల్చేసుకుంటాను.." అన్నాడు సత్యమూర్తి.

"తేల్చుకోదలచుకుంటే మీరు ఆయన ఇంటికి వెళ్ళండి. అసలు మీరు ఇక్కడకి వచ్చారని తెలిస్తే ఆయన నన్ను క్షమించరు. పైగా మల్లికతో తీరిగ్గా కబుర్లు చెబుతూ కూర్చుంటే ఆయన చూసి సహించగలరా, మీరు ఇందాక చెప్పిందేమిటి? ఇప్పుడు చేస్తోందేమిటి? వాళ్ళిద్దర్నీ కలపటానికి ప్రయత్నం చేస్తానన్నారుగా, ఆయన లేనప్పుడు, ఆయన పెళ్ళాంతో మీరు సొల్లు కబుర్లు చెబుతూ కూర్చోవటం వల్ల ఆయనకు మీ ఇద్దరి మీదా మరింత కోపం పెరుగుతుందే కానీ తరగదు. మీరు చెప్పింది సిన్సియర్‌గా చెయ్యాలనుకుంటే మాత్రం ఇది పద్ధతి కాదు" అంది షీలా.

"కానీ నా భయం నాకుంది. నేను అటు వెళ్ళగానే నువ్వూ ఆయనా కలిసి మల్లిక మరెక్కడికైనా తీసుకుపోయి దాచిపెడితే నా పని మళ్ళీ మొదటి కొస్తుంది" అన్నాడు సత్యమూర్తి.

"అదేం లేదు. మల్లిక ఎక్కడికీ పోదు. ఇక్కడే ఉంటుంది. ఇంకొంచెం సేపట్లో ఆయన ఇక్కడకు వస్తారు. ఆయనతో నేను కొన్ని విషయాలు మాట్లాడాలి. నేనూ ఒకదారి చూసుకోవాల్సిన సమయం వచ్చింది. అందు చేత అదేదో ఇవాళే తేల్చుకుంటాడు ఏం మాట్లాడుకోవాలన్నా, మీరు ఇక్కడ ఉండకూడదు. మీరు ఆయన్ను కలుసుకునేందుకు తర్వాత ప్రయత్నం చేయండి. అప్పుడు చెప్పదలచుకుందేదో ఆయనతో చెప్పండి. ఆ తర్వాత చేయదలచుకున్నదేమిటో చెయ్యండి. అంతేగాని, ఇక్కడ మీరు తిష్టవేసుకుని కూర్చుంటే, ఆయన వచ్చాక పెద్ద గొడవ జరుగుతుంది. మధ్యలో నన్ను చంపేస్తారు..." అంటూ షీలా సత్యమూర్తికి బయటకు దారి చూపించింది.

"మరి నన్ను ఎప్పుడు రమ్మంటారు?" అని అడిగాడు సత్యమూర్తి లేచి గదిలోంచి బయటకు వచ్చి.

"రేపు రండి..."

"కాదు సాయంత్రం వస్తాను. ఎట్టి పరిస్థితులలోనూ ఇవాళ మల్లిక జీవితం ఒక పెద్ద మలుపు తిరగాలి. సాయంత్రం మల్లికా, ఆమె భర్తా, ఒకటైపోవాలి. అందుకు మీరూ నేనూ చేయగలిగినదంతా చేయాలి. గుర్తు పెట్టుకోండి" అన్నాడు సత్యమూర్తి.

మల్లిక అదోలా నవ్వింది. "ఎత్తిన అవతారాలన్నిటికన్నా, అదే గొప్ప అవతారం అవుతుందిలే" అంది వ్యంగ్యంగా.

"మరి వస్తాను నేస్తం" అని చెప్పాడు మల్లికతో.

సత్యమూర్తి గదిలోనుంచి బయటకు వచ్చాక, షీలా ఆ గది తాళం వేసింది.

వెళ్ళిపోతూ షీలాతో అన్నాడు.

"నేను వట్టి చేతులతో వెళ్ళిపోతున్నాను కదాని సంతోషించకు అంతా సవ్యంగా జరిగితే, అందరికీ సంతోషమే. నీమాట మీద విలువ ఉంచి వెళుతున్నాను. నేను వచ్చేలోగా మల్లికను ఏమైనా చేస్తే, నీతలకాయ టెంకాయ పగిలినట్లు పగులుతుంది. నేను ఎంత మంచివాడినో, అంత దుర్మార్గుణ్ణి కూడా..."

ఆ మాటలకి షీలా మొహం మాడిపోయింది. అయినా తనితో ఇంకా వాదన పెంచుకోవటం ఇష్టం లేక ఊరుకుంది.

❀ ❀ ❀

సత్యమూర్తి ఇంటికి వచ్చి, మల్లికను చూసినట్లు చెప్పగానే రవి ఎగిరి గంతేశాడు.

"ఎక్కడ?"

"షీలా వాళ్ళింట్లో..."

"ఆవిడ వాళ్ళింట్లో ఉండొచ్చునని నాకు ఎందుకో ఇది వరకే అనిపించిందండీ" అన్నాడు రవి.

"ఎందుకో అనిపించదని ఇప్పుడు దీర్ఘాలు తీయకపోతే, అప్పుడే ఎందుకు చెప్పలేదు!"

"చెప్పినా మీరు నమ్మరని..."

"సంతోషించాంలే, తెలివితేటలకు..." అన్నాడు సత్యమూర్తి.

సాయంత్రం షీలా ఇంటికి సత్యమూర్తి బయలుదేరుతుంటే, రవి కూడా వస్తానన్నాడు.

"ఇప్పుడు అక్కడ చాలా ముఖ్యమయిన విషయాలు నిర్ణయించబోతున్నాం. ఇప్పుడు షీలా ఇంట్లో జరగబోయే సంఘటన మా నలుగురి జీవితంలో పెద్ద మార్పు తెస్తుంది.." అన్నాడు సత్యమూర్తి.

"ఏమిటండీ ఆ మార్పు?"

"ఏమో, అదేమిటో ఇప్పుడు నేనూ చెప్పలేను..." అన్నాడు సత్యమూర్తి.

దారి పొడుగునా ఎన్నో విషయాలు ఆలోచించుకుంటూ వచ్చాడు సత్యమూర్తి, డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్‌ను ఎలా ఒప్పించాలీ, మల్లికను ఎలా ఒప్పించాలీ అన్నదే అతని బుర్రలో తిరుగుతోంది.

షీలా ఇంటి ముందుకు రాగానే గేటు బయట ఆగిన కారును బట్టి మల్లిక భర్త అక్కడే ఉన్నాడని అర్థమైంది.

గేటు తీసుకుని లోపలికి వెళ్ళాడు. తలుపు తీసే ఉంది. అయినా తాను వచ్చినట్లు లోపల ఉన్న వాళ్ళకు తెలియటం కోసం కాలింగ్ బెల్ నొక్కాడు. రెండు మూడు నిముషాలు ఎదురు చూసినా ఎవరూ రాకపోవటంతో సత్యమూర్తి లోపలికి వెళ్ళాడు.

మధ్య గదిలో దృశ్యం చూసి ఆశ్చర్యంతో అలాగే నిలబడి పొయ్యాడు.

గదిలో బొక్క బోర్లా పడి ఉన్న మనిషి శవం కనిపించింది.

ఎప్పటికోగాని తేరుకుని సత్యమూర్తి దగ్గరకు వెళ్ళి ముందుకు వంగి చూశాడు.

ఎదురుగా మల్లిక గది తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి. ఆమె కిటికీ దగ్గర ముడుచుకుని కూర్చుంది. మొహం మోకాళ్ళ మధ్య దాచుకుని.

సత్యమూర్తి నెమ్మదిగా వెళ్ళి, ఆమెను తట్టి పిలిచాడు "మల్లికా... మల్లికా..." అని.

ఆమె తలెత్తి చూసింది. మొహం అంతా కన్నీటితో తడిసిపోయింది.

"వచ్చావా నేస్తం... మధ్యాహ్నం చెప్పి వెళ్ళావుకదా..... ఇవాళ సాయంత్రం నా జీవితం పెద్ద మలుపు తిరగబోతుందని ఇంతకన్నా పెద్దమలుపు ఏం కావాలి?" అని అడిగింది మల్లిక.

సత్యమూర్తికి నోటమాట రాలేదు.

బయట పోలీసు జీపు ఆగింది. పోలీసులు లోపలికి వచ్చారు.

అవతల గదిలో నుంచి షీలా వచ్చింది

సబ్ఇన్స్పెక్టర్ అడిగాడు "ఏం జరిగింది?"

షీలా చెప్పింది "మల్లిక ఆమె భర్తను హత్య చేసింది..." ఇంకా ఏదో అడుగుతున్నాడు.

ఆమె ఏదో చెబుతూంది.

సత్యమూర్తి ఇదెలా సంభవం అన్నట్లు మల్లికవైపు చూశాడు.

"నేను ఇవాళ కొత్త అవతారం ఎత్తుతానని అన్నావు కదా - ఇంతకన్నా గొప్ప అవతారం మరేం ఉంటుంది?" అంది మల్లిక పోలీసు జీపు ఎక్కుతూ.

*ఎక్కడెక్కడో -*

*చినుకు చినుకుగా రాలి, కాలవగా పారి, సెలయేరుగా మారి -*

*మన ఊళ్ళోకి వరదై వచ్చి, మన గుమ్మాల్లో బురదను మిగిల్చినట్లు -*

ఎప్పుడెప్పుడో -

ఎందుకెందుకో చేసిన పనులే, పొరపాట్లుగా మారి, అపోహలు కలిగించి, కక్షలు పెంచి, గుండెల్లో కత్తులు దించి, స్వచ్ఛమైన చేతులకు చిక్కని రక్తాన్ని పులిమి, హంతకులుగా మిగులుస్తాయి.

లేకపోతే -

మీరూ, నేనూ కూడా తల్లి కడుపులో నుంచి వేలెడు బిడ్డగా బయట పడ్డప్పుడు, ఒంటిని అంటుకుని ఉన్న మైలా, మకిలీ అయినా మనంతట మనం కడుక్కోగలిగామా? లేదుకదా! ఎవరో శుభ్రంగా స్నానం చేయించి, పొత్తిళ్ళలో పడుకోబెడితే తప్ప, పాలుపడితే తప్ప, నిశ్చింతగా నిద్రపోలేనంత నిస్సహాయులుగా పుట్టామా?

అలాగా!

రేపోమాపో పైనుంచి పిలుపు వచ్చాక, అన్నీ ఎక్కడివక్కడ వదిలేసి హడావిడిగా వెళ్ళేటప్పుడు, స్మశాన వాటిక దాకా అయినా, నాలుగు అడుగులు వేసి మనంతట మనం, వెళుతున్నామా చెప్పండి? అప్పుడు నలుగురు పుణ్యాత్ములెవరో మనల్ని భుజాల మీద మోసుకుపోతారు. పోనీ, లేచి చితిమంటలు రగిలించటానికో చిన్న అగ్గిపుల్ల అయినా స్వయంగా గీస్తామా అంటే అదీలేదు. ఏదీ ఎరగనట్లు మొద్దు నిద్దరపోతుంటాం.

అలా పుట్టినప్పుడు, ఇలా గిట్టినప్పుడూ మనం ఏమీ ఎరగనివాళ్ళం. ఏదీ చెయ్యలేని చేతగాని వాళ్ళం. కానీ ఈ మధ్య కాలంలో మాత్రం, 'నా అంతటి వాళ్ళు' ఎవరున్నారంటూ ఛాతీ విరుచుకు తిరుగుతాం. ఈ నాలుగు రోజులూ మనం ఏం చేస్తే అదే ఘనకార్యం. మనకు ఇష్టంలేని పని ఎవరేం చేసినా అది నేరం.

సత్యమూర్తి లాయర్ శోభనాద్రి దగ్గర కూర్చుని నేరాలూ శిక్షలు గురించి చర్చిస్తున్నాడు.

"మల్లిక హత్య చేసిందంటే నేను నమ్మలేనండి" అన్నాడు సత్యమూర్తి.

"మీరు నమ్మటం, నమ్మకపోవటం కాదుగదా ముఖ్యం. కోర్టుకు నమ్మకం కలగాలి మల్లిక నిర్దోషి అని... అందుకు పనికొచ్చే పాయింట్లు ఏమిటో చూడాలి.." అన్నాడు లాయర్ శోభనాద్రి.

"డాక్టరుగారి హత్య జరగటానికి కొన్ని గంటల ముందే నేను షీలా ఇంటికెళ్ళాను. అక్కడ మల్లిక ఉంటుందని ముందుగా నాకు తెలియదు. కానీ వెళ్ళేక తెల్సింది. షీలా అభ్యంతరం చెప్పినా, నచ్చచెప్పి మల్లికను చూసాను.. ఆమెతో మాట్లాడాను. మల్లిక అంతకుముందు కొద్ది రోజులనుంచీ తిండితినటం లేదు. చాలా బలహీనంగా ఉంది.... కళ్ళు తెరిచి చూడటం, నీరసంగా మాట్లాడటమే ఆమెకు కష్టమైపోయింది. అలాంటి మనిషి డాక్టరు హరిశ్చంద్రప్రసాద్‌ను హత్య చేయలేదు...." అని చెప్పాడు సత్యమూర్తి.

"అఫ్‌కోర్స్.... అదొక పాయింట్... కానీ రేపు పోలీసులు కోర్టులో మల్లికే హత్య చేసిందని రుజువు చేయటానికి అనేక కారణాలు చూపిస్తారు. మల్లికకూ ఆమె భర్తకూ ఏ మాత్రం సఖ్యత లేదు. ఇద్దరి మధ్యా యుద్ధమే జరుగుతోంది. ఆమె ఇంట్లో నుంచి పారిపోవటం, మీ దగ్గరకు రావటం, మీ దగ్గర నుంచీ మాయం కావటం, షీలా ఇంట్లో బందీ కావటం - ఇవన్నీ భార్యాభర్తల మధ్య ఏ మాత్రం ఆదరాభిమానాలు లేకపోగా, వాళ్ళిద్దరూ కత్తులు నూరుకుంటున్నారన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. భర్త ప్రియురాలు అయిన షీలా ఇంట్లో ఆమెను కట్టిపడేసినందువల్ల, మల్లిక రెచ్చిపోయేందుకు అవకాశం ఎంతైనా ఉంది. షీలా చేతి నుంచి ఇచ్చేనీళ్ళు కూడా తాగనని మల్లిక భీష్మించుకుని కూర్చోవటంలోనూ ఆశ్చర్యంలేదు. తన భర్త ఉంపుడు గత్తె పేరు చెబితేనే ఏ భార్యా అయినా కోపంతో ఉడికిపోతుంది. అలాంటిది ఆమె ఇంట్లో, ఆమె ఆధీనంలో పడేసి ఉంచినందుకు -

మల్లిక ఉద్వేగంతో రెచ్చిపోయే అవకాశం ఎంతైనా ఉంది. ఆ సమయంలో ఎదురుపడ్డ భర్తను తిట్టటం, కొట్టటం, చంపటం కూడా సంభవమే... రేపు పోలీసులు కోర్టులో ఎంతో నేర్పుగా చెప్పబోయే కథ కూడా ఇదే అందులో ఏ మాత్రం నిజం లేదని రుజువు చేయాలంటే, ఆవేళ జరిగినదంతా తెలుసుకోవాలి.... మల్లిక ఏమంటోంది?...." అని అడిగాడు లాయర్ శోభనాద్రి.

"జైల్లో ఉన్న మల్లిక చాలా డెస్పరేట్‌గా ఉంది. షాక్ నుంచి ఆమె ఇంకా తేరుకోలేదు. అందుకని ఈ విషయం ఆమెను అడగలేదు. ఎలాగూ బెయిల్ మీద విడుదల చేయించి, తీసుకొస్తాంగదా, ఇంటికి వచ్చాక, కొంచెం కుదుట పడ్డాక నెమ్మదిగా అన్నీ అడిగి తెలుసుకోవచ్చునని ఆగాను..." అన్నాడు సత్యమూర్తి.

"అఫ్ కోర్స్... అదీ నిజమేలే..." అన్నాడు శోభనాద్రి.

లాయర్ మర్నాడే బెయిలు మీద మల్లికను జైలునుంచి విడుదల చేయించగలిగాడు.

సత్యమూర్తి మల్లికని ఇంటికి తీసుకొచ్చాడు. ఆమె ఇంట్లోకి వస్తుంటే, చుట్టుపక్కల వాళ్ళంతా గుమ్మాల్లో నుంచీ, కిటికీల్లో నుంచి వింతగా చూశారు.

వాళ్ళందరి దృష్టిలో మల్లిక చెడిపోయిన మనిషి. అన్నిటికీ తెగించిన మనిషి. పూర్తిగా దిగజారిన మనిషి, నిక్షేపం లాంటి సంసారాన్ని మొగుడిని వదులుకుని, ఈ సత్యమూర్తి దగ్గర ఏదో సుఖపడి పోదామని వచ్చింది. వచ్చి అతనితో ఏమన్నా సుఖపడిందో లేదో ఎవరికీ తెలియదుగాని, పడరాని పాట్లు పడిందని అందరికీ తెలిసిపోయింది. భర్త భార్యను 'కిడ్‌నాప్' చేశాడు. 'కీప్' ఇంట్లో ఉంచాడు. అప్పుడైనా బుద్ధి తెచ్చుకుందా అంటే అదీ లేదు. రెచ్చిపోయి, మొగుడి గుండెల్లో కత్తి గుచ్చింది!

ఇంత గ్రంథ సాంగురాలని అంతా వింతగా చూడటంలో ఆశ్చర్యం ఏముంది? అసలు అలాంటి మనిషిని తమ ఇళ్ళ మధ్యకు రానివ్వటం, ఈ ఇంట్లో ఉండనివ్వటం... ఇదే గొప్ప.

తల వంచుకుని లోపలికి వచ్చింది మల్లిక. తూపుల్లాంటి చూపులతో, ఈటెల్లాంటి మాటలతో, ఇంక ఈ సమాజం తనని కుళ్ళబొడుస్తుందని మల్లికకు తెలుసు.

కిటికీలూ, తలుపులూ అన్నీ బంధించేశాడు రవి. మల్లిక సత్యమూర్తితో అన్నది -

"నన్ను మళ్ళా ఇక్కడకు ఎందుకు తీసుకొచ్చావు సత్యా?"

"తీసుకురాకుండా, నిన్ను అక్కడ వదిలేసి ఎలా ఉండగలను మల్లికా?"

మల్లిక కొంచెం సేపు ఏం మాట్లాడలేకపోయింది. రవి కాఫీ తెచ్చి ఇచ్చాడు, సత్యమూర్తి బలవంతం చేశాక, రెండు చుక్కలు కాఫీ గొంతులో పోసుకుంది. తర్వాత వెనక్కివాలి, గోడకు చేరగిలబడి, నెమ్మదిగా అన్నది -

"జైల్లోనే నయం... లోకం దృష్టిలో వాళ్ళంతా నేరస్తులు, ఖూనీ కోరులూ, దొంగలూ, వ్యభిచారులూ కావచ్చు. అక్కడున్న ఆ పాతిక మందీ అయినా పిలిస్తే పలుకుతారు. కలిసి ఉంటాం - కలిసి తింటాం.... ఇక్కడలా కాదు. చుట్టూ ఉన్న వాళ్ళంతా నీతిమంతులు, అతిపవిత్రులూ, పతివ్రతలూ, పెద్ద మనుషులూ... వీళ్ళ మధ్య నేనొక పాపిని. పతితను. హంతకిని. వాళ్ళ చూపుల్లో కోటికోట్ల అర్థాలు. ప్రశ్నార్థకాలు. ఎవరికీ ఏ సమాధానమూ చెప్పలేక, వంచిన తల ఎత్తలేని దౌర్భాగ్యపు స్థితిలో ఉన్నదాన్ని... వీళ్ళ మధ్య ఉండటం, ఇదే నాకు నిజమైన జైలు. ఈ అవమానభారాన్ని మోస్తూ అనుక్షణం కృంగిపోవటం - ఇదే అసలైన శిక్ష..." అంది మల్లిక.

"నిష్కారణంగా నీవీ శిక్షలూ, అవమాన భారాలు భరించాల్సి వస్తోంది..."

"నిష్కారణం ఏముంది? నేను నేరం చేశాను. అందుకనే ఈ బాధను భరిస్తున్నాను..."

"నువ్వు నేరం చేయలేదు. చేయలేవు. నాకు తెలుసా సంగతి..."

"నీకు నా మీదున్న అంతులేని ప్రేమవల్ల, ఆదరం వల్ల, నీకు అలా అనిపిస్తుంది. కానీ నేనే నేరస్తురాలిని..."

"ఈ విషయంలో ఎవరేం చెప్పినా, నేను నమ్మను. ఆ హత్య నువ్వు చెయ్యలేదు... అసలారోజు నేను వెళ్ళిపోయ్యాక ఏం జరిగిందో స్పష్టంగా చెప్పు..." అని అడిగాడు సత్యమూర్తి.

"ఏముందీ? కాసేపటికి ఆయన వచ్చాడు - మాటా మాటా పెరిగింది... కత్తితో పొడిచాను... అంతే..." అని చెప్పేసింది.

"అని నువ్వు కథలు చెబితే నమ్మేంత అమాయకుడిని కాదు నేను. లేచి కూచోవటానికి ఓపిక లేని నువ్వు, ప్రాణం పోతున్న దానిలాగా నాతో అంత నీరసంగా మాట్లాడిన నువు, ఆయన్ని ఎలా చంపగలిగావు? ఈ హత్య నువు చేయలేదు ఎవరు చేశారో నువ్వు చెప్పకపోయినా, ఇంకో నాలుగు రోజులు తర్వాత అయినా నేను కనుక్కోగలను..." అని చెప్పాడు సత్యమూర్తి.

"కనుక్కోవాల్సినదేముంది? నేనే ఒప్పుకుంటున్నానుకదా..." అంది మల్లిక.

"ఈ అవమానాన్ని, బాధనీ, భరించలేక జీవితం మీద అంతులేని విరక్తి కలిగి, ఎవరో చేసిన హత్యను నీ నెత్తిమీద వేసుకుని, ఈ జీవితానికి ఇంతటితో మంగళం పాడాలనుకుంటున్నావు. కానీ, నువ్వు ఒప్పుకున్నంత మాత్రాన నువు చేయని హత్య, నువ్వు చేసినట్లు చెలామణి కాదు, నేను అలా జరగనివ్వను..."

మల్లిక సత్యమూర్తి వంక నిశితంగా చూసింది " ఈ సమయంలో నాకు తల్లీ, తండ్రీ, అన్నా వదినా, అక్కా చెల్లెలూ... అయిన వాళ్ళు ఎంతమంది ఉన్నా, అంతా నా ఖర్మకు నన్ను వదిలేసి ఊరుకునేవాళ్ళు... ఎవరికీ అక్కర్లేని దౌర్భాగ్యురాలి మీద, భూమికి బరువైపోయిన ఈ హీన చరిత్రురాలిమీద, ఇంకా నీకెందుకు ఇంత దయ, జాలి, ప్రేమ, కరుణ?..." అని అడిగింది.

"దీనికి సమాధానం చెప్పటం కష్టమే. ఎందుకంటే నా పట్ల నువ్వు, నీ పట్ల నేను ఇంత ఎక్కువగా ఎందుకు రియాక్ట్ అవుతున్నామో మనకే తెలియదు గనుక. నిఖార్సయిన స్నేహం ఉన్నప్పుడు, వాళ్ళ శరీరాలు వేరయినా, ఆత్మలూ, అంతరాత్మలూ

కలిసేవుంటాయి. కనుకనే ఎవరికే చిన్న కష్టం వచ్చినా, రెండోవాళ్ళు అమితంగా బాధపడటం, ఆ బాధ నుంచి తేరుకోటానికి చేయగలిగినదంతా చేయటం ..."

"నువు చేయగలిగినదంతా చేస్తున్నావు సరే...నీకు నేను ఏం మిగులుస్తున్నాను? నా కష్టాల్ని, దుఃఖాన్నీ, నీకు పంచి పెడుతున్నాను అంతేకదూ?..."

"చెప్పాను కదా... నీ కష్టాలూ, దుఃఖాలూ నీవే కావు నావికూడా. నిర్మలంగా నీటిలోకి రాయి విసిరితే, ఆ రాయి పడిన చోటేకాదు. ఆ చుట్టూతా నీరు చెదిరి, కదిలి ప్రకంపనాలు ఏర్పడతాయి. అలాగే ప్రశాంతంగా ఉన్న నీ జీవితంలోకి నేను వచ్చిపడ్డాను. దాని ఫలితంగా ఏర్పడ్డవే ఈ బాధల వలయాలు...బీభత్సాల వైబ్రేషన్స్.... మీ ఆలుమగల ఉక్రోషాలకూ, ఆక్రోశాలకూ ఆద్యం నేను... ఒకనాటి నా సౌందర్య స్వప్నానివి నీవు..... నేను విదిల్చిన అగ్నికణానికి రగలి, ఆరనిమంటల మధ్య చిక్కి నువు దహించుకుపోతుంటే, నేను చూడనట్లు పక్కకు తలతిప్పుకు ఎలా వెళ్ళగలను?...." అని అడిగాడు సత్యమూర్తి.

"జ్వాలలకు ఆహుతి అయిపోతూ... సలసలా కాగే ఈ కన్నీటిలో మునుగుతూ, తేలుతూ... ఉక్కిరి బిక్కిరి అయిపోతూ... ఎంతకాలం ఇలాగా?" అని అడిగింది మల్లిక.

"ఎంత కాలం ఇలాగ అంటే ఏం చెప్పను? మన కథ ముగిసేదాకా ఇంతే... ఎడారి దారిలో కాలినడకన ప్రయాణం మనది. కాళ్ళకు చెప్పులయినా లేవు. నిప్పుకణాల్లా మారిన ఇసుక రేణువుల్లో కూరుకుపోతున్న పాదాలు భగ్గున మండుతుంటే పైకిలాక్కుంటూ, ఎండ తీవ్రతకూ, వేసవిగాడ్పులకూ మాడిపోతున్న మొహాన్నీ, తూలిపోతున్న శరీరాన్ని కూడదీసుకుంటూ ముందుకు పోవటమే మన పని. ఇదుగో ఈ ఇల్లు కట్టాలీ. ఈ పిల్లల చదువులు చెప్పించాలీ, వీళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలీ - అంటూ మనకు జీవితగమ్యాలు ఏమీ లేవు. సాధించాల్సిన లక్ష్యాలు లేవు. చేతుల్లో లక్షలూ లేవు... వ్యర్థంగా. నిరర్థకంగా గడిచిపోయే ఈ మూడునాళ్ళ ముచ్చటలోనూ, ఊరించే ఒకే ఒక్క ఆశాకిరణం, నీతో స్నేహం... ఈ చెలిమి విలువే మనకున్న లక్షణాలూ, కోట్లూ... ఈ జీవితానికీ వరం చాలు...." అన్నాడు సత్యమూర్తి.

అని సత్యమూర్తి ఎన్ని చెప్పినా మల్లిక సమాధానపడలేకపోతోంది. కొంచెం సేపు ఆగి, ఏదో ఆలోచించుకుని, తర్వాత తలెత్తి సత్యమూర్తి వంక చూసి అడిగింది.

"నేనో చిన్న కోరిక కోరాను... ఏం చేశావు?" అని అడిగింది.

"చిన్న కోరికా? ఏమిటది?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"నిజంగా గుర్తులేదా? నాతో మళ్ళా చెప్పించాలనా?" అని పొడిగా నవ్వింది మల్లిక.

'ఈ స్నేహితురాలి మీద నీకు అంత గొప్ప ప్రేమ ఉందన్న మాట? నిన్న చెప్పినమాట ఇవాళ గుర్తులేదు..."

సత్యమూర్తి కొంచెం సేపు ఆలోచించాడు. ఎంతసేపు ఆలోచించినా బుర్రకేమీ తట్టలేదు. మళ్ళా చెప్పమన్నాడు.

"నిన్ను పెళ్ళి చేసుకోమన్నాను.... పెళ్ళికొడుకుగా చూడాలని ఉందని అన్నాను... నువ్వు 'అలాగే'నన్నావు...."

సత్యమూర్తి నవ్వాడు. పైగా అన్నాడు కదా... "చిన్నప్పుడు బాగా అల్లరి చేసినప్పుడు, మానాన్న కొట్టేవాడు. అయింది అబ్బాయిగారి పెళ్ళి - అంటూ పక్కింటి అమ్మాయి నవ్వేది. అంచేత అప్పట్లో నాకు ఎప్పుడు తల్చుకుంటే అప్పుడు పెళ్ళి అయిపొయ్యేది. ఆ విధంగా చాలా సార్లు పెళ్ళికొడుకును అయ్యాను..."

"ఆ పెళ్ళికాదు. నిజంగా పెళ్ళిచేసుకోవాలి..."

"అది జరిగే పనికాదు..."

"ఎందుకని?"

"ఇప్పుడు నాకా ఆశలేదు. ఉన్న ఆశలన్నీ కేశాల్లా రాలిపోతున్నాయి. ఈ భూమ్మీద ఉండే ఈ నాలుగురోజులూ, ఇదుగో ఇలాగ నీకు చేరువుగా కూర్చుని, మనస్సు విప్పి మాట్లాడుకోగలిగితే చాలు. నాకు మిగిలిన ఒకే ఒక నేస్తం.... నా సమస్తం ... నువే గనక... మనసులో నువింత స్థిరంగా, బలంగా ఉండగా - ఎవర్నో పెళ్ళి చేసుకుని, ఆమె గొంతు కోయటం ఎందుకు చెప్పు? " అని అడిగాడు సత్యమూర్తి.

మల్లిక ఇంక మాట్లాడలేకపోయింది.

రాత్రి భోజనాలు అయ్యాక సత్యమూర్తి మల్లికను మాటల్లోకి దింపి హరిశ్చంద్రప్రసాద్ హత్య ఎలా జరిగిందో చెప్పమని అడిగాడు. "నేనే చంపాను" అంటూ ఆమె అదే పాట పాడింది. ఆమె ఎందుకీ నేరాన్ని నెత్తిన వేసుకుంటుందో, ఎంత టైం ఇచ్చి, ఎంత బుజ్జగించి అడిగినా, ఆ విషయంలో నిజం ఎందుకు చెప్పటం లేదో సత్యమూర్తికి అర్థంకావటంలేదు.

అర్థరాత్రి దాటాక మల్లిక నిద్రలేచింది. సత్యమూర్తి వైపు పరీక్షగా చూసింది. అతను మంచి నిద్రలో ఉన్నాడని నిర్ధారణ చేసుకున్నాక చప్పుడు చేయకుండా నెమ్మదిగా లేచింది.

అల్మారా లోనుంచి ఒక కాగితం, కలం తీసుకుని గబగబా నాలుగు పంక్తులు రాసింది. ఆ కాగితం చూడగానే కనబడేట్లు ఎదురుగా పెట్టింది. కూజాలోంచి గ్లాసులోకి నీళ్ళు వంపుకుంది. బొడ్లో నుంచి ఏదో చిన్న పొట్లం విప్పింది. దాన్లో నుంచి మెరుస్తున్న వజ్రాన్ని తీసింది. తలెత్తి దాన్ని నోట్లో వేసుకోబోయింది. ఛెళ్ళున ఏదో దెబ్బ తగిలింది. చేతిలోని వజ్రం దూరంగా పడిపోయింది. రెండో చేతిలోని గ్లాసులోని నీళ్ళు ఒలికి వంటి మీద పడిపోయినాయి.

సత్యమూర్తి మల్లిక చెంప పగలకొట్టాడు. రగులుతున్న అగ్నిపర్వతం బద్దలైంది. ఉగ్గబట్టుకుంటూ వచ్చిన దుఃఖావేశం ఇంక ఆపుకోలేకపోయింది. సత్యమూర్తి భుజాల మీద వాలిపోయింది. వెక్కి వెక్కి ఏడ్చింది.

"నీకు నేను ఇందాకే చెప్పాను కదా... నాకున్న సమస్య నువ్వేనని. నన్నిలా ఒదిలేసి నీ దారిన నువ్వు వెళ్ళిపోతావా?" అని అడిగాడు సత్యమూర్తి.

"నాకు అడ్డురాకు సత్యా?..... నన్ను వెళ్ళిపోనీ... ఇంతటితో ఈ కథ ఆగిపోనీ. ఈ వ్యథకు ముగింపు పలకనీ...." అంది ఏడుస్తూనే.

"చచ్చి ఎవర్ని సాధించాలని?"

"బతికి మాత్రం ఏం సాధించాలని? ఈ హత్యలూ, శవాలూ కోర్టులూ, కేసులూ,వాద ప్రతివాదనలూ - భరించటం నావల్ల కావటంలేదు. రేపటినుంచీ అందరి ముందూ బోనులో నిలబెట్టి నన్ను చూపెట్టి హంతకీ, హంతకీ అని హోలు దద్దరిల్లేటట్లు అరుస్తుంటే. ఈ దుర్భలమైన గుండె తట్టుకోలేదు, సత్యా... ఎందుకు చంపావు ఎలా చంపావు అంటూ వేసే ఒక్కొక్క ప్రశ్నా ఈ గుండెల్లో గునపంలా వచ్చి గుచ్చుకుంటుంది. నేను భరించలేను..... అంతకన్నా, ఈ తనువు చాలించటమే నయం. చచ్చేముందు ఆ నరకయాతన కూడా ఎందుకు?.... ఈ జీవితానికి ఇంతటితో స్వస్తి పలకనీ..." అంటూ వలవలా ఏడ్చింది మల్లిక.

"ఈ తతంగమంతా మనకు ఎవరికీ ఏ మాత్రం ఇష్టం లేక పోయినా - తప్పనిసరి - మన తప్పు ఏమీ లేకపోయినా ఒక్కసారి వరదలా వచ్చి, బురదలా మన కాలికీ చేతికీ, అంటుకుపోతుంటుంది పాపం... కడిగేసుకోవటం తప్పదు. అంత మాత్రాన ప్రాణాలు తీసుకుంటామా? కష్టం వచ్చినప్పుడల్లా, ఇష్టం వచ్చినప్పుడల్లా ప్రాణాలు తీసేసుకోవటమేనా పని?` అని మందలింపుగా అడిగాడు సత్యమూర్తి.

"చావటం అంటే అంత తేలిక కాదు - కష్టమే. కానీ బతకటం అంతకన్నా కష్టమైనప్పుడు, చావటం చాలా తేలిక అయిపోతుంది... అయినా ఈ జీవితం నాకింకా ఏం మిగిల్చిందని, రేపటి కోసం ఎదురు చూస్తూ బతకమంటావ్ సత్యా!..." అంది మల్లిక కన్నీరు తుడుచుకుని.

"ఒక్కసారి అటు ఆస్పత్రులకేసి చూడు... కాళ్ళు విరిగిన వాళ్ళూ, చేతులు విరిగినవాళ్ళూ, కళ్ళులేనివాళ్ళూ, ఊపిరి ఆడనివాళ్ళూ, ఎంతమంది మృత్యువుతో హోరాహోరీ పోరాడుతున్నారో? కుష్ఠురోగంతో కాన్సర్ రోగంతో, శరీరం కృంగి కృశించిపోయినవాళ్ళూ, ఆ చివరి క్షణం ఆసన్నం అయ్యేదాకా, జీవితం మీద ఎంత మమకారంతో బ్రతుకును ఈడ్చుకొస్తున్నారు చూడు..."

"వాళ్ళకి ఇంకా జీవితం మీద మమకారం అయినా మిగిలి ఉంది. నాకేం ఉంది? నువ్వు చెప్పినట్లుగా, నేను పిల్లల్ని పెంచాలనా, పెళ్ళిళ్ళు చేయాలనా, ఉద్యోగాలు చేయాలనా, ఊళ్ళు ఏలాలనా? భూమికి బరువై, లోకానికి వెలి అయి, చచ్చినవాడితో సమానంగా బతకటం కన్నా, చావటమే నయం కదా..." అంది మల్లిక పైట కొంగుతో ముక్కూ మొహం తుడుచుకుని.

"చెప్పానుగదా.... మనకు ఎవరూలేరన్న బాధ వద్దు - నాకు నువ్వూ నీకు నేనూ....." అన్నాడు సత్యమూర్తి.

"ఈ విడదీయరాని స్నేహానుబంధమూ మనకు మనస్తాపాన్నే మిగులుస్తోంది. నిజంగా చెప్పాలంటే నేను నీకో గుదిబండలా తయారైయాను. నా కష్టాలు నాతోగానీ విరగడకావు. నేను పోయాక అయినా, నువ్వు ఎవర్నో ఒకర్ని చూసుకుని, జీవితంలో స్థిరపడతావు. నిన్ను పట్టుకున్న ఈ శని నాతోగాని విరగడకాదు. అందుకేనే ఈ పని చేసి, నేను కడతేరి, నిన్ను సమస్యలనుంచి విముక్తుడ్ని చేద్దామంటే, అందుకూ నువ్వు అడ్డుపడితే ఇంకెలా సత్యా?...."

"విముక్తి ఇద్దరికీ రావాలి. పోనీ ఇద్దరం చచ్చిపోదామా? ఇంకో ఉంగరం రాయి ఉంటే తీసి నాకివ్వు..." అన్నాడు సత్యమూర్తి.

"వద్దు త్యాగాలకైనా ఒక హద్దు ఉంటుంది. స్నేహానికైనా ఒక పరిమితి ఉంటుంది...."

"దీనికి వేరే ఏం పేరు పెట్టాలో, నాకు తెలియదుగానీ, మన అనుబంధం ముందు, త్యాగం, స్నేహం అనేవి చాలా చిన్నమాటలు.... ఇప్పటి నీ వేదన త్వరలోనే తీరిపోతుంది. అయితే అందుకు నువ్వు కొంచెం సహాయం చేయాలి. ఆ వేళ, హత్య జరిగినప్పుడు, ఏం జరిగిందో చెప్పు..." అన్నాడు సత్యమూర్తి.

మల్లిక మళ్ళీ ఒకసారి పైట చెంగుతో కన్నీటి చారికలు, సజల నేత్రాలూ తుడుచుకుని, రెండు సార్లు ఎగబీల్చి నెమ్మదిగా చెప్పటం మొదలెట్టింది.

❀❀❀

*"మన కళ్ళముందే - కాలం.. ఇంద్రజాలం.. చల్లని వెన్నెల పరిచిన కాలమే గురి చూసి గుండెల్లోకి కత్తులు విసురుతుంది.*

*ఆడదాని జీవితం శోభించాలన్నా, క్షోభించాలన్నా, అదంతా ఆమె పక్కన చేరిన మగవాడి చలవేనని ఒప్పుకోవాల్సి వస్తోంది.*

*అప్పట్లో - ప్రేమోద్వేగంతో నువ్వు నా వద్దకు వచ్చే రోజుల్లో - భవిష్యత్తు గురించి నాకు ఎన్ని సుందర స్వప్నావలోకనాలు!*

*వేకువనే లేచి చూసుకుంటే, రాత్రి కన్న కలల కలువరేకుల మీద ఎన్నెన్ని మమతల మంచు బిందువులు కురిసి మెరిసి పోతుండేవి!!*

ఇప్పుడేముంది?

జీవితం కాగితంలా కాలి మాడి మసి అయిపోయింది.

ఇవాళ ఈ సిగ్గులేని ముఖాన్ని ఎవరికీ చూపించలేని - నిర్భాగ్యురాలిని నా నీడను చూసి నేనే జడుసుకునే భయస్తురాలిని. బాధాగ్రస్తురాలిని.

ఈ కష్టాలింక తీరేవికావు. నా బాధలే నన్ను పెనవేసుకున్న పెనుసర్పాలు. కళ్ళవెంటకారే ఈ కన్నీరే, నిర్నిద్ర సముద్ర తరంగాలు..." అంటూ ఆగిపోయింది మల్లిక.

ఆమె కుదటపడటానికిగాను, సత్యమూర్తి కొంచెం సేపు ఊరుకున్నాడు. తర్వాత అడిగాడు -

"నిన్ను వాళ్ళు ఇక్కడినుంచి తీసుకెళ్ళిన తర్వాత జరిగింది జరిగినట్లు చెప్పు, మల్లికా...."

"నన్ను కార్లోకి లాక్కుపోగానే నా ముక్కుకు ఏదో గుడ్డ బలంగా అడ్డం పెట్టారు. క్రమంగా నాకు స్పృహలేకుండా పోయింది..... ఎప్పుడో కళ్ళు తెరిచి చూస్తే, ఆ గదిలో పడి ఉన్నాను. శరీరం స్వాధీనం లేదు. లేచే ఓపికలేదు. అది ఎవరి ఇల్లో, ఎక్కడ ఉన్నానో కూడా తెలియలేదు. ఆ గది నేనెప్పుడూ చూడలేదు. కనుక నాకు పరిచయంలేనివాళ్ళ ఇల్లే అయివుంటుందన్న అభిప్రాయం కలిగింది. కొన్ని గంటలు అలాగే పడుకున్నాను. చీకటి పడినట్టుంది. బయట ఏవో అస్పష్టంగా మాటలు వినిపించాయి. తాళం తీసి తలుపు తెరిచిన చప్పుడు వినిపించింది. గదిలో లైటు వెలిగింది. నీరసంగానే కళ్ళు తెరిచి చూశాను. ఎదురుగా ఆయన... నా భర్త.... నన్ను బంధించి తెచ్చి, అక్కడ నిర్జీవ ప్రతిమలా పడేసి ఉంచగలిగినందుకు కాబోలు, విజయ గర్వంతో నవ్వుతున్నాడు.

"ఏమే, నన్ను కాదని వెళ్ళిపోయి, నా కళ్ళముందే మరొకడితో కులుకుతూ కాపురం చేద్దామనుకున్నావా? నువ్వంత బరితెగించి వెళ్ళిపోతే, చూస్తూ కూర్చోవటానికి నేనంత చేవ చచ్చిపోయి ఉన్నాననుకున్నావా?" అంటూ దగ్గర కొచ్చాడు. ఆయనకు సమాధానం చెప్పే శక్తి లేదు. శారీరకంగా, మానసికంగా చాలా అలిసిపోయి ఉన్నాను. కాకపోయినా, మొగుడుతో యుద్ధానికి దిగటమే నా ప్రారబ్ధం. ఇంక ఆ యుద్ధంలో గెలుస్తాననుకోవటం అవివేకం.... మళ్ళా మొదలైంది శారీరక, మానసిక చిత్రహింస. నన్ను నోటికొచ్చినట్లు తిట్టాడు, ఇష్టమొచ్చినట్లు కొట్టాడు. పొట్టలో తన్నితే, గిలగిల్లాడిపోయాను.... జుట్టుపట్టుకు గుంజితే, మెడ విరిగిపోతుందేమో, తల ఊడిపోతుందేమో అనిపించేది... అలా జరిగినా బాగుండేది. ఇప్పుడీ కష్టాలు పొయ్యేవి......

మా భార్యా భర్తల మధ్య అనుబంధం ఎంత గొప్పగా ఉందో ఊహించుకోవచ్చు.... మరి పెళ్ళినాడు చేసిన ప్రమాణాలూ, వాగ్దానాలు ఏమైపొయ్యాయో? పెళ్ళితంతు అంతా ఒక నాటకం. అందరి ముందూ కూర్చుని అంత ఆర్భాటంగా చేసే పెళ్ళికి విలువలేకుండా పోయింది. అప్పుడు చెప్పటం... మరుక్షణం నుంచే ఎవరి దోవ వాళ్ళు చూసుకుంటున్నారు. ఆలుమగల్లోనూ ఎవరి స్వార్థం వాళ్ళదే అయినప్పుడు, ఇంక వివాహబంధానికి అర్థం ఏముంది?....

"ఈ తిట్లూ దీవెనలు, అవమానాలూ, కక్షసాధింపులూ అన్నీ షీలా ఇంట్లో, దాని ఆధ్వర్యంలో జరగటం నాకు మరింత రంపపు కోతగా ఉంది. ఏది ఏమైనా, ఆ నాలుగు గోడల మధ్యా నేను శవాకారంలో పడి ఉన్నానే తప్ప, ప్రతిఘటించే స్థితిలో లేను. అంచేత వాళ్ళిద్దరూ విజృంభించి, వంతులేసుకుని నన్ను వేధించారు..." అని ఆగింది మల్లిక.

"డాక్టరు హరి రోజూ ఏ టైంలో అక్కడికి వచ్చేవాడు?" అని అడిగాడు సత్యమూర్తి.

"మధ్యాహ్నం వచ్చి సాయంత్రం దాకా ఉండేవాడు. మళ్ళా రాత్రికి వచ్చి పది, పదకొండు గంటలదాకా ఉండేవాడు............. కావాలనే, నా ముందే వాళ్ళు చేయరాని పనులన్నీ చేసి చూపించేవాళ్ళు..... అదొరకమైన ఆనందం కాబోలు - నేను స్పందించటం మానేశాను. వాళ్ళతో నాకు సంబంధంలేదనుకున్నాను. ఏదో తెరమీద సినిమా చూస్తునంత నిర్లిప్తంగా, నా కళ్ళముందు నా భర్త మరో స్త్రీతో జరిపే కామక్రీడల్ని చూడటానికి అలవాటు పడ్డాను. అసలు నా మనసు మొద్దుబారిపోయింది. నాకు అనుభవాలు లేవు, అనుభూతులులేవు.... వదిలేస్తే చాలురా దేవుడా అనుకునేదాన్ని. లేదా చంపేసినా ఫర్వాలేదు - పీడా వదిలిపోతుంది... కానీ ఆ రెండూ జరగలేదు......."

"నీ తిండీ తిప్పలూ మాటేమిటి?" అన్నాడు సత్యమూర్తి.

"దాని చేతికూడు తినాల్సిరావటమే నాకు అన్నిట్లోకి అమితంగా బాధ కలిగించిన విషయం... అందుకే మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు.... ఒకరకంగా కాదు. అన్ని రకాలుగానూ, ఈ మనసునూ, శరీరాన్ని బాధించారు, వేధించారు. ఏ ఆడదీ పడరానిపాట్లు పడ్డాను..."

"అక్కడ ఉండగా నువ్వు గమనించిన విశేషం ఏమైనా ఉంటే చెప్పు..."

"విశేషాలు లేకపోలేదు. షీలా తన కోసమే బతుకుతోందని ఆయన గుడ్డినమ్మకం. కానీ అదొక పెద్దకిలాడీ అన్న విషయం ఆయనకు చివర్లోకాని తెలియలేదు..."

"అంటే? కొంచెం వివరంగా చెప్పు..."

"ఈయన వెళ్ళిపొయ్యాక నా గది తలుపు తాళం వేసేది. తర్వాత ఇంకెవరో వచ్చేవాళ్ళు. అస్పష్టంగా మగగొంతు వినిపించేది. కిలకిలలు వినిపించేవి... "

"రోజూ అలా జరిగేదా?"

"మొదట్లో కొద్దిరోజులు నేను మొద్దునిద్దర్లో ఉండేదాన్ని. బహుశా నేనలా నిద్రపోయేందుకు ఏమైనా చేసేవాళ్ళేమో......... తర్వాత రోజుల్లో రాత్రిళ్ళు నిద్రపట్టేదికాదు. అప్పుడే వినిపించేవి ఏవో మాటలు.... పాటలు.."

"అంటే షీలా జీవితంలో డాక్టరు హరికాక మరొక మనిషి ఉన్నాడన్నమాట. అతనెవరో తెలుసుకుంటే మనకు మరికొంత సమాచారం తెలుస్తుంది. ఇంతకీ హత్య జరిగిన రోజు ఏం జరిగింది?" అని అడిగాడు సత్యమూర్తి.

"నువ్వు కాసేపు కూర్చుని వెళ్ళిపొయ్యావు కదా... వెంటనే గది తాళం వేసేసింది. రెండు గంటల తర్వాత ఎవరో వచ్చారు. మగవాడి గొంతు వినపడింది. మాటలు మాత్రం స్పష్టంగా తెలియలేదు. కాసేపటికి కారు వచ్చి ఆగింది. ఆయన వచ్చినట్లున్నాడు. మగవాళ్ళు ఇద్దరూ ఏదో ఘర్షణపడ్డారు. పెద్దగా అరుచుకున్నారు. ఆ వచ్చిన వాడెవరో ఆయన్ని పొడిచేసినట్లున్నాడు. హత్య జరిగాక, చంపినవాడూ, షీలా కలిసి ఒక పావుగంట తర్జన భర్జనపడ్డారు. వాడు వెళ్ళిపొయ్యాక షీలా నా గది తలుపు తీసింది. ఎదురుగా ఆయన చచ్చిపడి ఉన్నాడు. భర్త శవం, రక్తం మడుగులో చూసినందుకు ఒక్కసారి ఒళ్ళుఝల్లుమంది. అంతే అంతకుమించి ఆయన చనిపోయినందుకు పెద్దబాధ ఏమీలేదు. పైగా ఎన్నాళ్ళ నుంచో సలుపుతున్న కాల్లోని ముల్లు తీసేసినంత రిలీఫ్‌గానూ అనిపించింది క్షణకాలం...." అని చెప్పింది మల్లిక.

***

మర్నాడు సత్యమూర్తి షీలా దగ్గరకు వెళ్ళాడు. అతనితో మాట్లాడటానికే షీలాకు ఇష్టం లేకపోయింది. కానీ తప్పలేదు.

"మళ్ళా దేనికొచ్చారు?" అని అడిగింది షీలా అయిష్టంగా మొహం తిప్పుకుని.

"హత్యానేరం చాలా తెలివిగా మీరు మల్లిక మీదకు నెట్టారు. కానీ ఆమె ఆయన్ని చంపలేదు..." అన్నాడు సత్యమూర్తి -

"మరెవరు చంపారుట?"

"అదే తెలియటం లేదు - ఆవేళ మీ ఇంటికి నేనుగాక ఇంకెవరన్నా వచ్చారా?"

"ఎవరూ రాలేదు."

"నిజం చెప్పండి."

"మీతో అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకులేదు...."

"డాక్టరు హరిగాక మీ ఇంటికి ఇంకెవరో వస్తుంటారని మల్లిక అంటోంది...."

"నేను డాక్టర్ని. బోర్డు కట్టుకున్నాను - అనేకమంది అనేక రకాల కంప్లయింట్స్‌తో వస్తుంటారు....!" అంది షీలా.

"డాక్టరుగా మీ దగ్గిరకు వచ్చే రోగుల గురించికాదు నేను అడగటం... మీకోసం వచ్చే ఫ్రెండ్ ఎవరైనా ఉన్నారా అని..."

"హరి తప్ప ఇంకెవరూ లేరు. నేను ఆయన్నే నమ్ముకున్నాను. ఆయన్ను పోగొట్టుకుని జీవిత సర్వస్వాన్నీ పోగొట్టుకున్నాను, ఇంత హఠాత్తుగా ఆయన దూరమైపొయ్యాక, నేను ఎంత ఒంటరిదాన్ని అయిపొయ్యానో నాకు తెలుసు........."

"మీ కోసం ఇంకెవరో వచ్చేవాడిని మల్లిక అంటోంది. అతను మీ బంధువుకావచ్చు - స్నేహితుడు కావచ్చు.... గుర్తుచేసుకుని చెప్పండి..."

"మల్లిక ఎన్ని అయినా చెబుతుంది. మొగుడ్ని వదిలిపెట్టి, సిగ్గూ ఎగ్గూలేకుండా, పబ్లిక్‌గా వచ్చి నీతో ఉండటానికి సిద్ధపడింది. రంకు నేర్చింది. బొంకు నేర్వదా? అందరూ దానిలాగే అనుకుంటుంది...."

"తిట్టుకున్నంత కాలం తిట్టుకున్నారు. ఇప్పుడు కావాల్సింది నిందారోపణలు కాదు. నిజా నిజాలు......"

"భర్త మీద కోపంతో మల్లికే అతన్ని చంపింది."

"ఆ రోజు ఇంకెవరో మీ ఇంటికి వచ్చారు. ఆ వచ్చిన వ్యక్తికీ, డాక్టర్ హరికీ మధ్య ఘర్షణ జరిగింది. నీకూ, ఆ వ్యక్తికి ఉన్న స్నేహం హరికి నచ్చనందువల్ల గొడవపడ్డారు. ఆ వ్యక్తే హరిని చంపేశాడు........."

"అబద్ధం........."

"పచ్చి నిజం. ఈ విషయం నేను రుజువు చెయ్యబోతున్నాను...."

"ఇలాంటి కట్టుకథలు నేనూ చెప్పగలను. నువ్వూ మల్లిక కోసం రోజూ మా ఇంటికి వచ్చేవాడివని, తెల్లవార్లూ ఆమె దగ్గరే ఉండేవాడివనీ నేనూ చెప్పగలను....."

"అని మీరు చెప్పిన ఎవరూ నమ్మరుగానీ, మీ ఫ్రెండ్ ఎవరో చెప్పండి........" అని నిలదీశాడు సత్యమూర్తి.

"అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం? మీ ప్రేమ వ్యవహారం దేశమంతా తెలుసు. అయినా మీరిద్దరూ అతిపవిత్రులూ, నేనొక్కదాన్నీ పతితనూ - నీతిలేనిదాన్ని అని అంటారు. అంతేనా?"

"అదే వద్దు అంటున్నాను... ఒకొళ్ళనొకళ్ళని నిందించుకోవటం వల్ల ఒరిగిందేమీలేదు. హంతుకుడెవరో ఇవాళ కాకపోతే రేపు ఎలాగూ తెలుస్తుంది..."

"మల్లికే భర్తను చంపిందని అందరికీ తెలుసు. ఇంకా తెలియాల్సిందేముంది?" అని లేచినిలబడింది షీలా -

"మీరు చెప్పనంత మాత్రాన నేను తెల్సుకోలేనని అనుకోవద్దు - కాకపోతే రెండు రోజులు లేటవుతుంది - అంతే......" అని సత్యమూర్తి కూడా లేచాడు.

"మంచిది. హంతకుడిని పట్టుకొచ్చి కోర్టులో రుజువుచేసి, మీ మల్లిక నిర్దోషి అని రుజువు చేసుకోండి..." అని దాదాపుగా సవాల్ చేసింది షీలా.

ఇక ఆమె దగ్గరనుంచీ రాబట్టుకోగల సమాచారం ఏమీలేదని సత్యమూర్తికి అర్థమైంది. అంచేత వచ్చేశాడు.

డాక్టరు హరిశ్చంద్ర ప్రసాద్ హత్యకేసు డీల్ చేస్తున్న పోలీసు ఆఫీసరు దగ్గర కెళ్ళాడు. తన అనుమానం చెప్పాడు.

"పోనీ. ఎవడో షీలా ఇంటికి వచ్చాడనే అనుకుందాం. అతనికి డాక్టరు హరిని హత్య చేయాల్సిన అవసరం ఏముంది? సరదాకి ఒక మనిషిని మరో మనిషి చంపడు కదా, హత్య చేయటానికి తగిన కారణం ఉండాలి...." అన్నాడాఫీసర్.

"డాక్టర్ హరి షీలా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. ఆమె తనకు మాత్రమే పరిమితం కావాలనుకున్నాడు. అయితే షీలా అభిప్రాయాలు వేరుగా ఉన్నాయి. డాక్టరు హరితో అవసరం తీరిపోయింది కనుక, మరో బంగారు పిచ్చుకను పట్టుకుని ఉండొచ్చు. షీలా

ఇద్దరితోనూ నాటకం ఆడుతున్నందువల్ల, సహజంగానే మగవాళ్ళిద్దరూ కత్తులు నూరుకున్నారు. ఆ రెండో అతను హరిని చంపాడు..." అన్నాడు సత్యమూర్తి.

"ఇదంతా మీరు కోర్టులో చెప్పండి - జడ్జిని నమ్మించండి." అన్నాడాయన.

"అదెలాగూ తప్పదు. కానీ మీరు కూడా వాస్తవాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తే బావుంటుందని నా ఉద్దేశ్యం.... కత్తిమీద వేలి ముద్రలు తీసుకున్నారా?" అని అడిగాడు సత్యమూర్తి.

"మా డ్యూటీ మాకు తెలుసు. మీరు గుర్తుచేయాల్సిన పని లేదు" అని కటువుగా చెప్పాడాయన.

ఎవరి దగ్గరనుంచీ తనకు ఎలాంటి సహాయ సహకారాలూ లభించవని తేలిపోయింది. కనుక ఇంక సత్యమూర్తి తనే స్వయంగా అసలు విషయం తెలుసుకోవాలనుకున్నాడు.

షీలా ఇంటి రహస్యాలు తెలిసే వ్యక్తుల కోసం అన్వేషణ ప్రారంభించాడు. డాక్టరు బోస్ దగ్గరకెళితే, ఇటీవల ఆమె ఎవరెవరితో స్నేహాలు చేస్తుందో తనకు మాత్రం ఎలా తెలుస్తుందని అన్నాడు.

సాధారణంగా ఇంట్లోని రహస్యాలన్నీ కాకపోయినా కొన్ని అయినా పని మనుషులకు తెలుస్తాయి. డాక్టర్ షీలా ఇంట్లో ఇంటిపని, వంటపని చేసే మనిషి అలివేలు ఉంది. ఒకరోజు అంతా ఆమె కోసం కాపలా కాసి, ఆమెను వెంబడించి, అలివేలు ఇంటికెళ్ళాడు. మొదట బెట్టుసరి చేసినా, సత్యమూర్తి డబ్బు ఆశ చూపించి, ఎన్నో అభయాలు ఇచ్చి, ఎంతో ధైర్యం చెప్పాక, అసలు విషయం బయటపెట్టింది.

డాక్టర్ షీలా ఉండే ఇంటికి నాలుగిళ్ళ అవతల సాయినాథ్ అని ఒకతను ఉన్నాడట - ఈ మధ్య అతను తరచూ షీలా ఇంటికి వస్తున్నాట్ట. అదీ ఆమె కోసం వచ్చే పేషెంట్స్ అంతా వెళ్ళిపొయ్యాక వచ్చేవాడట. డాక్టరు హరి ఉండగా మాత్రం షీలా అతన్ని రానిచ్చేది కాదట. ఈ మాత్రం తెలిసినందుకు సత్యమూర్తి సంతోషించాడు. అలివేలు చెప్పిన గుర్తులు పట్టుకుని సాయినాథ్ ఉండే ఇంటికి వెళ్ళాడు. అతని గది తాళం వేసి ఉంది. ఊరికి వెళ్ళాడని చెప్పారు.

ఏ ఊరు వెళ్ళిందీ తెలుసుకున్నాడు.

ఆ ఊరు వెళ్ళి సాయినాథ్‌ను కలుసుకోవటానికి సత్యమూర్తి బయలుదేరుతుంటే మల్లిక అంది. "అతను ఇప్పుడు ఉన్నచోటు ఎలాంటిదో మనకు తెలియదు. పైగా హత్యచేసి, పారిపోయిన వాడిని పట్టుకోవటానికి వెళుతున్నావు. ఇంత తెలుసుకుని, వాళ్ళతో వాదనకు దిగాక నిన్ను మాత్రం అంత తేలికగా బయటపడనిస్తారా? వద్దు వెళ్ళొద్దు."

"ఏం జరగబోతోందో నాకూ తెలీదు. వీలున్నంత వరకూ నేర్పుగా అన్ని విషయాలూ తెలుసుకుని వస్తాను.... అయితే నువ్వు భయపడుతున్నట్లుగా కథ అడ్డం తిరిగే అవకాశాలు లేకపోలేదు. అన్నిటికీ తెగించే వెళుతున్నాను..." అన్నాడు సత్యమూర్తి -

"పోనీ రవిని కూడా తీసుకెళ్ళు" అంది మల్లిక.

"వద్దు, వాడ్ని నీకు తోడుగా ఉంచటమే మంచిది. అయితే నువు మళ్ళా ఏ అఘాయిత్యమూ చెయ్యనని నాకు మాట ఇవ్వాలి" అన్నాడు సత్యమూర్తి.

అలాగేనంది మల్లిక. చేతిలో చెయ్యి వేయించుకుని వాగ్దానం చేయించుకున్నాడు సత్యమూర్తి.

"నాకు మాత్రం ఎవరున్నారు చెప్పు? నా అన్నవాళ్ళంతా ఎన్నడో నాకు కాకుండా పొయ్యారు. నువ్వు ఎక్కడున్నా, ఎంత దూరాన ఉన్నా, ఫర్వాలేదు. నీ మనసులో నాకింత చోటు ఉందన్న ధైర్యంతో బతుకుతున్నాను. నాకున్న నిధులూ, నిక్షేపాలూ కూడా ఏమీ లేవు. ఉన్నా అవన్నీ నీకన్నా విలువైనవేం కావు..... అంచేత, కష్టాలూ, బాధలూ, ఎన్ని ఎదురైనా ఫర్వాలేదు. అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొంటాను. చివరకు నిన్ను కలుసుకోగలనన్న ఆశాలేశం మిగిలి ఉన్నంత వరకూ ఈ పోరాటం నాకో పెద్ద సమస్యకాదు..."

మల్లిక దీర్ఘంగా నిట్టూర్చింది. "చదువుకునే రోజుల్లో అంటే ఉద్రేకం తప్ప, మరేం తెలియదు. గనుక, ఒకళ్ళ కోసం మరొకళ్ళం పరితపించి పోయాం అంటే అర్థం ఉంది. ఇప్పుడు అనుభవాల కొలిమిలో కాలి, సమ్మెటపోట్లు తిని, ఆనాటి రూపురేఖలూ, సౌందర్యాలూ, లావణ్యాలూ - అన్నీ పోగొట్టుకున్న తర్వాత, ఇప్పుడూ నన్ను చూడాలనే అనిపిస్తోందా, సత్యా, నీకు?" అని అడిగింది నిశితంగా అతని కళ్ళల్లోకే చూస్తూ.

"నువ్వు అన్నట్లుగా ఆనాటి ఆకర్షణ శరీరాలది. ఈనాటి ఈ ఆకర్షణ మనుసులది. ఇంకా చెప్పాలంటే, ఇన్నాళ్ళ విరామం తర్వాత మన మధ్య ఉన్న ఆకర్షణ బలపడి, అనుబంధంగా పేరు మార్చుకుంది. కడుపులో నుంచి బిడ్డ బయటపడ్డాక, అంతవరకూ ఇద్దర్నీ కలిపి ఉంచిన పేగును కత్తిరించేస్తారు. కానీ నిజానికి తల్లీ బిడ్డల ప్రేమానుబంధం, అలా పేగు కత్తిరించిన మరుక్షణం నుంచే క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంది. అలాగే ప్రేమికులను ఒకటిగా కలిపి ఉంచే వివాహం జరగకుండా చేసి, వాళ్ళను కలుసుకోకుండా చేసి, విడదీసి దూరం చేసే కొద్దీ ఆ ఇద్దరి మధ్యా ప్రేమానుబంధం అనుక్షణం పెరుగుతూనే ఉంటుంది. ఇది అనుభవించే వాళ్ళకు తప్ప మిగతా వాళ్ళకు అర్థం కాదు కూడా" అని చెప్పాడు సత్యమూర్తి.

"కారణం ఇదీ అని చెప్పలేం గాని ఒక్కో మనిషిని మొట్టమొదటి సారి చూసినప్పటినుంచీ ప్రేమావేశంలోపడి కొట్టుకుపోతుంటాం. వాళ్ళను తొలిసారి చూసిన ముహూర్తబలం అలాంటిది - అనుకోవాలి మరి.....

"ఇంతకీ ఇప్పుడు నీ ప్రయాణానికి డబ్బులున్నాయా?" అని అడిగింది మల్లిక -

"కొద్దిగా ఉన్నాయి. సర్దుకుంటాను" అన్నాడు సత్యమూర్తి -

"పెళ్ళయిన కొత్తలో నా పేరున బ్యాంకులో వేసుకున్న డబ్బు ఉంది. అయితే ఇప్పుడు చెక్‌బుక్ నా దగ్గర లేదు. అంచేత బ్యాంకుకు వెళదాం పద, లూజ్ చెక్ తీసుకుని డ్రా చేసి ఇస్తాను...." అంది మల్లిక.

"వద్దులే సరిపోతుంది....." అన్నాడు సత్యమూర్తి.

"మొహమాటం ఎందుకు? పైగా ఇంకా కోర్టులూ, కేసులూ, అంటూ ఖర్చు తప్పదుకదా..." అని నచ్చచెప్పింది.

ఆ సాయంత్రం సత్యమూర్తి ఎల్లోరా ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు సాయినాథ్ కోసం. అతనెవరో తెలియదు. ఎలాంటివాడో తెలియదు. అతను హంతకుడని సత్యమూర్తి అభిప్రాయం.

అదెంత వరకు నిజమో, అతని దగ్గరకు వెళితేగానీ తెలియదు.

*అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఒకసారి ఆయనకు మశూచికం వచ్చింది. అది అంటువ్యాధి గనుక, అందరూ ఆయనకు దూరంగా పారిపోవటం మొదలెట్టారు. అప్పుడాయన "నా దగ్గర ఏమీ లేనప్పుడు, ఏమన్నా ఉంటే ఇవ్వమని నా చుట్టూ తిరిగే వాళ్ళు గదా మీరంతా.... ఇప్పుడు నా దగ్గరున్న దేదో మీ అందరికి పంచి పెడతానంటే ఒక్కళ్ళూ దరిదాపులకైనా రారేం?" అని అన్నాట్ట.*

ఆ జోక్ గుర్తొచ్చిన సత్యమూర్తి నవ్వుకుంటున్నాడు. ఆ జోక్ గుర్తురావడానికి కారణం కూడా ఉంది.

కుండపోతగా వాన కురుస్తోంది. అందుచేత జనం అంతా పరుగెత్తుకుపోయి, చోటు దొరికిన చోట తలదాచుకుంటున్నారు. వానలు రానంత కాలం, తాగటానికి నీళ్ళు లేవని నిన్నటిదాకా అంతా అలమటించి పొయ్యారా, లేదా? ఇప్పుడేమో మేఘాలు కరుణించి,

కుంభవృష్టిగా వర్షించి, తమ దగ్గరున్నదంతా ఈ భూమ్మీదకు ధార పోస్తుంటే, అంతా అలా చెట్టు కిందకీ, చూరు కిందకీ పారిపోతారేం? కాసేపు తడిస్తే తెల్లారేసరికి మొక్క మొలుస్తారా అని తర్కించుకుంటున్న సత్యమూర్తి కూడా చూరు కిందే నిలబడ్డాడు, చాలా మందితో పాటు.

వానాకాలం వస్తే చాలు, రకరకాల వేషాలు వేస్తారు. రెయిన్ కోట్లు, గొడుగులు, గోనెపట్టాలు కప్పుకునే వాళ్ళదేముంది గానీ - కాలుజారే వాళ్ళను చూడాలన్నా ఇదే మంచి ఛాన్స్ - పల్లెటూళ్ళల్లో అయితే, పంచెలు నడుం పైదాకా ఎగబట్టుకుని పొయ్యేవాళ్ళూ, తడిసిన కోకలు తపాతపామంటూ తిప్పుకుంటూ వెళ్ళేవాళ్ళూ - మామూలుగా కనిపించని అందాలతో కనువిందు చేస్తారు.

వాన తగ్గింది. అందరితోపాటు సత్యమూర్తి కూడా నడవటం మొదలుపెట్టాడు.

బాసర అదిలాబాద్ జిల్లాలో ఒక మారుమూల కుగ్రామం. మహా రాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉంది. స్టేషను నుంచి మూడు మైళ్ళు నడిస్తేగాని ఊరు రాదు.

సాయినాథ్‌ను కలుసుకోవాలని సత్యమూర్తి చాలా శ్రమపడి ఇక్కడకు వస్తున్నాడు. డాక్టర్ షీలా ఇంట్లో పని చేసే మనిషి చెప్పిన మాటల ప్రకారం సాయినాథ్‌కు షీలా అంటే వల్లమాలిన ప్రేమ. అటు డాక్టర్ హరిశ్చంద్రపసాద్‌కూ షీలా అంటే వల్లమాలిన ప్రేమ. ఈ ఇద్దరిలో షీలా ఎవరివైపు మొగ్గు చూపిందో తెలియదు. ఏమైనా ఈ ముక్కోణపు ప్రేమ వ్యవహారాలన్నీ కక్షలూ, కార్పణ్యాలు పెంచి, హత్యలకు దారితీస్తాయి. డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ హత్యకూడా ఇలాంటిదే కావచ్చు. సాయినాథ్‌ను కలుసుకుంటేగాని ఒక అభిప్రాయానికి రావటానికి వీల్లేదు. అసలు అతను తనతో మాట్లాడతాడా లేదా అన్నదీ సందేహమే - డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ హత్యగురించి తనే ఆరా తీసి, అసలు హంతకుడిని పట్టుకుంటే గాని మల్లికను కాపాడుకోలేడు. లేకపోతే, ఈ షీలా, ఆ పోలీసులు కలిసి, మల్లికే హంతకురాలని కోర్టుకు ఏవో కట్టు కథలు చెప్పేస్తారు. ఆమెను ఉరికంబం ఎక్కించేస్తారు. అంచేత మల్లికను ఈ ఆపద నుంచి కాపాడుకోవటానికి సత్యమూర్తి చేయవలసినదంతా చేయకుండా ఎలా ఉండగలడు?

ఊళ్ళోకి వచ్చాక సాయినాథ్ గురించి అడిగితే, అతనెవరో వెంటనే పోల్చుకోలేకపోయినారు. సాయినాథ్ అంటే, దశరథ్ బామ్మర్ది అని ఎవరో గుర్తు చేయగానే, దశరథ్ ఇంటి గుర్తులు చెప్పి వెళ్ళమన్నారు.

ఆ పెంకుటిల్లు తలుపు తట్టితే నడివయస్సులో ఉన్న స్త్రీ వచ్చి ఎవరు కావాలని అడిగింది. సాయినాథ్ లేడని, నిజామాబాద్ వెళ్ళాడనీ, మధ్యాహ్నానికి వస్తాడనీ చెప్పింది. తాను సాయినాథ్ స్నేహితుడిననీ, అతనితో అర్జంటుగా మాట్లాడాల్సిన పని ఉండి వచ్చానని చెప్పాడు సత్యమూర్తి.

ఆమె సత్యమూర్తికి కుర్చీ చూపించింది. కాఫీ తెచ్చి ఇచ్చింది. తన తమ్ముడి గురించి ఏవేవో చెబుతూనే ఉంది. ఆమె వంటింట్లోకి దూరాక, సత్యమూర్తి ఇవతలకు వచ్చాడు.

ఊరంతా చూద్దామని బయల్దేరాడు. ఆ రోడ్డు మలుపు తిరగగానే స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ బోర్డు కనిపించింది. ఇంకొంచెం ముందుకొస్తే పోలీసు స్టేషను, ఆయుర్వేద చికిత్సాలయం.... సన్నని రోడ్డుకు అటూ ఇటూ చాలా వరకు పెంకుటిళ్ళు ఉన్నాయి. చుట్టూ తిరిగి మళ్ళీ ఊరు మొదట్లోకి వచ్చాడు. అక్కడ నాలుగు రోడ్ల కూడలి మధ్యలో పెద్ద అరుగు, మధ్యలో వేపచెట్టూ... అరుగు మీద ఊసుపోక కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళూ.... తెలుగు దేశం గురించి చెప్పుకుంటున్నారు.

పక్కన కిళ్ళీ కొట్టుకు దగ్గర ఒక ముసలాడు ఇంకో కుర్రాడిని కొత్తగా రిలీజ్ అయిన సినిమా కథ చెప్పమంటున్నాడు. ఏమిటో.... కృష్ణా, రామా అనుకునే వయసులో ఉన్నవాళ్ళు కూడా, కృష్ణ, జయప్రద అనే అంటున్నారు తప్ప మరోమాట మాట్లాడటం లేదు.

ఒకడు షార్ట్‌హాండ్ నేర్పుతాడట. వాడి గొప్పలు చెప్పుకుంటున్నాడు.

"నేను నా దగ్గర నేర్చుకునే వాళ్ళందరికీ ఒకటే చెబుతాను. స్ట్రోక్‌లు నీట్‌గా పడాలి. అసలు ఉన్నదంతా ఆ స్ట్రోక్‌లోనే ఉంది..."

ఇంకొకడు వాడిని అడుగుతున్నాడు. "ఎంత సేపూ స్ట్రోక్‌లూ, సోకులూ చూసుకుంటుంటే ఎట్టాగయ్యా... స్పీడ్. స్పీడ్‌గా లాగించెయ్యొద్దూ..."

"స్పీడ్ దేముందయ్యా... ప్రాక్టీస్ చేసే కొద్దీ పెరుగుతుంది. కిందటేడాది నా దగ్గర నలుగురు అమ్మాయిలు నేర్చుకున్నారు. మూడు నెలల్లో స్పీడ్ వచ్చింది. నాలుగు నెలల్లో ఉద్యోగాలు వచ్చాయి. అయిదు నెలల్లో పెళ్ళిళ్ళు అయినయి, ఆరునెలల్లో, పురుళ్ళు వచ్చాయి.... అంటే వాళ్ళు హై స్పీడ్ పాసయ్యారులే..." అంటున్నాడు.

సత్యమూర్తి కూడా నవ్వుకుంటూ అక్కడ్నించి లేచి, మళ్ళా వాళ్ళింటికి వచ్చేటప్పటికి ఆ ఇంటాయన దశరథ్ కనిపించాడు. ఆయనతో సత్యమూర్తి కాసేపు మాట్లాడుతూ కూర్చున్నాక, ఆమె భోజనాలకు పిల్చింది. భోంచేస్తుండగా ఆమె సత్యమూర్తితో అంది.

"మావాడు పెళ్ళి చేసుకోనని మొండికేశాడు. మీరైనా చెప్పి చూడండి. మీకు లాగానే వాడికీ ఒక చిన్న ఉద్యోగం, ఒక చిన్న ఇల్లు, ఒక చిన్న భార్య, ఒక చిన్నపిల్లా ఉంటే చూడటానికి ఎంత బావుంటుంది. వాడికెంత తృప్తిగా ఉంటుంది... మీ స్నేహితుడికి నచ్చచెప్పండి..." అందామె.

సత్యమూర్తి నవ్వుకున్నాడు. నిజానికి ఆమె చెప్పిన వాటిల్లో ఏ ఒక్కటీ అతనికి లేవు - కానీ ఆ విషయం ఆమెతో అనలేకపొయ్యాడు..

"మీరు చెపితేనే వినకపోతే, నే చెపితే వింటాడా?" అన్నాడు సత్యమూర్తి.

"నా మాట అంటే వాడికి లక్ష్యంలేదు. నా వాగుడు ఒకటే మిగులుతోంది. వాడికి ఈ చెవిలో నుంచి చెప్పేది, ఆ చెవిలో నుంచి బయటకు వెళ్ళిపోతోంది.........." అని ఆమె బాధ పడుతుంటే, దశరథ్ అందుకో ఉపాయం చెప్పాడు.

"బయటకు పోకుండా ఉండాలంటే, నేనో చిన్న సలహా చెబుతాను, చేస్తావా?" అడిగాడు.

"చెప్పండి..." అందామె.

"ఏం లేదు, ఆ రెండో చెవిలో గట్టిగా దూది పెట్టేసెయ్... ఇంక అప్పుడు నువు చెప్పేది బయటకు పోదు..." అన్నాడు.

ఆమె మూతి విరిస్తే, సత్యమూర్తి నవ్వుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటలకు కాబోలు సాయినాథ్ వచ్చాడు. ఎన్నడూ చూసి ఎరుగని ఈ సత్యమూర్తి వంక సాయినాథ్ ఆశ్చర్యంగా చూస్తే, సత్యమూర్తి తనే చెప్పుకున్నాడు.

"నేను డాక్టర్ షీలా దగ్గరనుంచి వచ్చాను" అన్నాడు.

సాయినాథ్ మొహం క్షణం సేపు సంతోషంతో వెలిగింది. అదీ ఒక్క క్షణం సేపే. తర్వాత నెమ్మదిగా అన్నాడు.

"షీలా మిమ్మల్ని నా దగ్గరకు పంపిందా? ఆమెకు నేను గుర్తున్నానా?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"అదేమిటి ఆమె మీకు మంచి స్నేహితురాలు గదా....." అని ఆగాడు సత్యమూర్తి.

"ఆమె మంచి స్నేహితురాలు కావాలని నేను ఆశపడ్డాను.... కానీ..." అంటూ సాయినాథ్ కూడా ఆగిపోయాడు.

వీళ్ళ సంభాషణ వింటున్న అతని అక్క అడిగింది "షీలా ఎవరు?" అని.

"హైదరాబాదులో నేను ఉండే ఇంటిదగ్గర్లో నాలుగిళ్ళ అవతల ఉండేది..." అని చెప్పాడు సాయినాథ్

"నీకు ఏమవుతుంది?" అని మళ్ళా అడిగిందామె.

సాయినాథ్ పొడిగా నవ్వాడు. "ఆమె ఏమవుతుందో నాకు తెలిస్తేగదా, నీకు చెప్పటానికి..... బహుశా ప్రత్యేకించి ఏమీ కాకపోవచ్చు. అన్ని లక్షల మందిలో ఆమె ఒకతే కావచ్చు" అన్నాడు.

"అన్ని లక్షల మందిలో ఆమె ఒకరు అయితే, నీ కోసం ఆయన్ను ఎందుకు పంపిస్తుంది? నువ్వేదో గ్రంథం నడిపే ఉంటావు" అన్నది అతని అక్కగారు.

"నా మీద నీకు అంత మంచి నమ్మకం ఉందన్నమాట" అన్నాడు సాయినాథ్.

"నమ్మకం లేనిది నీమీద కాదు.... నీ వయస్సు అలాంటిది. వయస్సులో ఉన్నవాళ్ళ కళ్ళు, ముఖ్యంగా పెళ్ళికాని వాళ్ళ కళ్ళు, అస్తమానం తమకు కావల్సిన వాళ్ళకోసం అదేపనిగా వెతుక్కుంటూ ఉంటాయి. తమకు నచ్చినవాళ్ళు కనిపించగానే, దృష్టి వాళ్ళమీది నిల్చి పోతుంది. ఇంక వాళ్ళు తప్ప, లోకంలో ఉన్నవాళ్ళెవరూ కనిపించరు" అందామె.

ఇంత మారుమూల గ్రామంలో ఉన్న ఆమె నోటినుంచి వచ్చిన ఆ నిత్యసత్యాలను విని సత్యమూర్తి ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాడు.

"నీకు నచ్చిన పిల్ల ఎవరో చెప్పు, నేను వెళ్ళి మాట్లాడి ఒప్పిస్తాను ఎన్నాళ్ళు ఇలా చుక్కలు లెక్క పెడుతూ కూర్చుంటావు?" అని అడిగిందామె మళ్ళీ.

"అక్కా, నీ బాధ నాకు బాగానే అర్థమైంది. కానీ నా బాధ ఏమిటో నీకు చెప్పలేను. ఎవరికీ ఏమీ చెప్పలేను. అందుచేత నన్ను ఇంక అట్టే విసిగించకు..." అన్నాడు సాయినాథ్.

అంత చనువు, చొరవ, ఆదరం, అభిమానం ఉన్న అక్క అదే పనిగా పోరుతుంటేనే తన మనసులోని మాట నోరు విప్పి చెప్పనివాడు తనతో చెబుతాడా, అన్న అనుమానమూ సత్యమూర్తికి వచ్చింది - కొందరంతే - తమ ప్రేమ వ్యవహారాన్ని అతి పదిలంగా గుండె గదిలో ఏమూలో దాచుకుని, ఎవరూ లేనప్పుడు, తీసి చూసుకుని, ఆ అసంతృప్తి ప్రేమలో పడిపోతుంటారు. వాళ్ళ స్వభావం అది.

అక్కగారి ముందు ఏం అడిగినా, తనకేం చెప్పడని అర్థం చేసుకున్న సత్యమూర్తి, సాయంత్రం అలా షికారుగా వెళదాం రమ్మన్నాడు సాయినాథ్‌ను.

ఇద్దరూ బయలుదేరారు. 'గుళ్ళోకి వెళదామా' అన్నాడు సాయినాథ్, అలాగేనన్నాడు సత్యమూర్తి.

ఊరికి నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉందా గుడి. వ్యాస మహర్షి కాలంలో వెలిసిందట. అందరి దేవుళ్ళకీ గుళ్ళు ఉన్నాయని, సరస్వతీ దేవికి గుడి బాసరలో తప్ప ఇంకెక్కడా లేదుట. అందుచేత ఎక్కడెక్కడివాళ్ళూ వచ్చి, ఇక్కడ అక్షరాభ్యాసాలూ, అన్నప్రాసనలు చేయిసారట.

అయితే చెప్పినంత ఇదిగా ఏం కనిపించలేదు. గుడిముందు నాలుగు పాకల్లో కొబ్బరి కాయలు అమ్ముతున్నారు. అవి దాటుకుని గుళ్ళోకి వెడితే, ప్రాంగణం మరీ పెద్దది కాదు, మరి చిన్నదీ కాదు. ఆలయం మాత్రం చాలా చిన్నది. అసలు అమ్మవారి పాదాలు, కలశం ఉన్న చోట చుట్టూ గోడలు కూడా లేవు. ఆ నాలుగు స్థంభాల మంటపం మధ్య నున్న అమ్మ వారి పాదాల మధ్యనే అంతా కొబ్బరికాయలు కొట్టి పూజలూ పురస్కారాలు చేస్తున్నారు. కొత్తగా కట్టిన గర్భగుడిలో మాత్రం ఉట్టిపడుతున్న కళతో సరస్వతీ దేవి విగ్రహం ఉంది.

చుట్టూ అయిదారు అడుగుల ఎత్తున అరుగులూ, గదులూ ఉన్నాయి. ఆ అరుగుల మీద ఎవరో వంటలు చేసుకుంటున్నారు. ఎప్పుడో బ్రహ్మానంద రెడ్డి వచ్చినప్పటి ఫోటోలు, ఆఫీసు గదిముందు వేళ్ళాడుతున్నాయి.

గుళ్ళోనుంచి బయటకొచ్చాక, మళ్ళా తిరుగు మొహం పట్టారు. మట్టి రోడ్డు అర్ధచంద్రాకారంగా తిరిగిన చోట, చిన్న కొండల్లాంటి, పెద్ద బండలున్నాయి. కాసేపు అక్కడ కూర్చుందాం అన్నాడు సత్యమూర్తి. బండల మీద ఎక్కి కూర్చున్నారు.

"ఇక చెప్పండి" అన్నాడు సాయినాథ్.

"హత్య జరిగినప్పటినుంచీ షీలా చాలా డీలా పడిపోయింది" అన్నారు సత్యమూర్తి, అతని రియాక్షన్ చూద్దామని.

"హత్య జరిగిందా? ఎక్కడ? ఎవరి హత్య?" అని ఆశ్చర్యంగా అడిగాడు సాయినాథ్.

అతని మొహం వంకే నిశితంగా చూశాడు. అతనామాటలకు నిజంగానే విస్తుపొయ్యాడని అర్థమవుతోంది.

"నిజంగా హత్య గురించి మీకు తెలీదా?" అని రెట్టించి అడిగాడు.

"నిజంగా తెలీదు. ఎవరి హత్య జరిగింది?" సాయినాథ్ ప్రశ్నకు సత్యమూర్తి సూటిగా సమాధానం చెప్పలేదు.

"ఆ హత్య మీరే చేశారని పోలీసులకి తెలిసిపోయింది. బహుశా రేపో, ఎల్లుండో వాళ్ళు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు." అన్నాడు సత్యమూర్తి.

"నన్ను వెతుక్కుంటూ రావటం ఏమిటండీ? అసలు ఎవర్ని ఎవరుహత్య చేశారు?" అని ఆత్రంగా అడుగుతున్న సాయినాథ్ మాటల్లో కృత్రిమం గానీ, మాయమర్మంగానీ కనిపించటం లేదు.

"షీలాకు కొండంత అండగా డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ గురించి మీకు తెలుసా?" అని అడిగాడు సత్యమూర్తి.

"తెలుసు"

"ఏం తెలుసు?"

"ఆయన షీలాకు బాగా కావల్సినవాడు -"

"ఆయన్ని హత్య చేశారు."

"ఎవరు?"

"ఇంకెవరు? మీరే" అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ.

"నేనా? నేను హత్యలు చేసే వాడిలా కనపడుతున్నానా?"

"ఏం? వాళ్ళకేమైనా ప్రత్యేకతలున్నాయా? వాళ్ళూ అందరిలాగానే ఉంటారు..."

"సర్లెండి గానీ... షీలా ఇప్పుడెలా ఉన్నారు?"

"చెప్పానుగా, చాలా కృంగిపోయింది. మీరు దగ్గర ఉంటే కొంతవరకూ ధైర్యంగా ఉండేది. ఇక్కడకు పారిపోయి వచ్చినంత మాత్రాన తప్పించుకోవచ్చుననుకున్నారా?" అని అడిగాడు సత్యమూర్తి.

"మీరు నన్ను ఆటపట్టించారేమిటి? నాకీ గొడవే తెలియదు..." అన్నాడు సాయినాథ్.

"పోనీ మీకు తెలిసినంతవరకూ చెప్పండి."

"ఏం చెప్పాలి?"

"షీలా, హరిశ్చంద్రప్రసాద్‌ల గురించి, మీకూ, షీలాకూ ఉన్న పరిచయం గురించీ అంతా చెప్పండి. ఇవాళ కాకపోతే రేపు అయినా మీ కోసం పోలీసులు వస్తారు. అప్పుడైనా చెప్పాలి... ఈలోగా ఇక్కడ్నించి కూడా మీరు పారిపోకుండా ఉంటే..." సత్యమూర్తి మళ్ళీ అతని మొహంలోకి చూస్తూ.

"రానివ్వండి. ఎవరొచ్చినా నాకేం భయం లేదు. నాకీ హత్య విషయం మీరొచ్చి చెప్పేదాకా తెలియదు."

"సరే... అసలు పాయింట్‌కి రండి..." అని మళ్ళీ సత్యమూర్తి తన పాయింట్‌కి డైవర్ట్ చేశాడు సాయినాథ్‌ను. అతను ఒక క్షణం ఆగి నెమ్మదిగా మొదలుపెట్టాడు.

"కొన్ని కొన్ని ప్రమాదాలు, కొన్ని ప్రమోదాలకు దారి తీస్తాయంటారు - షీలాతో పరిచయం అలాంటిదే. ఒకసారి చేతికి దెబ్బ తగిలింది. నాలుగురోజుల తర్వాత బాగా వాచి, జ్వరం వస్తుంటే అప్పుడు నాలుగిళ్ళవతల వున్న డాక్టరు షీలా దగ్గరకు వెళ్ళాను. అంత ఆలస్యం చేసినందుకు కోప్పడింది. మందులు రాసిచ్చింది. నాలుగు రోజుల తర్వాత మళ్ళా రమ్మంది. మీరు రమ్మంటే రోజూ మూడు

పూటలా వస్తానన్నాను. ఎందుకలా అన్నానో, నాకే స్పష్టంగా తెలీదు. ఆమె నవ్వింది. నీలాంటి వాళ్ళను చాలామందిని చూశాను అన్న భావం ఆ నవ్వులో ఉందేమో మర్నాడూ, మూడోనాడూ వెళ్ళాను. రోజూ రావద్దు అన్నాను కదా అంది. ఏదో నా ఆదుర్దాకొద్దీ వచ్చాను. మిమ్మల్ని చూస్తే చాలు నొప్పి తగ్గిపోతుంది అంటూ పిచ్చివాగుడు వాగాను. ఆమె మళ్ళీ అదే నవ్వు నవ్వింది. తప్పు చేసి దొరికిపోయిన పిల్లాడివంక చూసి తల్లి అలాగే నవ్వుతుందేమో కానీ నాకు అప్పుడు అలా అనిపించలేదు. రోజూ రాత్రి తొమ్మిది గంటలకు ఆమె ఖాళీగా కూర్చున్నప్పుడు వెళ్ళడం అలవాటు చేసుకున్నాను. నీ రోగం కుదిరింది కదా, ఇంకా ఎందుకొస్తున్నావు అని అడిగింది. లేదండీ, నా రోగం ముదిరిపోయింది అన్నాను. ఏమైందీ అని అడిగింది. మిమ్మల్ని చూస్తుంటే గొంతు పొడారిపోతుంది. నాలుక పిడచకట్టుకు పోతుంది. మాట తడబడుతుంది. చెప్పాలనుకున్నది చెప్పలేను. చెప్పకుండా ఉండలేను. కానీ ఊరికినే ఎందుకో గుండెదడ. ఎంత ధైర్యంగా దగ్గరగా వస్తానో, వచ్చాక, అంత భయంగా ఉంటోంది - అంచేత పెన్సిలిన్ ఇంజెక్షన్ ఇవ్వండి... అన్నాను షీలాతో. ఆమె మళ్ళీ అదే నవ్వు. రోగం నువ్వే చెప్పుకుని, ప్రిస్కిప్షనూ నువ్వే చెప్పుకుంటే ఇంక నేనెందుకు అంది... ఇంజెక్షన్ ఇవ్వాలంటే మీరుండాలి కదండీ అన్నాను. ఆ మాటకు షీలాకు కోపం వచ్చింది. తీక్షణంగా చూసింది. గెటవుట్ అంటుందేమో అనుకున్నాను. అనలేదుగానీ, అన్నంత పనిచేసి, విసురుగా లోపలికి వెళ్ళిపోయింది. "సారీ, పొరపాటైంది. నన్ను క్షమించండి" అని ఓ కాగితం మీద రాసి అక్కడ పెట్టేసి వచ్చాను.

"అస్తమానం ఆమె గురించే ఆలోచిస్తూ ఉన్నందువల్ల కాబోలు మానసికంగా ఆమెకు చాలా దగ్గరైనట్లు అనిపించేది. అయితే ఆ ఫీలింగ్ ఆమెకు ఉందో లేదో నాకు తెలియదు... ఆమె దృష్టిలో పడటం కోసం నానా అవస్థలూ పడేవాడిని. మా ఇంటిముందు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు గుమ్మంలో నిలబడీ, ఏవో పిచ్చి వేషాలు వేస్తుండేవాడ్ని. చూస్తుందని, నవ్వుతుందని...పలకరిస్తుందని... ఏమీ పట్టనట్లు, ఈ ప్రపంచంతో సంబంధం లేనట్లు చకచకా నడుచుకుంటూ వెళ్ళిపొయ్యేది. ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు, కొన్ని నెలలు. నోటీసు చేయలేదనుకోవటానికి వీల్లేదు.... ఇలా లాభం లేదనిపించింది. ఇంకేదన్నా చేద్దామనిపించింది..... రోజూ రాత్రిళ్ళూ, తెల్లవార్లూ ఆవిడ ఇంటిచూట్టూ ప్రదక్షిణలు చేసేవాడిని..... ఎప్పుడన్నా కనిపిస్తే, "ఏమండీ, పోనీ నన్ను మీ ఇంటి ముందు గూర్ఖాలా పెట్టుకోండి, జీతం కూడా ఏమీ ఇవ్వనక్కర్లేదు. మీ గుమ్మంలో నుంచోనిస్తే చాలు." - అని అడుగుదామనిపించేది. ఆమె ఎదురైనప్పుడు, ఎన్నోసార్లు ఆ మాట నాలుక చివరిదాక వచ్చి అక్కడ ఆగిపొయ్యేది.... నవ్వుతున్నారా?" అని ఆగిపొయ్యాడు సాయినాథ్.

"లేదులెండి. చెప్పండి. మీ తప్పేం లేదులెండి. ఆడా మగా మధ్య ఆకర్షణ అలాంటిది. ఆ పరిస్థితుల్లో ఉన్నవాళ్ళు అంతా అలాగే ప్రవర్తిస్తారు. అది హ్యూమన్ ఇన్స్టింక్ట్. మానవ నైజం.... చెప్పండి..." అని ప్రోత్సహించాడు.

"రోజూ జ్వరమైనా వస్తే బావుండును. మందుకోసం ఆమె దగ్గరకు వెళ్ళేవాడిని. ఇంకోసారి కాలో, చెయ్యో విరిగినా బావుండును.... వెళ్ళి ఆమె వార్డులో పడేవాడిని..... చివరకు ఇంకో ఐడియా వచ్చింది రాత్రి పదిగంటలప్పుడు వెళ్ళాను. ఏంకావాలని అడిగింది. ఏదో ఇన్ఫర్మేషన్ కావాలని అడిగాను. "చూస్తానులే" అంది. అలాగేననో కాదనో, వీలుపడదనో, ఇంకేమన్నా అంత బాధపడకపోదును. అక్కడకి తానేదో ప్రధానమంత్రి అయినట్లు, నేనేదో పనివాడ్ని, పనికిరానివాడ్ని అయినట్లూ కాళ్ళా వేళా పడుతుంటే 'చూస్తానులే' అన్నట్లు.... ఎంతగా హర్ట్ అయ్యానో చెప్పలేను. నోరుమూసుకు పడి ఉన్నవాడ్ని, ఊరుకోక, ఎందుకు అడిగానా అనీ - బాధపడ్డాను. ఆ గుండె గాయం మానటానికే రెండూ నెలలు పట్టింది.....

"నిజానికి నాకే ఇన్ఫర్మేషనూ అక్కర్లేదు. నోరు తెరిచి అడిగినందుకు, ఏవో రెండు పిచ్చి కాగితాలు తెచ్చి నామొహాన పారేస్తుందనీ వాటినే ప్రాణప్రదంగా దాచుకుని, అయ్యో నాకోసం ఇంత శ్రమపడ్డారా అని బలవంతాన అయినా పార్టీకి పిలవాలనీ, పిక్చర్‌కు తీసుకెళ్ళాలనీ అలా అలా చనువు పెంచుకోవాలని, అప్పుడు.... ఎన్నో గుడ్డి ప్లానులు కుంటి ప్లానులూ వేసుకున్నాను. అన్నీ ఒక్క మాటలో గాలికి కొట్టుకు పోయినయి.... ఆశపడినంత మాత్రాన చాలదు..... పొందే యోగ్యత, అర్హతా కూడా ఉండాలి కదా!...

"తర్వాత ఎప్పుడో మళ్ళా నాకే అనిపించింది - ఆమె ఆమాట చాలా కాజువల్‌గా అందేమో - నేనే లేనిపోని అర్థాలు కలిపించుకున్నానేమో.... అయినా షీలా పరాయిదేం కాదు - ఆమెకు నేనేమీ కాకపోయినా నాకు ఆమె బాగా కావల్సిన మనిషే కదా.... అంచేత ఆమె ఏమంటే మాత్రం ఏం? ఈసారి ఇలా కాదని మనసులో ఉన్నదంతా వెళ్ళగక్కుతూ ప్రేమలేఖ రాశాను.... దానికీ జవాబు లేదు. బహుశా చదివి పక్కన పారేసి ఉంటుంది.... ఆమెకు అందం ఉంది. ఐశ్వర్యం ఉంది. మంచి తెలివితేటలున్నాయి. సోషల్ స్టేటస్ ఉంది. ఆమె క్రీగంటి చూపులకోసం ఎదురు చూసేవాళ్ళెందరో ఉన్నారు. డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్ లాంటి గొప్పవాళ్ళ అండదండలున్నాయి. పొద్దున లేస్తే కొన్ని వందల మందిని హలో, హలో అంటూ పలకరిస్తుంది - ఇంతమంది మధ్యలో నేను ఆమెకు గుర్తుండే అవకాశమే లేదు... కనుక ఈ హృదయఘోష సముద్రఘోష. ఎవరికి కావాలి?....

"అయినా అక్కడుంటే అసమానం అదే యావపడిపోయిందని, దూరంగా ఇక్కడికొచ్చాను..." అని ముగించాడు సాయినాథ్.

"మిమ్మల్ని లెక్కచెయ్యనందుకు, ఆమె మీద మీకు కోపం, ద్వేషంలాంటివి ఏమీలేవా?..."

"ఆమె ప్రేమించటమే నేర్పిందిగానీ, ద్వేషించటం నేర్పలేదు."

"పోనీ ఇక్కడికొచ్చాక షీలాను మర్చిపోగలుగుతున్నారా?" అని అడిగాడు సత్యమూర్తి సాయినాథ్ ఒక్క క్షణం నిశితంగా చూసి అడిగాడు -

"కొంత మంది ప్రభావం ఎప్పుడూ మన జీవితాల మీద పడుతూ ఉంటుంది. సూర్యుడూ, చంద్రుడూ మనకు అందనంత ఎత్తున ఉన్నారు. అయినా వాళ్ళ కాంతి మన మీద పడుతుంది. అలాగే కొంత మంది మనుషులు ఎంత దూరాన ఉన్నా, ఎంత మహోన్నత స్థాయిలో, అందని శిఖరాల మీద ఉన్నా, మనల్ని ప్రభావితం చేసి ముందుకు నడుస్తూ ఉంటారు. అది వాళ్ళ గొప్పదనం గానీ, మన గొప్పదనంకాదు.."

"అద్సరే, షీలాను మీరు మర్చిపోగలిగారా, ఇక్కడికి వచ్చాక?"

"మీ ప్రశ్నకు సమాధానం నేను చెప్పాలంటే, నా ప్రశ్నకు మీరు సమాధానం చెప్పాలి. మీ ఇంటి నుంచి మీరూ ఇంత దూరం వచ్చారుగదా.... మీ అమ్మనీ, నాన్ననీ మీరు మర్చిపోయ్యారా?.... ఎక్కడున్నా, ఎలా ఉన్నా, కొంతమంది మీద కొందరి ప్రభావం జీవితాంతం ఉంటుంది. ఆమె మనసులో ఏముందో నాకు తెలియదు. ఆమె నా గురించి ఒక్క క్షణమైనా ఆలోచించి ఉండపోవచ్చు. కానీ నా మనసు నిండా ఆమె నిండి ఉంటుంది. మా అమ్మ తర్వాత, మా అక్కయ్య తర్వాత, షీలా నన్ను విపరీతంగా ఇన్‌ఫ్లూయన్స్ చేసింది.........." అని చెప్పాడు సాయినాథ్.

"మీరిక్కడకువచ్చి ఎన్నాళ్ళు అయింది?" అని అడిగాడు సత్యమూర్తి.

"పదిహేను రోజులైంది............"

"కిందటి ఆదివారం హత్య జరిగిన రోజున మీరు హైదరాబాదులో ఉన్నట్లు తెల్సింది..." అని జస్ట్ టెస్ట్ చేయడం కోసం అడిగాడు.

"కిందటి ఆదివారం నేను ఇక్కడ రోజంతా పేకాడుతూనే ఉన్నాను. ఆ వేళ ఒక్కరోజులో వంద రూపాయలు సంపాదించాను. అందులో పది రూపాయలతో అందరికీ టీ ఇప్పించాను. కావాలంటే ఇప్పటికప్పుడు పాతికమందిచేత మీకు సాక్ష్యం ఇప్పిస్తాను...."

"బహుశా షీలాకు మీకూ ఉన్న పరిచయం వల్ల, హరిశ్చంద్ర ప్రసాద్‌ను మీరే చంపారన్న అనుమానం వచ్చి ఉంటుంది... అందుకే మీ పేరు చెప్పుకున్నారు..........."

"అయినా నాకే భయమూ లేదు. మీతోపాటు నేనూ ఇవాళే హైదరాబాదు వస్తాను. షీలా ఆపదలో ఉంటే కనీసం పలకరించటం నా విధి........"

"అయితే మనకు రైలు ఎప్పుడుంది?"

"రాత్రి పదింటికి........."

ఇద్దరూ బయలుదేరి ఊరి మొదట్లోకి వచ్చేటప్పటికి ఇంకో ఇద్దరి ఆడవాళ్ళతో కలిసి సాయినాథ్ సిస్టర్ కూడా మంచినీళ్ళ బిందె చంకన పెట్టుకుని వస్తోంది.

"ఎక్కడ్నించి తెస్తున్నారు నీళ్ళు........"

"మైలు దూరంలో బావి ఉంది....."

"ఎందుకని? ఇంటిముందే బోరింగ్ ఉంది కదా.........." అని అడిగాడు సత్యమూర్తి.

"వాడకానికి అవేగాని, తాగటానికి ఈ బావి నుంచి తెచ్చుకుంటారు. బారనా మంది ఆ బావి నీళ్ళే తెచ్చుకుంటారు...." అని చెప్పిందామె.

"అంటే?"

"బారనా మంది అంటే మూడొంతుల మంది అని.........." నవ్విందామె.

సత్యమూర్తితో పాటు సాయినాథ్ హైదరాబాదు బయలుదేరుతుంటే ఆమె అంది -

"మీ వ్యవహారం చూస్తే, ఏదో పెద్ద కుంభకోణంలా ఉంది. ఏదో దాస్తున్నారు..........."

"దాచడానికేం లేదు. రెండురోజులు అలా తిరిగి వస్తాడు మీ తమ్ముడు. సిటీ మీద గాలి మళ్ళింది............"

"గాలి మళ్ళింది సిటీ మీదనా, షీలా మీదనా?..... చూడు బాబూ, నా కన్నా చిన్నవాడివి కాబట్టి నువ్వూ నా తమ్ముడిలాంటి వాడినే అనుకుని చెబుతున్నాను. నువ్వెందుకొచ్చావో, ఎందుకు వీడ్ని లాక్కుపోతున్నావో నాకు తెలియదు. ఫర్వాలేదు. మీ రహస్యాలు నాకు చెప్పొద్దు. కానీ నేనొక రహస్యం మాత్రం మీకు చెప్పదలచుకున్నాను. ఈ ప్రేమ అనేది భగభగా మండే మంటలాంటిది. కొందరు దాని వెలుగులో జీవితాన్ని చక్కదిద్దుకుంటారు. ఇంకొందరు దానిలో పడి పురుగుల్లా మాడిపోతారు..... కనుక జగ్రత్త........." అంది ఆమె ఊరి బయటదాకా వచ్చి వాళ్ళను సాగనంపుతూ.

కొంచెం దూరం నడిచి వచ్చాక, సత్యమూర్తి సాయినాథ్‌ను అడిగాడు -

"మీ సిస్టర్ ఏం చదువుకుంది?"

"మామూలుగా అన్ని పుస్తకాలూ చదువుతుంది. కానీ పెద్దగా ఏమీ డిగ్రీలు లేవు........." అన్నాడు సాయినాథ్.

మన దౌర్భాగ్యం కొద్దీ అసలైన చదువుకీ, డిగ్రీకీ సంబంధం లేకుండా పోయింది. లీవులెటర్ రాయలేని గ్రాడ్యుయేట్స్ ప్రతి ఆఫీసులో ఉన్నారు మీకో జోక్ చెప్పనా?" అన్నాడు చీకట్లో సిమెంటు రోడ్డుమీద నడుస్తూ.

"చెప్పండి. కాలక్షేపం అన్నా అవుతుంది"

"ఒకడు లవ్ లెటర్ రాశాట్ట. యాజ్ అయామ్ సఫర్ విత్ మై బ్రదర్స్ మేరేజ్, యూమేబీ గ్రాంటెడ్ ఫోర్ డేస్ కాజువల్ లీవ్ - అని రాస్తే ఆ ఆఫీసర్ జుట్టుపీక్కుని, బ్రదర్ మేరేజ్ అయితే, వీడు సఫర్ అవటం ఏమిటి, మధ్యలో నాకు నాలుగు రోజులు లీవ్ గ్రాంట్ చేయటం ఏమిటని, వాడికి మెమో ఇస్తే, సారీ ఫర్‌ది మిస్టేక్, యు మే బీ ఎక్స్‌క్యూజ్‌డ్ అని జవాబు ఇచ్చాట్ట........"

"బావుందండీ" అన్నాడు సాయినాథ్ నవ్వుతూ.

ఇంగ్లీషు భాషను సుసంపన్నం చేయటంలో రైల్వేవాళ్ళ పాత్ర చెప్పుకోతగ్గది ఒకడు హడావుడిగా స్టేషన్‌కి వస్తూ, ఎదురుగా కనిపించిన టీసీని గోదావరీ లెఫ్టా - అని కంగారుగా అడిగితే, ఆ టీసీ, లెఫ్టింగ్ లెఫ్టింగ్ అన్నాట్ట."

ఈ కథలు చెప్పుకుంటూ స్టేషన్ కొచ్చి రైలు ఎక్కారు. సగం దూరం వచ్చాక పక్కన కూర్చున్న సాయినాథ్‌ను సత్యమూర్తి అడిగాడు.

"షీలాకు, హరిశ్చంద్ర ప్రసాద్‌కూ ఉన్న సంబంధం ఎలాంటిదో మీకు తెలుసా?"

"తెల్సు హరిశ్చంద్రప్రసాద్‌కు ఎలానూ వేరే పెళ్ళి అయింది గనుక, అతన్ని వదిలించుకుని, వేరే ఎవర్ని అయినా చూసుకుని పెళ్ళి చేసుకుని లైఫ్‌లో సెటిల్ కావాలన్న ఆలోచనలో ఉందన్న విషయమూ తెల్సు.........."

ఆ చివరి మాటలో సత్యమూర్తికి మరి కొంత ఆశ కనిపించింది. ఆమెకున్న ఇతర పరిచయాలూ తెల్సుకోనిదే, హరిశ్చంద్రప్రసాద్‌ను చంపిన హంతకుడ్ని తెలుసుకోలేడు - సాయినాథ్ ద్వారానే ఆ తీగె కూడా లాగాలి.

మర్నాడు ఉదయానికి ఇద్దరూ సికింద్రాబాద్ స్టేషన్‌లో దిగారు. సత్యమూర్తిని తన రూంకు రమ్మన్నాడు సాయినాథ్.

"ఇప్పుడు కాదు. ముందర మీరు వెళ్ళి షీలాతో మామూలుగా మాట్లాడండి. నేను తర్వాత వచ్చి మిమ్మల్ని కలుస్తాను" అన్నాడు.

ఇద్దరూ చెరో ఆటో ఎక్కి వెళ్ళిపోయారు.

****

రవి, మల్లిక ఇద్దరే ఇంట్లో మిగిలిపోయారు.

మల్లిక సత్యమూర్తి గురించీ, రవి తనూజ గురించీ - ఆలోచించుకుంటున్నారు, వాళ్ళకు అదే ధ్యాస.

ఎప్పటికో రవి తేరుకుని మల్లిక వంక చూస్తే ఆమె నవ్వింది. అతను కాలక్షేపం కోసం రేడియో పెడితే, ఆ పాటలు చెవుల తుప్పు వదలకొడుతుంటే, రేడియో కట్టేశాడు.

"రేడియో ఆపేశావేం?" అని అడిగింది మల్లిక

"నేనే పాడుదామని" అన్నాడు రవి నవ్వుతూ.

"పోనీ, పాడు, వింటాను."

"వద్దులెండి. చుట్టు పక్కలవాళ్ళంతా వస్తారు."

"రానివ్వు, వాళ్ళూ వింటారు."

"వినరండి, పిల్లలు ఝడుసుకుంటారు. ఏమిటా పిచ్చికేకలని నన్ను కేకలేస్తారు" అన్నాడు రవి.

మల్లిక సన్నగా నవ్వింది. మళ్ళీ కాసేపు మౌనం.

"ఏమైనా కబుర్లు చెప్పు, రవీ" అంది మల్లిక.

"మీరు ఏమన్నా చెబితే, నోరు తెరుచుకు చూస్తూ కూర్చోవటమే గానీ, మీ ముందు నేను మాట్లాడటం కూడానా..." అన్నాడు రవి.

"నోరు తెరుచుకు కూర్చుంటే ఏం జరుగుతుందో తెలుసా?"

"తెలుసండి నోరు తెరుచుక్కూర్చుంటే నోట్లోకి ఈగలూ, దోమలూ పోతాయి.."

"కనుక?"

"నోరు మూసుక్కూర్చోవటం ఆరోగ్యానికి మంచిది......... సరేగానీ, మీరు ఏమీ అనుకోనంటే ఒక చిన్న విషయం అడుగుతాను........"

"చిన్నదేం? పెద్ద విషయమే అడుగు."

"సరే అయితే, పెద్ద విషయమే అడుగుతాను. మీరూ సత్యమూర్తిగారూ ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?......." అని అడిగాడు మల్లికని.

మల్లిక అదోలా నవ్వింది "అదో పెద్ద కథ."

"మీరు కథ చెప్పండి....... నేనేదన్నా పత్రికకు రాస్తాను"

"నువ్వు కథలు కూడా రాస్తావా?"

"రాద్దామని ఉందండి. కానీ నేను కలం పడితే ఏం జరుగుతుందో తెల్సాండీ?"

"తెలుసు తెలుసు... పాళీ విరుగుతుంది..........." అని నవ్వేసింది మల్లిక.

"అందుకే............. ఈ రోజుల్లో కలం పడితే పాళీలు విరిగేవాళ్ళు ఉన్నారు కాబట్టే బాల పెన్‌లకు ఇంత గిరాకీ పెరిగిపోయిందండీ............"

"జోక్ బావుంది"

"మరి మీ కథ చెప్పండి"

"నువ్వు పత్రికలకు రాస్తానంటే నేను చెప్పను..........."

"రాయనులెండి. చెప్పండి"

"నాకు నమ్మకం ఏమిటి?"

"మీతోడు. ఇంక రాయను....."

"ఇంక రాయను అంటే - ఇప్పటికేదో రాసినట్లు............ "

"నాకేం రాదండీ బాబు ఒప్పుకుంటున్నాను. ..........మీరు మాత్రం మీ కథ చెప్పండి........." అని కాసేపు రవి బ్రతిమిలాడాక, మల్లిక తమ గతాన్ని గుర్తుచేసుకుంది.

✡ ✡ ✡

చదువుకుంటున్న రోజుల్లోనే మల్లిక, సత్యమూర్తి కలిసిమెలిసి తిరుగుతూ, ఎప్పుడూ ఒక చోటే ఉండేవాళ్ళు, ఒకటిగానే ఉండేవాళ్ళు.

అయితే వాళ్ళిద్దరికీ ఇష్టమైనంత మాత్రాన సరిపోదుగదా - చుట్టూ ఉన్నవాళ్ళు చూస్తూ ఊరుకోలేదుగదా. అన్ని వైపుల నుంచీ ప్రతిఘటన ఎదురైంది -

సత్యమూర్తికి తల్లీ తండ్రీ చిన్నప్పుడే పొయ్యారు. అందుచేత మేనమామ ఇంట్లో ఉంటూ, తిట్లూ చివాట్లూ తింటూ అతి కష్టం మీద రోజులు వెళ్ళబుచ్చుతూ పట్టుదలతో చదివి పరీక్షలు మాత్రం గట్టెకుతుండేవాడు. ఇంట్లో సరైన వాతావరణం లేనందువల్లనే, సత్యమూర్తి ఎప్పుడూ లైబ్రరీలోనో, ఫ్రెండ్స్ రూముల్లోనో లేకపోతే రోడ్ల మీదనో కాలక్షేపం చేసేవాడు.

సత్యమూర్తి ఏయే వేళల్లో ఎక్కడ ఉంటాడో మల్లికకు బాగా తెలుసు. అందుకని ఆమెకు వీలున్నప్పుడల్లా అతని దగ్గరకు చేరుతూ ఉండేది. అలా నెమ్మదిగా వాళ్ళిద్దరూ దగ్గరవుతూ, మిగతా లోకానికి దూరమవుతూ తమ చుట్టూ ఒక లోకాన్ని ఏర్పరుచుకుని అందులోనే అహర్నిశలూ ఉండిపోవాలనుకోవటం మొదలుపెట్టారు. కానీ లోకం కూడా వీళ్ళను ఒక కంట కనిపెట్టి చూడటం మొదలుపెట్టి చూడటం మొదలుపెట్టింది.

సత్యమూర్తితో అనుకున్న పరిచయం గురించీ, తమ ప్రేమ గురించీ, మల్లిక తల్లిదండ్రులతో చెప్పటానికి ఇంకా సాహసించలేక పోతోంది. ఆమె ఆ సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతుండగానే ఒకరోజు -

సత్యమూర్తిని మేనమామ ఇంట్లోంచి గెంటేశాడు. ఇలాంటి రోజు ఒకటి వస్తుందని అతను ఎదురుచూస్తే ఉన్నాడు గనుక అతను అంతగా బాధపడలేదు. వెళ్ళి ఒక స్నేహితుడి రూంలో చేరాడు. అయితే ఇతనికి ఆశ్రయం ఇచ్చినవాడూ ఇతనికి తోడుబోయినవాడే గనుక పెద్దగా ఆదుకోలేకపోయినాడు.

కానీ మల్లిక చూస్తూ ఊరుకోలేకపోయింది. సత్యమూర్తిని ఇంటికి తీసుకెళ్ళి తల్లికి తండ్రికీ తన క్లాస్‌మేట్ అని పరిచయం చేసింది. అతను ఇంటెలిజెంట్ అనీ, అతని చేత డౌట్స్ క్లియర్ చేసుకుంటాననీ వంక పెట్టి రోజూ సాయంత్రం అతన్ని ఇంటికి తీసుకువచ్చి, కాసేపు కబుర్లు చెప్పి భోజనం పెట్టి పంపించేది. అలాగూ ఎన్నాళ్ళో జరగలేదు.

వయస్సులో ఉన్న పిల్ల తను కళ్ళముందే ఈ పరాయి కుర్రవాడితో చనువుగా ఉంటుంటే మల్లిక తల్లిదండ్రులు చూస్తూ కూర్చోలేక పొయ్యారు. అతన్ని ఇంటికి తీసుకురావద్దని చెప్పారు. దాంతో మళ్ళా వీళ్ళు రోడ్డున పడ్డారు.

క్రమంగా మల్లిక మీద ఆంక్షలు ఎక్కువైనాయి. ఇంట్లో చిరు బుర్రులూ చిన్న చిన్న కలహాలూ పెరిగే కొద్దీ మల్లిక మానసికంగా సత్యమూర్తికి మరింత చేరువ అయింది.

ఎలాగో ఓపిక పట్టి పరీక్షలు అయినవి అనిపించాడు. తర్వాత కార్యక్రమం గురించే వాళ్ళకు దిగులు పట్టుకుంది. ఇంకా పూర్తిగా రెక్కలు రాని పక్షులు, ఏం చెయ్యాలి? ఎక్కడకి పోవాలి? ముందు తిండీ తిప్పలు చూసుకోవాలి కదా. తర్వాతనే కదా ప్రేమలూ, పెళ్ళిళ్ళూ, ఆశలూ, ఆశయాలూ....

ఇప్పటిదాకా ఒకరకంగా మల్లిక ఆర్థికంగా సత్యమూర్తికి సాయపడుతూ వచ్చింది. మల్లిక పుట్టింట్లో నుంచి వచ్చేస్తే ఇంక అలాంటి సాయమూ చేయలేదు.

"ఏం చేద్దాం?" అంది మల్లిక.

"తప్పదు. కొన్నాళ్ళు వెయిట్ చేద్దాం మరి" అన్నాడు సత్యమూర్తి.

"ఇంకానా? ఎన్నాళ్ళు?" అని అడిగింది మల్లిక అతని కౌగిట్లోకి ఒరిగిపోతూ.

స్నేహితురాలి ఇంటికని చెప్పి మల్లిక వస్తుండేది.

రోజూ సాయంత్రం ఒక చోట కలుసుకునే వాళ్ళు. కాసేపు ఒకరి కొకరు ధైర్యం చెప్పుకునే వాళ్ళు. భవిష్యత్తు మీద బోలెడంత భరోసాను పెంచుకునే వాళ్ళు.

వయస్సులో ఉన్న ఆడామగా ఒమటరిగా ఉంటే ఓర్వలేని కుర్రాళ్ళు వీళ్ళని వెంబడించడం మొదలెట్టారు. ఏవో వెకిలి చేష్టలు చేస్తూ అల్లరి చేసేవాళ్ళు. అందులో ఒకడు ఓసారి మల్లికను ఒంటరిగా వెంబడించి 'ఓ వంద ఇస్తాను, వస్తావా?' అని అడిగాడు.

సత్యమూర్తితో ఆ విషయం చెప్పి, ఏడ్చింది మల్లిక. అదే రోజు వీళ్ళు వస్తుంటే వెంబడిస్తూ వాడు 'లైలా, ఓ లైలా' అంటూ పలకరించాడు.

మల్లిక సత్యమూర్తిని గట్టిగా పట్టుకుని తనను అల్లరి పెట్టింది వీడేనని చెప్పగానే అతను కోపంతో ఉడికిపోయాడు

సైకిలు మీద నుంచి ఇవతలకు లాగి మొహం పగలకొట్టాడు. మూతిపళ్ళు రాలాయి.

మల్లిక అతనితో ఊరుకున్నా బావుండేది. ఆమె వెళ్ళి ఫలానా వాడు తనను అల్లరి పెట్టాడని, కంప్లయింట్ ఇచ్చింది. పోలీసులు వాడిని లాకప్‌లో పారేసి చితక తన్నాడు. ఆ రాత్రే వాడు చచ్చాడు. కానీ సత్యమూర్తి కొట్టిన దెబ్బకే చచ్చినట్లు కేస్ రిజిష్టర్ చేశారు. హత్యానేరంపై సత్యమూర్తిని అరెస్ట్ చేశారు. జైల్లో పారేశాడు. అతనికి డబ్బులేదు గొప్పవాళ్ళ ఆసరా లేదు. అతను చెప్పేది వినిపించుకునే వాళ్ళు లేరు.

చాలా సన్నిహితంగా మసలిన ఒకరిద్దరు స్నేహితులే ఆ కష్టసమయంలో అతన్ని ఆదుకున్నారు.

మల్లిక ఆడపిల్ల కాబట్టి, ఎక్కడ అల్లరి అయిపోతుందోనని ఆమె తల్లితండ్రులు భయపడి ఆమెను గడపదాటనివ్వలేదు.

తొందరగా ఒక అయ్య చేతిలో పెట్టి బరువు దించేసుకోవాలని ఆరాటపడి, పెళ్ళిచూపులు ఏర్పాటు చేశారు.

హరిశ్చంద్రప్రసాద్‌కు తన భార్య రూప లావణ్యాల గురించి, చదువు సంధ్యల గురించీ అంతగా పట్టలేదు. మల్లిక కాబోయే భర్త గురించీ ఆలోచించే స్థితిలో లేదు.

పెద్దలే అన్నీ నిర్ణయించుకుని ముహూర్తాలు పెట్టారు. మల్లిక నిర్జీవ ప్రతిమలాగా పెళ్ళి పీటల మీద కూర్చుంది.

అదే రోజు సత్యమూర్తి జైల్లో నుంచి బయటికొచ్చాడు. ఆ విషయం తెలిసి మల్లిక అతన్ని చూడటానికి వెళ్ళింది. ఇంకా పెళ్ళికూతురి చిహ్నాలన్నీ అలాగే ఉన్నాయి. మెళ్ళో పసుపుతాడుతో కొత్తగా, వింతకాంతితో కనిపించిన మల్లికకు కంగ్రాట్సు చెప్పాడు సత్యమూర్తి.

మల్లిక కన్నీళ్ళు కారిస్తే, సత్యమూర్తి నచ్చచెప్పాడు.

"ఊరుకో మల్లికా, మనం కోరుకున్న జీవితం మనకు దొరకలేదు. కనుక దొరికిన జీవితంతో రాజీపడక తప్పదు..........."

"ఒకరకంగా కాదు, అన్ని విధాలా నిన్ను కష్టాలుపాలు చేసి, నేను మాత్రం నా స్వార్ధం చూసుకున్నాను....." అంది మల్లిక చెమ్మగిల్లిన నేత్రాలు తుడుచుకుని.

"నన్ను నువ్వేం కష్టాలు పాలు చేయలేదు. నేనే అత్యాశకు పొయ్యాను. అంతే.........."

"నువ్వు వాడ్ని కొట్టినప్పుడు, అంతటితో వదిలి పెట్టినా బావుండేది. అనవసరంగా ఆవేశపడి, పోలీసు రిపోర్టు ఇచ్చాను. పోలీసుల చేతుల్లో వాడు చచ్చినా, నిష్కారణంగా నువ్వు హంతకుడివైనావు........"

"ఎప్పుడేం జరగాలో అది జరుగుతుంది. జీవితంలో ఇదో అనుభవం.........." అని నవ్వాడు సత్యమూర్తి.

"ఇప్పుడూ నవ్వగలుగుతున్నావా సత్యా నువ్వు."

"ఏం ఇప్పుడేమైందని..............చచ్చిపోయేటప్పుడు నేను నవ్వుతూనే చనిపోతాను నువ్వు దగ్గరుంటే.........సారీ..................ఇప్పుడు నువ్వు నా మల్లికవు కాదు. మరొకరి భార్యవు.......ఎక్కడుంటేనేంగానీ నువ్వు తృప్తిగా, హాయిగా ఉండగలిగినంతకాలం, నేను నిండుగా నవ్వగలుగుతూనే ఉంటాను మల్లికా" అన్నాడూ సత్యమూర్తి ఆమెను సాగనంపుతూ -

✡ ✡ ✡

అలా జరిగిపోయిన కథనంతా మల్లిక రవికి చెప్పింది.

"మేం మొట్టమొదటిసారిగా కలుసుకున్న వేళావిశేషం ఏమిటోగాని, ఎంతగా విడిపోదామన్నా విడిపోనివ్వకుండా, పరిస్థితులు మమ్మల్ని మళ్ళీ కలుపుతూనే ఉన్నాయి.

ఏ చిన్న కష్టం వచ్చినా రెండోవాళ్ళం రియాక్ట్ అవుతూ, నీ కోసం నేనున్నాను, కష్టసమయంలో నీ దగ్గరకు 'వస్తాను నేస్తం' అంటూ దగ్గరగా వస్తూనే ఉన్నాం. అలా వచ్చి కష్టాలు కొనితెచ్చుకుంటూనే ఉన్నాం. అయినా మాకు బాధలేదు. అతనికి దగ్గరగా నేను, నాకు దగ్గరగా అతనూ రాకుండా ఉండలేం. అది మా బలహీనత అయితే, ఒకరికొకరు చేరువుగా ఉన్నప్పుడు కలిగే మనోధైర్యమే మాకు కొండంత అండ.........." అంది మల్లిక.

"ఔనుగానీ మరి సత్యమూర్తిగారి మీద రిజిస్టర్ అయిన ఆ హత్యా నేరం ఏమైంది?"

"పోలీసులకీ ఇతనికీ మధ్య జరుగుతున్న వ్యవహారం గదా.......... కోర్టులో నానుస్తూనే ఉన్నారు. అయితే పోస్ట్‌మార్టం ఒకటే సత్యమూర్తికి ఫేవర్‌బుల్‌గా ఉంది - ఘర్షణలో కొట్టిన దెబ్బల్లా లేవు. ఒంటిమీద గాయాల్లేవు. అలా పైకి గాయాలు పడకుండా కొట్టే దెబ్బలనే పోలీసుల దెబ్బలు అని అంటారు......" అంది మల్లిక.

వీళ్ళు జరిగినవన్నీ తిప్పిపోసుకుంటున్న సమయంలోనే టెలిగ్రాం వచ్చింది. అది చదివిన మల్లిక మొహం విప్పారింది.

"ఏమిటది?" అని అడిగాడూ రవి.

"ఇప్పుడు మనం అనుకుంటూన్న కేసు గురించే............ లాయర్ టెలిగ్రాం ఇచ్చారు... ఆ హత్యకీ సత్యమూర్తికీ సంబంధం లేదని తీర్పు చెప్పారట....." అంది మల్లిక తేలికగా నిట్టూర్చి.

"అలాగే మీ మీద వచ్చిన హత్యా నేరమూ తొలిగిపోతుందండీ.......... నాకు తెల్సు" అన్నాడు రవి.

"ఏమో ఆ రోజు నేను చూస్తానో చూడనో" అంది మల్లిక నిస్పృహతో.

రాత్రికి సత్యమూర్తి వచ్చాక మల్లిక సంతోషంతో అతని భుజం మీద్ అచేతులు వేసి, కళ్ళల్లోకి చూస్తూ ఆ వార్త చెప్పింది.

"అదేలానూ, ఫేవరబుల్‌గా వస్తుందని అనుకుంటూనే ఉన్నాంగదా" అన్నాడు సత్యమూర్తి -

"అనుకోవటం వేరు అనుకున్నట్లుగా జరగటం వేరు కదా అందుకే ఈ సంతోషం............."

"మళ్ళా ఎన్నాళ్ళకు నీ ముఖంలో ఆనందాన్ని చూశాను మల్లికా?" అన్నాడు సత్యమూర్తి తృప్తిగా ఆమె వంకే చూస్తూ.

ఆమె కాఫీ అందిస్తుంటే సత్యమూర్త్ అన్నాడు.

"హరిశ్చంద్ర ప్రసాద్ మర్డర్ కేసులో మబ్బులు విడిపోతున్నాయిలే" అన్నాడు సత్యమూర్తి.

"ఎలాగా?" అని అడిగాడు రవి.

"సాయినాథ్ అని ఇంకొక ఫ్రెండ్ దొరికాడు.. అతని వల్ల కొంత సమాచారం దొరికింది........" అన్నాడు సత్యమూర్తి.

✡ ✡ ✡

వాకిట్లో ఆటో దిగుతున్న తనూజను చూడగానే రవి "హాయ్" అంటూ అరుచుకుంటూ అరుచుకుంటూ ఆమె దగ్గరకు పరుగెత్తాడు.

ముఖం నిండా సంతోషాన్ని పులుముకుని ఆనందాతిశయంతో ఆమె రెండు చేతులూ పట్టుకుని "వచ్చావా నేస్తం" అన్నాడు.

"వచ్చేశాను" అంది తనూజ. ఆమె ముఖం కూడా ఆనందంతో వెలిగి పోయింది అతన్ని చూడగానే.

రవి తనూజ నడుం చుట్టూ చేతిని చుట్టి లోపలకు తీసుకు వెళుతుంటే తనూజ విడిపించుకుంది.

"ఉండండి, సూట్‌కేస్ ఉంది" అంది.

రవి సూట్‌కేస్ అందుకున్నాడు. లోపలికి వచ్చాక, ఇన్నాళ్ళ వినియోగం తర్వాత ఎదురైన తనూజను చూస్తూ దూరంగా ఉండలేక ఒక్కసారి కౌగిట్లోకి తీసుకున్నాడు. చిరపరచితమైన ఆ స్పర్శ, వెచ్చదనం క్షణ కాలం ఇద్దరికీ ఊరట కలిగించింది.

"నన్ను వదిలి ఇన్నాళ్ళూ ఎలా ఉండగలిగావు?" అని తనూజను ఆప్యాయంగా అడిగాడు రవి.

"ఎలా ఉండగలిగానో, ఆవేదనలో ఎలా వేగిపొయ్యానో నాకే తెలియదు" అంది తనూజ.

"నీ మొహం చూస్తుంటే నాకు తెలుస్తోందిలే చాలా చిక్కిపొయ్యావు........... దిగులు పడ్డావా?" అని అడిగాడు రవి.

"నీకు దూరమైతే నాకు దిగులు కాదా మరి?" అని బుంగ మూతి పెట్టి, ఇంతలేసి కళ్ళు చేసుకుని చూసింది.

"అవును అప్పట్లో ఉత్తరం రాశావు కదా ఒట్టి మనిషివి కాదని........... రోజూ పళ్ళ రసం తాగుతున్నావా?" అని అడిగాడు.

"ఆ, రోజూ నిద్దర లేచాక, ముఖం కడిగేదాకా పళ్ళరసమేగా తాగేది..........."

"ఛీ..........పాచి పళ్ళ రసం కాదోయ్, బత్తాయి పళ్ళరసం.......జూనియర్ తనూజ ఏమంటోంది?" అంటూ ఒంటిని తడిమినప్పుడు మాత్రం తనూజ తట్టుకోలేక రవి భుజం మీద వాలిపోయి ఏడ్చేసింది ఏడుస్తూనే జరిగింది చెప్పేసింది.

"మీ నాన్నకు హత్యలు చేయటం, చేయించటం అలవాటని తెలుసుగనీ చివరకు భ్రూణ హత్యలకూ పాల్పడతాడనుకోలేదు......... ఇలాంటి వాడ్ని ఏం చేసినా పాపం లేదు.........." అని ఓదార్చాడు రవి.

పక్క గదిలో నుంచి మల్లిక రావటంతో తనూజ ఆమెకు ఎదురు వెళ్ళింది. మల్లిక తనూజను హృదయానికి హత్తుకుంది.

"నా కోసం నువ్వు పడిన శ్రమ, కొని తెచ్చుకున్న కష్టాలూ అన్నీ విన్నాను" అంది మల్లిక.

"మామూలంగా మీరూ, అన్నయ్యా జీవితాలనే త్యాగం చేయటానికి సిద్ధపడ్డారు. మీ కోసం మేం ఏదో శ్రమపడ్డామని చెప్పుకోవటమూ చిన్నతనంగానే ఉంటుంది" అని సమాధానం చెప్పింది.

హరిశ్చంద్ర ప్రసాద్ హత్య గురించి గుర్తుచేసింది తనూజ. మల్లిక నిట్టూర్చింది. తర్వాత అంది -

"నేను ఎవరినుంచీ ఏమీ పెద్దగా ఆశించలేదు. చివరకు కట్టుకున్న భర్త నిర్లక్ష్యం చేసి నాకళ్ళముందే మరొకరితో విచ్చలివిడిగా తిరుగుతున్నా నేను పెద్దగా బాధ పడలేదు. ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు..... కళ్ళు మూసినా, తెరిచినా, ఎక్కడున్నా ఏం చేసున్నా నా ఊహల్లో నన్ను వెన్నంటి వచ్చే నా నేస్తం.. అతనికి ప్రాణం పోతుందని తెలిసాక, నన్ను నేను నిగ్రహించుకోలేక, కట్టిపడేస్తున్న ఈ వెలిసిపోయిన పట్టుదారాల సంప్రదాయాలను తృణప్రాయంగా తెంచేసుకుని పరుగు పరుగున అతనికోసం వెళ్ళాను. నా కోసమే బ్రతుకుతూ నా పేరే కలవరిస్తున్న నా స్నేహితుడ్ని బతికించుకునే ప్రయత్నం చేశాను.. నా జీవితంలో ఇదొక్కటే నేను తెల్సి తెల్సి చేసిన మహాపరాధం. ఇక తర్వాత కథంతా నా ప్రమేయం లేకుండా జరిగిపోయింది..... ఇంతకీ ఏ కట్టెకు నిప్పు ఉంటే, ఆ కట్టే దహించుకు పోతుంది. ఎవడీ దగ్గర అంతులేని స్వార్థం, సంకుచిత్వం, మోసం ఉంటాయో వాడే వాటికి బలి అయిపోతాడు. ఇది ఎప్పటికప్పుడు చరిత్ర మనకు చెబుతున్న సత్యం.." అంది మల్లిక.

కాసేపటికి సత్యమూర్తి వచ్చాడు. అతన్ని చూడగానే నవ్వుతూ ఎదురు వెళ్ళింది తనూజ.

"వచ్చేశావా తల్లీ - నీకోసం పరుగెత్తుతా పరుగెత్తుతానని ఆంబోతులా కాలు దువుతున్న నీ ప్రియుడ్ని పట్టి బంధించటం ఎంత కష్టంగా ఉందో తెలుసా?............. " అన్నాడు సత్యమూర్తి కూడా నవ్వుతూ.

"నాకు తెలుసు. మరికొన్ని తేలికగానే అర్థం చేసుకోగలను. సమయానికి నీవు చెప్పే సలహాలు, చేసే సహాయాలూ లేకపోతే మేం ఇవాళ ఇలా ఉండగలిగేవాళ్ళం మాత్రం కాదు" అంది తనూజ, సత్యమూర్తి వంక కృతజ్ఞతా భావంతో చూస్తూ.

"కానీ నువ్వు మాత్రం నీ మాట నిలబెట్టుకున్నట్లు లేదు" అన్నాడు ఆమెనే తేరిపారి చూస్తూ.

"ఏమటన్నయ్యా అది?" అని ఆశ్చర్యంగా అడిగింది తనూజ.

"నాకో మేనకోడల్ని అందిస్తానన్నావు కదమ్మా" అని సత్యమూర్తి అడిగితే, తనూజ తల దించుకుంది.

"అదిసరేగానీ, అసలు ఎలా రాగలిగావు నువ్వు? మీ నాన్న పెట్టిన నిఘా అంతా ఏమైంది?" అని అడిగాడు సత్యమూర్తి.

"ఈ మధ్య మా నాన్న ఇంట్లో ఉండటం లేదు. అసలు ఈ ఊళ్ళోనే, ఇంట్లో ఉన్నా రోజుల తరబడి నాకు కనబడటం మానేశాడు. అందుచేత ఆయన లేడన్న విషయమే నాకు ఆలస్యంగా తెల్సింది. వీలు చూసుకుని కాపలా పెట్టిన పనివాళ్ళకు టోకరా ఇచ్చి వచ్చేశాను" అంది తనూజ

"కానీ మనం ఎక్కడున్నామో, ఏమిటో మీ నాన్నకు తెలుసు నువ్వు ఇంట్లోంచి పారిపొయ్యావని తెలియగానే, ఆయనే స్వయంగా ఇక్కడకి రావచ్చు. లేదా ఇంకేదో విధంగా నిన్ను లాక్కుపోవచ్చు........... అందుచేత చాలాచాలా జాగ్రత్తగా ఉండాలి మరి" అన్నాడు సత్యమూర్తి.

"నేను గుమ్మంలో కాపలా కూర్చుంటా" అన్నాడు రవి.

"నువ్వు అసలైన మొగుడ్ని అంటే - భర్త అన్నాక భార్యకు బాడీగార్డులా ఉండాలి." అని నవ్వింది మల్లిక.

"బాడీ గార్డుని కాదండి అంగరక్షకుడ్ని" అన్నాడు రవి.

"రెండిటికీ తేడా ఏమిటి?" అని తనూజ అమాయకంగా అడిగింది.

"ఏమిటో మరి మీ ఆయన్నే అడుగు" అంది మల్లిక నవ్వును దాచుకుంటూ.

✡ ✡ ✡

రాత్రి తొమ్మిది గంటలైంది. ఇంట్లో డాక్టర్ షీలా ఒక్కతే ఉంది. కుర్చీలో కూర్చుని తలవెనక్కి వాల్చి, కళ్ళు మూసుకుని దీర్ఘంగా ఆలోచిస్తోంది.

సాయినాథ్ ఎంత నిశ్శబ్దంగా వచ్చినా, ఆమె కళ్ళు తెరిచి, సర్దుకుని కూర్చుంది.

"సారీ, మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్లున్నాను" అన్నాడు సాయినాథ్.

"అదేం లేదు. ఏమీ తోచకనే ఒంటరిగా కూర్చున్నాను" అంది షీలా.

"పేషెంట్స్ రావడం, చూడటం అంతా అయిపోయిందా?" అని అడిగాడు.

"ఈ మధ్య పేషెంట్స్ ఎవరూ రావటం లేదు. వాళ్ళకూ భయం పట్టుకున్నట్లుంది........... ఇంక నా మీద పడిన ఈ ముద్ర చెరిగిపోదేమో" అని దీర్ఘంగా ఊపిరి వదిలింది.

"హత్య మీ ఇంట్లో జరిగిందే గాని, మీరు చెయలేదు కదా.." అని సర్ది చెప్పాడు సాయినాథ్.

"ఆమె కొద్దిసేపు మౌనం వహించి, అతనితో చెబుతున్నట్లుగా కాక, తనకు తానే చెప్పుకుంటున్నట్లుగా చెప్పటం మొదలెట్టింది.

"లోకాన్ని మనం పట్టించుకోకపోయినా, మనల్ని లోకం పట్టించుకుంటూనే ఉంటుంది. మనల్ని వెయ్యి కళ్ళతో కనిపెట్టి చూస్తూనే ఉంటుంది. అందుకే అందర్నీ కాదని, ఒంటరిగా బతకడానికి ఇంతగా వెనకాడాల్సి వస్తోంది."

"కానీ మీకేం తక్కువని?"

"తక్కువా, ఎక్కువల ప్రసక్తి కాదు. మనిషి సంఘజీవి. నలుగురూ నన్ను చిన్న చూపు చూస్తున్నారన్న భావమే నన్ను కృంగదీస్తోంది. ఈ బాధ చాలు. ఈ శిక్ష చాలు...." అంది షీలా.

"ఈ లోకం దృష్టి కూడా ఎప్పుడూ ఒక మాదిరిగా ఉండదు. ఒకప్పుడు అందలం ఎక్కించి ఊరేగించిన వాళ్ళనే, మళ్ళీ ఓసారి బురద గుంటలోకి నెట్టేస్తుంటారు జనం. ఇంకోసారి ఎప్పుడో వాళ్ళను మళ్ళా ఆకాశానికి ఎత్తేస్తూ ఉంటారు. కనుక దేనికీ స్థిరమైన విలువలు లేవు.."

"కొంతమంది విషయంలో నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. కానీ ఒకసారి దెబ్బతిని నిబ్బరించుకుని పైకి లేచి, మళ్ళా నిలదొక్కుకుని పోగొట్టుకున్న స్థానాన్ని గౌరవాన్ని సంపాదించుకోగల వాళ్ళు చాలా తక్కువగా ఉంటారు. ఒకరిద్దరు అలాంటి వాళ్ళు ఉన్నా వాళ్ళ జీవితాల మీద పడిన మచ్చ మాత్రం అంత తేలికగా మాసిపోదు. వాళ్ళను ఇంకెవరూ మామూలు మనిషిగా చూడరు.........." అంది షీలా.

"అందరి సంగరి ఏమోగానీ, మనిషిలోని బలహీనతలను అర్థం చేసుకోగలిగిన వాళ్ళు, వాళ్ళను సహృదయంతో ఆదరించగలిగిన వాళ్ళు ఉండకపోరు. నా మటుకు నాకు జరిగిన దానిలో మీ తప్పు ఏమీ కనిపించటం లేదు......" అన్నాడు సాయినాథ్.

"ఏం జరిగిందో మీకు పూర్తిగా తెలుసా?" అంది షీలా.

"పూర్తిగా తెలియదు."

"తెలియకుండానే నా తప్పు ఏమీ లేదని తీర్పు చెప్పారా?"

"ద్రోహ చింతలో మీ అంతట మీరు ఘోరమైన అపరాధం ఏమీ చేయరు, చేయలేరు. ఆ మనుషులు వేరు. కాకపోతే పరిస్థితుల ప్రోద్భలంతోనో మరొకరి బలవంతం చేతనో, ఇంకొకరికి నచ్చని పనులు చేయాల్సిరావచ్చు. అది మరొకరికి తప్పుగా కన్పించవచ్చు రాజుగారు ఒక శాసనం చేస్తే అది సగం మందికి నచ్చకపోవచ్చు. కానీ ఆ శాసనాన్ని తప్పు అని ఎంతమంది అనగలరు? గొప్పవాళ్ళు ఏం చేసినా అది తప్పుకాదు. వాళ్ళు నిష్కారణంగా నిర్దోషుల పీకలు కత్తిరించినా అది తప్పుకాదు. కానీ సగటు మనిషి తన జీవితాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నంలో ఏం చేసినా తప్పే. ఆ పనే మనం చేసి దొరికిపోతే, పొరపాటు జరిగిందని అంటాం. ఇంకెవరన్నా చేస్తే తప్పు చేసాడని తీర్పు చెబుతాం" అన్నాడు సాయినాథ్.

షీలా అతనివంకే నిశితంగా చూసి, అన్నది.

"సానుభూతి చూపి, అర్థం చేసుకోగల మనిషి, మీరు ఒక్కరైనా మిగిలిపోవటం నా అదృష్టంగానే భావిస్తాను......... అసలేం జరిగిందో చెపుతాను వినండి" అంటూ తనకథ సవిస్తరంగా చెప్పటం మొదలు పెట్టింది.

✡ ✡ ✡

*"ఈ జీవితం కొందరికి వరం. కొందరికి శాపం. కొందరికి కల. ఇంకొందరికి వల. నాకు మాత్రం అదో పెద్ద అల. ఉత్తుంగ తరంగం ఎటు నెట్టుకుపోతే, అటు కొట్టుకు పోవటం మినహా నేను చేయగలిగిందేమీ లేకపోయింది....."*

*ఆమె ఏం చెబుతుందోనని ఆసక్తిగా వింటున్న సాయినాధ్ ఆమె వంక సాభిప్రాయంగా చూశాడు. పూర్తిగా చెప్పమన్న అర్థం ఆ చూపుల్లో కనిపిస్తోంది. షీలా మళ్ళా నెమ్మదిగా చెప్పటం మొదలెట్టింది.*

"నేను ఒక అనామకురాలిగా ఉన్న రోజుల్లో హరిశ్చంద్రప్రసాద్‌తో స్నేహం కలిసింది. అతను నా జీవితానికో అర్థాన్ని కల్పించాడు. నిస్తేజంగా సాగిపోతున్న రోజులను తేజోమయం చేశాడు. బాధలతో కృంగిపోతున్న నాకు బాసటగా నిలిచాడు. నాకు నవ్వటం నేర్పాడు, నలుగురిలోకి ధైర్యంగా నడవటం నేర్పాడు. అస్తమానం బుర్ర వంచుకుని భూమిలో ఏం వెతుకుంటావు, అదుగో ఆకాశం ఎన్నెన్ని అందాలు సంతరించుకుంటుందో ఆసక్తిగా చూడమన్నాడు. నాకు తెలియని విషయాలెన్నో వివరంగా, విశదంగా, ఓపిగ్గా చెప్పాడు. చదవలేక మధ్యలో చతికిలబడి పోయిన నాకు చేయూత నిచ్చి చివరిదాకా గెలిపించాడు. నన్నూ తనతో సమానంగా డాక్టర్ని చేశాడు. నాకీస్థాయిని, హోదాని కల్పించాడు. దారిద్ర్యం అనే బురదలో కూరుకుపోయిన పద్మాన్ని అరచేతుల్లోకి తీసుకున్నాడు... నన్ను చరితార్థురాలిని చేశాడు. హరి పట్ల విశ్వాసం, కృతజ్ఞతాభిమానం నా రక్తంలో జీర్ణించుకుపోయినయి. నేను వున్నదీ, బ్రతికి ఉన్నదీ అతని కోసమేనన్న అభిప్రాయం నాలో ఏర్పడింది...

"అయితే అన్నీ మనం అనుకున్నట్లే జరగవు. జరిగితే బహుశా భగవంతుడి ఉనికినే మర్చిపోతామని ఆయన కాబోలు. కాలం అనూహ్యమైన మలుపుల వైపు మనల్ని నడిపించుకుపోతుంటుంది. ఇలాంటి మలుపే ఒకటి తిరిగి, నావాడు అనుకున్న హరిశ్చంద్రప్రసాద్ మల్లికను పెళ్ళిచేసుకున్నాడు. ఈ కులం తక్కువదాన్ని కోడలుగా తెచ్చుకోవటానికి అతని తల్లి ఒప్పుకోలేదు. ఆమె కుదిర్చిన సంబంధం చేసుకోకపోతే బావిలో దూకుతానని బెదిరించింది. ఏమైనా జన్మనిచ్చిన తల్లిని అంతగా వేధించవద్దని వారికి నేనే నచ్చ చెప్పాను. తల్లికోరికను తీర్చటంకోసం హరి మల్లికను చేసుకున్నాడు. కానీ ఆమె అతని హృదయంలో భార్యస్థానాన్నీ మాత్రం పొందలేకపోయింది. హరిని ఆకట్టుకోగలిగినందుకు మొదట్లో నేను గర్వించినా, రాను రాను నాలో ఏదో అలజడి మొదలైంది.....

"ఈ ప్రేమోద్వేగం, మోహావేశం ఎన్నాళ్ళుంటుందో తెలియదు సమాజం దృష్టిలో మల్లికే అతని భార్య. ఆమే అతని ఇంట్లో తిష్టవేసుక్కూర్చుంది. ఇవాళ కాకపోతే, రేపో, ఎల్లుండో, ఇంకో అయిదేళ్ళకో పదేళ్ళకో హరికి నామీద మోజు తగ్గిపోతే, అప్పుడు అతనికి అసలు భార్య ఉండనే ఉంటుంది. జరిగింది మర్చిపోయి ఇద్దరూ ఒకటైపోతారు. కానీ తాను.. అప్పుడు తనేమైపోతుంది... వయసు

దాటిపోతుంది. వృద్ధకన్య అయిపోతుంది. చుట్టూ ఇన్ని కోట్లమంది ఉన్నా తను ఒంటరిదైపోతుంది. భూమికి బరువైపోతుంది.... అందుకని మరేం చెయ్యాలి? అస్తమానం ఇదే భయం. ఇవే ఆలోచనలు పీడకలల్లా పట్టి పీడిస్తుండేవి.

"ఎప్పుడో ఏదో జరుగుతుందన్న భయంతో, ఇప్పుడు తన చుట్టూ ఎన్నెన్నో ఆశల్ని పోగుచేసుకుంటున్న హరిని కాదనటం ఎలా? కాలదన్నటం ఎలా? ఎదమిద్దంగా ఏదీ తేల్చుకోలేక, ఎటూ నిర్ధారణ చేసుకోలేక, మనసు డోలాయమానంగా ఊగుతున్న 'పరిస్థితుల్లో-చాలాచిత్రంగా ఎంతో చొరవగా, ధైర్యంగా దూకుడుగా మరో వ్యక్తి నా జీవితంలోకి నడుచుకుంటూ వచ్చాడు...

"ముకుందరావుగారు అప్పట్లో మంత్రిగా ఉండేవారు. ఓసారి ఆయనకు జబ్బుచేసింది. హాస్పిటల్‌లో చేరారు. మామూలు పేషెంట్స్ మధ్య మంత్రిగారికి ప్రత్యేక ట్రీట్‌మెంట్ ఉంటుంది కదా. అంచేత ఆయనపట్ల ఎక్కువగానే శ్రద్ధ చూపించాను. నేనేకాదు. అక్కడ డాక్టరుగా ఎవరున్నా అలానే చేస్తారు. ఒకటికి రెండుసార్లు వెళ్ళి చూస్తున్నా, ఆయన ఇంకా భయాన్ని నటిస్తూ 'నేను బతుకుతానంటావా షీలా?' అంటూ నా చేతులు పట్టుకుని అడిగేవాడు. మందులివ్వటమే కాదు ధైర్యం చెప్పటమూ, డాక్టర్ వృత్తిలో ఒక భాగమే. ఏం ఫర్వాలేదని, ఒక నెలరోజుల్లో మళ్ళా మీరు ఊపిరాడని పనుల్లో మునిగిపోతారని ధైర్యం చెప్పేదాన్ని. 'ఆస్పత్రినుంచి వెళ్ళిపోతే నిజంగానే ఊపిరాడని పనుల్లో మునిగిపోవాల్సి ఉంటుంది అప్పుడు నిజంగానే ఊపిరాడకపోతే?' అంటూ చిన్న పిల్లాడిలాగా అడిగేవాడు. నా రెండు చేతుల్నీ గట్టిగా పట్టుకుని 'ధైర్యంగా ఉంటుంది కాసేపు దగ్గర కూర్చోమ'నేవాడు. మంత్రిగారు కదా, మర్యాదకు లోపం రావటానికి వీల్లేదని పై అధికార్ల ఆజ్ఞలూ ఉన్నాయి. కబుర్లు చెప్పటం, మందులు మింగించటం, పండ్లూఫలాలూ ఒలిచి ఆయన ముందు పెట్టటం... ఇలాంటి కొన్ని రాచమర్యాదలూ ఆయనకు అప్పట్లో నాకు తప్పనిసరి అయింది.

ముకుందరావు గారికి నయమైంది. ఇంటికి వెళ్ళారు. అంతటితో ఆ అధ్యాయం పూర్తయితే బావుండేదేమో. కానీ ఆయన నన్ను విడిచి పెట్టలేదు. నా ఇల్లు వెతుక్కుంటూ వచ్చేవారు. అదీ రాత్రి బాగా పొద్దు పొయ్యాక. ఊరూ వాడా మంచి నిద్దర్లో ఉండగా వచ్చి నన్ను నిద్దర లేపేవాడు. ప్రాణదానం చేసిన దేవతననీ, ఎన్ని జన్మలెత్తినా ఈ రుణం తీరదనీ, నన్ను ఆకాశానికి ఎత్తుతూ పొగిడేవాడు. తర్వాత ఖరీదైన చీరలూ, నగలూ తేవటం మొదలెట్టాడు. నా డ్యూటీ నేను చేశాను. మీరింతగా స్పందించాల్సిన పనిలేదంటే ఆయన వినేవాడు కాదు. తను తెచ్చిన చీరలు కట్టుకోమనేవారు. నగలు పెట్టుకోమనేవాడు. వచ్చి తనపక్కన కూర్చోమనేవాడు. ఇదంతా నాకు బొత్తిగా ఇష్టం లేకపోయినా, ఎందుకో గట్టిగా ఆయన్ను రావద్దని చెప్పలేకపొయ్యాను. ఈ చిన్న బలహీనతను ఆయన బాగా వినియోగించుకున్నాడు.

"బంజారాహిల్స్‌లో నా పేర స్థలం కొన్నానంటూ కాగితాలు తెచ్చిచ్చాడు ఒకరోజు. నేనెవరు? మీరెవరు? నాకు ఇవన్నీ ఎందుకు ఇస్తున్నారు? అని అడిగాను. ఇప్పుడు నువ్వు పరాయిదానిలాగా కనిపించటంలేదు. ఎన్నో జన్మల నుంచీ పరిచయం ఉన్నదానిలాగా అనిపిస్తున్నావు. కానీ ఎటొచ్చీ ఈ జన్మలోనే చెరోదారి అయిపోయి, ఇప్పుడు కొంచెం ఆలస్యంగా కలుసుకున్నాం. కనక నన్ను కాదనకు." అంటూ ప్రాధేయపడేవాడు. అయినా ఎందుకో రాజీపడలేకపొయ్యాను. నాకు భవిష్యత్తు అంధకార బంధురంగా తయారైంది. ఆ చీకట్లో, ఒంటరిగా, దిగులుగా నిలబడ్డ నేను గట్టిగా ప్రతిఘటించే శక్తినీ కోల్పోయాను..."

"ఇంతలో ముకుందరావుగారికి మంత్రి పదవిపోయింది ఇక్కడినుంచీ మకాం మార్చాడు. కానీ తరచూ హైదరాబాదు వస్తుండేవాడు. తిన్నగా ఇంటికొచ్చేసేవారు. గంటలకొద్దీ కూర్చుని కదిలేవాడు కాదు. ఇంక ఈ రహస్యం ఎన్నాళ్ళో దాగలేదు. హరిశ్చంద్రప్రసాద్‌కు తెలిసింది. ఆయనకూ నీకూ ఏమిటి సంబంధం అని నిలదీశాడు. ప్రత్యేకంగా ఆయన మీద నాకేం అభిమానం లేదని చెప్పాను. అది నిజం కూడా. ఒకరోజు హరి, ముకుందరావుగారు ఈ ఇంట్లోనే మాటా మాటా అనుకున్నారు - తిట్టుకున్నారు. ఇద్దరికీ నా మీద ఏదో హక్కు ఉన్నట్లుగానే ఫీల్ అవుతున్నారని స్పష్టంగా తెల్సింది. ముకుందరావు గారు మాత్రం మాత్రం నన్ను అందలం ఎక్కించేస్తానని ఆశలు కలిపిస్తూనే ఉన్నాడు. హరి మల్లికను పెళ్ళి చేసుకుని, ఇష్టంతోనో అయిష్టంతోనో తన సంసారాన్ని ఏర్పాటు చేసుకున్నప్పుడు, నా స్థానం

ఏమిటి అన్న ప్రశ్న నా మనసులో కుమ్మరి పురుగు తొలిచినట్లు తొలుస్తూనే ఉంది. హరిమీద ఇది వరకు ఉన్నంత ఆరాధన ఇప్పుడు లేదు అని ఒప్పుకోవాల్సి వస్తోంది...

"వీళ్ళిద్దరి మధ్యా ఎటూ చెప్పలేని పరిస్థితుల్లో మల్లికను తెచ్చి హరిశ్చంద్ర ప్రసాద్ మా ఇంట్లో ఉంచాడు. ఆమె ఇక్కడున్నప్పుడే ముకుందరావుగారు వచ్చాడు. మల్లిక హరిశ్చంద్రప్రసాద్ భార్యని, వాళ్ళిద్దరికీ కొన్ని గొడవలున్నాయని, కొంతకాలం ఆమెను ఇక్కడ బలవంతాన ఉంచాల్సివచ్చిందని తెలుసుకున్న ముకుందరావుగారు ఆవేళ హరితో మళ్ళా ఘర్షణకు దిగాడు. అసలే చికాకుల్లో ఉన్న హరి ముకుందరావుగార్ని ఇంట్లోంచి వెళ్ళిపొమ్మని మెడపట్టి బయటకు గెంటాడు. నరసింహావతారం ఎత్తాడు - అంతకుముందు ఆపిల్ కాయలు కాయలు కోసిన కత్తితోనే హరిని పొడిచేశాడు. కాళ్ళూ చేతులూ కడుక్కుని అయిదునిముషాల తర్వాత ఆయన ఆటో ఎక్కి వెళ్ళిపోయాడు...

"అప్పుడు ఇంక ఏం చెయ్యాలో నాకు తెలియలేదు. ముకుందరావుగారి విషయం పోలీసులకు చెప్పటం ఇష్టంలేకపోయింది. ఇప్పటికే నన్ను చిన్న చూపు చూస్తున్న లోకం, మరింత హీనంగా చూస్తుంది. ఆ ఊహ రాగానే, ఆయన విషయం దాచి, మల్లిక మీదకు ఈ హత్యానేరం మోపాను. అంతకుముందే ఆ భార్యాభర్తలిద్దరూ వీధిన పడ్డారు. సత్యమూర్తి కోర్టుకెక్కాడు. కనుక మల్లిక భర్తను చంపిందంటే అందరూ తేలికగానే నమ్ముతారని తెలుసు.."

"కానీ జరిగింది మాత్రం అది. ఈ విషయం నా గుండెల్లోనే దాచుకోవాలనుకున్నాను నీకు చెప్పకుండా ఉండలేకపోతున్నాను. ఎందుకంటే, ఈ విపత్కర పరిస్థితుల్లో నా పట్ల ఏమాత్రం అయినా సానుభూతి చూపే మనిషి ఒకడు ఉన్నాడన్న రిలీఫ్ ముందు, రహస్యాలన్నీ చాలా చిన్నవిగా కనిపిస్తున్నాయి." ... అంటూ ముగించింది షీలా.

ఆమె చెప్పినదంతా వింటూ కూర్చున్న సాయినాధ్ కుర్చీలోనుంచి కొంచెంగా ముందుకు వంగాడు. ఆమెతో అన్నాడు.

"ఇంతకు ముందుదాకా మీ గురించి కొంతే తెలుసుకున్నాను.... ఇప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను..."

"తెలుసుకున్నాక నా మీద బాగా అసహ్యం పెరిగిపోయింది కదూ." మీరు చెప్పినట్లుగా, మనలో చాలామంది జీవితాలను విధి అనే అల గమ్యం ఎరుగని తీరంవైపుకు నెట్టుకు పోతుంటుంది. ఆ అలను ఎదిరించటం, ఎదురీదటం మనకు చేతకాదు. తల ఒగ్గటమే మనం చేయగలిగిలిగింది..." అన్నాడు సాయినాధ్.

"నా జీవితంలో ఇప్పటికే ఒకరు కాదు, ఇద్దరు వ్యక్తులు చెలగాటాలు ఆడారు. వాళ్ళ మాట అటుంచి ఈ పోరాటంలో నేను చిత్తుగా ఓడిపొయ్యాను. పూర్తిగా అలిసిపొయ్యాను. రాత్రిపూట ఈ ఇంట్లో ఎలా ఉంటున్నానో నాకే తెలియదు. ఇంకా హరి శవం అక్కడున్నట్లే అనిపించి, గుండెదడదడలాడిపోతుంది... " అంటు షీలా కన్నీరు కార్చింది.

"మీరు మరోలా అనుకోకపోతే, నా రూంకు వచ్చి అక్కడే ఉండడి.... లేదా, మీకు తోడుగా నన్ను ఇక్కడ ఉండమన్నా ఉంటాను.."

"ఇంకా నాకు తోడుగా, నీడగా ఉండాలనే అనిపిస్తోందా నీకు?"

"మీమీద నా అభిప్రాయం మారలేదు. నా అభిమానం తగ్గనూ లేదు."

"ఎందుకని?" అని అడిగింది పైటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకుని.

"మనవి మధ్య తరగతి కుటుంబాలు. మనకు ఆశలు ఎక్కువ. అవి తీరే అవకాశాలు తక్కువ. అందుకనే ఏ చిన్న అవకాశం దొరికినా, దాన్ని అంది పుచ్చుకుని, ఈ పరమపద సోపానంలో పైకి పోవాలన్న తాపత్రయం... మీకే కాదు అందరికీ ఉంటుంది. ఉండాలి కూడా. లేకపోతే ఈ జీవితం నిరామయంగానే గడిచిపోతుంది మరి.... ఇంతకీ మీరు నా రూంకు వస్తున్నారా? లేక నన్నే ఇక్కడ ఉండిపొమ్మంటారా?" అని మళ్ళీ అడిగాడు సాయినాధ్.

"ఇక్కడున్నంత సేపూ జరిగిపోయినవన్నీ గుర్తొచ్చి పిచ్చెక్కిపోతోంది. కనుక నేనే మీ రూముకు వస్తాను కానీ నలుగురూ ఏమనుకుంటారు?" అని అడిగింది షీలా.

"ఇకనుంచి మీరు నలుగురి కోసం ఆలోచించటం మానేసి, ఇద్దరి కోసం ఆలోచించండి...."

"ఎవరా ఇద్దరు?"

"మీరు నేను" అని నవ్వాడు సాయినాథ్.

ఆ రాత్రికి రాత్రి సాయినాథ్ షీలాను తన రూంకు తీసుకొచ్చాడు.

మరునాడు సత్యమూర్తి సాయినాథ్ రూంకు వచ్చాడు. జరిగినదంతా సాయినాథ్ ద్వారా విన్నాడు. తర్వాత ఆమెతో అన్నాడు.

"చూడండి, జరిగిందేదో జరిగిపోయింది, మంచో చెడో ఫలితాన్ని మీరూ, మల్లికా మీ చుట్టూ ఉన్న మేమూ కొద్దో గొప్పో అనుభవిస్తున్నాం. పోయినవాళ్ళను ఎలానూ తీసుకురాలేం ఉన్నవాళ్ళం ఐనా బతికిన నాలుగు రోజులూ ఇంక స్నేహితుల్లా బతుకుదాం, తలా ఒక రకంగా మనం శాపగ్రస్తుల్లా - ఐనా ఫర్వాలేదు. ఒకరికొకరు అండగా ఉన్నంతవరకూ ధైర్యంగానే ఉంటాం - ఇక మీకు సాయినాథ్ తోడుగా ఉంటాడు సరే, మమ్మల్ని మీ నేస్తాలుగా భావించటానికి అభ్యంతరమా!"

"అలాంటి అభ్యంతరాలు ఏమన్నా ఉంటే మీకు ఉండాలి. చరిత్రహీనురాలిని... నాకేం అభ్యంతరం" అంది షీలా.

"ఉదాత్త చరిత్రలు సృష్టించడానికి మన పరిధి ఎంత? మనకున్న అవకాశాలు ఎన్ని? తిండికీ బట్టకీ వెతుక్కోవటంతోనే బతుకులు తెల్లారిపోయే సగటు మనుషులం మనం, ఈ కాస్త పరిధిలోనే ఏదో సాధించాలన్న తపన ఏమో చేయాలన్న ఆరాటం మాత్రమే .... సరేమరి, మాతో దోస్తి చేయటానికి అంగీకరించారు గనుక, ఈ నేస్తానికి మరో చిన్న సాయం చేయాలి?...." అని అడిగాడు సత్యమూర్తి.

"ఏమిటది "అని ప్రశ్నించింది షీలా.

"మల్లిక మీద మీ మనసులో ఎలాంటి అభిప్రాయం ఉంటుందో నేను ఊహించుకోగలను. కానీ ఆమెకు ఇప్పుడు జీవితం మీదే విరక్తి కలిగింది. ఆమె మాటలలో చేష్టలలో ఆ విరక్తి కనిపిస్తోంది, ఆ నిర్లిప్తతనుంచి ఆమెను ఇవతలకి లాక్కొచ్చే ప్రయత్నం చేయాల్సిన డ్యూటీ మనందరి మీదా ఉంది. ముఖ్యంగా మీరు చేయాల్సింది కొంత ఉంది...." అన్నాడు.

"ఏమిటో చెప్పండి..."

"హరిశ్చంద్రప్రసాద్‌ని హత్యచేసింది మల్లిక కాదు. ముకుందరావు అని కోర్టులో చెప్పాలి. ఈ హత్యకు ప్రత్యక్షసాక్ష్యం మీ రొక్కరే. జరిగింది జరిగినట్లుగా కోర్టులోనూ చెప్పండి. ఒక అమాయకురాలి ప్రాణాలు కాపాడండి... ఈపాటి సాయం చెయ్యండి జీవితాంతం మీకు ఎలాంటిసాయం చేయటానికైనా నేనూ మల్లికా సిద్ధంగా ఉంటాం" అని నచ్చచెప్పాడు సత్యమూర్తి.

షీలా స్టేట్‌మెంటుతో కోర్టుకేసు కొత్తమలుపు తిరిగింది. ఇన్నాళ్ళూ సిటీలోనే ఒక హోటల్ రూంలో ఉండిపోయిన ముకుందరావుకు విషయం అర్థమైంది. కూతురు తనూజ ఇక్కడకు చేరిందన్న విషయమూ తెలిసిపోయింది.

ఆఖరి ప్రయత్నంగా ఆయన సత్యమూర్తి దగ్గరకు వచ్చాడు.

"రండి, మీరు బేరానికి వస్తారని నాకు తెలుసు. మీకోసం ఎదురు చూస్తూనే ఉన్నాను" అన్నాడు సత్యమూర్తి

"అదే కోర్టులో చెప్పండి..."

"ఆ సంగతి నువ్వు చెప్పక్కర్లేదు. బయటపడే మార్గం చూడు.."

"లాయర్ ను పెట్టుకోండి. ఆ మార్గాలు ఏమన్నా ఉంటే ఆయన చెబుతాడు" అన్నాడు సత్యమూర్తి.

ముకుందరావు లేచి నిలబడ్డాడు. తనూజను చూసి "వెడతాను" అన్నాడు.

తండ్రిని చూడటానికి కూడా తనూజ ముందర ఒప్పుకోలేదు. సత్యమూర్తి లోపలికు వెళ్ళి ఆమెను వెంట తీసుకొచ్చాడు.

కూతురుని చూసి ఆయన కన్నీరు తుడుచుకున్నాడు. తనూజ తండ్రిని కౌగిలించుకుని ఏడ్చేసింది.

"నిక్షేపం లాంటి పిల్లను తెచ్చి ఈ నరకకూపంలో పడేశావు. ఏం ఉద్ధరిద్దామని?"

"నేను ఎవర్నీ ఉద్ధరిస్తానని ఎన్నడూ చెప్పలేదు. ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి గాని, ఇంకొకరు వచ్చి ఉద్ధరిస్తారని నోరు తెరుచుకు కూర్చుంటే వాడంత వెధ ఇంకొకడు ఉండడు, ఇది జగమెరిగిన సత్యం.... తనూజ రవితో పెళ్ళి చేయామని కోరింది. వద్దని పోరాను. చెప్పవలసిందంతా చెప్పాను. ఐనా ఎన్ని కష్టాలు ఎదురొచ్చినా పెళ్ళీ చేసుకోటానికే వాళ్ళు నిశ్చయించుకున్నారు. ఇంక వాళ్ళకు అడ్డుపడటం భావ్యం కాదనిపించింది." అన్నాడు సత్యమూర్తి.

"అది అభం శుభం తెలియని పిల్ల. దాన్ని మాయచేసి వాడూ వల్లో వేసుకుంటే నువ్వేమో తగుదునమ్మా అని వాళ్ళకు పెళ్ళి చేయిస్తావా? వాళ్ళ మధ్యనున్న అంతర్యం ఎలాంటిదో నీకు తెలియదా? వాళ్ళు సుఖపడతారనే నీ ఉద్దేశ్యమా?"

"వాళ్ళు వయసులో ఉన్న పిల్లలు. వాళ్ళది ఉడుకు రక్తం. వాళ్ళ సంగతి అలా ఉంచండి. ముందు మీ సంగతి చెప్పండి. మీరేం చేశారు? ఈ వయసులో షీలా వెంటపడ్డారు. ఆమెకు ఆభరణాలిచ్చారు. ఆస్తులిచ్చారు. మొదటినుంచీ ఆమె మీద మమతలు పెంచుకున్నవాడు అడ్డుపడితే, మీరు మండిపడుతూ అతని గుండెల్లో కత్తిని దించారు. మీరు చేసినదాన్ని ఏమనాలి? ఇంత లేటు వయస్సులోనూ, దీన్ని ఘాటు ప్రేమ అనాలా, మొరటు ప్రేమ అనాలా? కళ్ళు మూసుకుపోయిన కామం అనాలా" అని అడిగాడూ సత్యమూర్తి.

అలా సూటిగా అడిగితే ఆయన బదులు చెప్పలేక కోపంతో విసవిసలాడుతూ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

షీలా చెప్పినదంతా కోర్టునమ్మింది. కత్తిమీద వేలిముద్రలు కూడా ముకుందరావువేనని రుజువైంది. ఆయనకు శిక్షపడింది.

జైల్లో ఉన్న తండ్రిని చూసి వచ్చింది తనూజ. ఈసారి మాత్రం ఆయనే కూతుర్ని చూసి ఏడ్చాడు.

"అమ్మా, నువ్వింక మనింటికి వెళ్ళు అవన్నీ ఇంక నీవే" అని అప్పచెప్పాడు.

తనూజ రవితోపాటు మల్లికను, సత్యమూర్తిని కూడా తమ వెంట ఊరికి తమ ఇంటికి తీసుకెళ్ళింది.

మల్లిక ఈ కొత్త చోట క్రమంగా కోలుకుంది.

ఓ రోజు సాయంత్రం సత్యమూర్తి లాన్‌లో కూర్చుంటే తనూజ దగ్గరికి వచ్చి నవ్వుతూ అతనితో ప్రస్తావించింది.

"అన్నయ్యా, నేనొకటి అడుగుతాను చెపుతావా?"

"అడుగు"

"నా పెళ్ళి నువ్వు చేశావు కదా. నీ పెళ్ళి నేను చేస్తే బావుంటుందని ..... "

"మల్లికను అడిగావా? అని ప్రశ్నించాడు సత్యమూర్తి.

"ఇంకా లేదు ముందు నువ్వు సరేనంటే ఆమె కాదనదని నా నమ్మకం నీకిష్టమేనా చెప్పు..." అంది తనూజ.

"మల్లిక ఏం అడిగినా నేను కాదనలేదు. కాని నా ఇష్టం గురించి అడుగుతున్నావు గనక చెబుతున్నాను. పెళ్ళి చేసుకుంటే భార్యమీద భర్తకూ భర్తమీద భార్యకూ కొన్ని హక్కులూ, అధికారాలు వస్తాయి. వీటితోపాటే కలతలూ కలహాలూ వస్తాయి కానీ స్నేహానికి ఈ హక్కులూ లేవు. అధికారాలు లేవు. కలతలూ లేవు. కలహాలు లేవు. అందుకని మల్లికకు భర్తగా ఉండటం కన్నా, ఒక నేస్తంగా ఉండటమే నాకు ఇష్టం...." అన్నాడు సత్యమూర్తి.

"నాకు తెలియక అడుగుతాను - భార్యా భర్తలూ స్నేహితుల్లా ఉండలేరా మిగతా వాళ్ళ మాట ఏమోగాని, నువ్వూ మల్లిక ఎప్పటికీ స్నేహితులే.... స్నేహితులు సాన్నిహిత్యాన్ని కోరుకుంటారు ఒక్క దాంపత్యంలోని నిండుదనం ఏమిటో తెలిసివస్తుంది. అందుకని మా అన్నయ్య పెళ్ళికి వచ్చేనెల ఐదో తారీకు ముహూర్తం పెట్టాను...".

"కానీ మల్లికను..."

"సారీ, అవతల నాకు చాలా పనులున్నాయి మరి. వస్తాను నేస్తం" అంటూ నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

మేడమీద కిటికీలోంచి చూస్తున్న మల్లిక తేలిగ్గా నిట్టూర్చింది.

## (సమాప్తం)

**ఈ నవల ప్రచురణ వెనుక నున్న కథ..!**

ఈ నవల ఫిబ్రవరి 1986 నుంచి సెప్టెంబర్ 1986 వరకూ 'పల్లకి' వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. అంటే 23 సంవత్సరాల క్రిందట. అప్పట్లోనే నేను వ్రాసిన ఫోటో కవితలు కూడా అదే 'పల్లకి'లో తరచూ ప్రచురితమౌతుండేవి. 'పల్లకి' పత్రికాఫీసులో పనిచేసే వాళ్ళంతా చాలా దగ్గరి మిత్రులయ్యారు, ముఖ్యంగా అసోసియేట్ ఎడిటర్ శివప్రసాద్ గారు. ఒక రోజు ఆయన వద్ద ఉండగా, శ్రీధర గారు ఈ సీరియల్ గురించి మాట్లాడడానికి వచ్చారు. టైటిల్ 'వస్తాను నేస్తం..' అన్నది నన్ను బాగా కట్టుకుంది. 'మీరు వ్రాసే సీరియల్‌కి తగినట్లుగా ప్రతి వారం ఒక ఫోటో కవిత వ్రాస్తాన' ని ఆయనతో అన్నాను. శివప్రసాద్ గారు కూడా ఒప్పుకున్నారు. ఈ సీరియల్ మొదలు కావడానికి ముందు వచ్చే ప్రకటనల్లోని కవితలు కూడా వ్రాశాను. సీరియల్ మొదటి వారం నుంచీ దాదాపు అన్ని వారాలూ ఫోటో కవితలు వ్రాశాను..

కట్ చేస్తే..

మళ్ళా 20 సంవత్సరాల తర్వాత 2006లో సిలికాన్ వేలీలో కనిపించారు శ్రీధర గారు. గొట్టుముక్కుల కామేష్ నాకు పదేళ్ళగా మిత్రుడే కానీ తన మామగారే శ్రీధర గారన్న విషయం 2006లోనే తెలిసింది. రెండు దశాబ్దాల తరువాత కలుసుకుని పాత జ్ఞాపకాలన్నీ గుర్తు తెచ్చుకున్నాము. 'కౌముది' మొదలు పెట్టాక, నేనే అన్నాను 'వస్తాను నేస్తం..మళ్ళీ ప్రచురిస్తే బావుంటుంది. ఈ నాటి పాఠకుల్లో చాలామందికి ఇది తెలియదు, డైరెక్టు నవలగా కూడా రాలేదు.. ' అని. వెంటనే శ్రీధర గారు ఒప్పుకోవడమే కాక హైదరాబాదు వెళ్ళగానే పాత సంచికలన్నీ జిరాక్స్ చేసి పంపించారు. గత 20 నెలలుగా ఈ నవలని అభినందిస్తూ ఎన్నో మెయిల్స్ వచ్చాయి. కథాబలం వున్న ప్రేమ కథలు ఏకాలం పాఠకులనైనా ఆకట్టుకుంటాయనడానికి ఈ నవల ఒక ఉదాహరణ. ఆ రోజుల్లో ఈ సీరియల్ తో బాటు వచ్చిన కొన్ని ఫోటో కవితలివిగో..

కిరణ్‌ప్రభ







